

'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 17 సంచిక: 261

మంగళవారం 3-6-2025

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | VIJAYAWADA | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



తొలి ట్రోఫీని ముద్దాడేందుకు...

బెంగళూరు, పంజాబ్ మధ్య ఆఖరి పోరు నేడు ఐపీఎల్–18 ఫైనల్ - స్పోర్ట్స్‌లో



స్వల్ప నష్టాలతో సరి

తొలుత 797 పాయింట్లు డౌన్.. చివరికి 77 పాయింట్లు మైనస్ - బిజినెస్‌లో

ముఖ్యనేత..

'ఐకానిక్' మేత

రాజధాని టెండర్లలో మరో లాలూ'ఛీ' పర్వం

ఐకానిక్ టవర్లూ సిండి'కేటు'కే



- మూడు ప్యాకేజీల కింద టెండర్లు పిలిచిన సీఆర్‌డీఏ
- 2018లో దక్కించుకున్న సంస్థలకే వాటిని మళ్లీ కట్టబెట్టేలా చక్రం తిప్పిన ముఖ్యనేత
- ఎన్‌సీసీ, షాపూర్‌జీ పల్లోంజీ, ఎల్ అండ్ టీ సంస్థల నుంచి మాత్రమే బిడ్లు
- కాంట్రాక్టు విలువ కంటే 4.49, 4.50, 4.57 శాతం అధిక ధరలకు పనులు చేజిక్కించుకున్న సంస్థలు
- ఖజానాపై రూ.159 కోట్లకుపైగా భారం
- జీఏడీ టవర్ నిర్మాణ పనులను రూ.882 కోట్లకు దక్కించుకున్న ఎన్‌సీసీ
- జీఎస్టీ, ఇతర పన్నులతో కలిపి జీఏడీ టవర్ కాంట్రాక్టు విలువ రూ.1,045.60 కోట్లు
- 2018లో ఇదే పనులు రూ.554.06 కోట్లకు ఎన్‌సీసీకి అప్పగింత
- టవర్–1, 2 పనులను 1,487 కోట్లకు చేజిక్కించుకున్న షాపూర్‌జీ పల్లోంజీ
- జీఎస్టీ, ఇతర పన్నులతో కలిపి టవర్–1, 2 కాంట్రాక్టు విలువ రూ.1,762.70 కోట్లు
- 2018లో ఇవే పనులు రూ.932.46 కోట్లకు షాపూర్‌జీ పల్లోంజీకి అప్పగింత
- టవర్–3, 4 పనులను రూ.1,304 కోట్లకు దక్కించుకున్న ఎల్ అండ్ టీ
- జీఎస్టీ, ఇతర పన్నులతో కలిపి టవర్–3, 4 కాంట్రాక్టు విలువ రూ.1,545.70 కోట్లు
- 2018లో ఇవే పనులను రూ.784.62 కోట్లకు ఎల్ అండ్ టీకి అప్పగింత

1లో

జేఈఈ అడ్వాన్స్‌డ్ టాపర్ రజిత్‌గుప్తా

ఓబీసీ కేటగిరీ టాపర్‌గా ఏపీ విద్యార్థి జ్ఞాన రుత్విక్ సాయి

ఐఐటీల్లో ప్రవేశాలకు దేశవ్యాప్తంగా 54,378 మందికి అర్హత

- హైదరాబాద్ జోన్ నుంచి అర్హత పొందిన 12,946 మంది
- టాప్‌-10లో ఇద్దరు హైదరాబాద్ జోన్ విద్యార్థులు
- అర్నవ్ సింగ్‌కు 9, వడ్లమూడి లోకేశ్‌కు 10వ ర్యాంకులు
- నేటి నుంచి జోసా కౌన్సెలింగ్‌కు రిజిస్ట్రేషన్లు


రజిత్ గుప్తా


దేవదత్త


రాజరాజేశ్వరి తన్వీ


జ్ఞానరుత్విక్ సాయి

సాక్షి, అమరావతి/నరసన్నపేట/పిఠాపురం/బేస్తవారిపేట: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)ల్లో ప్రవేశాలకు నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 ఫలితాల్లో ఐఐటీ హైదరాబాద్ జోన్ విద్యార్థులు సత్తా చాటారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష నిర్వహణ సంస్థ ఐఐటీ కాన్పూర్ సోమవారం ఫలితాలను ప్రకటించింది. దేశవ్యాప్తంగా 1,80,422 మంది జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాయగా, 54,378 మంది అర్హత సాధించారు. వారిలో అత్యధికంగా 12,946 మంది ఐఐటీ హైదరాబాద్ జోన్ విద్యార్థులు ఉండటం విశేషం. మొత్తం అర్హత సాధించిన వారిలో 44,974 మంది పురుష అభ్యర్థులు, 9,404 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. ఐఐటీ ఢిల్లీ జోన్‌కు చెందిన రజిత్ గుప్తా కామన్ ర్యాంక్ లిస్టులో జాతీయ స్థాయి టాప్ ర్యాంకర్‌గా నిలిచారు. మొత్తం 360 మార్కులకు గాను అతను 332 మార్కులు సాధించారు. ఐఐటీ ఖరగ్‌పూర్ జోన్‌కు చెందిన మిగతా 1వ పేజీలో ▶

వైద్యశాఖ బదిలీల్లో గందరగోళం

- ఖాళీల విషయంలో స్పష్టత కరువు
- ఆ వివరాలు చెప్పకపోతే దరఖాస్తు చేసుకునేదెలా అంటూ ఉద్యోగులు అసహనం
- కొందరు బాస్‌లను మేనేజ్ చేసుకుంటున్నారని ఆరోపణలు
- రెగ్యులర్ అయిన కాంట్రాక్టు సిబ్బంది సీనియారిటీ విషయంలోనూ అయోమయం



5లో

ఉద్యోగుల బదిలీల గడువు 9 వరకు పొడిగింపు

- ఉత్తర్వులు జారీ చేసిన ఆర్థిక శాఖ
- బేరసారాల కోసమేనంటున్న ఉద్యోగ వర్గాలు

5లో



సాంకేతిక విద్యలో బదిలీలకు శ్రీకారం

- ఈ నెల 15లోగా పూర్తిచేయాలన్న ప్రభుత్వం
- మార్గదర్శకాలతో ఉత్తర్వులు జారీ

5లో

కర్నూలు జిల్లాలో మరో సీఐ వేధింపులు..

వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

- పత్తికొండ స్టేషన్‌లో పోలీసు అధికారి సివిల్ పంచాయతీ
- తీసుకున్న అప్పు చెల్లించాలంటూ పచ్చిబూతులు
- గడువులోగా చెల్లించకపోతే రౌడీషీట్ తెరుస్తానంటూ బెదిరింపు.. బలవంతంగా ప్రామిసరీ నోట్లపై సంతకాలు
- ఈ వేధింపులు భరించలేక పురుగుల మందు తాగిన బాధితుడు
- తనకు జరిగిన అన్యాయంపై సెల్ఫీ వీడియో


ప్రవీణ్‌కుమార్

సాక్షి టాస్క్‌ఫోర్స్: టీడీపీ కూటమి నాయకులు పోలీసులను ఇష్టారాజ్యంగా వాడుకుంటూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. పోలీసులపై ఒత్తిడి తీసుకొచ్చి వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు, కార్యకర్తలను బెదిరించి కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు. తెనాలి పోలీసుల మాదిరిగానే కర్నూలు జిల్లా పత్తికొండ సీఐ వేధింపులు, బెదిరింపులు తట్టుకోలేక మండల పరిధిలోని దూదేకొండ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పి.ప్రవీణ్‌కుమార్ ఆదివారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా..

మిగతా 1వ పేజీలో ▶

ఔను.. గత ప్రభుత్వంలోనే జీఎస్టీ మెరుపులు

- వివరాలు 3లో

నీట్ పీజీ పరీక్ష వాయిదా

- పరీక్ష నిర్వహణ తేదీని త్వరలో వెల్లడిస్తాం
- నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రకటన



- వివరాలు 1లో

క్లుప్తంగా...

నీట్ పీజీ వాయిదా

సాక్షి, అమరావతి: వైద్య విద్య పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ పీజీ–2025 పరీక్షను వాయిదా వేస్తున్నట్టు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ (ఎన్‌బీఈ) సోమవారం ప్రకటించింది. పరీక్ష నిర్వహణ తేదీని త్వరలో వెల్లడిస్తామని స్పష్టం చేసింది. రెండు షిఫ్టుల్లో ఈ నెల 15న నీట్ పీజీ నిర్వహించాలని ఎన్‌బీఈ నిర్ణయించిన విషయం తెలిసిందే. అయితే రెండు షిఫ్టుల్లో పరీక్ష నిర్వహణపై కొందరు అభ్యర్థులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఒకే షిఫ్ట్‌లో నీట్ పీజీ నిర్వహించాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. దరఖాస్తు చేసిన అభ్యర్థుల సంఖ్య ఆధారంగా రెండు షిఫ్టుల్లో పరీక్ష నిర్వహణకు సెంటర్‌లను ఎంపిక చేశారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఒకే షిఫ్ట్‌లో పరీక్ష నిర్వహించాల్సినందున అదనపు సెంటర్లను ఎంపిక చేయడం కోసం పరీక్ష తేదీని మార్చనున్నారు.

ఏఐ పరిజ్ఞానంతో ప్రజా సమస్యల పరిష్కారం
డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా



ఏఐ హ్యాకథాన్ వెబ్ సైట్‌ను ఆవిష్కరిస్తున్న డీజీపీ గుప్తా

సాక్షి, అమరావతి: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ఆధారంగా ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ఏఐ హ్యాకథాన్‌ను నిర్వహించనున్నామని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా స్పష్టం చేశారు. ఈ నెల 27 నుంచి 29వరకు గుంటూరులో ఏఐ హ్యాకథాన్‌ను రాష్ట్ర పోలీసు శాఖ నిర్వహించనుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వెబ్‌సైట్, ప్రోమోను రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో డీజీపీ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ హ్యాకథాన్‌లో జాతీయ, అంతర్జాతీయ ఐటీ సంస్థలు పాల్గొంటాయన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 'తిరుమల' ప్రభంజనం

రాజమహేంద్రవరం రూరల్: ప్రతిష్టాత్మక జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో తమ తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు అత్యద్భుత ఫలితాలు సాధించినట్లు తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమల రావు తెలిపారు. వివిధ కేటగిరీల్లో జాతీయ స్థాయిలో తమ విద్యార్థులు కె.ప్రణీత్ 2వ ర్యాంకు, కె.యశ్వంత్ సాత్విక్ 8, ఇ.వర్షిత్ 12, ఎం.సుమంత్‌దొర 38, మజ్జి పురుషోత్తమరావు 39, కె.అభినవ్ 42, జి.సుజోష్‌రాజ 43, జి.అఖిల్‌సాయి 45, తుమాటి పూజిత అఖిల్ రాజ్‌కుమార్ 85, ఆర్.చరణ్‌తేజ 86, కప్పల వెంకట రామవినీష్ 127, పాతపాటి వెంకట వివేక్ వర్మ 132, ముప్పల లిఖిత 137వ ర్యాంకులు సాధించారని వివరించారు. వీటితో పాటు 165, 174, 193, 195, 226, 231, 238, 243, 245, 246, 270, 272, 275, 276 ర్యాంకులు సాధించారన్నారు. 1000 లోపు 99 మంది, 3000 లోపు 272 మంది, 10,000 లోపు 641 మంది ర్యాంకులు సాధించారని, 400 మంది పైన విద్యార్థులు ఐఐటీలో సీట్లు సాధించగలరని చెప్పారు.

ముఖ్యనేత.. 'ఐకానిక్' మేత

ఐకానిక్ టవర్లూ సిండి'కేటు'కే.. ■ రాజధాని టెండర్లలో మరో లాలూ'ఛీ' పర్వం

సాక్షి, అమరావతి: రాజధాని నిర్మాణ పనుల్లో సిండి'కేటు' లాలూ'ఛీ' పర్వం ఐకానిక్ టవర్ల టెండర్ల సాక్షిగా మరోసారి బట్టబయలైంది. మూడు ప్యాకేజీల కింద ఐదు ఐకానిక్ టవర్ల నిర్మాణానికి సీఆర్‌డీఏ (రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ) టెండర్లు పిలిచింది. ఆ టెండర్ నోటిఫికేషన్ జారీ చేయకముందే.. 2018లో ఆ పనులు దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థలకే ఇప్పుడూ కట్టబెట్టేలా 'ముఖ్యనేత' పథకం పన్నారు. తద్వారా పాత సంస్థలకే మూడు ప్యాకేజీలను అధిక (ఎక్సెస్) ధరకు కట్టబెడుతూ సీఆర్‌డీఏ సోమవారం ఆమోద ముద్ర వేసింది. దీనివల్ల ప్రభుత్వ ఖజానాపై రూ.159 కోట్ల భారం పడుతుంది. ఆ మేరకు ఖజానాను కాంట్రాక్టు సంస్థలకు దోచిపెట్టి నీకింత.. నాకింత అంటూ పంచుకుతినడానికి ముఖ్యనేత సిద్ధమయ్యారని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. రాజధాని అమరావతిలో ప్రభుత్వ భవనాల సముదాయంలో సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయాల కోసం డయాగ్రిడ్ విధానంలో ఐదు ఐకానిక్ టవర్లు నిర్మించేలా పోస్టర్ అండ్ పార్టనర్స్–జెనిసిస్ ప్లానర్స్–డిజైన్ ట్రీ సర్వీస్ కన్సల్టెంట్స్ సంస్థలు 2018లో డిజైన్లు రూపొందించాయి. ఆ పనులకు టెండర్లు పిలిచి 2018 ఏప్రిల్‌లోనే కాంట్రాక్టు సంస్థలకు ప్రభుత్వం అప్పగించింది. పునాదులు అప్పట్లోనే పూర్తయ్యాయి. ఇప్పుడు మిగిలిన పనులకు సీఆర్‌డీఏ టెండర్లు పిలిచింది.

రాజధాని ప్రాంతంలో ఐదు ఐకానిక్ టవర్ల నిర్మాణ వ్యయాన్ని అమాంతం పెంచేయడమే కాకుండా.. ఆ పనులను పాత 'సిండికేట్' సంస్థలకే కట్టబెట్టేలా 'ముఖ్యనేత' చక్రం తిప్పారు. అంచనా వ్యయాలను విపరీతంగా పెంచేయడంతోపాటు పాత కాంట్రాక్టు సంస్థలనే తెరపైకి తెచ్చి.. పోటీదారులు లేకుండా పక్కా వ్యూహ రచన చేశారు. నచ్చిన సంస్థలకే అధిక ధరలకు టెండర్లు కట్టబెట్టి భారీ దోపిడీకి తెరలేపారు.



మూడు ప్యాకేజీలకూ మూడు సంస్థలే

- సచివాలయం 1, 2 ఐకానిక్ టవర్లను బీ+జీ+39 అంతస్తులతో నిర్మించనున్నారు. ఈ పనులకు రూ.1,423.07 కోట్లను కాంట్రాక్టు విలువగా నిర్ణయించి సీఆర్‌డీఏ టెండర్లు పిలిచింది. సచివాలయం 3, 4 ఐకానిక్ టవర్లను బీ+జీ+39 అంతస్తులతో నిర్మించనున్నారు. ఈ పనులకు రూ.1,247.22 కోట్లను కాంట్రాక్టు విలువగా నిర్ణయించి సీఆర్‌డీఏ టెండర్లు పిలిచింది. ముఖ్యమంత్రి కార్యాలయం, విభాగాధిపతుల కార్యాలయాల కోసం సచివాలయంలో జీఏడీ ఐకానిక్ టవర్‌ను బీ+జీ+49 అంతస్తులతో నిర్మించనున్నారు. ఈ పనులకు రూ.844.22 కోట్లను కాంట్రాక్టు విలువగా నిర్ణయించి టెండర్లు పిలిచింది.
- ఈ టెండర్లలో మూడు ప్యాకేజీలకూ ముఖ్యనేత ఏర్పాటుచేసిన సిండికేటులోని ఎన్‌సీసీ, ఎల్ అండ్ టీ, షాపూర్‌జీ పల్లోంజీ సంస్థలే బిడ్లు దాఖలు చేశాయి.
- 1, 2 ఐకానిక్ టవర్ల నిర్మాణ పనులను 4.50 శాతం అధిక ధరకు అంటే రూ.1,487 కోట్లకు కోట్ చేసి ఎల్–1గా నిలిచిన షాపూర్‌జీ పల్లోంజీ దక్కించుకుంది. జీఎస్టీ, సీనరేజీ, న్యాక్ వంటి పన్నుల రూపంలో రూ.275.70 కోట్లు రీయింబర్స్ చేస్తామని సీఆర్‌డీఏ పేర్కొంది. అంటే.. 1, 2 టవర్ల కాంట్రాక్టు విలువ రూ.1,762.70 కోట్లు. ఇదే పనులను 2018లో రూ.932.46 కోట్లకే పూర్తి చేసేందుకు సీఆర్‌డీఏతో ఇదే షాపూర్‌జీ పల్లోంజీ ఒప్పందం చేసుకుంది. అంటే.. 2018తో పోల్చితే ఇప్పటికే ఈ టవర్ల కాంట్రాక్టు వ్యయం రూ.830.24 కోట్లు పెరిగినట్లు స్పష్టమవుతోంది.

3, 4 ఐకానిక్ టవర్లు నిర్మాణంలోనూ ఇలా..

3, 4 ఐకానిక్ టవర్ల నిర్మాణ పనులను 4.57 శాతం అధిక ధరకు అంటే రూ.1,304 కోట్లకు కోట్ చేసి ఎల్–1గా నిలిచిన ఎల్ అండ్ టీ సంస్థ దక్కించుకుంది.

జీఎస్టీ, సీనరేజీ, న్యాక్ వంటి పన్నుల రూపంలో రూ.241.70 కోట్లు రీయింబర్స్ చేస్తామని సీఆర్‌డీఏ పేర్కొంది. అంటే.. 3, 4 టవర్ల కాంట్రాక్టు విలువ రూ.1,545.7 కోట్లు. 2018లో ఇదే పనులను రూ.784.62 కోట్లకే పూర్తి చేసేందుకు సీఆర్‌డీఏతో ఎల్ అండ్ టీ ఒప్పందం చేసుకుంది. అంటే.. 2018తో పోల్చితే ఇప్పటికే 3, 4 టవర్ల కాంట్రాక్టు వ్యయం రూ.761.08 కోట్లు పెరిగినట్లు తేటతెల్లమవుతోంది.

జీఏడీ టవర్ పనులూ అధిక ధరకే..

జీఏడీ టవర్ నిర్మాణ పనులను 4.49 శాతం అధిక ధరకు అంటే రూ.882 కోట్లకు కోట్ చేసి ఎల్–1గా నిలిచిన ఎన్‌సీసీ సంస్థ దక్కించుకుంది. జీఎస్టీ, సీనరేజీ, న్యాక్ వంటి పన్నుల రూపంలో రూ.163.60 కోట్లను రీయింబర్స్ చేస్తామని సీఆర్‌డీఏ పేర్కొంది. అంటే ఆ పనుల కాంట్రాక్టు విలువ రూ.1,045.6 కోట్లు. 2018లో ఇదే పనులను రూ.554.06 కోట్లకు ఇదే ఎన్‌సీసీ సంస్థకు సీఆర్‌డీఏ అప్పగించింది. అంటే.. 2018తో పోల్చితే ఇప్పటికే జీఏడీ టవర్ కాంట్రాక్టు వ్యయం రూ.491.54 కోట్లు పెరిగింది.

అప్పు చేసి.. దోచిపెట్టి.. పంచుకు తినేలా

ఐకానిక్ టవర్ల నిర్మాణాన్ని 2018లోనూ.. ఇప్పుడూ డయాగ్రిడ్ విధానంలోనే నిర్మించేలా కాంట్రాక్టర్లకు ప్రభుత్వం అప్పగించింది. అప్పటితో పోల్చితే సిమెంట్, స్టీల్, డీజిల్, పెట్రోల్, నిర్మాణ సామగ్రి ధరల్లో పెద్దగా వ్యత్యాసం లేదు. పైగా ఇప్పుడు ఇసుక ఉచితం. అదీ నాలుగైదు కిలోమీటర్ల దూరంలోనే కృష్ణా నదిలో కావాల్సినంత దొరుకుతుంది. వీటిని పరిగణనలోకి తీసుకుంటే.. 2018తో పోల్చితే ఐకానిక్ టవర్ల కాంట్రాక్టు విలువ ఇప్పుడు పెరగడానికి వీల్లేదని అధికార వర్గాలే స్పష్టం చేస్తున్నాయి. కానీ.. ఇదే ఐకానిక్ టవర్ల పనులను 2018 ఏప్రిల్ 26న చదరపు అడుగు రూ.4,350.42 చొప్పున రూ.2,271.14 కోట్లకు షాపూర్‌జీ పల్లోంజీ, ఎల్ అండ్ టీ, ఎన్‌సీసీ సంస్థలకు అప్పగిస్తూ ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు మళ్లీ అదే సంస్థలకు వాటి నిర్మాణ పనులను రూ.4,354 కోట్లకు అప్పగించింది. అంటే.. 2018తో పోల్చితే ఇప్పుడు వాటి కాంట్రాక్టు వ్యయం రూ.2,082.86 కోట్లు పెరిగింది. ఐదు ఐకానిక్ టవర్ల నిర్మిత ప్రాంతం 4,85,000 చదరపు మీటర్లు (52,20,496 చదరపు అడుగులు). అంటే.. చదరపు అడుగు రూ.8,340.20 చొప్పున పనులను కాంట్రాక్టు సంస్థలకు అప్పగించినట్టు స్పష్టమవుతోంది. సంప్రదాయ పద్ధతిలో నిర్మించినా.. డయాగ్రిడ్ విధానంలో నిర్మించినా నిర్మాణ వ్యయంలో పెద్దగా తేడా ఉండదని ఇంజినీరింగ్ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. చదరపు అడుగుకు రూ.1,800 నుంచి రూ.2 వేల వరకూ వ్యయం అవుతుందని చెబుతున్నారు. డయాగ్రిడ్ విధానంలో అంతస్తులు పెరిగే కొద్దీ నిర్మాణ వ్యయం తగ్గుతుందని స్పష్టం చేస్తున్నారు. కానీ.. ఐకానిక్ టవర్ల నిర్మాణాన్ని చదరపు అడుగు రూ.8,340.20 చొప్పున కాంట్రాక్టు సంస్థలకు అప్పగించడంపై ఇంజినీర్లు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచ బ్యాంకు, ఏడీబీ, కేఎఫ్‌డబ్ల్యూ, హడ్కో వంటి సంస్థల నుంచి రాజధాని నిర్మాణానికి అధిక వడ్డీలకు అప్పుగా తెచ్చి.. వాటిని కాంట్రాక్టు సంస్థలకు దోచిపెడుతూ.. నీకింత నాకింత అంటూ ముఖ్యనేత పంచుకుతినేలా కుట్ర పన్నడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

నిర్మాణం పూర్తయ్యే సరికి తడిసిమోపెడు

తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 2015లో ఓటుకు కోట్లను ఎరగా వేసి.. ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తూ ఆడియో, వీడియో టేపులతో సీఎం చంద్రబాబు తెలంగాణ సర్కార్‌కు అడ్డంగా దొరికిపోయారు. ఓటుకు కోట్లు కేసు భయంతో హైదరాబాద్ నుంచి ఉండవల్లి కరకట్టలోని లింగమనేని అక్రమ బంగ్లాలోకి మకాం మార్చారు. ఆ తర్వాత అమరావతి నుంచే పరిపాలన చేయడం కోసం 6 లక్షల చదరపు అడుగుల నిర్మిత ప్రాంతంతో తాత్కాలిక సచివాలయం పనులను చదరపు అడుగు రూ.3,350 చొప్పున రూ.201 కోట్లకు షాపూర్‌జీ పల్లోంజీ, ఎల్ అండ్ టీ సంస్థలకు అప్పగించారు. కానీ.. వాటి నిర్మాణం పూర్తయ్యే సరికి అంచనా వ్యయం రూ.1,151 కోట్లకు చేరుకుంది. అంటే.. చదరపు అడుగుకు రూ.19,183 చొప్పున బిల్లులు చెల్లించారు. ఈ వ్యవహారంలో భారీ ఎత్తున కమీషన్లు చేతులు మారాయనే ఆరోపణలు బలంగా వ్యక్తమయ్యాయి. షాపూర్‌జీ పల్లోంజీ సంస్థ నుంచి కమీషన్లు వసూలు చేసి సీఎం చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి ఐటీ శాఖకు అప్పట్లో పట్టుబడటం కలకలం రేపింది. ఇప్పుడు శాశ్వత సచివాలయం పేరుతో నిర్మిస్తున్న ఐకానిక్ టవర్ల నిర్మాణంలోనూ అదే తరహా దోపిడీకి పథకం రచించారని.. వాటి నిర్మాణం పూర్తయ్యే సరికి కాంట్రాక్టు వ్యయం ఇంకెంతకు పెరుగుతుందోనని అధికార వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

అమరావతిలో 40 వేల ఎకరాలను ఎలా సేకరించాలో ఆలోచిస్తున్నాం

- ఇప్పటికే 36 వేల ఎకరాలు ఇచ్చేందుకు రైతులు సిద్ధం
- మంత్రి పి.నారాయణ



సాక్షి, అమరావతి: శంషాబాద్ ఎయిర్‌పోర్టు తరహాలో అమరావతిలో 5 వేల ఎకరాల్లో అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు, 2,500 ఎకరాల్లో స్మార్ట్ ఇండస్ట్రీలు, మరో 2,500 ఎకరాల్లో అంతర్జాతీయ స్పోర్ట్స్ సిటీ నిర్మాణానికి మొత్తంగా 10 వేల ఎకరాల భూమి అవసరమని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో సోమవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన సీఆర్‌డీఏ 48వ సమావేశం జరిగింది. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి నారాయణ మీడియాకు వివరించారు. ప్రభుత్వానికి అవసరమైన 10 వేల ఎకరాల భూమిని రైతుల నుంచి భూసేకరణ చేయాలా లేదా భూసమీకరణ (ల్యాండ్ పూలింగ్) ద్వారా సేకరించాలా అనేది ఆలోచిస్తున్నామని చెప్పారు. ఇందుకోసం గ్రామసభలు నిర్వహిస్తూ రైతుల అభిప్రాయాన్ని సేకరిస్తున్నామని, ల్యాండ్ పూలింగ్‌కే రైతులు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. ఇప్పటికే దాదాపు 36 వేల ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్ ద్వారా ఇచ్చేందుకు రైతులు ముందుకొచ్చారని వివరించారు. ప్రభుత్వానికి అవసరమైన 10 వేల ఎకరాలను సమకూర్చుకోవాలంటే దాదాపు 40 వేల ఎకరాలను సేకరించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే అమల్లో ఉన్న ల్యాండ్ పూలింగ్ చట్టంలోని నిబంధనల మేరకు రాజధాని ప్రాంతం 217 చదరపు కిలోమీటర్లకే అనుమతి ఉందని, ఆ పరిధిని మరింతగా పెంచేందుకు సీఆర్‌డీఏ సమావేశంలో ఆమోదించామని తెలిపారు. రాజధానిలో ఎడ్యుకేషన్, హెల్త్ ఇన్‌స్టిట్యూట్ల రిజిస్ట్రేషన్ ఫీజులు మినహాయించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. మూడేళ్లలో అమరావతి కోర్ క్యాపిటల్ ప్రాంతంలోని అన్ని నిర్మాణాలను పూర్తి చేస్తామని, రెండో దశ భూసేకరణ చేస్తామన్నారు.

5 అడ్మినిస్ట్రేటివ్ టవర్ల నిర్మాణానికి టెండర్ల ఖరారు

కోర్ క్యాపిటల్ ఏరియాలో రూ.3,673 కోట్ల అంచనా వ్యయంతో 5 అడ్మినిస్ట్రేటివ్ టవర్ల నిర్మాణానికి టెండర్లను ఖరారు చేశామని నారాయణ చెప్పారు. రూ.882 కోట్లతో నిర్మించే జీఏడీ టవర్ నిర్మాణాన్ని ఎన్‌సీసీ, రూ.1,487 కోట్లతో నిర్మించే టవర్–1, 2 నిర్మాణాన్ని షాపూర్‌జీ పల్లోంజీ, రూ.1,304 కోట్లతో నిర్మించే టవర్–3, 4 నిర్మాణాన్ని ఎల్ అండ్ టీ దక్కించుకున్నాయని తెలిపారు. 2014–19 మధ్య కాలంలో రూపొందించిన డిజైన్ల ప్రకారమే ఈ టవర్ల నిర్మాణం జరుగుతుందని స్పష్టం చేశారు.

కర్నూలు జిల్లాలో మరో సీఐ వేధింపులు.. వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

▶ మొదటి పేజీ తరువాయి

పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆసుపత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. మరోవైపు బాధితుడు తనకు జరిగిన అన్యాయంపై హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులను ఉద్దేశిస్తూ సెల్ఫీ వీడియో తీశాడు.

పోలీస్‌స్టేషన్‌లో బెదిరింపులు..

రెండేళ్ల క్రితం దూదేకొండ గ్రామానికి చెందిన తలారి కృష్ణమూర్తి నుంచి రూ.10 వడ్డీతో ప్రవీణ్‌కుమార్ రూ.లక్ష అప్పు తీసుకున్నాడు. రూ.50 వేలు చెల్లించాడు. ఇంకా రూ.50 వేలు చెల్లించాల్సి ఉంది. అయితే, కృష్ణమూర్తికి మద్దతుగా మాజీ ఎంపీటీసీ మునిలక్ష్మి కుమారుడు రంగస్వామి, రంగన్న ఇద్దరు కలిసి పోలీసుస్టేషన్‌కు వచ్చి అధికార పార్టీ నాయకుల సహకారంతో సీఐ జయన్నపై ఒత్తిడి తీసుకొచ్చారు. ప్రవీణ్‌కుమార్ వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు కావడంతో వారు ఒత్తిడి పెంచారు. పైగా.. గతంలో కొంత చెల్లించినా కూడా మళ్లీ అప్పు ఉన్నట్లుగా ప్రామిసరి నోటు రాయించారు. మిగిలిన బాకీ రూ.50వేలు తనకిస్తే అప్పు ఇచ్చిన వారికి తాను ఇచ్చి సెటిల్‌చేస్తానని సీఐ కొద్దిరోజుల క్రితం చెప్పారు. అలాగే, పొలం అమ్మకానికి సంబంధించిన మరో అంశంలో కూడా ప్రవీణ్‌కుమార్ వేరొకరికి ఇవ్వాల్సిన రూ.లక్ష నగదు, తలారి కృష్ణమూర్తికి ఇవ్వాల్సిన రూ.50వేలు మే 31లోగా చెల్లించకపోతే రౌడీషీట్ ఓపెన్ చేస్తానని పచ్చిబూతులు తిడుతూ బెదిరించారు. అంతేకాక.. గతంలో జరిగిన ఇంటి గొడవలో ఎలాంటి విచారణ చేపట్టకుండానే ప్రవీణ్‌కుమార్, అతని భార్యపై కేసు నమోదు చేశారు. జేఎం తండా, హోసూరుకు చెందిన ఇద్దరి వద్ద చీటీ విషయమై రాసుకున్న ప్రామిసరీ నోటుకు బదులుగా పోలీసుస్టేషన్‌లో మరో ప్రామిసరీ నోటు బలవంతంగా రాయించారు. ఇలా కక్షపూరితంగా టార్గెట్ చేసి వేధిస్తుండడాన్ని భరించలేక తాను పురుగుల మందు తాగినట్లు బాధితుడు ప్రవీణ్‌కుమార్ చెప్పాడు.

విశ్వభారతి విద్యార్థుల జయకేతనం



పల్లా భరత్‌చంద్ర

గుడివాడటౌన్: ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో కృష్ణాజిల్లా గుడివాడ విశ్వభారతి పూర్వ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ సోమవారం తెలిపారు. పల్లా భరత్‌చంద్ర ఓబీసీ కేటగిరిలో ఆల్ ఇండియా 2వ ర్యాంకు, ఓపెన్ కేటగిరిలో 21వ ర్యాంక్ సాధించారన్నారు. కె.ప్రణయ్ ఆల్ ఇండియా 23వ ర్యాంక్, కె. చెన్నకేశవ ఓబీసీలో 29వ ర్యాంకు, ఎస్.రోహిత 29వ ర్యాంకు, బి.చాణిక్య 78వ ర్యాంకు, డి.బలరామ్ నాయుడు 89వ ర్యాంకు సాధించారన్నారు. 100 లోపు 7 జాతీయ స్థాయి ర్యాంకులు, 1000 లోపు 29 జాతీయ స్థాయి ర్యాంకులు సాధించారని తెలిపారు. ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులను డైరెక్టర్ మంజుల అభినందించారు.

భాష్యం ప్రభంజనం



జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకర్లతో భాష్యం రామకృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: జేఈఈ అడ్వాన్స్‌డ్–2025 ఫలితాల్లో భాష్యం ప్రభంజనం సృష్టించిందని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. గుంటూరులోని మెయిన్ క్యాంపస్‌లో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ అఖిల భారతస్థాయి ఓపెన్ కేటగిరిలో 33వ ర్యాంకు కైవసం చేసుకున్న తమ విద్యార్థి సోమిశెట్టి వెంకటసాయి చక్రి ఈడబ్ల్యూఎస్ విభాగంలో 3వ ర్యాంకర్‌గా నిలిచినట్లు చెప్పారు. తమ విద్యార్థులు 5,000లోపు 218 ఆలిండియా ర్యాంకులు సాధించారని తెలిపారు. జేఈఈ మెయిన్స్‌లో ఓపెన్ కేటగిరిలో 100 పర్సంటైల్‌తో పాటు ఆలిండియా 18వ ర్యాంకు సాధించిన జి.సాయిమనోజ్ఞకు రూ. ఐదు లక్షలు, జేఈఈ అడ్వాన్స్‌డ్ ఓపెన్ కేటగిరిలో ఆలిండియా 33వ ర్యాంకు సాధించిన ఎస్.వెంకట సాయి చక్రికి రూ.ఐదు లక్షలు. శ్రీకర గణేష్, ఎస్. ఆకాష్ లకు రూ.రెండు లక్షలు, టి.విక్రమ్ లెవీ, డి. జస్వంత్ బాలాజీలకు రూ. లక్ష చొప్పున నగదు ప్రోత్సాహక చెక్కులను అందజేశారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ టాపర్ రజిత్‌గుప్తా

▶ మొదటి పేజీ తరువాయి



రవిచంద్రారెడ్డి

దేవదత్త మాఝీ 312 మార్కులతో మహిళల విభాగంలో టాపర్(జాతీయ స్థాయిలో 16వ ర్యాంకు)గా నిలిచారు. టాప్–10లో ఇద్దరు ఐఐటీ హైదరాబాద్ జోన్ విద్యార్థులు ఉన్నారు. అర్నవ్ సింగ్ 9వ ర్యాంక్, వడ్లమూడి లోకేష్ 10వ ర్యాంక్ సాధించారు. తొలి రెండు స్థానాలతోపాటు మొత్తం టాప్–10 ర్యాంకులలో ఐఐటీ ఢిల్లీ జోన్‌కు నాలుగు, ఐఐటీ ముంబయి జోన్‌కు మూడు, ఐఐటీ హైదరాబాద్ జోన్‌కు రెండు, ఐఐటీ కాన్పూర్ జోన్‌కు ఒకటి వచ్చాయి. జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో అర్హత సాధించిన విద్యార్థులకు ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే విద్యాసంస్థల్లో అడ్మిషన్ల కోసం జోసా కౌన్సెలింగ్‌కు మంగళవారం నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభించనుంది.

జాతీయ స్థాయిలో టాప్ 10 అభ్యర్థులు

ర్యాంకు	పేరు	జోన్
1	రజిత్ గుప్తా (332 మార్కులు)	ఐఐటీ ఢిల్లీ
2	సక్షం జిందాల్ (332 మార్కులు)	ఐఐటీ ఢిల్లీ
3	మాజిద్ ముజాహిద్ హుస్సేన్ (330 మార్కులు)	ఐఐటీ ముంబయి
4	పార్థ్ మందర్ వర్తక్ (327 మార్కులు)	ఐఐటీ ముంబయి
5	ఉజ్వల్ కేసరి (324 మార్కులు)	ఐఐటీ ఢిల్లీ
6	అక్షత్ కుమార్ చౌరాసియా (321 మార్కులు)	ఐఐటీ కాన్పూర్
7	సాహిల్ ముఖేష్ డియో (321 మార్కులు)	ఐఐటీ ముంబాయ్
8	దేవేష్ పంకజ్ భయ్యా (319 మార్కులు)	ఐఐటీ ఢిల్లీ
9	అర్నవ్ సింగ్ (319 మార్కులు)	ఐఐటీ హైదరాబాద్
10	వడ్లమూడి లోకేశ్ (317 మార్కులు)	ఐఐటీ హైదరాబాద్

జేఈఈ అడ్వాన్స్‌డ్–2025కి గణాంకాలు ఇలా..

జెండర్	నమోదు	హాజరు	అర్హత
పురుషులు	1,43,810	1,39,085	44,974
మహిళలు	43,413	41,337	9,404
మొత్తం	1,87,223	1,80,422	54,378

ఐఐటీ హైదరాబాద్ జోన్ టాప్..

ఐఐటీ హైదరాబాద్ జోన్ తర్వాత ఢిల్లీ జోన్‌లో 11,370 మంది, ముంబయి జోన్‌లో 11,226, రూర్కీ జోన్‌లో 5,445, ఖరగ్‌పూర్ జోన్‌లో 5,353, కాన్పూర్ జోన్‌లో 5,295, గువాహటి జోన్‌లో 2,743 మంది ప్రవేశాలకు అర్హత సాధించారు. ఐఐటీ హైదరాబాద్ జోన్ పరిధిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాలు ఉన్నాయి. మిగిలిన జోన్‌లతో పోలిస్తే అడ్వాన్స్‌డ్‌లో హైదరాబాద్ జోన్ విద్యార్థులు గణనీయమైన ఫలితాలు సాధించారు. టాప్–10లో ఇద్దరు, టాప్–100లో 23 మంది, టాప్–200లో 57 మంది, టాప్–300లో 78 మంది, టాప్–400లో 116 మంది, టాప్–500లో 136 మంది ఐఐటీ హైదరాబాద్ జోన్ విద్యార్థులు ఉన్నారు. ఇక జాతీయ స్థాయిలో జనరల్ ఈడబ్ల్యూఎస్ కోటాలో ఐఐటీ హైదరాబాద్ జోన్‌కు చెందిన వంగల అజయ్‌రెడ్డి, ఓబీసీ–ఎన్‌సీఎల్ కేటగిరీలో ఆంధ్రప్రదేశ్ విద్యార్థి ధర్మాన జ్ఞాన రుత్విక్ సాయి మొదటి ర్యాంకులు పొందారు. ఐఐటీ హైదరాబాద్ జోన్ టాపర్‌గా అర్నవ్ సింగ్, మహిళల కేటగిరీలో కోరికన రసజ్ఞ (జాతీయ స్థాయిలో 78వ ర్యాంక్) టాపర్‌గా నిలిచారు.

శ్రీకాకుళం జిల్లా విద్యార్థికి ఓబీసీ కేటగిరీ టాప్ ర్యాంక్

జేఈఈ అడ్వాన్స్‌డ్–2025 ఫలితాల్లో శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం దేవాది గ్రామానికి చెందిన ధర్మాన జ్ఞాన రుత్విక్ సాయి ఓబీసీ–ఎన్‌సీఎల్(నాన్ క్రీమీలేయర్) కేటగిరీలో మొదటి ర్యాంక్ పొందాడు. జనరల్ కేటగిరీలో ఆలిండియా 18వ ర్యాంకు వచ్చింది. ఓవరాల్‌గా 310 మార్కులు వచ్చాయి. అతనికి జేఈఈ మెయిన్ పరీక్షలో కూడా 99.99% మార్కులు వచ్చాయి. తమ కుమారుడికి జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అత్యుత్తమ ర్యాంక్ రావడంపై జ్ఞాన రుత్విక్ సాయి తల్లిదండ్రులు ధర్మాన లత, శంకర్ నారాయణ ఆనందం వ్యక్తంచేశారు.

దివ్యాంగుల కేటగిరీలో తన్వీకి రెండో ర్యాంక్

కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణానికి చెందిన అప్పన రాజరాజేశ్వరి తన్వీ దివ్యాంగుల కేటగిరీలో జాతీయ స్థాయిలో రెండో ర్యాంక్ సాధించింది. ఆమె తండ్రి రాజేష్ పిఠాపురంలో వ్యాపారి. తల్లి సుప్రియ గృహిణి. కంప్యూటర్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ పూర్తి చేసి, సివిల్స్ సాధించాలన్నదే తన ధ్యేయమని తన్వీ తెలిపారు. ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలంలోని ఖాజీపురానికి చెందిన మంతు వెంకట రవిచంద్రారెడ్డి ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో జాతీయ స్థాయి 8వ ర్యాంక్ సాధించాడు. అతని తల్లిదండ్రులు మంతు రాజశేఖర రెడ్డి, వెంకట రత్నాలు సంతోషం వ్యక్తంచేశారు.

ఆదిత్య విద్యార్థుల అద్భుత ఫలితాలు..



మీసాల జయచంద్ర



ఆదిత్య అభిషేక్



జి.రామశశాంక్



శుభశ్రీవల్లీ ఆత్రేయ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో తమ విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించి ప్రతిభ చూపారని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి సోమవారం తెలిపారు. మీసాల జయచంద్ర ఓపెన్ కేటగిరిలో ఆలిండియా 169వ ర్యాంక్, ఆదిత్య అభిషేక్ 257, జి.రామశశాంక్ 281, శుభశ్రీవల్లీ ఆత్రేయ 296వ ర్యాంకులు సాధించారన్నారు. వీరితో పాటు 500 లోపు 15 మంది, వెయ్యిలోపు 25 మంది, 3 వేల లోపు 62 మంది, 5 వేల లోపు 82 మంది ర్యాంకులు కైవసం చేసుకున్నారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఆదిత్య హాస్టల్ డైరెక్టర్ లక్ష్మీరాజ్యం, డైరెక్టర్ శృతి, ఎస్.సుగుణ, కో–ఆర్డినేటర్ లక్ష్మీకుమార్, ఐఐటీ క్యాంపస్ ప్రిన్సిపాల్ మెయిన, అకడమిక్ డైరెక్టర్ రాఘవరెడ్డి, గంగిరెడ్డి అభినందించారు.

సత్తాచాటిన శ్రీచైతన్య

హైదరాబాద్: ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు సత్తాచాటారు. టాపర్లతో కలిసి జూబ్లీహిల్స్‌లోని దసపల్లా హోటల్‌లో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యాసంస్థల సీఈవో అండ్ అకడమిక్ డైరెక్టర్ సుష్మశ్రీ బొప్పన తన ఆనందాన్ని పంచుకున్నారు. ఆలిండియా మొదటి ర్యాంకుతో పాటు ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 3, 5, 6, 11 ర్యాంకులతో శ్రీచైతన్య తన ఆధిపత్యాన్ని కొనసాగించిందన్నారు. ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్–2025 ఆలిండియా 1వ ర్యాంకు వంగల అజయ్‌రెడ్డి (జనరల్, ఈడబ్ల్యూఎస్), జేఈఈ మెయిన్ 2025లో 300కి 300 మార్కులతో ఆలిండియా ఫస్ట్ ర్యాంకు సాధించడం గమనార్హం. ఆలిండియా 1వ ర్యాంకు డి.జి.రిత్విక్ సాయి (ఓబీసీ), ఆలిండియా ఓపెన్ కేటగిరీలో మూడో ర్యాంకు మాజిద్ హుస్సేన్, 5వ ర్యాంకు ఉజ్వల్ కేసరి, 6వ ర్యాంకు అక్షత్ కుమార్ చౌరాస్య, 11వ ర్యాంకు అర్ణవ్ నిగమ్, 16వ ర్యాంకు దేవదత్తా మాజి, 18వ ర్యాంకు డి.జి.రిత్విక్ సాయి, 19వ ర్యాంకు వంగల అజయ్‌రెడ్డి సాధించారని పేర్కొన్నారు. ఓపెన్ కేటగిరీలో టాప్ 10లోపు 3 ర్యాంకులతో పాటు, 20 లోపు 7 ర్యాంకులు, 50లోపు 19 ర్యాంకులు, 100 లోపు 29 ర్యాంకులు సాధించారని తెలిపారు.

కేకేఆర్ గౌతమ్ విద్యార్థుల ఉత్తమ ఫలితాలు



రసజ్ఞ

గుడివాడటౌన్: అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో కేకేఆర్ గౌతమ్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని కేకేఆర్ గౌతమ్ స్కూల్ ప్రిన్సిపాల్ సత్యారామ్ సోమవారం తెలిపారు. ఈ ఫలితాల్లో తమ పూర్వ విద్యార్థులు వివిధ కేటగిరిలలో 100 లోపు 13 ర్యాంకులు సాధించారన్నారు. తమ విద్యార్థిని కోరికన రసజ్ఞ ఆల్ ఇండియా 8వ ర్యాంకు, ఎం. మణిదీప్‌వర్మ 21, ఎస్. నిర్మిత్ 29, సీహెచ్. చేతన్ 34, కె. ధీరజ్ 37, ఎల్. చర్విత 41, జి. ప్రత్యూష 47, ఎస్. హేమంత్ అభిరామ్ 48, పివి శ్రీ వినయ్ 50వ ర్యాంకులతో పాటు 54, 73, 78, 91 ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు.

ఎస్ఆర్ విద్యార్థుల ప్రతిభ

విద్యారణ్యపురి: దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన జేఈఈ అడ్వాన్స్‌డ్–2025 ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభను చాటారని ఆ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్ రెడ్డి సోమవారం తెలిపారు. ఈ ఫలితాల్లో తమ విద్యార్థులు జాతీయ స్థాయిలో అన్నికేటగిరీల్లో కలిపి ఎం.రవిచంద్రారెడ్డి 8వ ర్యాంకు, వి.నాగసిద్ధార్థ 13వ ర్యాంకు, పి.సాక్షి 40వ ర్యాంకు, ఎ.అనుశ్రీ 47వ ర్యాంకు, బి.సాయి 68వ ర్యాంకు, బి.భరణీశంకర్ 90వ ర్యాంకు, జి.రాజేష్ 106వ ర్యాంకు, బి.వినోద్ 115వ ర్యాంకు, ఎం.వెంకటకౌశిక్ 123వ ర్యాంకు, ఎస్.పవన్ 204వ ర్యాంకు, ఎ.సంతోష్ 265వ ర్యాంకు, బి.వాగ్దేవి 269వ ర్యాంకు సాధించారని పేర్కొన్నారు.

నారాయణ జయభేరి

సాక్షి, హైదరాబాద్: జేఈఈ అడ్వాన్స్‌డ్–2025 ఫలితాల్లో నారాయణ విద్యార్థులు జయభేరి మోగించారు. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో మాజిద్ హుస్సేన్ 3వ ర్యాంకు, పార్థ్ మందర్ వార్తక్ 4వ ర్యాంకు, అక్షత్ చౌరాసియా 6వ ర్యాంకు, సాహిల్‌డియో 7వ ర్యాంకు, వడ్లమూడి లోకేశ్ 10వ ర్యాంకుతో టాప్–10 ర్యాంకుల్లో 5 ర్యాంకులు నారాయణ కైవసం చేసుకుందని ఆ విద్యాసంస్థల డైరెక్టర్స్ పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ తెలిపారు. అలాగే ఆలిండియా ఓపెన్ కేటగిరీలో టాప్ 100 లోపు 43 ర్యాంకులు తమ విద్యార్థులు కైవసం చేసుకున్నారని వెల్లడించారు. ఆలిండియా అన్ని కేటగిరీల్లో 10లోపు 10 ర్యాంకులు, 50 లోపు 42 ర్యాంకులు, 100 లోపు 75 ర్యాంకులను కైవసం చేసుకున్నారని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పునీత్ అభినందనలు తెలిపారు.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 17 సంచిక: 261
మంగళవారం 3-6-2025
SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | VIJAYAWADA | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి. పాడిపంటలతో పులకించిపోవాలి'


కార్ల్‌సన్‌పై గెలిచిన గుకేశ్
క్లాసికల్ చెస్ ఫార్మాట్‌లో సంచలన విజయం నమోదు - స్పోర్ట్స్‌లో


ఈవీ మేకర్స్‌కు గుడ్ న్యూస్!
తయారీ దేశంలో అయితే.. ట్యాక్స్ తక్కువే! - బిజినెస్‌లో


ముగ్గురు జవాన్ల మృత్యువాత
సిక్కింలో మిలటరీ క్యాంప్‌పై కొండచరియలు విరిగి పడి ముగ్గురు జవాన్లు మృత్యువాతపడగా ఆరుగురు గల్లంతయ్యారు.
వివరాలు 6లో ▸


పోలండ్ అధ్యక్షుడిగా కరోల్
పోలండ్ అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో కన్జర్వేటివ్ లా అండ్ జస్టిస్ పార్టీకి చెందిన కరోల్ నవ్‌రోకి ఎన్నికయ్యారు.
వివరాలు 6లో ▸


జీ7 శిఖరాగ్రానికి మోదీ డుమ్మా!?
కెనడాలో ఈ నెల 15 నుంచి మొదలయ్యే జీ7 శిఖరాగ్ర సమావేశానికి ప్రధాని మోదీ వెళ్లకపోవచ్చని తెలుస్తోంది.
వివరాలు 6లో ▸


ముగిసిన రష్యా–ఉక్రెయిన్ చర్చలు
తుర్కియే వేదికగా రష్యా–ఉక్రెయిన్ ప్రతినిధుల మధ్య జరిగిన రెండో విడత చర్చలు గంటలోపే ముగిశాయి.
వివరాలు 6లో ▸


న్యూస్‌రీల్

మంత్రి దుర్గేష్‌పై అన్నదాతల ఆగ్రహం

ఆరు నెలలు కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వకపోగా, ధాన్యం అమ్మి నెల రోజులైనా ఖాతాల్లో సొమ్ము జమ కాలేదని, గతంలో ఇటువంటి దుస్థితి ఎప్పుడూ చూడలేదని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్‌పై తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండల రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.
వివరాలు 2లో ▸

ఏపీ సర్కారుకు సుప్రీంకోర్టు నోటీసులు

బుగ్గ మఠం భూములపై మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం విచారణ జరిపిన జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సతీష్‌చంద్ర శర్మ ధర్మాసనం వారంలోగా సమాధానమివ్వాలని ఏపీ ప్రభుత్వానికి నోటీసులిచ్చింది.
వివరాలు 2లో ▸

డీసెట్‌కు 82.77 శాతం మంది హాజరు

సాక్షి, అమరావతి: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (డీసెట్) రెండేళ్ల కోర్సుల్లో ప్రవేశాలకు సోమవారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా 25 కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 82.77 శాతం మంది హాజరయ్యారు.

యూపీఐ లావాదేవీల రికార్డ్

పేద, ధనిక తేడా లేకుండా స్మార్ట్‌ఫోన్ వినియోగదారులందరికీ అత్యంత చేరువైన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలు గత నెలలో సరికొత్త రికార్డ్ నెలకొల్పాయి.
మే నెలలో యూపీఐ లావాదేవీల విలువ రూ. 25.14 లక్షల కోట్లను తాకింది.
వివరాలు బిజినెస్‌లో ▸

కేసులు తిరగదోడుతున్న చంద్రబాబు ప్రభుత్వం

కాపులు కరివేపాకులా?

రిజర్వేషన్ కోసం పోరాడిన కాపులపై గతంలో చంద్రబాబు ప్రభుత్వం కేసులు

తుని కేసు తిరగదోడేందుకు తాజాగా సర్కారు నిర్ణయం

కాపులపై కేసులు కొట్టేస్తూ 2023లో తీర్పునిచ్చిన విజయవాడ రైల్వే కోర్టు

దీనిపై హైకోర్టులో అప్పీల్ దాఖలు చేయాలని తాజాగా నిర్ణయించిన చంద్రబాబు ప్రభుత్వం

అందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు ఆదేశం.. ఉత్తర్వులూ జారీ

ప్రభుత్వ నిర్ణయంపై కాపు సామాజికవర్గం ఆగ్రహం

తమ భావోద్వేగాలకు సంబంధించిన అంశంపై బాబుకు ఇంత చిన్నచూపా?

తమ జాతినే అవమానించడంపై మండిపాటు

2లో

HOME (COURTS-B) DEPARTMENT

G.O.RT.No. 862 Dated: 02-06-2025
Read:
From the Public Prosecutor, High Court of Andhra Pradesh, Amaravati, Lr.Opinion No. 58 of 2024, dated 19.03.2025
***

ORDER:

In the circumstances explained by the Senior Divisional Security Commissioner, R.P.F., S.C.Railways, Vijayawada and the Opinion of the Public Prosecutor, High Court of Andhra Pradesh, Amaravati in the reference read above, the Government after careful examination of the matter and in exercise of the powers conferred under section 419 of the Bharatiya Nagarik Suraksha Sanhita, 2023 (Act No.46 of 2023), hereby direct the Public Prosecutor, High Court of Andhra Pradesh, Amaravati, to prefer an appeal before the Hon'ble High Court of Andhra Pradesh against the acquittal judgment passed by the Hon'ble VII Additional Metropolitan Magistrate Court for Railways, Vijayawada in C.C. No. 97/2021, dated 01.05.2023 along with delay condonation petition and duly specifying the reasons for delay to avoid further legal complications in the matter.

విజయవాడ రైల్వే కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టులో అప్పీల్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వు

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, కాకినాడ: రాష్ట్రంలో కాపులకు చంద్రబాబు ప్రభుత్వం భారీ ఝలక్ ఇచ్చింది. కక్ష సాధింపులో వారినీ టార్గెట్ చేసింది. కాపులను బీసీల్లో చేర్చాలన్న ఉద్యమం సందర్భంగా తునిలో చోటుచేసుకున్న ఘటనపై నమోదైన కేసులను ఏకంగా న్యాయస్థానమే కొట్టేసినా సరే టీడీపీ కూటమి ప్రభుత్వం ఇప్పుడు వాటిని తిరగదోడుతోంది. ఆ కేసుల పునర్విచారణకు అనుమతించాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీచేసి కాపు సామాజిక వర్గాన్ని తీవ్రషాక్‌కు గురిచేసింది. ప్రభుత్వ తాజా నిర్ణయం కాపుల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. ఎప్పుడో సమసిపోయిందనుకున్న కేసు తిరగదోడి కాపులను తిరిగి ఇబ్బందుల పాల్జేయాలనే కుట్రలను తిప్పికొడతామని కాపు నేతలు, కాపు సామాజికవర్గం వారు హెచ్చరిస్తున్నారు. కుట్రపూరితంగా ప్రభుత్వం తీసుకునే చర్యలను సహించబోమని, వాటికి వ్యతిరేకంగా సంఘటితంగా ఉద్యమిస్తామని వారు స్పష్టం చేస్తున్నారు.

మీ అనుభవం నేర్పింది

ఇదేనా బాబూ?

ముఖ్యమంత్రి చంద్రబాబును నిలదీసిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్



- మా ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో చేసిన రుణంలో.. మీరు ఏడాదిలోనే చేసిన అప్పు 44 శాతం
- మీరు అడ్డగోలుగా, భారీగా అప్పులు చేసినా అభివృద్ధి జాడ లేదు.. సంక్షేమం ఊసే లేదు
- మీ దశాబ్దాల అనుభవం ఏడాదిగా రాష్ట్రానికి ఇచ్చింది ఇదేనా?
- కాగ్, ఎంవోఎస్‌పీఐ నివేదికలు, గణాంకాలతో టీడీపీ కూటమి ప్రభుత్వ ఆర్థిక అసమర్థతను కడిగేస్తూ 'ఎక్స్'లో వైఎస్ జగన్ పోస్టు

3లో

నేడు తెనాలిలో మాజీ సీఎం **వైఎస్ జగన్ పర్యటన**

3లో

పోలీసుల దాడిలో గాయపడ్డ జాన్ విక్టర్ కుటుంబానికి పరామర్శ

ఎన్టీఆర్ జిల్లా విజయవాడ వాంబే కాలనీ సమీపంలో రేషన్ దుకాణం వద్ద సర్వర్ పనిచేయకపోవటంతో గంటల తరబడి క్యూలైన్‌లో వేచి ఉన్న ప్రజలు



తిండిగింజలకు నానాతిప్పలు

రాష్ట్రంలో రెండో రోజూ రేషన్ పరేషాన్

5లో

- రాత్రివేళల్లోనూ తప్పని పడిగాపులు
- సుదూరం నుంచి రాలేక తీవ్ర అవస్థలు పడుతున్న వృద్ధులు
- సాయం చేసేవారు లేక దివ్యాంగుల ఎదురుచూపులు
- సర్వర్లు మొరాయించడంతో గంటల కొద్దీ నిరీక్షణ
- మండుటెండలో చిన్నారులతో మహిళలకు నరకయాతన

ఆపరేషన్ స్పైడర్స్‌వెబ్... నయా పెరల్ హార్బర్!

ఆధునిక యుద్ధ చరిత్రలోనే అతి పెద్ద సర్జికల్ స్ట్రైక్స్

రష్యాకు తీరని అవమానం మిగిల్చిన ఉక్రెయిన్ డ్రోన్ దాడులు



- మూడు టైమ్ జోన్ల పరిధిలో దాడులు
- 41 బాంబర్, నిఘా విమానాలు ధ్వంసం
- మూడో వంతు ఫ్లీట్‌ను నష్టపోయిన రష్యా
- నష్టం విలువ రూ.60 వేల కోట్ల పై చిలుకే!
- ఒక్కోటీ రూ.42 వేలు చేసే 117 డ్రోన్లతో కారుచౌకగా పని పూర్తి చేసిన ఉక్రెయిన్



6లో



కోవిడ్ పరీక్షలు పెంచండి

ప్రభుత్వ మొద్దునిద్రపై 'సాక్షి' కథనంతో వైద్యశాఖ హడావుడిగా సమీక్ష

10 రోజుల క్రితమే ఏపీలో పాజిటివ్ కేసులు.. నాటి నుంచి నేటి వరకూ పరీక్షల పెంపునకు కనీస చర్యల్లేవు

12లో

కొల్లేరు ప్రజల సమస్యలకు

పరిష్కారం

ముఖ్యమంత్రి చంద్రబాబు



సాక్షి,అమరావతి: పర్యావరణపరంగా కొల్లేరు సరస్సును పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. కొల్లేరుపై కోర్టు తీర్పులు, నిబంధనలు, కేంద్ర సంస్థల ఆదేశాలు, స్థానిక పరిస్థితులు, పర్యావరణ, కాంటూరు అంశాలపై చంద్రబాబు సచివాలయంలో సోమవారం సమీక్షించారు. కొల్లేరు నుంచి నీటిని సముద్రంలోకి తీసుకువెళ్లే ఉప్పుటేరు ఆక్రమణలను తొలగించడంతో పాటు ఉప్పుటేరు పూడిక తీసి, నీరు సజావుగా సముద్రంలోకి వెళ్లేలా చేయాలన్నారు. కాగా, 'పచ్చదనం'పై సచివాలయంలో మరో సమీక్షలో సీఎం మాట్లాడుతూ, ఈ నెల 5న కోటి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ పాలనలో స్పేస్ టెక్నాలజీని విస్తృతంగా వినియోగించుకునేలా ఇస్రో–ఆర్టీజీఎస్ మధ్య సీఎం సమక్షంలో అవగాహన ఒప్పందం కుదిరింది.

ఇదండీ సంగతి



పనికిమాలిన ప్రచారం ఎందుకు చేతనైతే మాకు బస్సులో ఉచిత ప్రయాణం ఇమ్మనండీ!



డీల్ కాదు.. జేబు ఖాళీ!

- ఈ–కామర్స్ కంపెనీల మాయాజాలం
- 'డార్క్ ప్యాటర్న్లు'తో గాలం
- అవసరం లేకపోయినా కొనిపించేలా ఎత్తులు.. రంగంలోకి కేంద్ర వినియోగదారుల మంత్రిత్వ శాఖ

12లో



ఎండలు ముందే ముగిశాయెందుకు?

- గత ఏడాదితో పోలిస్తే ముందస్తుగా ముగిసిన ఎండాకాలం
- గత ఏడాది మే, జూన్‌లో భానుడి భగభగలు
- ఈసారి మేలో చల్లదనం, దేశవ్యాప్తంగా చాలా చోట్ల వర్షాలు
- వాతావరణ చక్రంలో మార్పులే కారణమంటున్న నిపుణులు

6లో

మర్రిపూడి ఎస్సై అరాచకం


మహిళపై ఎస్సై రమేష్‌బాబు దౌర్జన్యం చేస్తున్న సీసీ టీవీ ఫుటేజీ

సీసీ ఫుటేజీ కోసం కిరాణా షాపులో మహిళపై దౌర్జన్యం

- రాష్ట్రంలో మహిళలపై దాడులు జరిగితే ఉపేక్షించేది లేదని సీఎం చంద్రబాబు గత నెల 28న కడపలో జరిగిన మహానాడులో ప్రకటించారో లేదో ప్రకాశం జిల్లా కొండపి మండలం జాళ్లపాలెంలో మర్రిపూడి ఎస్సై ఎ.రమేష్‌బాబు మహిళపై దౌర్జన్యం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది.

2లో

పుట్టపర్తిలో విదేశీయుడి అనుమానాస్పద మృతి

- శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో విదేశీయుడు మృతి చెందాడు. ఆయనను బెలారస్ దేశానికి చెందిన డేవిడ్ డోవిచ్ (44)గా గుర్తించారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

- వివరాలు 12లో


మృతి చెందిన డేవిడ్ డోవిచ్

జీతాలు రాక.. ఎంటీఎస్ టీచర్ ఆత్మహత్య

అప్పులపాలై..మానసిక వేదనకు గురై బలవన్మరణం

- తూర్పు గోదావరి జిల్లాలో ఘటన
- ఉద్యోగ భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైంది
- రెగ్యులర్‌గా జీతాలు ఇవ్వకపోవడంవల్లే సమస్యలు
- టీచర్ల ఆత్మహత్యలకు ప్రభుత్వం బాధ్యత వహించాలి
- ఎంటీఎస్ టీచర్లకు ప్రాధాన్యం ఇవ్వాలి
- ఎంటీఎస్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్

5లో


విజయకుమార్ (ఫైల్)

క్లుప్తంగా...

ఏపీ సర్కారుకు సుప్రీం నోటీసులు

- బుగ్గమఠం భూములపై వారంలోగా సమాధానం ఇవ్వాలని ఆదేశం
- ప్రభుత్వం కౌంటర్‌పై రిజాయిండర్ దాఖలుకు పెద్దిరెడ్డికి వారం గడువు



సాక్షి, న్యూఢిల్లీ: తిరుపతి బుగ్గ మఠం భూములపై మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం విచారణ జరిపిన జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సతీష్‌చంద్ర శర్మ ధర్మాసనం వారం రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని ఏపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. అలాగే, ప్రభుత్వం ఇచ్చిన కౌంటర్‌పై వారం రోజుల్లోగా రిజాయిండర్ దాఖలు చేసేందుకు పిటిషనర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సమయం ఇచ్చింది. అప్పటివరకు భూములపై యథాతథ స్థితి కొనసాగించాలని ఆదేశాలు జారీ చేసింది. పిటిషనర్ పెద్దిరెడ్డి తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి, ఏపీ ప్రభుత్వం తరపున సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. బుగ్గమఠం భూములు ఖాళీ చేయాలంటూ మఠం అసిస్టెంట్ కమిషనర్/ఈవో ఇచ్చిన ప్రొసీడింగ్స్‌పై ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సుప్రీంకోర్టులో ఈ పిటిషన్ దాఖలు చేశారు.

సీఎంను కలిసిన నాస్కాం సభ్యులు

సాక్షి, అమరావతి: టెక్నాలజీ రంగంలో ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి నాస్కాం ముందుకొచ్చిందని, ఏపీని ప్రపంచటెక్ హబ్‌గా నిలబెట్టడానికి అవసరమైన సహాయ సహకారాలు అందించనున్నట్టు సీఎం చంద్రబాబు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. సోమవారం నాస్కాం అధ్యక్షుడు రాజేశ్ నంబియార్ ప్రతినిధుల బృందం సీఎంని కలిసి రాష్ట్రంలో అమలు చేస్తున్న ఏఐ, జీసీసీ, ఈఆర్అండ్‌డీ, గవర్నమెంట్ టెక్నాలజీ ఇన్నోవేషన్స్, కోస్టల్ క్లౌడ్, గ్రీన్‌డేటా వంటి వాటిలో కలిసి పనిచేయడానికి ఆసక్తిని వ్యక్తంచేసినట్లు ఆయన పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ నుంచి ఏడుగురు కౌన్సిలర్ల సస్పెన్షన్



మాట్లాడుతున్న స్వామిదాసు

తిరువూరు: ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జారీ చేసిన విప్ ఉల్లంఘించి టీడీపీ బలపరచిన అభ్యర్థికి ఓటేసిన ఏడుగురు కౌన్సిలర్లను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసు ప్రకటించారు. తిరువూరులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజాదరణ లేని టీడీపీ వక్రమార్గంలో నగర పంచాయతీని చేజిక్కించుకోడానికి వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను తనవైపునకు తిప్పుకుందని ధ్వజమెత్తారు. టీడీపీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లతో రాజీనామా చేయించిన తర్వాత తిరిగి పోటీ చేయించాలని సవాల్ చేశారు. చైర్‌పర్సన్ ఎన్నికల్లో నిజాయితీగా వ్యవహరించిన కౌన్సిలర్లను ఆయన అభినందించారు. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని నియోజకవర్గంలో అక్రమ వ్యాపారాలు, దందాలు చేస్తూ శాంతియుత వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారని స్వామిదాసు విమర్శించారు. డబ్బుతో నీతిమాలిన పనులు చేయగలమనుకుంటే ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. మీడియా సమావేశంలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు తంగిరాల వెంకటరెడ్డి, పరసా శ్రీనివాసరావు, మోదుగు ప్రసాద్, వెలుగోటి విజయలక్ష్మి, రామవరపు మంజుల, షేక్ నదియా, పాలం రమాదేవి, గుమ్మా వెంకటేశ్వరి, ఇనపనూరి చిన్నారి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై నివేదికకు ఆదేశం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించిన గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలు, ప్రయోజనాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని కేంద్ర ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి సజ్జన్ సింగ్ యాదవ్ కేంద్ర జల్‌శక్తి శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (టెక్నికల్) అనూప్‌కుమార్ శ్రీవాత్సవను ఆదేశించారు. సోమవారం ఢిల్లీలో జరిగిన సమావేశంలో, రాష్ట్ర అధికారులు ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇస్తూ, కేంద్ర ఆర్థిక సహాయం కోరారు. సమగ్ర నివేదిక వచ్చిన తర్వాత మళ్లీ సమీక్ష సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పీయూష్‌కుమార్, జలవనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కేసులు తిరగదోడుతున్న చంద్రబాబు ప్రభుత్వం

కాపులు కరివేపాకులా?

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, కాకినాడ: చంద్రబాబు ప్రభుత్వ మోసపూరిత వైఖరిపై కాపు సామాజికవర్గం భగ్గుమంటోంది. తమను లక్ష్యంగా చేసుకుని కక్ష సాధింపులకు దిగడంపై యావత్ కాపు సామాజికవర్గం మండిపడుతోంది. ఏరు దాటాక బోడి మల్లయ్య అన్నరీతిలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చంద్రబాబు తమను కూరలో కరివేపాకులా తీసిపారేయడం మాత్రమే కాదు.. ఏకంగా అక్రమ కేసులు పెట్టి వేధించే కుట్రకు తెగబడటంపై ఆ సామాజికవర్గంలో సర్వత్రా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. కాపులను బీసీల్లో చేర్చాలన్న ఉద్యమం సందర్భంగా నమోదైన కేసులను ఏకంగా న్యాయస్థానమే కొట్టివేసినా సరే ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వం వాటిని తిరగదోడాలని నిర్ణయించడం.. పునర్విచారణకు అనుమతించాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసేందుకు అనుమతి ఇస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేయడం టీడీపీ కూటమి ప్రభుత్వం బరితెగించడం కాపు సామాజికవర్గాన్ని షాక్‌కు గురి చేసింది. ఎన్నికల ముందు కల్లబొల్లి కబుర్లు చెప్పి తమ ఓట్లు దండుకున్న చంద్రబాబు ప్రస్తుతం అధికారంలోకి రాగానే తన అసలు నైజాన్ని చూపించారని కాపు సామాజికవర్గం దుయ్యబడుతోంది. కక్ష సాధింపు కోసం చంద్రబాబు ప్రభుత్వం తెరతీసిన ఈ దుష్ట సంప్రదాయం రాష్ట్ర రాజకీయాలను మరింత కలుషితం చేయడమే కాకుండా రాష్ట్రంలో వర్గ వైషమ్యాలు రేకెత్తించే ప్రమాదం ఉందని కూడా పరిశీలకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు వెన్నుపోటు రాజకీయాలకు మరోసారి గురయ్యామని కాపు సామాజికవర్గీయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాపులను బీసీల్లో చేరుస్తామని 2014 ఎన్నికల మేనిఫెస్టోలో చంద్రబాబు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించారు. ఎన్నికల హామీని అమలు చేయాలని కాపు రిజర్వేషన్ పోరాట ఉద్యమాన్ని చేపడితే 2016లో అక్రమ కేసులు పెట్టి వేధించారు. ఆ కేసులను న్యాయస్థానాలే తోసిపుచ్చడంతో కాపులకు ఊరట లభించింది. కాగా 2024 ఎన్నికల్లో మరోసారి కాపులను మాయమాటలతో చంద్రబాబు కనికట్టు చేశారు. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత 2016 నాటి కేసును తిరగదోడి కాపు సామాజికవర్గంపై కక్ష సాధింపు చర్యలకు చంద్రబాబు ప్రభుత్వం తెగబడటం గమనార్హం. గతంలో చేసిన మోసానికి 2019లో చంద్రబాబు ప్రభుత్వాన్ని ఓడించామని, ఈసారి చేస్తున్న మోసానికి కూడా అదే రీతిలో శిక్షిస్తామని కాపు సామాజిక వర్గం స్పష్టం చేస్తోంది. ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలకు వ్యతిరేకంగా సమష్టిగా పోరాడతామని... తమ సత్తా ఏమిటో చంద్రబాబుకు మరోసారి రుచి చూపిస్తామని చెబుతోంది.

కాపు సామాజికవర్గమే లక్ష్యంగా కుట్ర

ఉత్తర్వులు జారీ చేసిన టీడీపీ కూటమి ప్రభుత్వం

రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం కాపులను మరోసారి లక్ష్యంగా చేసుకుంది. కాపు రిజర్వేషన్ల వ్యవహారంలో కాపులు 2016లో చేపట్టిన ఆందోళనకారులపై అప్పట్లో కేసులు పెట్టిన తెలుగుదేశం ప్రభుత్వం, ఇప్పుడు మరోసారి ఆ ఉద్యమకారులను జైలు పాల్జేయడానికి కంకణం కట్టుకుంది. కాపులను ఓబీసీల్లో చేర్చాలన్న డిమాండ్‌తో ఆందోళన చేపట్టినందుకు మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంతో సహా పలువురు కాపులపై అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం 2016లో కేసులు నమోదు చేసింది. మొత్తం 329 కేసులు పెట్టింది. ఇందులో పలు కేసులను ఆ తర్వాత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉపసంహరించింది. మరికొన్ని కేసులపై విచారణ జరిపిన విజయవాడ రైల్వే కోర్టు ముద్రగడ పద్మనాభంతోపాటు 41 మందిని నిర్దోషులుగా ప్రకటించింది. ఆ మేర 2023 మే 1న తీర్పు వెలువరించింది. ఇప్పుడు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మళ్లీ ఆ కేసులను తిరగదోడుతోంది. కాపు ఉద్యమకారులను నిర్దోషులుగా ప్రకటిస్తూ విజయవాడ రైల్వే కోర్టు ఇచ్చిన తీర్పుపై హైకోర్టులో అప్పీల్ దాఖలు చేయాలని నిర్ణయించింది. అందుకు రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ)కి అనుమతినిచ్చింది. విజయవాడ రైల్వే కోర్టు తీర్పుపై హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ఆదేశించింది. ఈ మేరకు హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ సోమవారం జీవో 852 జారీ చేశారు.

హామీని నిలబెట్టుకోని చంద్రబాబు ప్రభుత్వం

2014 టీడీపీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు తమను ఓబీసీల్లో చేర్చాలంటూ కాపులందరూ కూడా 2016 జనవరి 30న తూర్పు గోదావరి జిల్లా, తునిలో 'కాపు గర్జన' పేరుతో సభను ఏర్పాటు చేశారు. అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం తీరుకు నిరసనగా ఈ కార్యక్రమంలో వేల మంది కాపులు పాల్గొన్నారు. కాపు ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేయడం కోసం కొందరు గుర్తు తెలియని విద్రోహులు అందులో చేరి రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌కు నిప్పుపెట్టారు. దీనిపై అప్పటి టీడీపీ ప్రభుత్వం, రైల్వే పోలీసులు ఆందోళనకారులపై 329 కేసులు నమోదు చేశారు. పెద్ద సంఖ్యలో కాపులపై కేసులు పెట్టారు. అయితే కాపులు కేసులకు భయపడకుండా ఆ తరువాత కూడా తమ ఉద్యమాన్ని కొనసాగించారు. వైఎస్ జగన్ సీఎం అయిన తరువాత కాపు ఉద్యమకారులపై గతంలో పెట్టిన కేసుల్లో అత్యధిక కేసులను ఉపసంహరించుకున్నారు. కొన్ని కేసుల్లో విజయవాడ కోర్టు 2023లో ఉద్యమకారులను నిర్దోషులుగా ప్రకటించింది. ఇప్పుడు ఆ తీర్పుపై అప్పీల్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది.

చంద్రబాబు కాపు వ్యతిరేకి



సీఎం చంద్రబాబు కాపు వ్యతిరేకి. కాపులపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే కోర్టు కొట్టేసిన కేసుపై పునర్విచారణకు వెళ్లాలని చూస్తున్నారు. అన్యాయంగా కాపు జాతిని ఇబ్బంది పెట్టాలని చూస్తే ఉపేక్షించేది లేదు. తగిన గుణపాఠం చెబుతాం.

– చినమిల్లి వెంకటరాయుడు, కాపునాడు పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు

కాపులను ఇబ్బంది పెడితే సహించం..

గత ప్రభుత్వంలో రైలు దగ్ధం కేసులో కాపులపై పెట్టిన కేసులు కొట్టేస్తే.. ఈ ప్రభుత్వం వాటిని తిరగదోడి కాపులను ఇబ్బందులకు గురిచేయాలని చూస్తే సహించేదిలేదు. రాష్ట్ర ప్రభుత్వం కాపులపై కక్ష సాధింపు చర్యలను మానుకోవాలి. కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి కాపులపై కేసులు పెరిగిపోయాయి. ఎమ్మెల్యే సీట్లు తగ్గించారు. నామినేటెడ్ పోస్టుల్లో కూడా కాపులను పూర్తిగా విస్మరించారు. ప్రభుత్వం కాపులపై వివక్ష చూపడం సమంజసం కాదు.

– సంకటి లక్ష్మణరావు, పీవీఆర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపునాడు అధ్యక్షులు

కేసు తిరగదోడటం మంచి పద్ధతి కాదు..



కాపు సామాజికవర్గంపై కక్ష సాధింపు చర్యగా ప్రభుత్వ నిర్ణయాన్ని పరిగణిస్తున్నాం. రైలు ప్రమాద ఘటన అనేది ముగిసిన అధ్యాయం. తిరిగి ఆ కేసును రీ ఓపెన్ చేయడం బాధాకరం. కాపులమంతా దీన్ని తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఎప్పుడో జరిగిన ఘటనను మళ్లీ తెరపైకి తీసుకురావడం మంచి పద్ధతి కాదు. ఇది కాపు జాతి మనోభావాలను దెబ్బతీసే చర్యగా భావిస్తాం.

– బండి శ్రీనివాసరావు, కాపు సామాజికవర్గ ఐక్యవేదిక నాయకుడు, కైకలూరు నియోజకవర్గం, ఏలూరు జిల్లా

కాపుల జోలికొస్తే సర్కారు పతనమే..



తుని కేసును పునర్విచారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుయుక్తులు పన్నుతోంది. కాపులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. కాపుల కారణంగానే ఈ రోజు ప్రభుత్వంలో ఉన్నారు. అది మరిచిపోయి కాపు జాతిపై కక్ష సాధింపునకు పాల్పడితే చంద్రబాబు సర్కారుకు పతనమే.

– తోట రాజీవ్, రాష్ట్ర కాపు జేఏసీ కన్వీనర్

రంగా కేసును ముందు పునర్విచారణ చేయాలి..



గతంలో కాపులను టీడీపీ ప్రభుత్వం అనేక రకాలుగా వేధించింది. కాపులను అణచివేసే ప్రయత్నం చేసింది. అక్రమ కేసులు బనాయించింది. తుని రైలు దగ్ధం కేసును కోర్టు కొట్టివేసింది. కాపులే లక్ష్యంగా ఆ కేసును పునర్విచారించాలని కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు మానుకోవాలి. కాపులను వేధింపులకు గురిచేస్తే సహించేదిలేదు. పాత కేసులు పునర్విచారణ చేయించాలనుకుంటే ముందుగా వంగవీటి మోహన్‌రంగా హత్య కేసును పునర్విచారణ జరపాలి.

– యర్రంశెట్టి అంజిబాబు, రాష్ట్ర అధ్యక్షుడు, ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం

ఇలాగైతే బలిజలు కూటమిలో ఇమడలేరు..



రెండేళ్ల క్రితం తుని ఘటనపై సాక్ష్యాధారాలు లేవంటూ కోర్టు కొట్టేసిన కేసును ఇప్పుడు తెరపైకి తీసుకురావాల్సిన అవసరంలేదు. ఒకవేళ అలాంటి ప్రయత్నం ఏదైనా చేస్తే కూటమి ప్రభుత్వంలో ఉన్న మాలాంటి వాళ్లపై ఒత్తిడి పెరుగుతుంది. బలిజలంతా కూటమిలో ఇమడలేని పరిస్థితులు తలెత్తుతాయి.

– రామమూర్తి, కాపు జేఏసీ రాష్ట్ర సహ కార్యదర్శి, బీజేపీ చిత్తూరు జిల్లా నాయకుడు, చిత్తూరు.

---

59 కేజీల బంగారం లూటీ

- కర్ణాటకలో భారీ బ్యాంకు దోపిడీ
- వారం రోజుల తరువాత వెలుగులోకి...



దోపిడీ జరిగిన బ్యాంకు వద్ద మే 26 ఉదయం పోలీసుల విచారణ

బనశంకరి: కర్ణాటకలో భారీ బ్యాంకు దోపిడీ జరిగింది. ఒకటీ రెండూ కాదు.. ఏకంగా 59 కేజీల బంగారాన్ని దొంగలు ఎత్తుకుపోయారు. మే నెల 25వ తేదీ ఆదివారం జరిగిన దోపిడీ, వారం తర్వాత సోమవారం వెలుగులోకి వచ్చింది. విజయపుర (బిజాపుర) జిల్లా, బసవన బాగేవాడి తాలూకా, మనగోళిలోని కెనరా బ్యాంకు బ్రాంచిలో ఈ భారీ దోపిడీ చోటుచేసుకుంది. రాత్రికి రాత్రి బ్యాంకులో ఉన్న 59 కిలోల బంగారు ఆభరణాలు, రూ.5.20 లక్షల నగదు మాయమైంది. పోయిన బంగారు నగల విలువను రూ.53.26 కోట్లుగా అంచనావేశారు. అయితే వారం తర్వాత ఈ ఘటనను బయటపెట్టడం పలు అనుమానాలకు తావిస్తోంది. జిల్లా ఎస్పీ లక్ష్మణ నింబరగి సోమవారం దోపిడీ వివరాలను మీడియాకు తెలిపారు. 6 నుంచి 8 మంది దొంగలు ఈ దోపిడీలో పాల్గొన్నట్లు భావిస్తున్నారు. బ్యాంకు లాకర్ తెరవడానికి, సైరన్ బంద్ చేయడానికి నకిలీ తాళం వాడారు. బ్యాంకు ఆవరణలో ఉన్న సీసీ కెమెరాలను పక్కకు తిప్పేశారు. వెళ్లేటప్పుడు సీసీ కెమెరాలు, డీవీఆర్, హార్డ్ డిస్క్‌లను పట్టుకెళ్లారు. బ్యాంకు ప్రవేశ ద్వారం తాళం బద్దలుకొట్టారు. బ్యాంకు కిటికీల కడ్డీలను లోపలి నుంచి కత్తిరించి బ్యాంకులోకి ప్రవేశించారు. దోపిడీదారులు దర్యాప్తు దృష్టి మరల్చడానికి అనేక ప్రయత్నాలు చేశారు. బ్యాంకులోపల చేతబడి చేసినట్లు నల్లబట్ట, నిమ్మకాయ పెట్టి పూజ చేశారు. మనగోళి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. విషయం వెలుగులోకి రాగానే బంగారం కుదువపెట్టిన ఖాతాదారులు, లాకర్లలో నగలు దాచుకున్న కస్టమర్లల్లో ఆందోళన నెలకొంది.

పోలీసులు అత్యంత కిరాతకంగా హింసించారు

తెనాలి ఘటనపై జాతీయ ఎస్సీ కమిషన్, ఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఎంపీ గురుమూర్తి ఫిర్యాదు



సాక్షి, న్యూఢిల్లీ: 'రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల యువకుల పట్ల పోలీసులు అత్యంత కిరాతకంగా వ్యవహరిస్తున్నారు. ఇందుకు తెనాలి ఘటనే ఉదాహరణ' అని వైఎస్సార్‌సీపీ తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి అన్నారు. 'తెనాలిలో నడిరోడ్డుపై ప్రజల సమక్షంలో ముగ్గురు దళిత, మైనారిటీ యువకులను పోలీసులు దారుణంగా హింసించారు. ఇంత జరిగినా ఏపీ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదు. పోలీసులపై తక్షణం చర్యలు తీసుకోవాలి' అని కోరుతూ జాతీయ ఎస్సీ కమిషన్ చైర్‌పర్సన్ కిషోర్ మక్వానా, జాతీయ మానవ హక్కుల సంఘం(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) చైర్మన్ రామసుబ్రమణియన్‌లకు సోమవారం ఎంపీ గురుమూర్తి ఫిర్యాదు చేశారు. తెనాలి ఘటన వీడియోలు, పత్రికల్లో వచ్చిన కథనాలను ఢిల్లీలోని జాతీయ ఎస్సీ కమిషన్, ఎన్‌హెచ్‌ఆర్‌సీ కార్యాలయాల్లో అందజేశారు. 'రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలను లక్ష్యంగా చేసుకుని పోలీసులు క్రూరంగా ప్రవర్తిస్తున్నారు. రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించడమే కాకుండా న్యాయం, సమానత్వం, వ్యక్తి గౌరవం అనే మూలస్తంభాలపై రాజ్యాంగ నిర్మాతలు నిర్మించిన ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. గుంటూరు జిల్లా తెనాలిలో ప్రజలను బెంబేలెత్తించే విధంగా నడిరోడ్డు మీదే ముగ్గురు యువకులు చేబ్రోలు జాన్‌విక్టర్, షేక్ బాబూలాల్, దోమ రాకేష్‌లపై పోలీసులు దాడికి పాల్పడ్డారు. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 21, 22లను ఉల్లంఘించారు. సుప్రీంకోర్టు తీర్పులను కూడా అవమానించారు. దాచేపల్లిలో హరికృష్ణ అనే యువకుడి పట్ల కూడా పోలీసులు అత్యంత క్రూరంగా వ్యవహరించారు. హరికృష్ణను అక్రమంగా పోలీసు క్వార్టర్స్‌లో నిర్బంధించి తీవ్రంగా హింసించారు.' అని గురుమూర్తి తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇసుక దోపిడీపై టీడీపీలోనే ఆగ్రహ జ్వాల!

- ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై పార్టీ కార్యకర్త ఆగ్రహం
- లంచమిస్తేనే చర్యలంటే.. అందుకూ రెడీ అంటూ ఆవేదన
- జాయింట్ కలెక్టర్ ముందు జేబులోంచి రూ.1.50లక్షలు బయటకు..
- తప్పుడు ఫిర్యాదు చేస్తే తనపైనే చర్యలు తీసుకోవాలని సవాల్
- శ్రీకాకుళం జిల్లాను హీటెక్కించిన ఘటన



జేసీ ఎదుట రూ.లక్షా 50వేలు బయటికి తీసిన టీడీపీ సీనియర్ కార్యకర్త సనపల సురేశ్



పరిమితికి మించి ఇసుక లోడ్ చేయడంతో నారాయణపురం వద్ద విరిగిన లారీ చక్రాలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: శ్రీకాకుళం జిల్లాలో ఇసుక దోపిడీపై టీడీపీ శిబిరంలోనే అసంతృప్తి భగ్గుమంటోంది. జిల్లా రాజకీయ వాతావరణాన్ని ఒక్కసారిగా వేడెక్కించింది. జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో టీడీపీ కార్యకర్త సనపల సురేశ్ తన సొంత పార్టీకి చెందిన ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, ఆయన అనుచరులపై ఇసుక దోపిడీకి సంబంధించి నేరుగా ఫిర్యాదు చేయడం కలకలం రేపింది. లంచం లేకపోతే చర్యలు ఉండవంటూ ఆవేదన వ్యక్తం చేసిన ఆయన, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తదితర అధికారుల సమక్షంలోనే రూ.1.50లక్షల నగదు జేబులోంచి బయటకు తీయడం మరింత సంచలనం రేపింది.

లంచమిస్తా.. చర్యలు తీసుకోండి: సనపల సురేశ్

గ్రీవెన్స్ సెల్‌లో సురేశ్ మాట్లాడుతూ, 'ఇసుక అక్రమ తవ్వకాలను ఆపండి. ఇప్పటికే ఎన్నో సార్లు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశాను. మైనింగ్ అధికారులకు ఎప్పటికప్పుడు ఫిర్యాదు చేస్తున్నాను. కానీ చర్యలు తీసుకోవడం లేదు. ఇసుక అక్రమాలను అడ్డుకుంటున్నానని ఎమ్మెల్యే అనుచరులు నాపై దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. నాపై దౌర్జన్యం చేసిన వారిపై చర్యలు కూడా తీసుకోవడం లేదు. ఒకవేళ తప్పుడు ఫిర్యాదులు చేశాననుకుంటే నాపై చర్యలు తీసుకోండి. లంచాలకు అలవాటు పడి ఇసుక అక్రమాలను అడ్డుకోవడం లేదు. అదే లంచం నేను ఇస్తాను.. చర్యలు తీసుకోండి' అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా 'ఇదిగో.. లంచం అంటూ' తన జేబులో నుంచి రూ.1.50 లక్షలు తీసి ఇవ్వడానికి సిద్ధమవడంతో అందరూ షాక్‌కు గురయ్యారు. సుదీర్ఘకాలంగా టీడీపీకి విధేయుడిగా, సీనియర్ కార్యకర్తగా కొనసాగుతున్న సురేశ్, ఇసుక అక్రమాలను చూసి తట్టుకోలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు.

వంశధార, నాగావళి పరీవాహక ప్రాంతాల్లో అడ్డగోలు తవ్వకాలు

వంశధార, నాగావళి నదీ పరీవాహక ప్రాంతాల్లో అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఇష్టారీతిన తవ్వకాలతో ఎక్కడికక్కడ భారీ గోతులు ఏర్పడి దీవుల్లా కనిపిస్తున్నాయి. వందలాది లారీల రవాణాతో రోడ్లన్నీ ఛిద్రమైపోతున్నాయి. ఒక్క ఆమదాలవలస నియోజకవర్గంలోనే ఇసుక ద్వారా రోజుకి రూ.50 లక్షలకు పైగా తెలుగు తమ్ముళ్లు అక్రమంగా ఆర్జిస్తున్నట్లు అంచనాలు ఉన్నాయి. అనుమతులిచ్చిన ర్యాంపుల గడువు ముగిసినప్పటికీ తవ్వకాలు ఆపడం లేదు. డీసిల్టేషన్ పాయింట్‌లోనైతే పరిమితికి మించి తవ్వకాలు జరుపుతున్నారు. పరిమితికి మించి లోడింగ్, రవాణా చేయడంతో లారీల చక్రాలు కూడా విరిగిపోతున్న పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయి.

మర్రిపూడి ఎస్సై అరాచకం

సీసీ ఫుటేజీ కోసం కిరాణా షాపులో మహిళపై దౌర్జన్యం

కిరాణా షాపు నిర్వాహకుడి కుటుంబ సభ్యులతో మర్రిపూడి ఎస్సై అనుచిత ప్రవర్తన వీడియో కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి



మహిళపై ఎస్సై రమేష్‌బాబు దౌర్జన్యం చేస్తున్న సీసీ టీవీ ఫుటేజీ

ఒంగోలు టాస్క్‌ఫోర్స్: రెడ్‌బుక్ రాజ్యాంగంలో సామాన్యుల పట్ల పోలీసుల దాడులు పెరిగిపోతున్నాయి. తెనాలిలో నడి రోడుడపై దళిత, మైనారిటీ యువకులను హింసించిన ఘటన మరువకముందే ప్రకాశం జిల్లాలో ఓ ఎస్సై మహిళపై దౌర్జన్యం చేశారు. రాష్ట్రంలో మహిళలపై దాడులు జరిగితే ఉపేక్షించేది లేదని సీఎం చంద్రబాబు గత నెల 28న కడపలో జరిగిన మహానాడులో ప్రకటించారో లేదో ప్రకాశం జిల్లా కొండపి మండలం జాళ్లపాలెంలో మర్రిపూడి ఎస్సై ఎ.రమేష్‌బాబు మహిళపై దౌర్జన్యం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. దీనిపై జాళ్లపాలెం గ్రామానికి చెందిన మారంరెడ్డి కొండలరావు అదేరోజు కొండపి పోలీస్‌స్టేషన్‌కు, ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోవటంతో సోమవారం జిల్లా ఎస్పీకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం ప్రకారం... జాళ్లపాలెంలో మారంరెడ్డి కొండలరావు నిర్వహిస్తున్న కిరాణా దుకాణంలో సీసీ కెమెరా ఏర్పాటు చేసుకున్నారు. గత నెల 28న కొండపి మండలం పెట్లూరు శివాలయంలో రూ.7 లక్షల విలువైన బంగారు, వెండి వస్తువులు, జరుగుమల్లి మండలం ఎన్‌ఎస్ కండ్రిక పంచాయతీ కొత్తపాలెం అంకమ్మ తల్లి ఆలయంలో రూ.70 వేల విలువైన వెండి వస్తువులు, హుండీలో సుమారు రూ.20 వేల నగదు చోరీకి గురయ్యాయి. ఈ కేసుల విచారణలో భాగంగా మర్రిపూడి ఎస్సై రమేష్‌బాబు జాళ్లపాలెం వెళ్లారు. కొండలరావు షాపు వద్ద సీసీ కెమెరా ఉన్నట్లు తెలుసుకుని అతడి కుటుంబ సభ్యులను సీసీ టీవీ ఫుటేజీ పరిశీలించాలని కోరారు. వారు యజమాని కొండలరావు లేరని చెప్పగా.. ఎస్సై రమేష్‌బాబు వెంటనే కొండలరావు కుమారుని ద్వారా ఫోన్ చేయించి అతడితో మాట్లాడారు. కొండలరావు ఎస్సైతో మాట్లాడుతూ తాను ఊళ్లో లేనని, సాయంత్రం వస్తానని, పెన్ డ్రైవ్ ఇస్తే సీసీ ఫుటేజీ కాపీ చేసి పంపిస్తానని మర్యాదపూర్వకంగా చెప్పారు. దీంతో ఎస్సై రమేష్‌బాబు తాను స్వయంగా సీసీ కెమెరా ఫుటేజీ చెక్ చేసుకుంటానని చెప్పడంతో 'సార్ మీరు నా ఇంట్లోకి వెళ్లడానికి వీల్లేదు. మీ మీద నాకు నమ్మకం లేదు' అని చెప్పాడు. దీంతో అహం దెబ్బతిన్న ఎస్సై 'మా మీద నమ్మకం లేదా' అనడంతో కొండలరావు 'నమ్మకం లేదు. గత ఏడాది నవంబర్‌లో మర్రిపూడి మండలం జగ్గరాజుపాలెం పెట్రోల్ బంకులో నాపై దాడి జరిగిందని ఫిర్యాదు చేస్తే నన్ను మూడు గంటలపాటు నిలువరించటమే కాక మీరు నేరస్తుల పక్షాన నిలబడి నాపై తప్పుడు కేసు పెట్టమని సలహా ఇచ్చారు. నేటి వరకు ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదు' అనడంతో ఎస్సై ఫోన్ కట్ చేశారు. తరువాత కొండలరావు కుటుంబ సభ్యులపై ఎస్సై ఆగ్రహం వ్యక్తం చేస్తూ 'ఎంత పొగరు. తలుపులు వేసేస్తారా' అని తలుపులు నెట్టుకుంటూ షాపులోకి వెళ్లి కుటుంబ సభ్యులను కొట్టారు. షాపులో ఉన్న కొండలరావు చెల్లెలు చంద్రమ్మను చేతితో నెట్టుకుంటూ ఆమెను దూషిస్తూ బలవంతంగా ఇంట్లోకి ప్రవేశించి సీసీటీవీ ఎన్‌వీఆర్, మొబైల్లు, పెన్‌డ్రైవ్‌లు జేబులో వేసుకుని వెళ్లిపోయారు. ఈ ఘటనపై కొండలరావు కొండపి పోలీస్‌స్టేషన్‌లోను, ఎస్పీకి వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేశారు. అయినా ఇంతవరకు న్యాయం జరగలేదని, తక్షణమే విచారించి న్యాయం చేయటంతోపాటు దోషులను శిక్షించి తమ వద్ద లూటీ చేసిన ఆస్తులను రికవరీ చేసి ఇప్పించాలని మరోమారు ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

మంత్రి దుర్గేష్‌పై అన్నదాతల ఆగ్రహం

- ధాన్యానికి ఈ దుస్థితి ఎప్పుడూ లేదు
- నెలరోజులైనా సొమ్ములు జమ కావట్లేదు
- గిట్టుబాటు ధర కూడా దక్కడం లేదు
- నిలదీసిన ఉండ్రాజవరం రైతులు

మంత్రి దుర్గేష్‌ను రైతులు నిలదీస్తున్న వీడియో కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



ధాన్యం సొమ్ము ఇప్పించాలని మంత్రి దుర్గేష్‌ను నిలదీస్తున్న రైతులు

ఉండ్రాజవరం: ఆరు నెలలు కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వకపోగా, ధాన్యం అమ్మి నెల రోజులైనా ఖాతాల్లో సొమ్ము జమ కాలేదని, గతంలో ఇంటువంటి దుస్థితి ఎప్పుడూ చూడలేదని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్‌పై తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండల రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని సత్యవాడ గ్రామంలో రేషన్ షాపును పునఃప్రారంభించేందుకు ఆదివారం వచ్చిన మంత్రి దుర్గేష్‌తో పాటు జాయింట్ కలెక్టర్ చిన్నరాముడును రైతులు నిలదీశారు. ధాన్యం సొమ్ము ఎప్పుడు జమ చేస్తారంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ధాన్యం సొమ్ము అందక ఖరీఫ్ పంట వేసుకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో సొసైటీల వద్ద ధాన్యం సేకరణ జరిగేదని, ఇప్పుడు మిల్లులకు తోలుకోమంటున్నారని, ధాన్యం తీసుకున్న మిల్లర్లు రూ.1,600 మాత్రమే చెల్లిస్తామని చెబుతున్నారని ఆందోళన చెందారు. మద్దతు ధర రూ.1,720 ప్రభుత్వమే ఇప్పించాలని డిమాండ్ చేశారు. రైతుల వద్ద ఉన్న ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేస్తామని సీఎం నుంచి మంత్రుల వరకూ చెప్పారని, కానీ అది ఆచరణలో అమలు కావడం లేదని మండిపడ్డారు. ఉండ్రాజవరం, పెరవలి మండలాల రైతులకు ధాన్యం సొమ్ము రూ.22 కోట్లు రావాల్సి ఉందని వివరించారు. దీనిపై స్పష్టమైన హామీ ఇవ్వాలని భీష్మించారు. దీనికి స్పందించిన దుర్గేష్ పౌర సరఫరాల మంత్రితో మాట్లాడి, సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

క్లుప్తంగా...

నేడు తెనాలికి మాజీ సీఎం వైఎస్ జగన్

పోలీసుల దాడిలో గాయపడ్డ జాన్ విక్టర్ కుటుంబానికి పరామర్శ

సాక్షి, అమరావతి: మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం గుంటూరు జిల్లా తెనాలిలో పర్యటిస్తారని ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. ఇటీవల పోలీసుల దాడిలో గాయపడ్డ జాన్ విక్టర్ కుటుంబాన్ని జగన్ పరామర్శించనున్నట్టు తెలిపింది. మంగళవారం ఉదయం 9.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి తెనాలి ఐతానగర్ చేరుకుంటారని, జాన్ విక్టర్ కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి తాడేపల్లి బయలుదేరుతారని వెల్లడించింది.

తెలంగాణ ప్రజలకు వైఎస్ జగన్ శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: తెలంగాణ ప్రజలకు ఏపీ మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర అవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'మహోన్నతమైన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు' అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు.

గుకేశ్‌కు వైఎస్ జగన్ అభినందనలు

సాక్షి, అమరావతి: క్లాసికల్ చెస్ ఫార్మాట్‌లో నార్వే దిగ్గజం మాగ్నస్ కార్ల్‌సన్‌ను తొలిసారి ఓడించిన భారత గ్రాండ్‌మాస్టర్, ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్‌ను ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభినందించారు. 'హృదయపూర్వక అభినందనలు హీరో' అంటూ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. గుకేశ్ తన అసాధారణ ప్రావీణ్యంతో భవిష్యత్‌లో దేశానికి మరింత పేరు తేవాలని వైఎస్ జగన్ ఆకాంక్షించారు.

గిన్నిస్ రికార్డు బ్రేక్ చేయడమే లక్ష్యం

'యోగా'పై సీఎస్ విజయానంద్

సాక్షి, అమరావతి: 2023లో 1.53 లక్షల మందితో సూరత్‌లో జరిగిన యోగా దినోత్సవంలో సాధించిన గిన్నిస్ ప్రపంచ రికార్డును అధిగమించేలా ఈ నెల 21వ తేదీన రాష్ట్రంలో రెండు కోట్ల మందితో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ చెప్పారు. విశాఖపట్నంలో జరిగే ప్రధాన కార్యక్రమం ఆర్‌కె బీచ్ నుంచి భీమిలి వెంబడి నిర్వహించనున్నట్లు తెలిపారు. గిన్నిస్ మార్గదర్శకాల ప్రకారం ఏర్పాట్లను పర్యవేక్షించడానికి, కన్సల్టెన్సీతో సమన్వయం చేసుకోవడానికి ఏపీఐఐసీ ఎండీ ఎం.అభిషిక్త్ కిషోర్, ఏపీటీఎస్ ఎండీ సూర్య తేజను నోడల్ అధికారులుగా నియమించారు.

ఎన్‌సీడీసీ అవార్డుల కోసం ఎంపిక కమిటీ

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ) ప్రాంతీయ స్థాయిలో అందించే కో–ఆపరేటివ్ ఎక్స్‌లెన్స్ అండ్ మెరిట్–2025 అవార్డుల కోసం రాష్ట్రంలోని ఉత్తమ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పీఏసీఎస్), రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పీవో)ను ఎంపిక చేసేందుకు రాష్ట్ర స్థాయి ఎంపిక కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొదటి స్థానంలో నిలిచిన సంఘాలకు రూ.35వేలతో ఎక్స్‌లెన్స్, రెండో స్థానంలో నిలిచిన సంఘాలకు రూ.25వేలతో మెరిట్ బహుమతులు ప్రదానం చేస్తారు. బెస్ట్ ప్రైమరీ క్రెడిట్ కో–ఆపరేటివ్స్ (పీఏసీఎస్), బెస్ట్ ప్రైమరీ కో–ఆపరేటివ్స్ (ప్రాధాన్యతా రంగాలు), బెస్ట్ ప్రైమరీ కో ఆపరేటివ్స్ (మినిస్ట్రీ ఆఫ్ కో ఆపరేషన్ ఎడాప్షన్ చేసుకున్న సంఘాలు), బెస్ట్ ఉమెన్ కో–ఆపరేటివ్స్, బెస్ట్ ఎఫ్‌పీవోలకు ఈ అవార్డులు అందజేస్తారు. ఇందుకోసం రాష్ట్ర స్థాయిలో రిజిస్ట్రార్ ఆఫ్ కో ఆపరేటివ్ సొసైటీస్ (ఆర్‌సీఎస్) కమిషనర్ చైర్మన్‌గా ఎంపిక కమిటీని ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీకి ఎన్‌సీడీసీ–విజయవాడ రీజనల్ డైరెక్టర్ మెంబర్ కన్వీనర్‌గానూ, ఆప్కాబ్ చైర్మన్, ఐసీడీపీ (ఇంటిగ్రేటెడ్ కో–ఆపరేటివ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్) అదనపు రిజిస్ట్రార్‌లు సభ్యులుగా వ్యవహరిస్తారు.

జల రవాణాను ప్రోత్సహిస్తాం: మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

సాక్షి, అమరావతి / భవానీపురం: రాష్ట్రంలో జలరవాణాను ప్రోత్సహించడం ద్వారా భారీ పెట్టుబడులు ఆకర్షించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందని రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖల మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఏర్పాటై రెండేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం పున్నమి ఘాట్ నుంచి ×బోట్ మారథాన్ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రోడ్డు రవాణాతో పోల్చితే జల రవాణా ద్వారా దాదాపు 50 శాతం తక్కువ ఖర్చుతో సరుకును గమ్యస్థానానికి చేర్చవచ్చన్నారు. రాష్ట్రంలో మొత్తం 1,555 కిలోమీటర్ల నావిగేషన్ కు అనుకూలమైన జల మార్గాలు ఉన్నాయని తెలిపారు. ఇన్ లాండ్ క్రూయిజ్ టూరిజాన్ని ప్రోత్సహించడంలో భాగంగా రీజనల్ ఎక్స్‌లెన్స్ కేంద్రం ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు.

మీ అనుభవం నేర్పింది ఇదేనా బాబూ?

సీఎం చంద్రబాబును నిలదీసిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ''దశాబ్దాల రాజకీయ అనుభవంతో పాటు ముఖ్యమంత్రిగా పనిచేసి పాలనపై లోతైన అవగాహన ఉందని మీరు చెప్పుకొంటున్నారు. కానీ, ఆ దశాబ్దాల అనుభవం ఈ ఏడాదిగా రాష్ట్రానికి ఏం ఇచ్చింది?'' అంటూ 'ఎక్స్'వేదికగా సీఎం చంద్రబాబును వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ సూటిగా ప్రశ్నించారు. తమ ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన రుణంలో.. కేవలం ఏడాదిలోనే టీడీపీ కూటమి సర్కారు 44 శాతం అప్పు చేసిందని దెప్పిపొడిచారు. ''ఏడాదిగా మీ ప్రభుత్వం అడ్డగోలుగా, భారీగా అప్పు చేసినా సంక్షేమం ఊసేలేదు. అభివృద్ధి జాడే లేదు. దశాబ్దాల అనుభవం మీకు నేర్పింది ఇదేనా?'' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. మీ ప్రభుత్వ ఆర్థిక అసమర్థతపై కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్), ఎంవోఎస్‌పీఐ (కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ) నివేదికలు దిగ్భ్రాంతికర వాస్తవాలను



బహిర్గతం చేస్తున్నాయని తెలిపారు. కాగ్, ఎంవోఎస్‌పీఐ నివేదికలు, ఆ సంస్థలు వెల్లడించిన గణాంకాలను ఉటంకిస్తూ.. ఏడాదిగా చంద్రబాబు కూటమి ప్రభుత్వ ఆర్థిక అసమర్థతను కడిగేస్తూ 'ఎక్స్'లో తన ఖాతాలో వైఎస్ జగన్ సోమవారం పోస్టు చేశారు. ఆ పోస్టులో ఏమన్నారంటే..

1. జీఎస్‌డీపీ (రాష్ట్ర స్థూల ఉత్పత్తి)లో ద్రవ్య లోటు 4.08 శాతం నుంచి ఏడాదిలోనే 5.12 శాతానికి పెరిగింది.
2. జీఎస్‌డీపీలో రెవెన్యూ లోటు 2.65 శాతం నుంచి ఏడాదిలోనే 3.61 శాతానికి చేరింది.
3. కరోనా మహమ్మారి వ్యాప్తి వంటి ప్రతికూల పరిస్థితులు లేనప్పటికీ జీఎస్‌డీపీలో అప్పుల వాటా 35.64 శాతానికి పెరిగింది.
4. 2024–25లో భారీగా చేసిన అప్పుల్లో కేవలం 23.49 శాతం మాత్రమే మూలధన వ్యయం కోసం ఖర్చు చేశారు. కానీ.., మా ప్రభుత్వ హయాంలో 33.25 శాతం మూల ధన వ్యయం చేశాం.

జీఎస్‌డీపీలో ద్రవ్య లోటు

ఆర్థిక సంవత్సరం	ద్రవ్య లోటు (రూ.కోట్లలో)	జీఎస్‌డీపీ (రూ.కోట్లలో)	జీఎస్‌డీపీలో ద్రవ్య లోటు శాతం	జీఎస్‌డీపీలో ద్రవ్యలోటు సగటు
2019-20	39,687	9,25,839	4.29	--
2020-21	55,167	9,78,581	5.64	--
2021-22	25,013	11,31,629	2.21	--
2022-23	52,528	13,09,464	4.01	--
2023-24	62,720	14,22,094	4.41	4.08
2024-25	81,622	15,93,062	5.12	5.12

((నోట్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో జీఎస్‌డీపీలో ద్రవ్యలోటు సగటు 4.08 శాతమే. టీడీపీ కూటమి ప్రభుత్వ పాలనలో మొదటి ఏడాదిలోనే ద్రవ్య లోటు 5.12 శాతానికి పెరిగింది. వైఎస్సార్‌సీపీ పాలనలో కోవిడ్ మహమ్మారి వంటి ప్రతికూల పరిస్థితుల వల్ల ప్రభుత్వానికి ఆదాయం తగ్గింది. ఇది జీఎస్‌డీపీలో ద్రవ్య లోటు ఎక్కువ ఉండటానికి దారితీసింది. కీలకమైన రంగాలపై అధికంగా వ్యయం చేయాల్సి రావడంతో అప్పులు ఎక్కువగా చేయాల్సి వచ్చింది. కోవిడ్ మహమ్మారి ప్రభావం వల్ల 2020–21లో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఏర్పడినప్పుడు ఉన్న ద్రవ్య లోటు కంటే 2024–25లో జీఎస్‌డీపీలో ద్రవ్య లోటు అధికంగా ఉంది.))

జీఎస్‌డీపీలో రెవెన్యూ లోటు

ఆర్థిక సంవత్సరం	రెవెన్యూ లోటు (రూ.కోట్లలో)	జీఎస్‌డీపీ (రూ.కోట్లలో)	జీఎస్‌డీపీలో రెవెన్యూ లోటు శాతం	జీఎస్‌డీపీలో రెవెన్యూ లోటు సగటు
2019-20	26,441	9,25,839	2.86	--
2020-21	35,540	9,78,581	3.63	--
2021-22	8,611	11,31,629	0.76	--
2022-23	43,487	13,09,464	3.32	--
2023-24	38,683	14,22,094	2.72	2.65
2024-25	57,456	15,93,062	3.61	3.61

((నోట్: వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో జీఎస్‌డీపీలో రెవెన్యూలోటు 2.65 శాతం ఉంటే.. టీడీపీ కూటమి ప్రభుత్వం మొదటి ఏడాది పాలనలో అది 3.61 శాతానికి పెరిగింది. దీన్నిబట్టి చూస్తే.. మొదటి ఏడాదిలో రెవెన్యూ వ్యయానికి టీడీపీ కూటమి ప్రభుత్వం అప్పులపై ఆధారపడటం పెరిగిందన్నది స్పష్టమవుతోంది.))

జీఎస్‌డీపీలో రాష్ట్ర ప్రభుత్వ అప్పు శాతం

ఆర్థిక సంవత్సరం	రాష్ట్ర ప్రభుత్వ అప్పు (రూ.కోట్లలో)	జీఎస్‌డీపీ (రూ.కోట్లలో)	జీఎస్‌డీపీలో రాష్ట్ర ప్రభుత్వ అప్పు శాతం
2019-20	3,01,802	9,25,839	32.60
2020-21	3,50,557	9,78,581	35.82
2021-22	3,78,086	11,31,629	33.41
2022-23	4,23,942	13,09,464	32.38
2023-24	4,86,151	14,22,094	34.19
2024-25	5,67,773	15,93,062	35.64

(కాగ్, ఎంవోఎస్‌పీఐ గణాంకాలు ఆధారంగా)

((నోట్: టీడీపీ కూటమి ప్రభుత్వ తొలి ఏడాది పాలనలో జీఎస్‌డీపీలో రాష్ట్ర ప్రభుత్వ అప్పు 35.64 శాతానికి పెరిగింది. కోవిడ్ మహమ్మారి ప్రభావం వల్ల 2020–21లో ఆర్థిక కార్యకలాపాలు మందగించి జీఎస్‌డీపీపై ప్రతికూల ప్రభావం పడినందువల్ల ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు అప్పులు ఎక్కువగా చేయాల్సి వచ్చింది))

మూలధన వ్యయానికి వినియోగించిన అప్పులు

ఆర్థిక సంవత్సరం	అప్పు (రూ.కోట్లలో)	మూలధన వ్యయం (రూ.కోట్లలో)	అప్పులో మూలధన వ్యయం శాతం	అప్పులో మూల ధన వ్యయం శాతం సగటు
2019-20	39,687	12,242	30.85	--
2020-21	55,167	18,975	34.40	--
2021-22	25,013	16,373	65.46	--
2022-23	52,528	7,244	13.79	--
2023-34	62,720	23,330	37.20	33.25
2024-25	81,622	19,177	23.49	23.49

((నోట్: వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో 2019–24 మధ్య చేసిన అప్పుల్లో 33.25 శాతాన్ని మూలధన వ్యయంగా ఖర్చు చేసింది. కానీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బాధ్యతారహిత్యంగా అప్పులు చేస్తోందని.. చేసిన అప్పును ఉత్పాదకత పెంచేందుకు ఖర్చు చేయడం లేదని అప్పట్లో ప్రతిపక్ష టీడీపీ ఆరోపించింది. కానీ, ఇప్పుడు టీడీపీ కూటమి ప్రభుత్వం తొలి ఏడాదిలో చేసిన అప్పుల్లో కేవలం 23.49 శాతాన్ని మాత్రమే మూలధన వ్యయంగా ఖర్చు చేసింది.))

ప్రజలకు ఏడాదంతా వెన్నుపోటే

చంద్రబాబు వెన్నుపోటు పాలనను ఎండగడదాం

- 4న వెన్నుపోటు దినాన్ని జయప్రదం చేయండి
- వైఎస్సార్‌సీపీ అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజ రాణి పిలుపు

సాక్షి, న్యూఢిల్లీ: మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మాయలోపడేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని వైఎస్సార్‌సీపీ అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి పేర్కొన్నారు. ఏడాదంతా సీఎం చంద్రబాబు ప్రజలను వెన్నుపోటు పొడుస్తూనే పాలన సాగించారని మండిపడ్డారు. బాబు వెన్నుపోటు రాజకీయాలను ఎండగట్టేందుకు ప్రతి ఒక్కరూ 'వెన్నుపోటు దినం' కార్యక్రమంలో పాలుపంచుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. సోమవా



రం ఢిల్లీలోని ఆమె నివాసంలో తనూజ రాణి మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ పిలుపు మేరకు జూన్ 4న ఏపీవ్యాప్తంగా 'వెన్నుపోటు' దినం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆరోజు ప్రజలంతా కూటమి మోసాల్ని నిలదీసేందుకు లోక్‌సభ నియోజకవర్గం కేంద్రాల్లో నిర్వహించే భారీ ర్యాలీకి హాజరై జయప్రదం చేయాలని కోరారు. సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. ఏడాది గడిచినా ఏ ఒక్క హామీని అమలు చేయకుండా ఇంకా కల్లబొల్లి మాటలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. వెన్నుపోటు దినాన్ని అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలకు దిగుతోందన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా తాము వెన్నుపోటు దినాన్ని ఘనంగా నిర్వహించి, చంద్రబాబు మోసాలను ప్రపంచానికి చాటిచెబుతామని స్పష్టం చేశారు.

దేశవ్యాప్తంగా వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్

కేంద్ర వ్యవసాయశాఖ సంయుక్త కార్యదర్శి పేరెందేవి

సాక్షి, అమరావతి: 'ఒకే దేశం..ఒకే వ్యవసాయం.. ఒకే బృందం' నినాదంతో దేశ వ్యాప్తంగా వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు కేంద్ర వ్యవసాయ శాఖ సంయుక్త కార్యదర్శి పేరెందేవి తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నూతక్కి గ్రామంలో జరిగిన ఖరీఫ్ సీజన్ సన్నద్ధత–వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్–2025 కార్యక్రమంలో ఆమె పాల్గొని రైతులతో మాట్లాడారు. అనంతరం మంగళగిరిలోని వ్యవసాయ శాఖ కమిషనరేట్ కార్యాలయం నుంచి వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని, భూసార పరీక్ష, ప్రకృతి వ్యవసాయం, పశుపోషణ, ఈ–నామ్ మార్కెటింగ్ తదితర విషయాలపై రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులకు తట్టుకుని నిలిచే కొత్త వంగడాలను అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

ఉపాధ్యాయ శిక్షణ వాయిదా వేయాలి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రస్తుతం ఉపాధ్యాయ బదిలీలు జరుగుతున్న నేపథ్యంలో ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ ఇవ్వడం సరికాదని, వీటిని వాయిదా వేయాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులు బదిలీ ఉత్తర్వులతో కొత్త పాఠశాలల్లో చేరేందుకు సిద్ధం కావాల్సి ఉందని,ఇప్పటికే బదిలీపై ఆందోళనతో ఉన్నవారికి శిక్షణ పేరుతో ఇబ్బంది పెట్టొద్దని ఆయన కోరారు.

ఔను.. గత ప్రభుత్వంలోనే జీఎస్టీ మెరుపులు

- వైఎస్ జగన్ హయాంలో జీఎస్టీ రూ.25,331 కోట్ల నుంచి రూ.44,298 కోట్లకు పెరుగుదల
- కోవిడ్ తర్వాత ఏటా రెండంకెల వృద్ధి నమోదు
- చంద్రబాబు ప్రభుత్వంలో తగ్గిపోయిన జీఎస్టీ ఆదాయం
- గతేడాది వృద్ధి 1.2 శాతానికే పరిమితం
- ఈ ఏడాది ఏప్రిల్‌లో 3.6 శాతం, మే నెలలో 2.24 శాతం తగ్గుదల
- స్టేట్ ట్యాక్స్ కమిషనర్ ఎ.బాబు



రాష్ట్ర జీఎస్టీ వసూళ్ల వృద్ధి ఇలా..

సంవత్సరం	స్థూల జీఎస్టీ (రూ.కోట్లలో)	వృద్ధి
2017-18 (9 నెలలు)	14,325.95	-
2018-19	25,331.43	19.76
2019-20	27,107.75	7.0
2020-21	26,163.16	-3.5
2021-22	32,710.57	25.0
2022-23	40,230.17	23.0
2023-24	44,298.36	10.1
2024-25	44,824.51	1.2

సాక్షి, అమరావతి: వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో రెండంకెల వృద్ధి రేటు నమోదు చేసిన జీఎస్టీ ఆ తర్వాత గణనీయంగా పడిపోయిందని స్టేట్ ట్యాక్స్ కమిషనర్ ఎ.బాబు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో గణాంకాలతో సహా వివరించారు. 2018–19 ఆర్థిక సంవత్సరంలో రూ.25,331.43 కోట్లుగా ఉన్న స్థూల జీఎస్టీ వసూళ్లు.. వైఎస్ జగన్ ప్రభుత్వం దిగిపోయే నాటికి రూ.44,298.36 కోట్లకు పెరిగాయి. అంటే కోవిడ్ వంటి మహమ్మారి కారణంగా విధించిన లాక్‌డౌన్‌తో ఆర్థిక కార్యకలాపాలు ఆగిపోయినా గడచిన ఐదేళ్లలో రాష్ట్ర జీఎస్టీ ఆదాయం అదనంగా రూ.18,966.57 కోట్లు పెరిగింది. అంటే ఏటా సగటున 14.97 శాతం వృద్ధి రేటు నమోదు చేసింది. కోవిడ్ తర్వాత వరుసగా మూడేళ్ల రాష్ట్ర జీఎస్టీ ఆదాయం 2021–22లో 25 శాతం, 2022–23లో 23 శాతం, 2024–25లో 10.1 శాతం వృద్ధి నమోదైనట్టు ఎ.బాబు వివరించారు.

కూటమి ప్రభుత్వం వచ్చాక..

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నుంచి రాష్ట్ర జీఎస్టీ ఆదాయం నేలచూపులు చూస్తోందని.. 2024–25లో రాష్ట్ర స్థూల జీఎస్టీ ఆదాయం కేవలం 1.2 శాతం వృద్ధితో రూ.44,824.51 కోట్లకే పరిమితమైందని ఎ.బాబు పత్రికా ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రస్తుత కొత్త ఆర్థిక సంవత్సరంలో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతోందని, ఏప్రిల్ నెలలో జీఎస్టీ ఆదాయం 3.36 శాతం తగ్గి రూ.4,686 కోట్లకు, మే నెలలో 2.24 శాతం తగ్గి రూ.3,803 కోట్లకు పరిమితమైందని పేర్కొన్నారు. ఒకపక్క జీఎస్టీ ఆదాయం పడిపోయిందని గణాంకాలు స్పష్టం చేస్తున్నా.. కిందపడ్డా మాదే పైచేయి అన్న చందంగా రాష్ట్రంలో వాణిజ్య కార్యకలాపాలు సజావుగా సాగుతున్నాయంటూ పత్రికా ప్రకటన ద్వారా సుదీర్ఘ వివరణ ఇచ్చుకునే ప్రయత్నం చేశారు. గత ప్రభుత్వం హయాంలో రెండంకెల వృద్ధి రేటు నమోదవడానికి కోవిడ్ కారణంగా రిటర్న్‌లు దాఖలు చేయడానికి వ్యాపారులకు గడువు పెంచరాదని, దీంతో భారీ వృద్ధి నమోదైందని పేర్కొన్నారు. 2024–25లో ఆమ్నెస్టీ స్కీం అమలు చేయడం, జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్ లేకపోవడం కారణమని పేర్కొన్నారు. 2017–18 నుంచి 2019–20 వరకు లేవనెత్తిన డిమాండ్లపై వడ్డీని మాఫీ చేస్తూ పాత బకాయిలు చెల్లించడానికి అనుమతించడం ద్వారా అదనపు ఆదాయం రావడం, ఆమ్నెస్టీ స్కీం అమలు చేయడం వల్లే 2024–25లో 1.2 శాతం వృద్ధి నమోదైందని జీఎస్టీ అధికారులు స్పష్టం చేస్తున్నారు.



చదవడం అనేది ఆలోచించడంతో సమానం.
తన మెదడుతో కాకుండా ఇంకొకరి మెదడుతో.
– ఆర్థర్ షోపెన్‌హావర్

సాక్షి
మంగళవారం, 3 జూన్ 2025

సంయమనం అవసరం

నెత్తురు చిందకుండా, నష్టం జరగకుండా యుద్ధం సాగుతుందనీ, ముగుస్తుందనీ ఎవరూ అనుకోరు. ప్రత్యర్థిని చిత్తు చేద్దామని ఇరుపక్షాలూ విశ్వప్రయత్నం చేస్తాయి. కానీ అనేక కారణాలవల్ల ఎవరో ఒకరినే విజయం వరిస్తుంది. ఇందులో సరైన అంచనాలకు రాలేకపోవటం దగ్గరనుంచి స్థానిక వాతావరణ స్థితిగతుల వరకూ చాలా వుంటాయి. ఈ సంగతి తెలిసి కూడా మన విపక్షాలు, ప్రత్యేకించి కాంగ్రెస్ మొన్నటి 'ఆపరేషన్ సిందూర్'లో మనకు కలిగిన నష్టాలగురించి వెంటనే వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నాయి. యాదృచ్ఛికంగానే కావొచ్చుగానీ... మన రక్షణ దళాల చీఫ్ జనరల్ అనిల్ చౌహాన్ శనివారం సింగపూర్‌లో మాట్లాడుతూ మన దళాలు చేసిన కొన్ని 'వ్యూహాత్మక తప్పిదాల' కారణంగా జెట్ విమానాలు కోల్పోయామని చెప్పటం వివాదాస్పదమైంది. ఆ అంశాన్ని ప్రభుత్వ పెద్దలకు వదలటం లేదా వారితో చర్చించి ఎప్పుడు ఏ విధంగా చెప్పాలో సలహా తీసుకోవటం సరైన విధానం. విదేశీ గడ్డపై చెప్పటమైతే ఎంతమాత్రమూ సరికాదు. పైగా ఆయన సింగపూర్ వెళ్లింది ఏటా జరిగే అంతర్ ప్రభుత్వాల భద్రతా వ్యవహారాలపై నిర్వహించే 'షాంగ్రీ లా డైలాగ్' కోసం. అందులో పాకిస్తాన్ త్రివిధ దళాల చీఫ్ కూడా పాల్గొన్నారు. ఒకపక్క మన ఎంపీల అఖిలపక్ష బృందాలు పాకిస్తాన్ ఆగడాల గురించీ, వాటిని నిలువరించక తప్పని స్థితి గురించీ వివరించటానికి వేర్వేరు దేశాల్లో పర్యటిస్తున్నాయి. కనుక జనరల్ చౌహాన్ ప్రకటన ఏ రకంగా చూసినా సమయం, సందర్భం లేనిది. కొందరు మాజీ సైనికాధికారులూ, నిపుణులూ చెప్పినట్టు పాకిస్తాన్‌కు మన దళాలు కలిగించిన భారీ నష్టంతోపాటు దీన్ని చెప్పివుంటే ఇంత వివాదమయ్యేది కాదేమో!

గత నెల 7 నుంచి పదో తేదీ వరకూ సాగించిన దాడుల్లో మన నష్టం ఏపాటో చెప్పాలని విపక్షాలు కోరుతున్నాయి. దాడి చేయటానికొచ్చిన రఫేల్ యుద్ధ విమానాలను కూల్చేశామని పాకిస్తాన్ ప్రభుత్వం చేసిన ప్రచారం ఆధారంగా కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ ఈ డిమాండ్ మొదలుపెట్టారు. మన సైనిక దళాలు సాధిస్తున్న విజయాలను ఎన్డీయే ప్రభుత్వం తన సత్తాకు ప్రతీకగా చెప్పుకోవటాన్ని నిరోధించేందుకు విపక్షాలు ఈ ప్రయత్నం చేసివుండొచ్చు. కానీ ఎప్పుడు ఎక్కడ ఎలా దాడిచేయాలనే అంశాలను పూర్తిగా త్రివిధ దళాలకు అప్పగించాక వాటిపై అనుకూలంగా లేదా వ్యతిరేకంగా మాట్లాడటం ఎవరు చేసినా తప్పే. యుద్ధంలో తొలి క్షతగాత్ర సత్యమేనంటారు. ఎందుకంటే అవతలి పక్షాన్ని చావుదెబ్బ తీశామని, అనేకమంది శత్రు సైనికుల్ని హతమార్చామని, కీలక స్థావరాలు ధ్వంసం చేశామని ప్రభుత్వాలు చెప్పటం ప్రపంచంలో ఎక్కడైనా వున్నదే. యుద్ధం ముగిసిన కొన్నాళ్లకుగానీ వాస్తవ గణాంకాలు బయటకు రావు. మన విపక్షాలు అంతవరకూ ఆగలేకపోయాయి. పాక్ మీడియా వార్తల్ని విశ్వసించి మన ప్రభుత్వాన్ని నిలదీయటం మొదలుపెట్టాయి. ఇదంతా రాజకీయంగా బీజేపీకి లాభిస్తుందన్న ఆందోళనే దీనికి కారణం.

ఎప్పుడూ లేనివిధంగా 'ఆపరేషన్ సిందూర్' సమయంలో సామాజిక మాధ్యమాల్లో, చానెళ్లలో మన సేనలు పాకిస్తాన్ నగరాలను నేలమట్టం చేయటం మొదలుకొని పలు విజయాలు సాధించినట్టు ప్రచారం సాగింది. ఇదెంత ముదిరిందంటే... ఒక దశలో మన ప్రభుత్వం ఖండించాల్సి వచ్చింది కూడా. మరోపక్క యుద్ధంవల్ల కలిగే అనర్థాల గురించి చెప్పిన మాజీ సైనికాధికారులనూ, వారి కుటుంబసభ్యులనూ దూషించటం, ఉగ్రవాదుల దుర్మార్గానికి భర్తను కోల్పోయిన యువతి ముస్లింలపై ద్వేషం వద్దని అన్నందుకు ఆమెను దుర్భాషలాడటం వంటి వైపరీత్యాలూ చోటుచేసుకున్నాయి. కొందరైతే దాడులు నిలిపేస్తున్నట్టు ప్రకటించిన మన విదేశాంగ శాఖ కార్యదర్శిపైనా, ఆయన కుటుంబసభ్యులపైనా నోరుపారేసుకున్నారు. యుద్ధకాలంలో ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఇచ్చే సూచనలనూ, సలహాలనూ పాటించటం తప్ప ఉన్మాదం ఆవహించినట్టు ఊగిపోవటం సరైంది కాదు. ఇందువల్ల మన జవాన్లకు వీసమెత్తు ఉపయోగం లేదు సరికదా... ప్రజల్లో తప్పుడు భావాలు వ్యాప్తి చెందే ప్రమాదం వుంటుంది. దాడులు ఎప్పుడు మొదలెట్టాలో, ఎప్పుడు ఆపాలో, ఏ దశలో ఏం చేయాలో నిర్ణయించటానికి ప్రభుత్వం ఉన్నప్పుడు గుంపులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించటం అనర్థదాయకం.

చౌహాన్ చెబుతున్న ప్రకారం నాలుగు రోజుల దాడుల్లో తొలి రెండు రోజులూ మనకు నష్టం వాటిల్లింది. వెంటనే లోపాలు గుర్తించి సరిచేసుకోవటం పర్యవసానంగా ఆ తర్వాత మన జెట్ విమానాలు శత్రు స్థావరాలను ధ్వంసం చేయగలిగాయని ఆయన అన్నారు. ఏ లోపమూ చోటుచేసుకోకుండా, ఏ నష్టమూ జరగకుండా మనం కోరుకున్న ప్రకారం అంతా జరిగిపోవాలనుకునేవారికి ఇది నిరాశ కలిగించవచ్చు. బీజేపీ అగ్ర నాయకులంతా ఈ విజయాలను తమ వ్యక్తిగత ఖాతాలో వేసుకోవటం కాంగ్రెస్ పార్టీకి కంటగింపు కావొచ్చు. కానీ దేశ రక్షణకు సంబంధించిన అంశాల్లో సంయమనం పాటించటం అందరి బాధ్యత. దాడులు ప్రారంభించటానికి ముందు అఖిలపక్ష సమావేశం నిర్వహించి వారి మద్దతు కోరిన ప్రభుత్వం ముగించటానికి ముందు కూడా ఆ పనే చేసివుంటే బాగుండేది. కనీసం మన దళాలు సాధించిన విజయాలు, మన నష్టాల గురించి ఈ నెల్నాళ్లలోనైనా అఖిలపక్షం నిర్వహిస్తే సమస్య తలెత్తేది కాదు. ఇప్పటికైనా మించిపోయింది లేదు. ఈ తరహా ఉదంతాలు ఇకపై పునరావృతం కాకూడదనుకుంటే కేంద్రం ఆ పని చేయాలి. అందులో అధికార, విపక్షాల వ్యవహారశైలి గురించీ, కొన్ని శక్తులనుంచి అతిగా వచ్చిన స్పందనల గురించీ తన వైఖరేమిటో చెప్పాలి. కష్టకాలంలో సంయమనం పాటించటం ఎంత ముఖ్యమో వివరించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయనం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.అష్టమి రా.12.36 వరకు, తదుపరి నవమి; **నక్షత్రం:** పుబ్బ రా.3.44 వరకు, తదుపరి ఉత్తర; **వర్జ్యం:** ప.10.55 నుండి 12.36 వరకు; **దుర్ముహూర్తం:** ఉ.8.06 నుండి 8.58 వరకు, తదుపరి రా.10.54 నుండి 11.38 వరకు; **అమృత ఘడియలు:** రా.9.07 నుండి 10.50 వరకు

సూర్యోదయం : 5.28
సూర్యాస్తమయం: 6.27
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

నదీ జలాలతో ఆటలాడవచ్చా?

విశ్లేషణ



కిసలయ భట్టాచార్జీ

పాల్ సెజాన్ (ఫ్రాన్స్) 1890లో ఓ పెయింటింగ్ వేశారు. దాని పేరు 'ఎట్ ద వాటర్'స్ ఎడ్జ్.' నీటిపై కాంతి ప్రతిఫలనాన్ని వినూత్న రీతిలో చూపెడుతూ చేసిన చిత్రమిది. దాన్ని గీసేందుకు రంగులను పొరలు పొరలుగా అద్దారు. అవి కరుగుతున్నట్టుగా ఉంటాయి. దీనికి ఈ టైటిల్ ఇవ్వడం వెనుక చిత్రకారుడి ఉద్దేశం ఏమిటో తెలియదు. కానీ, పహల్‌గామ్ ఊచకోత ఇండియా, పాకిస్తాన్ దేశాలను సింధూ నది నీటి అంచున నిలబెట్టింది.

టిబెట్ పర్వతాల మీద 18,000 అడుగుల ఎత్తున మానస సరోవరం వద్ద పుట్టిన సింధూ నది వేల సంవత్సరాలుగా ఎన్నో నాగరికతలకు ఆలవాలమైంది. ఇటీవలి సంవత్సరాల్లో నదుల గురించి, వాటి చరిత్రల గురించి చాలా రచనలు వెలువడుతున్నాయి. బ్రిటిష్ చరిత్రకారుడు, 'ద కాంక్వెస్ట్ ఆఫ్ నేచర్' రచయిత డేవిడ్ బ్లాక్‌బోర్న్ ఇలా అంటాడు: ''ప్రకృతిపై విజయం సాధించాలన్న మానవుడి తపన వెనుక అనేక ఊహలు ఇమిడి ఉంటాయి. మానవ, సాంకేతిక శక్తులతో ప్రకృతిని జయించాలని మనిషి అనుకుంటాడు. నదుల అస్తిత్వం పట్ల అతడి వైఖరి కూడా దీనికి ఒక కారణమవుతుంది''.

నైలు నదిని మార్చిన ఫలితం?

నదులకు వ్యక్తిత్వం ఉందీ అనుకున్నా, అవి ఏం ఆలోచిస్తాయో తెలియదు. అయితే, నదుల గురించి మనుషులు ఏ విధంగా ఆలోచిస్తారో మనకు తెలుసు. నీటి ప్రవాహాన్ని క్యూసెక్కులలో లెక్కగట్టి వాటి స్వరూపాన్ని నిర్ణయిస్తాం. అంతే కాకుండా, వాటిపై ఆధారపడి ఉండే వృక్ష జంతుజాలం, ఆ నదులను పెనవేసుకుని ఉండే ఆచార వ్యవహారాలు, కల్పిత గాథలు ఆధారంగా వాటి గొప్పతనాన్ని అంచనా వేస్తాం.

శత్రుదేశం మీద ప్రయోగించడానికి సింధూ నదిని ఒక అస్త్రంగా మార్చుకోవాలని ఇండియా భావిస్తోంది. నదులతో ఆడుకుంటే వాటి పరిణామాలు ఎంత తీవ్రంగా ఉంటాయో తెలిసిన విషయమే. నైలు నదీ స్వరూపాన్ని మార్చేయాలని 200 సంవత్సరాలుగా ప్రయత్నిస్తున్నా అది సాధ్యపడలేదు. అస్వాన్ డామ్ కట్టడంతో నైలు నదీ డెల్టాను వేల సంవత్సరాలుగా సారవంతం చేసిన ఒండ్రుమట్టి ఆ ప్రాంతంలో మేట వేయడం నిలిచిపోయింది. అంతేకాదు, నత్తగుల్లల ద్వారా వ్యాపించే ప్రాణాంతక వ్యాధి శిస్టోమియాసిస్ ప్రబలడానికీ, మలేరియా వ్యాప్తికీ కారణమైంది.

నది మీద డ్యామ్ కడితే అది ఇక నదే కాదు. ''నీటిని అదుపులోకి తెచ్చుకోవడమంటే, జీవవైవిధ్యాన్ని నాశనం చేయడమే. హైడ్రలాజికల్ ప్రాజెక్టుల వల్ల అక్కడి మానవ ఆవాసాలు అంతరిస్తాయి. ఆ మానవ సమూహాల విలువైన పారంపరిక విజ్ఞానం శాశ్వతంగా కనుమరుగవుతుంది'' అని కూడా బ్లాక్‌బోర్న్ రాస్తాడు.

భారీ నీటిని నిల్వ చేయగలమా?

కశ్మీర్ 'పాకిస్తాన్ జీవనాడి' అంటూ, పహల్‌గామ్ ఊచకోతకు కొద్దిరోజుల ముందు, పాక్ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ రెచ్చగొట్టే ప్రకటన చేశాడు. వాస్తవానికి సింధూ నది ఈ రెండు దేశాలను యుద్ధం వైపు నడిపించే అవకాశం ఉన్నది! సైనిక ప్రతిచర్యలకు అదనంగా, ఇండియా 1960 నాటి సింధు నదీజలాల ఒప్పందాన్ని సస్పెండ్ చేసింది. ఇండియా, పాకిస్తాన్ ఉద్రిక్తతలు ఇన్నిసార్లు వచ్చినా ఇలా చేయడం ఇదే ప్రథమం. జల యుద్ధాలు సంభవించే ముప్పు ఉందంటూ కొన్ని దశాబ్దాలుగా భద్రతా నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇదిప్పుడు పరీక్షా సమయం.

ఒప్పందం నిలిపివేయడంతోనే సింధూ జలాలు దిగువకు ప్రవహించకుండా ఆగిపోవు. ఒక్క చుక్క నీటిని కూడా వదలం అంటూ జలశక్తి మంత్రి హెచ్చరించడం పాక్‌ను బెదిరించే రాజకీయ ప్రకటన. సింధూ ప్రవాహాన్ని అకస్మాత్తుగా ఆపేయడం సాధ్యపడేది కాదన్నది మనకు తెలిసిన విషయమే. ''నెత్తురు నీరు కలసి ప్రవహించజాలవు'' అని 2016 కశ్మీర్ ఉగ్రదాడి అనంతరం ఇండియా హెచ్చరించింది. అయితే, ఇస్లామాబాద్‌కు మద్దతుగా చైనా రంగంలోకి దిగిత్సాంగ్పో (బ్రహ్మపుత్ర) ఉపనది ప్రవాహాన్ని అడ్డుకుందని వార్తలు వచ్చాయి.

ఇండియా ప్రస్తుత జలవిద్యుత్ ప్రాజెక్టులతో భారీ పరిమాణంలో నీటిని నిల్వ చేయలేదు. ఇండస్ వాటర్ ట్రీటీ (1960) అందుకు అంగీకరించదు కూడా. ఒప్పందాన్ని పునః సమీక్షించడం కోసం, స్టోరేజ్ సదుపాయాల ఏర్పాటు కోసం దౌత్యపరమైన ఒత్తిడి తెచ్చేందుకు రచించిన వ్యూహం ఇది. ఇండియా ప్రస్తుతం 20 శాతం నీటినే వినియోగించుకోగలుగుతోంది. మరీ ఎక్కువగా నీరు నిల్వ చేస్తే వరద ముంపు ప్రమాదం ఎదురవుతుంది.

దౌత్యవ్యూహంగా సరే!

ఇరు దేశాలూ తమ జల వివాదాలను పరిష్కరించుకోడానికి 2022 నుంచీ ఒక్క సమావేశం కూడా నిర్వహించలేదు. మారుతున్న జనాభా, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఈ ఒప్పందంపై పునః సమీక్ష జరగాలని 2023లో ఇండియా ప్రతిపాదించింది. నదీ ప్రవాహాన్ని మళ్లించడం అంటే వ్యయంతో కూడుకున్న పని. నీటి మళ్లింపు ఆర్థిక రీత్యా సాధ్యం కాకపోవచ్చు. చైనా సైతం త్సాంగ్పో నీటి మళ్లింపు విషయంలో ఈ కారణంతోనే సందిగ్ధంలో పడింది.

''సింధూ నదుల పరీవాహక ప్రాంతంలో ప్రత్యేకించి చీనాబ్ బేసిన్‌లో జలవాతావరణం భారీ మార్పులకు లోనవుతోంది. ఈ వాతావరణ మార్పుతో ఇప్పటికే మనం సమరం చేస్తున్నాం'' అని 'సౌత్ ఏషియా నెట్‌వర్క్ ఆన్ డామ్స్, రివర్స్ అండ్ పీపుల్' (ఎస్‌ఏఎన్‌డీఆర్‌పీ) సమన్వయకర్త పరిణీతా దాండేకర్ చెబుతున్నారు.

ఇండియాలోని సింధూ పరీవాహక ప్రాంతపు పశ్చిమ నదులపై ఎక్కడా లేనన్ని జలవిద్యుత్ ప్రాజెక్టులు చీనాబ్ బేసిన్లో ఉన్నాయి (హిమాచల్ ప్రదేశ్, జమ్ము కశ్మీర్, పంజాబ్‌లో కొంతభాగం చీనాబ్ పరీవాహక ప్రాంతం కిందకు వస్తాయి). తొందరపడి మరిన్ని రిజర్వాయర్లు, ఆనకట్టలు నిర్మించాలని నిర్ణయిస్తే ఇండియా, పాకిస్తాన్ దేశాలు రెండూ ప్రకృతి విపత్తుల బారిన పడే ప్రమాదం ఉంది.

ఎస్‌ఏఎన్‌డీఆర్‌పీ బృందం 2024లో చీనాబ్ నది ఆసాంతం పర్యటించి సమగ్ర నివేదిక రూపొందించింది. ఇప్పటికే భూకంపాలు, నిరంతర వాతావరణ విపత్తులు ఎదుర్కొంటున్న చీనాబ్ నదీ ప్రాంతం మరిన్ని భారీ ప్రాజెక్టులను తట్టుకోలేదు. అయినా సరే నిర్మిస్తే పెను ఉపద్రవం తప్పదని ఈ నివేదిక హెచ్చరించింది. వీటి వల్ల ఉత్పన్నమయ్యే జీవావరణ, భూగర్భ సంబంధిత దుష్పరిణామాలను సరిదిద్దడానికి వీలు కూడా కాదు. నదీజలాల మళ్లింపు వల్ల ఆ ప్రాంతాల్లో నివసించే ప్రజలు ఇక్కట్ల పాలవుతారు. లక్షల మంది నిర్వాసితులు అవుతారు. జలప్రవాహాన్ని నిలిపివేయడం తెలివైన దౌత్యవ్యూహమే కావచ్చు. కానీ నదీప్రవాహంతో ఆటలాడితే దీర్ఘకాలంలో ప్రమాదం తప్పదు.

వ్యాసకర్త జిందాల్ స్కూల్ ఆఫ్ జర్నలిజం అండ్ కమ్యూనికేషన్ డీన్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)



◆ పహల్‌గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్టుగా ఇండియా ప్రకటించింది. జలప్రవాహాన్ని నిలిపివేయడం తెలివైన దౌత్యవ్యూహమే కావచ్చు. కానీ నదీప్రవాహంతో ఆటలాడితే దీర్ఘకాలంలో ప్రమాదం తప్పదు.

◆ నైలు నదీ స్వరూపాన్ని మార్చేయాలని గత 200 ఏళ్లుగా ప్రయత్నిస్తున్నా అది సాధ్యపడలేదు. అస్వాన్ డామ్ కట్టడంతో నైలు నదీ డెల్టాను వేల సంవత్సరాలుగా సారవంతం చేసిన ఒండ్రుమట్టి ఆ ప్రాంతంలో మేట వేయడం నిలిచిపోయింది. అంతేకాదు, నత్తగుల్లల ద్వారా వ్యాపించే ప్రాణాంతక వ్యాధి శిస్టోమియాసిస్ ప్రబలడానికీ, మలేరియా వ్యాప్తికీ కారణమైంది.

◆ ఇండియా ప్రస్తుతం సింధూ నదిలోని 20 శాతం నీటినే వినియోగించుకోగలుగుతోంది. మరీ ఎక్కువగా నీరు నిల్వ చేస్తే వరద ముంపు ప్రమాదం ఎదురవుతుంది.

సోషల్ మీడియా

ఏ ఇమేజ్ ముఖ్యం?



పాకిస్తాన్‌తో డ్రోన్లు, క్షిపణుల వినిమయం తర్వాత ప్రపంచానికి చెప్పడానికి ఇండియా దగ్గర మంచి కథ ఉండింది. మరి సైన్యంలోని ఉన్నతాధికారులు ఆ కథను ఎందుకు చెప్పలేదు? ఎందుకంటే, విమానాలు(రఫేల్) నష్టపోవడం అనేది ప్రధాని ఇమేజ్‌కు భంగకరం. ఇండియా ఇమేజ్ కంటే ఆయన ఇమేజ్ ముఖ్యమైపోయింది. విషాదం, కానీ నిజం.

– ఎం.కె.వేణు, సంపాదకుడు

చెప్పకోవడానికేనా?



దశాబ్దాలుగా ఏ విధమైన మినహాయింపు లేకుండా ప్రతి ఏడాదీ ఈశాన్య భారత రాష్ట్రాలది వరదలు, విపత్తుల కథే. జీడీపీ అనేది మన సాటి పౌరుల ప్రాథమిక అవసరాలను తీర్చలేకపోతే, ఇంక ఆ సంఖ్యల్లో మనం గర్వపడాల్సింది ఏముంటుంది?

– మనోజ్ అరోరా, ఫైనాన్షియల్ ప్లానర్

అసలు బలం



జినాలు మనల్ని నిరాశపరిచినా మర్యాదగా, నిజాయితీగా, తొణక్కుండా ఉండగలగడమే సూపర్ పవర్.

– వాలా అఫ్షార్, డిజిటల్ ఇవాంజెలిస్ట్

మొదలైంది అప్పుడే!



ఇది (ఉక్రెయిన్ దాడి) కచ్చితంగా రష్యాకు 'పెరల్ హార్బర్' క్షణం కాదు(1941లో యూఎస్ మీద జపాన్ దాడిని సూచిస్తూ). ఏ ప్రమాణాల్లో చూసినా రష్యా దురాక్రమణదారే. 2022 ఫిబ్రవరి 24 నిజానికి యూరప్ శక్తులన్నీ దానికి అనుగుణంగా నడుచుకోవాల్సిన పెరల్ హార్బర్ క్షణం(ఉక్రెయిన్ మీద రష్యా దాడి మొదలైన రోజు). ఇప్పటికీ ఆశలేమీ అడుగంటిపోలేదు.

– వెలీనా త్చకరోవా, జియోపొలిటికల్ స్ట్రాటెజిస్ట్

ప్రయాణంలో పుస్తకం



రైలు ప్రయాణంలో పుస్తకం చదువుతూ భిన్న ప్రపంచంలోకి ఆరోగ్యంగా తప్పించుకోవడం అనేది మరిచిపోయిన విలాసం.

– హెంద్ అల్ ఖసీమీ, యూఏఈ యువరాణి

వైరాగ్యమే ఉత్సాహం



మూలంతో అనుసంధానం అయివున్నప్పుడు ఉత్సాహం అనేది సహజం, దానికి దారం కావడం ఉదాసీనత. వైరాగ్యం అనేది ఉదాసీనత కాదు– అది విశాల దృక్పథం, మూలానికి తిరిగి వెళ్లడం. ఉత్సాహం, వైరాగ్యం అనేవి వ్యతిరేకంగా కనబడినా అవి రెండూ పరస్పర పూరకాలు.

– శ్రీశ్రీ రవిశంకర్, ఆధ్యాత్మిక బోధకుడు

పులుల నేస్తం



వాల్మీక్ థాపర్‌కు కడపటి సెలవు. ఆయన అన్ని భారతీయ పులుల రక్షక సాధువు. చిన్న పరిధికి పరిమితం కాకుండా పులులు దేశంలో వర్ధిల్లుతున్నాయంటే అది ఆయన కృషి వల్లే. ఓం శాంతి.

– అభిజిత్ అయ్యర్ మిత్రా, వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

సైకిల్ ఓ ఆరోగ్య సాధనం

నేడు ప్రపంచవ్యాప్తంగా దాదాపు అన్ని దేశాల్లో అందరికీ అందుబాటులో ఉన్న అత్యంత చౌకైన వాహనం సైకిల్. ఒకప్పుడు సైకిల్ ఉందంటే ధనిక కుటుంబంగా భావించే పరిస్థితి. పల్లెటూరు నుంచి పట్టణాలకు వెళ్లాలన్నా, సినిమాలకు వెళ్లాలన్నా సైకిల్‌నే వాడేవారు. కొత్తగా పెళ్లయిన జంటలు, అక్కా చెల్లెళ్ళు, అన్నాదమ్ములు, స్నేహితులు ఇలా ఎంతోమంది సరదాగా ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వెళ్లాలంటే సైకిలే ఆధునిక ప్రయాణ సాధనం. అటువంటి సైకిల్ కొంతకాలంగా తన ప్రభావాన్నీ, ప్రాధాన్యాన్నీ కోల్పోతోంది. మోటార్ సైకిళ్ళు, కార్లు వంటి వాహనాలు సైకిళ్ల స్థానాన్ని ఆక్రమించాయి. అయితే నార్డిక్ దేశాల్లో నేటికీ రవాణా సాధనంగా సైకిల్‌కి అత్యంత ప్రాధాన్యం ఉండటం గమనార్హం.



మోటారు వాహనాల వాడకం కాలుష్య కారకం కాబట్టి సైకిల్‌ను వాడాలని స్వీడన్ ప్రజల్లో చైతన్యం తెచ్చింది. అలాగే ప్రతి సంవత్సరం జూన్ 3వ తేదీన 'అంతర్జాతీయ సైకిల్ దినోత్సవం' జరిపే విధంగా ఐక్యరాజ్య సమితిపై ఒత్తిడి తెచ్చింది. ఫలితంగా 2018 నుంచి ఈ దినోత్సవాన్ని జరుపుతున్నారు. ఈ ఏడాది 'సైకిల్ ద్వారా ఆరోగ్యం, సమానత్వం, స్థిరత్వాన్ని ప్రోత్సహించడం' అనే థీమ్‌ను ఎన్నుకున్నారు. నేడు సైకిల్ వాడకంలో ప్రపంచంలోనే ముందున్న దేశం 'నెదర్లాండ్స్'. సైకిల్ తొక్కడం ఓ మంచి వ్యాయామం. కనీస శారీరక శ్రమ లేకపోవడం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఎందరో వివిధ రకాల రోగాల బారిన పడుతున్నారు. చిన్న చిన్న దూరాలకు కూడా మోటార్ సైకిళ్ళు, కార్లు వినియోగించడం సరికాదు. నడవడమో లేక సైకిల్‌పై వెళ్లిరావడమో అలవాటు చేసుకోవాలి. పట్టణ ప్రాంతాల్లో 'సైకిల్ ట్రాక్'లు ఏర్పాటు చేయాలి. 'సైక్లింగ్' ఒక ఫ్యాషన్‌గా మారాలి. ఊబకాయం, డయాబెటిస్ వంటి సమస్యలు పరిష్కారానికీ; ఊపిరితిత్తుల ఆరోగ్యానికీ, మంచి నిద్రకీ, అధిక రక్తపోటు నియంత్రణకూ సైకిల్ తొక్కడం మంచి తరుణోపాయం.

– ఐ.ప్రసాదరావు, ఉపాధ్యాయుడు, కాకినాడ.
(నేడు ప్రపంచ సైకిల్ దినోత్సవం)

ఉన్నత విద్యను వికసింపజేయాలి!

అభిప్రాయం



ప్రొ॥ పీటా బాబీ వర్ధన్

విద్యకు ప్రోత్సాహకాలు అందించడం అనేది అభివృద్ధికి తోడ్పాటును ఇవ్వడంతో సమానమన్నది అంగీకరించాల్సిన అంశం. విద్యకు నిధులు కేటాయించడం అంటే అభివృద్ధికి పెట్టుబడులు పెట్టడంతో సమానమని వైఎస్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనడమే కాదు తదనుగుణంగా విద్యారంగంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు కూడా. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జిల్లాకో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశారు. గ్రామీణ, గిరిజన విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేసేందుకు విశేష కృషి చేశారు. కేవలం యూనివర్సిటీలు స్థాపించడమే కాకుండా కనీస వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చారు. యూనివర్సిటీ గ్రాంట్ల సంఘం నిబంధనలు మేరకు ఒక్కో విభాగంలో 'కోర్ అధ్యాపకుల' నియామకాలకు కేటాయింపులు చేశారు. దీని ప్రకారం ఒక్కో విభాగంలో ఒక ప్రొఫెసర్, ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం జరుగుతుంది. హార్టికల్చర్ యూనివర్సిటీ (తాడేపల్లి గూడెం), వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటీలను ఏర్పాటు చేశారు. జేఎన్‌టీయూ (అనంతపురం) కూడా ఈ ప్రణాళికలో భాగమే. ఇదంతా గతం.




ప్రస్తుతం ఉన్నత విద్య సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. కనీస సౌకర్యాలు లేక కునారిల్లుతోంది. యూనివర్సిటీల మనుగడకు అత్యంత ప్రధానమైన బోధనా సిబ్బంది కొరత తీవ్రంగా పీడిస్తోంది. కొత్త కోర్సులు ప్రవేశ పెట్టినా, మౌలిక వసతులు లేక విద్యలో నాణ్యత లోపిస్తోంది. ఒప్పంద అధ్యాపకులు, (రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో నాలుగు వేల పైబడి వున్నారు), అతిథి అధ్యాపకుల (సుమారు మూడు వేలమంది సేవలు అందిస్తున్నారు) సహకారంతో నెట్టుకొస్తున్నారు. ఖాళీలను భర్తీ చేసే నియామక ప్రక్రియ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది. దీంతో వయస్సు పెరిగి పోయి ఎక్కడ అర్హత కోల్పోతామోనని ఆందోళన చెందుతున్నారు అభ్యర్థులు. ఒప్పంద, అతిథి అధ్యాపకుల్లో మెజారిటీ సభ్యులు యాభై ఏళ్లు దాటిన వారుండడం విచారించదగిన అంశం. గత ప్రభుత్వం ఎంపిక నియామకాల కోసం ప్రకటన విడుదల చేసినా, కోర్టు కేసులతో ప్రక్రియ నిలిచి పోయింది. సిబ్బంది కొరత కారణంగా బోధన కుంటుపడడంతో పాటు, పరిశోధన పూర్తిగా నిలిచి పోయింది. జాతీయ స్థాయిలో ర్యాంకుల విషయంలో మనం పూర్తిగా వెనుకబడి పోతున్నాం. నిర్దేశకులు(గైడ్స్) లేక పీహెచ్‌డీ ప్రవేశాలు పూర్తిగా తగ్గిపోయాయి. సిబ్బంది నియామకం అత్యంత ప్రాధాన్యతాంశంగా భావించి తదనుగుణంగా చర్యలు చేపట్టాలి.

శాశ్వత నియామకాల్లో తమకు పాధాన్యం ఇవ్వాలని ఒప్పంద, అతిథి అధ్యాపకులు కోరుతున్నారు. కనీసం అప్పటివరకు టైమ్ స్కేల్ వేతనాలు ఇవ్వాలంటున్నారు. ఈ నేపథ్యంలో విశ్వవిద్యాలయాలకు ఉన్నత విద్యామండలి ఒప్పంద అధ్యాపకులకు తిరిగి ఇంటర్వ్యూలు నిర్వహించాలని ఆదేశిస్తూ కాకినాడ జేఎన్‌టీయూ, అనంతపురం జేఎన్‌టీయూ, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయాలకు ఓ సర్క్యులర్ పంపింది. రెండు దశాబ్దాల అనుభవం ఉన్న తమకు మళ్లీ ఇంటర్వ్యూలేమిటని, ఇది 'పొమ్మన లేక పొగబెట్టడం లాంటిదే'నని, తమకు ఇష్టమొచ్చిన అభ్యర్థులను ఎంపిక చేసుకునేందుకు ఇది ఒక పన్నాగమని ఒప్పంద అధ్యాపకులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇంటర్వ్యూలను తాము బహిష్కరిస్తున్నట్లు ఒప్పంద అధ్యాపకుల సంఘం ప్రకటించింది. అతిథి అధ్యాపకులు సైతం తమకు నెలనెలా జీతాలు ఇవ్వాలని ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచారు. ఈ నేపథ్యంలో జూన్ నాలుగో తేదీన ఉన్నత విద్యా మండలి నిర్వహించ తలపెట్టిన సమావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారోనని ఒప్పంద, అతిథి అధ్యాపకులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

వ్యాసకర్త మీడియా విశ్లేషకులు । 9393100566

ఉండాల్సిన నమ్మకం

భగవంతుడు సర్వాంతర్యామి అనేది భారతీయుల విశ్వాసం. అందుకే భారతీయులకు నదీనదాలూ, కొండలూ, గుట్టలూ, జంతువులూ, పక్షులూ... ఒకటేమిటి– అన్నీ పూజనీయాలే. పండుగలూ పబ్బాలలో ప్రకృతితో మమేకమై తన్మయత్వంతో పూజలు చేయడం అందుకే! అయితే వివిధ రూపాల్లో ఉన్న దేవుని గుర్తించడంలో మాత్రం చాలా మంది విఫలమవుతూ ఉంటారు. ఇందుకు దైవాన్ని గుర్తించగలిగిన జ్ఞానం వారికి లేకపోవడమే కారణం. దేవుణ్ణి దర్శించుకోవడానికి గుడి లోపలికి చాలా భక్తిప్రపత్తులతో వెళతారు. కానీ గుడి మెట్లపై కూర్చునే యాచకులు, దీనులను చాలామంది పట్టించుకోరు. వారితోనే నిజంగా దేవుడు కూర్చున్నా గుర్తించలేరు. అయితే భగవంతుని గుర్తించడానికి శోధన అవసరం.



జ్యోతిర్మయం

అన్వేషించే కొద్దీ భగవంతుణ్ణి ఏదో ఒకరోజు తెలుసుకోవచ్చు. ఆరాధనా పద్ధతులతోపాటు అన్వేషణా జ్ఞానాన్నీ సముపార్జించాలి. ఆ జ్ఞానం లేకపోతే ఆ నారాయణుడే మన ముందుకొచ్చి నిల్చున్నా తెలుసుకోలేం. పైపెచ్చు అనుమానిస్తాం. అతను నిజంగా నారాయణుడేనా అని ఆలోచనలో పడతాం. నారాయణుడేదో మన అవసరాలను తీర్చడానికొస్తే ఎదురు మనమే అవీ ఇవీ అడిగి అనుమానిస్తాం. అప్పుడు 'నేను సాక్షాత్తూ ఆ నారాయణుడినే నయ్యా' అని భగవంతుడు చెప్పినా సరే... మన మనసు ఒప్పుకోవడానికి ససేమిరా అంటుంది. 'అదేంటీ, నాకంత సులభంగా పరమాత్మ ప్రత్యక్షమవుతాడా' అని సందేహిస్తాం. ఇటువంటి స్థితిలోనైనా మనకు ప్రహ్లాదుడి మాట గుర్తుకు రావాలిగా... ఆ హరి నారాయణుడు లేని చోటేది? అతను సర్వాంతర్యామి అనేది తెలిసుండాలిగా! అలాకాక 'నీకు శంఖం, చక్రం లేవేమిటీ? నీ వాహనమైన గరుత్మంతుడేడీ?' అని ప్రశ్నిస్తే ఆ నారాయణుడిని ఎలా చూడగలం?

మనకు మన మీదే అపనమ్మకం. అటువంటప్పుడు సాక్షాత్తూ ఆ వైకుంఠవాసుడైనా ఏమీ చేయలేడు. కనుక మనకు ఉండాల్సింది నమ్మకం. అన్నింట్లోనూ ఆ భగవంతుడు ఉంటాడనేది తెలియాలి.

– యామిజాల జగదీశ్

తిండిగింజలకు నానాతిప్పలు

రాష్ట్రంలో రెండో రోజూ రేషన్ పరేషాన్



విజయవాడ వన్‌టౌన్ కొత్తపేట సమీపంలోని రేషన్ డిపో వద్దకు నడవలేని స్థితిలోనూ స్టాండ్ సాయంతో సరుకుల కోసం వచ్చిన వృద్ధురాలు



విశాఖపట్నం కోటవీధి వద్ద రేషన్ డిపోలో సర్వర్ మొరాయించడంతో తలపట్టుకున్న లబ్ధిదారులు



విజయవాడ వాంబే కాలనీ సమీపంలో సర్వర్ పనిచేయక పోవటంతో క్యూలైన్‌లో వేచి ఉన్న కార్డుదారులు



కర్నూలు కప్పల్ నగర్‌లో సర్వర్ పనిచేయకపోవడంతో సోమవారం పొద్దుపోయేవరకు వేచి ఉన్న లబ్ధిదారులు



విశాఖపట్నం అల్లిపురంలో సరకుల మూటలు మోసుకొస్తున్న మహిళలు

సాక్షి, అమరావతి: నడవలేని స్థితిలోనూ చేతికర్రల సాయంతో వచ్చిన వృద్ధులు..! సర్వర్లు మొరాయించడంతో గంటల కొద్దీ క్యూలైన్లు, రోడ్లపై మహిళల పడిగాపులు..! సమయం దాటినా తెరుచుకోని చౌక దుకాణాల వద్ద నిరీక్షించిన చిన్నారులు..! చంటిబిడ్డలను చంకన ఎత్తుకుని తల్లుల ఎదురుచూపులు..! ఒకేసారి రద్దీతో డిపోల్లో కుస్తీలు..! ఈ-పోస్ మిషన్లు పనిచేయక దుకాణాలు మూసేసి వెళ్లిపోయిన డీలర్లు..! ఉసూరుమంటూ వెనుదిరిగిన కార్డుదారులు..! ..ఇదీ రాష్ట్రంలో రెండో రోజు పరిస్థితి. కూటమి ప్రభుత్వంలో ప్రజా పంపిణీ వ్యవస్థ అధ్వాన స్థితి. పొట్ట నింపుకొనేందుకు చౌక బియ్యమే పరమాన్నంగా భావించే పేదలను గంటల తరబడి క్యూలైన్లలో నిలబెడుతోంది కనికరం లేని సర్కా రు. వృద్ధులు, దివ్యాంగులపై దయ చూపకుండా మండుటెండల్లో రోడ్లపై నడిపిస్తోంది. పేదల మేలును మరిచి.. ఇంటి వద్దకే రేషన్ ఇచ్చే వ్యవస్థను రద్దు చేసిన కూటమి సర్కారు సోమవారం రేషన్ పంపిణీలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. రాష్ట్రంలో ఎక్కడికెళ్లినా.. లబ్ధిదారుల్లో ఎవరిని పలకరించినా రేషన్ అవస్థలే వినిపిస్తున్నాయి.

అక్కరకు రాని వైనం..

రేషన్ డిపోల ద్వారా బియ్యం పంపిణీని గొప్పగా కూటమి ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది. దివ్యాంగులు, వృద్ధులకు ఇంటికే బియ్యం అందిస్తున్నట్లు ప్రకటనలు గుప్పిస్తోంది. క్షేత్రస్థాయిలో చూస్తే వీరు చౌక బియ్యం కోసం ప్రాణాలకు తెగించి యుద్ధం చేయాల్సి వస్తోంది. జీవిత చరమాంకంలో.. ఊతకర్రల సాయంతో బియ్యం కోసం రేషన్ షాపుల వద్దకు వచ్చిన వయోధికులు అక్కడే కూలబడుతున్నారు. బియ్యం మూటను భుజంపై కూడా పెట్టుకోలేని దుస్థితిలో చుట్టుపక్కలవారిని సాయం కోసం బతిమలాడుకుంటున్నారు. గత ప్రభుత్వంలో ఎండీయూల ద్వారా ఇంటి వద్దనే హాయిగా రేషన్ తీసుకున్న పరిస్థితి నుంచి కూటమి ప్రభుత్వం తమను అవస్థల పాలు చేస్తోందని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

- 65 ఏళ్లు దాటినవారికి దివ్యాంగులకు ఇంటికే డీలర్ల ద్వారా రేషన్ ఇస్తామని కూటమి ప్రభుత్వం చెబుతోంది. ఇలా 15 లక్షల మందిని లెక్కించింది. వీరిలో తొలి రోజు ఏకంగా మూడు లక్షలమందికి పంపిణీ చేసినట్టు దొంగ లెక్కలు చూపిస్తోంది. మరి ప్రభుత్వమే ఇంటికి రేషన్ ఇస్తుంటే లక్షలమంది వృద్ధులు, దివ్యాంగులు ఎందుకు దుకాణాలకు వస్తారు? వచ్చినా డీలర్ ఇంటికే బియ్యం పంపిస్తామని ఎందుకు చెప్పట్లేదు? ఇదంతా కూటమి కుటిలతంత్రం.

ఒకటే మాట.. సర్వర్ల మొరాయింపు

టెక్నాలజీ వినియోగం తమ పేటెంట్ హక్కుగా చెప్పుకునే చంద్రబాబు అండ్ కో పేదలకు ఐదు కిలోల బియ్యాన్ని పంపిణీ చేయలేక చేతులెత్తేస్తోంది. రేషన్ దుకాణాలకు వెళ్లిన లబ్ధిదారులకు ఒక్కటే మాట వినిపిస్తోంది.. సర్వర్ పనిచేయట్లేదు అని. దీంతో ప్రజలు పాట్లు పడుతున్నారు.

60 ఏళ్లకే వృద్ధాప్య పింఛన్.. రేషన్‌కు 65 ఏళ్లా?

రాష్ట్రంలో ప్రభుత్వం 60 లక్షలకుపైగా వృద్ధాప్య, దివ్యాంగ, ఇతర పింఛన్లను ఇస్తోంది. వీళ్లందరికీ తెల్ల రేషన్ కార్డులే ఉంటాయి. ఇందులో 48 లక్షలకు పైగా వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్య బాధితులు ఉంటారు. ఇన్ని లక్షల్లో వృద్ధులు, దివ్యాంగులు ఉంటే ప్రభుత్వం 15 లక్షల మందికి.. అది కూడా 65 ఏళ్లు దాటినవారికి మాత్రమే రేషన్ ఇంటికి చేరవేస్తామని చెబుతోంది. 60 ఏళ్లకే వృద్ధాప్య పింఛన్ ఇస్తూ.. రేషన్‌కు వచ్చేసరికి 65 ఏళ్లకు పెంచి చూపి ప్రజలను మోసం చేస్తోంది.

తూకంలో అంతా మోసం..

కూటమి ప్రభుత్వం రేషన్ పంపిణీని ఒక్కరోజులోనే భ్రష్టుపట్టించింది. గతంలో లబ్ధిదారుల కళ్ల ముందే బియ్యం తూకం వేసి.. ఈ-పోస్, తూకం యంత్రం అనుసంధానాన్ని చూపించి బియ్యాన్ని సరఫరా చేసేవారు. ఇప్పుడు సిగ్నల్ సమస్య వల్ల మాన్యువల్‌గా బియ్యం పరిమాణాలను నమోదు చేసి, తూకం లేకుండా ఇస్తున్నారు. వేలిముద్రలు తీసుకుని బియ్యం బదులు పేదల చేతుల్లో డీలర్లు అరకొర నగదు పెడుతున్నారు.



అసలే వృద్ధురాలు. ఊతకర్ర లేనిదే నడవలేదు. అయినా బియ్యం కోసం దుకాణానికి వచ్చింది. సర్వర్ పనిచేయక గంటల తరబడి నిరీక్షించింది. ఎట్టకేలకు బియ్యం ఇచ్చాక.. సంచి భుజాన పెట్టుకుని మోయలేక అవస్థలు పడుతూ ఇంటికి బయలుదేరింది. నెల్లూరు ఈద్గామిట్ట ప్రాంతంలో సోమవారం కనిపించిన దృశ్యమిది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

రేయింబవళ్లు పడిగాపులు

సోమవారం చాలాచోట్ల అసలు రేషన్ దుకాణాలు తెరుకోలేదు. గుంటూరు జిల్లా కొరిటిపాడులో సాయంత్రం 4.30 దాటినా చౌక దుకాణం తీయకపోవడంతో వృద్ధులు డీలర్ కోసం ఎదురుచూశారు. నెహ్రూనగర్‌లో 4.50కు కూడా దుకాణం తెరవకపోవడంతో లబ్ధిదారులు నిరాశగా వెనుదిరిగారు. కడప హౌసింగ్‌బోర్డు కాలనీలో 9.50 దాటినా తెరవలేదు. ఇక్కడే ఎన్జీవో కాలనీలో సర్వర్ పనిచేయకపోవడంతో డీలర్ వెళ్లిపోయారు. ఒంగోలు బలరాం కాలనీలో సర్వర్ పనిచేయక రాత్రి సమయంలోనూ ప్రజలు పడిగాపులు పడ్డారు. వాస్తవానికి రేషన్ డీలర్ ఇల్లు ఒక చోట ఉంటుంది.. దుకాణం ఎక్కడో ఉంటుంది. దీంతో సమయపాలన పాటించడంలేదు.

తలలు పట్టుకుంటున్న డీలర్లు

- సర్వర్ మొరాయించడంతో ఒంగోలు జిల్లాలో రెండో రోజూ ప్రజలకు కష్టాలు తప్పలేదు. కార్డుదారులు గంటల తరబడి ఎదురుచూశారు. వృద్ధులు కూడా దుకాణానికి వచ్చి రేషన్ తీసుకోవాలనని డీలర్లు చెబుతుండడంతో.. సుదూరంగా ఉన్నప్పటికీ కాలి నడకన వెళ్లి బియ్యం గోతాలను ఎత్తుకుని అష్టకష్టాలు పడుతూ ఇళ్లకు తెచ్చుకున్నారు.
- సర్వర్ సక్రమంగా పనిచేయక రాజమహేంద్రవరంలోని పలు ప్రాంతాల్లో కార్డుదారులు రెండు రోజులుగా కష్టాలు పడ్డారు. సర్వర్ ఎప్పుడు పని చేస్తుందోనని నిరీక్షించి.. డీలర్లు సైతం తలలు పట్టుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన లబ్ధిదారులు ఉదయం, సాయంత్రం కాళ్లరిగేలా తిరగాల్సి వస్తోందని వాపోయారు.
- కడపతో పాటు ప్రొద్దుటూరు, పులివెందుల, జమ్మలమడుగు, బద్వేలు, మైదుకూరు, కమలాపురం తదితర ప్రాంతాల్లో సర్వర్ సమస్య కారణంగా కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎండ తీవ్రత ఉన్నప్పటికీ సరుకులు అయిపోతాయేమోనని వచ్చిన వృద్ధులు అవస్థలు పడ్డారు. సరుకులను ఇంటికి తీసుకెళ్లేందుకు పడరాని పాట్లు పడ్డారు.
- తిరుపతి జిల్లాలో చౌక దుకాణాల వద్దకు వెళ్లడానికి లబ్ధిదారులు నానా తిప్పలు పడ్డారు. జిల్లాలో 300 దుకాణాల బాధ్యతను ఇంచార్జి డీలర్లకు అప్పజెప్పారు. వీరంతా ఒక గంట తమ షాప్ వద్ద.. మరో గంట ఇంచార్జి రేషన్ షాపు వద్ద సరుకులు ఇస్తున్నారు. కంది పప్పు, చక్కెర అరకొర ఇస్తున్నారు.
- చిత్తూరు జిల్లాలో రెండోరోజు కూడా రేషన్ పంపిణీ మొరాయించింది. ఉదయం నుంచి రాత్రి వరకు సర్వర్ సమస్య వేధించింది. సర్వర్ పనిచేసినప్పుడల్లా ఒక్కో కార్డుదారుడికి రేషన్ ఇచ్చేందుకు డీలర్లు ముప్పుతిప్పలు పడ్డారు. క్యూలో వేచి ఉన్న కార్డుదారులకు మధ్యాహ్న సమయంలో నీరసం ఆవరించింది. చాలామంది డీలర్లు ఇష్టానుసారం రేషన్ తలుపులు తీశారు.
- ఏలూరు జిల్లాలో రేషన్ పంపిణీ గందరగోళంగా సాగుతోంది. అనేక ప్రాంతాల్లో ఉదయం నుంచి సర్వర్ల సమస్యలతో గందరగోళం నెలకొంది.
- ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా సోమవారం కూడా ప్రజలు రేషన్ కష్టాలు ఎదుర్కొన్నారు. 65 ఏళ్లు దాటిన వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ అందిస్తామంటూ కూటమి ప్రభుత్వ పెద్దలు ప్రగల్భాలు పలికినా.. క్షేత్రస్థాయిలో అమలు కాలేదు.



సర్వర్ పనిచేయకపోవడంతో రాజమహేంద్రవరంలో తలపట్టుకున్న డీలర్



అనంతపురంలో రేషన్ బియ్యం మూటను మోసుకెళ్తున్న వృద్ధురాలు



శ్రీకాకుళం జిల్లాలో రేషన్ తెచ్చుకుంటున్న వృద్ధురాలు



ఏలూరు కొత్తపేటలో సర్వర్ పనిచేయకపోవడంతో వృద్ధులు, మహిళల పడిగాపులు



ఒంగోలు బలరాం కాలనీలో రేషన్ షాపు వద్ద క్యూలో పడిగాపులు కాస్తున్న కార్డుదారులు

క్లుప్తంగా...

మమ్మల్ని చంపి మా భూములు తీసుకోండి

- రామకుప్పం మండల రైతుల ఆక్రోశం



కుప్పం: వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న తమ భూములను విమానాశ్రయ నిర్మాణం కోసం బలవంతగా లాక్కుంటే తాము ఏలా బతకాలంటూ చిత్తూరు జిల్లా రామకుప్పం మండల రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. రామకుప్పం మండలం గాంధీనగర్ గ్రామానికి చెందిన రైతులు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కుప్పం చేరుకుని ప్రజా సమస్య పరిష్కార వేదికలో కుప్ప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కడా) పీడీ వికాస్ మర్మత్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం కడా కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. "బలవంతంగా మా భూములను లాక్కోవద్దు.. మా కడుపులు కొట్టొద్దు.. మమ్మల్ని చంపి మా భూములు తీసుకోండి" అంటూ నినాదాలు చేశారు. భూములు ఇచ్చే ప్రసక్తి లేదని రైతులు స్పష్టం చేశారు. ముందస్తుగా రైతులకు నోటీసులు ఇవ్వకుండా వ్యవసాయ భూముల సర్వే జరిపి విమానాశ్రయం కోసం లాక్కోవడం దారుణమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఓబులరాజు విమర్శించారు.

వెన్నుపోటు దినంలో న్యాయవాదులంతా పాల్గొనాలి

వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షులు మలసాని మనోహర్‌రెడ్డి

సాక్షి,అమరావతి: జూన్ 4న వైఎస్సార్‌సీపీ నిర్వహించే వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమంలో న్యాయవాదులంతా పాల్గొనాలని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ పిలుపునిచ్చింది. గుంటూరు జిల్లా తాడేపల్లిలో సోమవారం వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షులు మలసాని మనోహర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేయడంతో ఆ రోజును వెన్నుపోటు దినంగా పరిగణిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చిందని చెప్పారు. న్యాయవాదులకు ఇచ్చిన హామీలనూ కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదని మండిపడ్డారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లా నేస్తం పేరుతో జూనియర్ న్యాయవాదులకు ప్రతినెలా రూ.5,000 చొప్పున చెల్లించిందని గుర్తుచేశారు. న్యాయవాదులు మరణిస్తే ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్‌గా ఇచ్చే రూ.4 లక్షలను విడుదల చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు.

రేషన్ వాహనాల రద్దు.. ప్రజలకు మరో వెన్నుపోటు

- చౌక దుకాణాల వద్ద జనం పడిగాపులు
- క్యూలో నిల్చోలేక ప్రాణాలు కోల్పోతున్న వృద్ధులు
- ప్రజలకు ఏది బాగున్నా.. చంద్రబాబుకు నచ్చడం లేదు
- మాజీ మంత్రి కారుమూరి ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న కారుమూరి

తణుకు అర్బన్: రేషన్ వాహనాల రద్దు.. ప్రజలకు చంద్రబాబు పొడిచిన మరో వెన్నుపోటు అని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు బాధపడుతుంటేనే చంద్రబాబుకు ఇష్టమని, వారికి ఏది బాగున్నా.. ఆయనకు నచ్చదని, ఆయన కన్నుకుడుతుందని ఎద్దేవా చేశారు. రేషన్ వాహనాల రద్దుతో ప్రజలు చౌక దుకాణాల వద్ద పడిగాపులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతపురంలో రేషన్ బియ్యం కోసం క్యూలో ఉన్న వృద్ధురాలు ఎండ వేడికి తట్టుకోలేక ప్రాణం కోల్పోయిందని, ఈ పాపం చంద్రబాబుదేనని విమర్శించారు. రేషన్‌వాహనాలను తొలగించడం ద్వారా రేషన్ మాఫియాకు సర్కారే తెరలేపిందని, ప్రారంభించిన రోజే విశాఖపట్నంలో 40 బస్తాల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వేలాది కుటుంబాల ఉపాధిని దెబ్బతీసిందని, వలంటీర్లు, మద్యం దుకాణాల్లో గుమాస్తాలు, రేషన్ వాహనాల డ్రైవర్లను, అసిస్టెంట్‌లను తొలగించిందని విమర్శించారు. రేషన్ వాహనాల రద్దుతో ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పిల్లలను ఎత్తుకుని మహిళలు కొండలు, కోనల్లో నడుచుకుంటూ చౌక దుకాణాల వద్దకు వెళ్లి సరుకులు తెచ్చుకోవడం కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పండించిన పంటలకు సరైన ధరలు లేక రైతులు అవస్థలు పడుతున్నారని, రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తున్నారని వివరించారు. కూటమి ప్రభుత్వ రాక్షస పాలనకు చరమగీతం పాడాలని అన్నారు. సీఎం చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్నీ అమలు చేయకుండా వెన్నుపోటు పొడిచినందుకు నిరసనగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జూన్ 4న వెన్నుపోటు దినం పాటించాలని కారుమూరి కార్యకర్తలను కోరారు. ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టండి అని గతంలో మంత్రి నారా లోకేశ్ అనేవారని, ఇప్పుడు బిగిస్తున్న స్మార్ట్ మీటర్లను ఆయన పగలగొడతారా..? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సభ్యులు వెలగల సాయిబాబారెడ్డి, జల్లూరి జగదీష్, మెహర్ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకమే కానీ.. సమస్యలున్నాయి!

డీలర్ల ద్వారా రేషన్ పంపిణీపై మంత్రి మనోహర్ ద్వంద్వ వ్యాఖ్యలు



సాక్షి, అమరావతి: డీలర్ల ద్వారా రేషన్ బియ్యం అక్రమ రవాణాపై పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దాటవేత ధోరణిని అవలంభించారు. రేషన్ డిపోల్లో తొలిరోజు నుంచే పేదల వేలిముద్రలు తీసుకుని బియ్యం దొడ్డిదారిన తరలిస్తున్నారన్న ప్రశ్నలకు పొంతన లేని సమాధానాలు చెప్పారు. పైగా గతంలో బఫర్ గోడౌన్ల నుంచి ఎంఎల్ఎస్ పాయింట్లకు.. అక్కడ నుంచి నేరుగా బియ్యం పంపిణీ వాహనాలకు (ఎండీయూలకు) సరఫరా జరిగేదని, తద్వారా బియ్యం ఎక్కడికి వెళ్లేవో లెక్కలు ఉండేవి కావని అవగాహన రాహిత్యంతో మాట్లాడారు. సోమవారం విజయవాడలోని పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో మంత్రి మనోహర్ మీడియాతో మాట్లాడుతూ.. ఒకేసారి ఎక్కువ మంది దుకాణాలకు వస్తుంటే సాంకేతిక సమస్యలు వస్తున్నాయని చెప్పడం ద్వారా పంపిణీలో డొల్లతనాన్ని బయటపెట్టారు. మరోవైపు సమాచారం లేకపోవడంతో వృద్ధులు, దివ్యాంగులు రేషన్ కోసం డిపోలకు వస్తున్నట్టు అంగీకరించారు. 3.73 లక్షల మంది వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ అందించామని చెప్పుకొచ్చారు. రేషన్ పంపిణీ తొలిరోజే చాలాచోట్ల బియ్యం అక్రమ రవాణా జరిగిందని మీడియా ప్రశ్నించగా.. భవిష్యత్‌లో ప్రతి బ్యాగ్‌కు క్యూఆర్ కోడ్, షాపుల్లో సీసీ కెమెరాలు పెడతామని చెప్పారు. బియ్యానికి బదులు డీలర్లు డబ్బులిచ్చి పంపిస్తున్నారన్న ప్రశ్నకు ఆయన చిరునవ్వే సమాధానమైంది. ఈ-పోస్ సమస్యలపై ప్రశ్నించగా కొన్నిచోట్ల సమస్య వచ్చి ఉండొచ్చన్నారు.

వైఎస్ జగన్ పర్యటనపై గాబరా

దళిత యువకులపై పోలీసులు కర్కశంగా ప్రవర్తించిన తీరును ఖండిస్తూ, బాధిత కుటుంబాలను ఓదార్చేందుకు మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెనాలి పర్యటనకు వెళ్తున్న నేపథ్యంలో మంత్రి మనోహర్ గాబరా పడ్డారు. రేషన్ సేవలపై మీడియా సమావేశం పెట్టి వైఎస్ జగన్ పర్యటనపై విషం చిమ్మే ప్రయత్నం చేశారు.

జీతాలు రాక.. ఎంటీఎస్ టీచర్ ఆత్మహత్య

అప్పులపాలై.. మానసిక వేదనకు గురై బలవన్మరణం

కోరుకొండ: టీడీపీ కూటమి ప్రభుత్వంలో జీతాలు సక్రమంగా అందకపోవడంతో తూర్పుగోదావరి జిల్లాలోని మినిమమ్ టైమ్ స్కేల్ (ఎంటీఎస్) టీచర్ బలవన్మరణానికి పాల్పడ్డారు. కోరుకొండ మండలం పశ్చిమ గానుగూడేనికి చెందిన కన్నాబత్తుల విజయకుమార్ (43) కాపవరం మండల పరిషత్ పాఠశాలలో ఎంటీఎస్ టీచర్‌గా పనిచేస్తున్నారు. మే నెలలో జీతాలు అందకపోవడంతో అప్పులపాలై, ఆర్థిక సమస్యలతో మానసిక వేదనకు గురై ఆదివారం రాత్రి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్ హుక్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు. పిల్లలు ఇంటర్మీడియెట్ చదువుతున్నారు. విజయకుమార్ 2008 డీఎస్సీలో ఎంపికై, నాలుగేళ్లుగా సర్వీసులో ఉన్నారు.

ఆ టీచర్లకు సక్రమంగా జీతాలు లేకే సమస్యలు..

1998, 2008 సంవత్సరాల్లో టీచర్లుగా చేరిన వారికి ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం రెగ్యులర్‌గా జీతాలు ఇవ్వకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. ఉద్యోగానికి ఎంపికైనా కూడా వారికి 16 సంవత్సరాలుగా ఉద్యోగాలివ్వలేదు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత 1998, 2008 సంవత్సరాల్లో డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులకు ఎంటీఎస్ టీచర్లుగా అవకాశం కల్పించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వీరికి సరిగా వేతనాలు ఇవ్వడం లేదు. వారిలో పలువురు వయస్సు రీత్యా వివిధ వ్యాధులతో బాధపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో పలువురు రిటైర్మెంట్ వయస్సుకు చేరుకుంటూ, కుటుంబ పోషణ కష్టమై, ఆర్థిక సమస్యలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి..

ఉద్యోగ భద్రత కల్పించడంలో విఫలమవుతున్న కూటమి ప్రభుత్వం నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషిచేయడం లేదు. ఎంటీఎస్ టీచర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి. ఆత్మహత్యలను అరికట్టాలి.
– కె.చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కన్వీనర్, ఎంటీఎస్ టీచర్స్ అసోసియేషన్

రెగ్యులరైజ్ చేయాలి..

ఎంటీఎస్ టీచర్లను బేషరతుగా రెగ్యులరైజ్ చేయాలి. వారి కుటుంబాల్లో ఆర్థిక సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి. ఒత్తిడి లేకుండా విధులు నిర్వహించేందుకు అవకాశం కల్పించాలి.
– బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు, ఎంటీఎస్ టీచర్స్ అసోసియేషన్

కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాలి..

టీచర్ల ఆత్మహత్యలకు టీడీపీ కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాలి. వసతుల కల్పనలో, జీతాలందించడంలో ప్రభుత్వం విఫలమైంది.
– మార్తార్ బాల్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంటీఎస్ టీచర్స్ అసోసియేషన్

వైద్యశాఖ బదిలీల్లో గందరగోళం

ఖాళీల విషయంలో స్పష్టత కరువు

సాక్షి, అమరావతి: వైద్యశాఖలో బదిలీల కోసం శనివారం జారీచేసిన మార్గదర్శకాలు ఉద్యోగులను గందరగోళపరుస్తున్నాయి. రెండేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న ఉద్యోగులకు రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్‌కు అవకాశం కల్పించారు. ఐదు ఆప్షన్లను ఎంచుకోవాలని సూచించారు. అయితే, రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్ కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగుల స్థానాలను ఖాళీలుగా ప్రకటిస్తారా? ఎంచుకున్న ఐదు స్థానాల్లో ఖాళీలేని పక్షంలో ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడికి బదిలీ చేస్తారా? అనే అంశాలపై స్పష్టత లేకపోవడంతో రెండేళ్ల సర్వీసు పైబడిన ఉద్యోగులు దరఖాస్తు చేసుకోవాలా వద్దా అనే అయోమయం నెలకొంది. మరోవైపు.. బదిలీ దరఖాస్తుల సమర్పణకు మంగళవారం తుది గడువు విధించారు. అయితే, సోమవారం సాయంత్రానికి కూడా అన్ని విభాగాల్లో పూర్తి స్థాయిలో ఖాళీల వివరాలను ప్రదర్శించనే లేదు. దీంతో ఖాళీల వివరాలు చెప్పకపోతే దరఖాస్తు చేసుకునేదెలా అని వైద్యులు, నర్సులు, ఇతర ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా డీఎంఈ పరిధిలోని రాష్ట్రస్థాయి కేడర్ అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్ ఖాళీల వివరాలను సోమవారం సాయంత్రం వరకూ ప్రకటించలేదు. మీకేమైనా సమాచారం ఉందా అంటూ వైద్యులందరూ తాము పనిచేస్తున్న కళాశాలల ప్రిన్సిపాల్స్ కార్యాలయాల చుట్టూ సోమవారం ప్రదక్షిణలు చేశారు.



ఖాళీలు చూపకపోవడంపై ఆరోపణలు..

ఐదేళ్ల సర్వీసు పూర్తయినప్పటికీ కొందరు వైద్యులు, ఇతర ఉద్యోగులు తాము పనిచేస్తున్న కార్యాలయాల్లోని పరిపాలన సిబ్బంది, బాస్‌లను మేనేజ్ చేసుకుని తమ స్థానాలను ఖాళీలుగా చూపకుండా చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో.. ఐదేళ్లు పైబడిన సివిల్ అసిస్టెంట్ సర్జన్ (సీఏఎస్) జాబితాలో కొన్ని స్థానాలు పొందుపరచలేదని తెలుస్తోంది. ఐదేళ్లు పైబడినప్పటికీ తిరుపతి రుయా, విశాఖ కేజీహెచ్‌లలో ముగ్గురు సీఏఎస్ స్థానాలను ఖాళీగా చూపలేదని వైద్యుల నుంచి ఫిర్యాదులున్నాయి. మిగిలిన కేడర్లలోనూ ఇదే తంతు నడుస్తోంది. ఇక గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వేల సంఖ్యలో కాంట్రాక్టు ఉద్యోగులు రెగ్యులర్ అయ్యారు. వీరి సీనియారిటీని రెగ్యులరైజ్ అయిన నాటి నుంచి పరిగణనలోకి తీసుకుంటారా? లేక మరేదైనా నిబంధనలున్నాయా అనే ప్రస్తావన కూడా చేయకపోవడంతో వీరంతా కూడా అయోమయానికి గురవుతున్నారు.

ఉద్యోగుల బదిలీల గడువు 9 వరకు పొడిగింపు

బేరసారాల కోసమేనంటున్న ఉద్యోగ వర్గాలు

సాక్షి, అమరావతి: ఉద్యోగుల బదిలీల గడువును ఈ నెల 9 వరకు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. తొలుత జారీ చేసిన జీవో ప్రకారం సోమవారంతో గడువు ముగిసింది. వీటిపై మంత్రులు, కూటమి ఎమ్మెల్యేలు మరింత సమయం కోరారు. దీంతో ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్ బదిలీల గడువును ఈ నెల 9వ తేదీ వరకు పొడిగిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీలపై నిషేధం ఈ నెల 10వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని స్పష్టంచేశారు. ఉద్యోగుల బదిలీకి సంబంధించి మంత్రులు, కూటమి ఎమ్మెల్యేల బేరసారాలకు సమయం సరిపోకపోవడంతో గడువు పొడిగించారని ఉద్యోగ వర్గాలు చెబుతున్నాయి.

సాంకేతిక విద్యలో బదిలీలకు శ్రీకారం

సాక్షి, అమరావతి: రాష్ట్ర సాంకేతిక విద్యలో అధికారులు, సిబ్బంది బదిలీలకు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. బదిలీ ప్రక్రియను ఈ నెల 15లోగా పూర్తిచేయాలని ఆదేశిస్తూ ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది సీనియారిటీపై సమగ్ర మార్గదర్శకాలనూ విడుదల చేశారు. కాగా, ఇటీవల మార్గదర్శకాలను తయారు చేసి ప్రభుత్వానికి నివేదించగా, లోపాలపై ముఖ్య కార్యదర్శి తీవ్రంగా ఆక్షేపించినట్టు తెలిసింది. కేంద్ర కార్యాలయంలోని కొందరు సిబ్బందికి మేలుచేసేలా నిబంధనలు ఉండటంతో ఫైల్‌ను తిప్పిపంపి, నిబంధనలు మార్చాలని ఆదేశించినట్టు విశ్వసనీయ సమాచారం.

ఆపరేషన్ స్పైడర్స్‌వెబ్...

నయా పెరల్ హార్బర్!

ఆధునిక యుద్ధ చరిత్రలోనే అతి పెద్ద సర్జికల్ స్ట్రైక్

రష్యాకు తీరని అవమానం మిగిల్చిన ఉక్రెయిన్ డ్రోన్ దాడులు



డ్రోన్ దాడుల్లో కాలిపోతున్న రష్యా విమానం

మూడు టైమ్ జోన్ల పరిధిలో దాడులు

- 41 బాంబర్, నిఘా విమానాలు ధ్వంసం
- మూడో వంతు ఫ్లీట్‌ను నష్టపోయిన రష్యా
- నష్టం విలువ రూ.60 వేల కోట్ల పై చిలుకే!
- ఒక్కోటీ రూ.42 వేలు చేసే 117 డ్రోన్లతో కారుచౌకగా పని పూర్తి చేసిన ఉక్రెయిన్

నాటో దేశాలు నిరంతరం ఆయుధాలతో సహా సర్వ సామగ్రీ సమకూరుస్తుంటే తప్ప యుద్ధరంగంలో పూట గడవని పరిస్థితి ఉక్రెయిన్‌ది. అవతలున్నదేమో అపార సైనిక పాటవానికి మారుపేరైన రష్యా. అలాంటి అగ్రరాజ్యానికి చెందిన ఏకంగా 41 బాంబర్ విమానాలను ఏదో వీడియోగేమ్ ఆడుతున్నంత అలవోకగా దాని సొంత గడ్డ మీదే ధ్వంసం చేసిన తీరు ప్రపంచవ్యాప్తంగా పెను కలకలం సృష్టించింది. అది కూడా ఏ ఒక్కచోటో కాదు. రష్యావ్యాప్తంగా ఏకంగా మూడు టైమ్ జోన్లలో, ఏకంగా 6,000 కి.మీ. పరిధిలో ఉన్న ఐదు వైమానిక స్థావరాలపై ఏకకాలంలో విజయవంతంగా దాడులు జరగడం విశేషం. ఆ దెబ్బకు రష్యా బాంబర్ శ్రేణి విమానాల్లో మూడో వంతు తుడిచిపెట్టుకుపోయాయి! అత్యంత సంక్లిష్టమైన ఇంతటి ఆపరేషన్‌ను పూర్తి కచ్చితత్వంతో, కేవలం డ్రోన్ల సాయంతో కారుచౌకగా, తనవైపు ఎలాంటి ప్రాణనష్టమూ లేకుండా పూర్తి చేసిన వైనం రక్షణ నిపుణులనే విస్మయపరిచింది. ఆధునిక ప్రపంచ యుద్ధ చరిత్రలోనే అతి పెద్ద, అత్యంత సంక్లిష్టమైన సర్జికల్ స్ట్రైక్ ఇదేనని చెబుతున్నారు. అంతేగాక ఏ కోణం నుంచి చూసినా అత్యంత విజయవంతమైన దాడిగా కూడా ఇది నిలిచింది. రష్యా చరిత్రలో అతి పెద్ద నిఘా వైఫల్యంగా కూడా ఇదేనని చెబుతున్నారు. ఈ దాడులను తమ పాలిట 'పెరల్ హార్బర్' ఉదంతంగా రష్యా మీడియానే అభివర్ణిస్తోంది. రెండో ప్రపంచయుద్ధం చివర్లో హవాయిలోని పెరల్ హార్బర్‌పై జపాన్ మెరుపు దాడులకు దిగి అమెరికా యుద్ధనౌకలను సముద్రంలో ముంచేసింది. ఈ ఉదంతం అమెరికాను యుద్ధంలోకి లాగడమే గాక జర్మనీ, జపాన్ తదితర అక్షదేశాల ఓటమికి ప్రధాన కారణంగా నిలిచింది. 'ఆపరేషన్ స్పైడర్స్‌వెబ్' పేరిట ఉక్రెయిన్ జరిపిన డ్రోన్ దాడులు రష్యాను ఆ స్థాయిలో దెబ్బకొట్టాయని అక్కడి మీడియా వాపోతోంది. అది అక్షరాలా నిజమేనని రక్షణ నిపుణులు ముక్త కంఠంతో చెబుతున్నారు. ప్రపంచ దేశాలన్నీ ఆధునిక యుద్ధ వ్యూహాలను తక్షణం సమీక్షించుకోవాల్సిన అవసరాన్ని ఇది మరోసారి గుర్తు చేసిందని వారంటున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

కారుచౌకే.. కానీ ఖతర్నాక్

రష్యా ఎయిర్‌బేస్‌లపై దాడుల్లో ఉక్రెయిన్ వాడింది ఎఫ్‌పీవీ (ఫస్ట్ పర్సన్ వ్యూ) రకం డ్రోన్లు.

- ఇవి కారుచౌకగా దొరుకుతాయి. పేలుడు పదార్థాలను బిగించి పంపగల ఒక్కో ఎఫ్‌పీవీ డ్రోన్ ఖరీదు కేవలం రూ.42 వేలు మాత్రమేనని రాయిటర్స్ వార్తా సంస్థ పేర్కొంది.
- అయితే గురితప్పకుండా లక్ష్యాన్ని ఛేదించడంలో వీటికివే సాటి.
- డ్రోన్‌కు అమర్చిన కెమెరా సాయంతో అక్కడి పరిసరాలను దాని ఆపరేటర్ ప్రత్యేక కళ్లద్దాల సాయంతో లైవ్‌లో చూడటమే గాక వీడియో తీయగలడు. రిమోట్‌గా ఆపరేట్ చేయగలడు.
- పరిసరాల చిత్రీకరణ వంటి సైనికేతర పనుల్లో ఈ డ్రోన్లను విరివిగా వాడుతుంటారు. వీటి రేంజ్ కొన్ని కిలోమీటర్లకే పరిమితం.

రష్యా అణుదాడి చేస్తుందా...?

ఉక్రెయిన్ డ్రోన్ దాడులపై రష్యా తీవ్ర అవమాన భారంతో ఉడికిపోతోంది. కారుచౌకైన డ్రోన్లతో కోలుకోలేని దెబ్బతీయడాన్ని జీర్ణం చేసుకోలేకపోతోంది. దీనికి ప్రతీకారం తప్పదని రష్యా రక్షణ శాఖ ఇప్పటికే ప్రకటించింది. కనుక ఉక్రెయిన్‌పై భారీ స్థాయిలో విరుచుకుపడటం ఖాయమే.

- ఉక్రెయిన్ ప్రధానంగా నాటో సభ్యదేశాలు సమకూర్చిన ఆయుధాలనే తనపై వాడుతోంది. కనుక యూరప్‌లోని నాటో దేశాల్లోని సైనిక స్థావరాలు, ఆయుధాగారాలను రష్యా లక్ష్యంగా చేసుకోవచ్చు. వాటిపై దాడులు చేస్తామని గతంలోనే ఎన్నోసార్లు హెచ్చరించింది కూడా.
- ఉక్రెయిన్ బహుశా ఈ ప్రమాదాన్ని ముందే ఊహించింది. డ్రోన్ దాడులు పూర్తిగా తన పనేనని, నాటో మిత్రులకు ఏ సంబంధమూ లేదని జెలెన్‌స్కీ ప్రకటించారు. వాణిజ్యపరంగా సులువుగా అందుబాటులో ఉన్న డ్రోన్లనే దాడుల్లో వాడినట్టు వివరించారు. అందుకు రుజువుగా దాడుల ఫొటోలను విడుదల చేశారు.
- నష్ట, అవమాన తీవ్రత దృష్ట్యా ఉక్రెయిన్‌పై రష్యా అణుదాడికి దిగినా ఆశ్చర్యం లేదని చెబుతున్నారు.


ఎఫ్‌ఎస్‌బీ పక్కనే దాడుల అడ్డా!

ఇంత భారీ ఆపరేషన్‌కు రష్యా గడ్డ మీద కూడా అవసరమైన మద్దతు తప్పనిసరి. ఇందుకోసం ఉక్రెయిన్ రష్యాలో ఏకంగా ఆఫీసే తెరిచింది! అది కూడా రష్యా అంతర్గత భద్రతా విభాగం ఎఫ్‌ఎస్‌బీ కార్యాలయం పక్కనేనని జెలెన్‌స్కీ వెల్లడించడం విశేషం. ఏ ప్రాంతంలో అన్నది మాత్రం చెప్పలేదు.

- మొత్తం ఆపరేషన్‌ను ఉక్రెయిన్ సీక్రెట్ సర్వీస్ (ఎస్‌బీయూ) పక్కాగా నిర్వహించింది.
- దీన్ని జెలెన్‌స్కీ ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. దాడి వెనక ఏడాదిన్నర ప్రణాళిక ఉన్నట్టు వెల్లడించారు. ''రష్యా గడ్డ నుంచే ఎంతోమంది ఇందుకు తోడ్పడ్డారు. వారందరినీ దాడులకు ముందే సురక్షితంగా తరలించాం. మావైపు ప్రాణనష్టం లేకుండా రష్యాను చావుదెబ్బ తీశాం'' అన్నారు. రష్యాపై మరిన్ని దాడులు తప్పవన్నారు.
- డ్రోన్ దాడుల అనంతరం రష్యా ప్రతీకార దాడుల్లో 12 మంది ఉక్రెయిన్ సైనికుల మృతికి బాధ్యత వహిస్తూ ఉక్రెయిన్ పదాతి దళాధిపతి మేజర్ జనరల్ మైకేలియో ద్రాపత్యు రాజీనామా చేశారు.

ఎక్కడెక్కడ దాడులు...

- ఒలెన్యా (ముర్మాన్‌స్క్), బెలయా (ఇర్కుట్స్క్–సైబీరియా), ద్యాగిలెవొ (సెంట్రల్ ర్యాజాన్), ఇవనొవొ
- వీటిలో ఒలెన్యా, బెలయా స్థావరాల మధ్య దూరం ఏకంగా 6,000 కి.మీ.! ఇవి పరస్పరం మూడు టైమ్ జోన్ల దూరంలో ఉండటం విశేషం.
- ఉక్రెయిన్ సరిహద్దుల నుంచి బెలయా ఏకంగా 4,000 కి.మీ. దూరంలో ఉంటుంది!
- అమూర్, ఇవనోవో, ర్యాజన్ తదితర ప్రాంతాల్లోనూ డ్రోన్ దాడుల యత్నాలు జరిగాయని రష్యా ధ్రువీకరించింది.



ట్రక్కుల్లో తరలించి...

సింపుల్ ప్లానింగ్. పూర్తి గోప్యత. పక్కా రిహార్సల్స్. ఆకస్మిక దాడి. అమలులో మెరుపువేగం. 100 శాతం లక్ష్యసాధన. సర్జికల్ స్ట్రైక్స్ వంటి స్పెషల్ ఆపరేషన్స్ ఏ మేరకు సఫలమైందీ తేల్చేందుకు ప్రఖ్యాత సైనిక నిపుణుడు అడ్మిరల్ విలియనం మెక్‌రావెన్ సిద్ధాంతీకరించిన గీటురాళ్లు. వాటన్నింటినీ పూర్తి స్థాయిలో మేళవించిన ఆపరేషన్‌గా స్పైడర్స్ వెబ్ నిలిచింది.

- మొత్తం ఆపరేషన్‌లో ఉక్రెయిన్ చాలావరకు పౌర మౌలిక సదుపాయాలనే వాడుకుంది.
- ఇంతటి భారీ స్థాయి దాడులకు ప్రణాళిక రచించిన ఉక్రెయిన్, అందుకు సిద్ధం చేసిన డ్రోన్లను రష్యాలోకి తెలిగ్గా దొంగచాటుగా తరలించడం విశేషం.
- అనంతరం వాటిని ట్రక్కుల్లో చెక్క కంటైనర్లలో పెట్టి ఎయిర్‌బేస్‌లకేసి తరలించారు.
- ఒక్కో కంటైనర్‌లో 36 డ్రోన్లను ఉంచారు. వాటిని ప్రత్యేకంగా డిజైన్ చేశారు.
- దాడుల్లో ఎక్కడా ప్రత్యక్షంగా సిబ్బందిని నియోగించే అవసరమే లేకుండా పకడ్బందీగా ముందస్తు ఏర్పాట్లు చేశారు.
- ట్రక్కులను వైమానిక స్థావరాలకు అతి సమీపంలోకి తీసుకెళ్లారు.
- అక్కడినుంచి నిర్ధారిత సమయంలో కంటైనర్ల పైకప్పును రిమోట్ ద్వారా తెరిచారు.
- ఆ వెంటనే వాటిలోంచి డ్రోన్లు పైకెగిరి లక్ష్యాలపైకి దూసుకెళ్లాయి. సరిగ్గా విమానాలపై పడి పేలిపోయాయి.

కంటైనర్ల నుంచి డ్రోన్లు పైకి ఎగురుతున్న దృశ్యాలతో కూడిన వీడియోలను రష్యా మీడియా విడుదల చేసింది. వాటిని అడ్డుకునేందుకు కొందరు సాయుధులు ట్రక్కులపైకి ఎక్కుతున్న దృశ్యాలు కూడా కొన్నింట్లో కనిపిస్తున్నాయి.

గతంలోనూ...

మూడేళ్ల పై చిలుకు యుద్ధంలో అనూహ్య, ఆకస్మిక దాడులతో రష్యాకు ఉక్రెయిన్ తీవ్ర నష్టం కలిగించడం ఇది తొలిసారేమీ కాదు.

- 2022 ఏప్రిల్లో రష్యా యుద్ధనౌక మోస్క్‌వాను నెప్ట్యూన్ యాంటీ షిప్ మిసైళ్లతో ఉక్రెయిన్ నల్లసముద్రంలో ముంచేసింది.
- 2022 అక్టోబర్‌లో ఆక్రమిత క్రిమియాను రష్యా భూభాగానికి కలిపే కీలక కెర్చ్ బ్రిడ్జిని బాంబులతో పేల్చేసింది.
- 2024 ఆగస్టులో ఉక్రెయిన్ సైన్యం తొలిసారిగా సరిహద్దులు దాటి రష్యా భూభాగంపై మెరుపు దాడులకు దిగి కుర్క్స్ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకుంది. తీరని అవమానం మిగిల్చింది!


డ్రోన్ కంటైనర్లతో కూడిన ట్రక్కు

రష్యాకు నష్టం ఇలా...

- 41 టీయూ–95, టీయూ–22ఎం3 దీర్ఘ శ్రేణి బాంబర్లు, దాడుల్లో వాటికి ఆద్యంతం దన్నుగా నిలిచే ఏ–50 నిఘా విమానాలపై డ్రోన్ దాడులు జరిగాయి.
- వాటిలో 14 పూర్తిగా, మిగతా 27 చాలావరకు ధ్వంసమైనట్టు చెబుతున్నారు.
- మూడున్నరేళ్లుగా ఉక్రెయిన్‌పై క్షిపణి, బాంబు దాడులకు రష్యా ప్రధానంగా ఉపయోగిస్తున్నది ఈ విమానాలనే!
- ఈ నష్టం విలువ కనీసం రూ.60 వేల కోట్ల (700 కోట్ల డాలర్ల)పై చిలుకేనని రష్యా రక్షణ శాఖే అంచనా వేసింది.



పోలండ్ అధ్యక్షుడిగా కరోల్ ఎన్నిక

వార్సా: పోలండ్ అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో కన్జర్వేటివ్ లా అండ్ జస్టిస్ పార్టీకి చెందిన కరోల్ నవ్‌రొకి(42) ఎన్నికయ్యారు. అత్యంత ఉత్కంఠగా సాగిన పోరులో నౌరొకికి 50.89% శాతం ఓట్లు రాగా, ప్రత్యర్థి, వార్సా మేయర్ రఫాల్ ట్రస్ కోవ్‌స్కీకి 49.11% ఓట్లు పోలయ్యాయి. రెండు వారాల క్రితం జరిగిన మొదటి రౌండ్ ఓటింగ్ సమయంలో ఈయూ, నాటో అనుకూల పార్టీల మధ్య నెలకొన్న తీవ్ర విభేదాలు తేటతెల్ల మయ్యాయి. ఆదివారం సాయంత్రం ప్రకటించిన ఎగ్జిట్ పోల్ ఫలితాల్లో రఫాల్ ట్రస్‌కోవ్‌స్కీ ముందంజలో ఉన్నారు. కేవలం రెండు గంటల్లోనే ఫలితం తారుమారవడం గమనార్హం. ఓటమిని అంగీకరించిన ట్రస్‌కోవ్‌స్కీ సోమవారం నవ్‌రొకికి అభినందనలు తెలిపారు. మాజీ బాక్సర్, చరిత్రకారుడు, అయిన నవ్‌రొకికి ఎటువంటి రాజకీయ అనుభవం లేదు. నవ్‌రొకికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మద్దతు ప్రకటించడం విశేషం. ఆయనకే గెలుపు అవకాశాలున్నాయని కూడా వ్యాఖ్యానించారు. నవ్‌రొకి ఎన్నికల కార్యక్రమాల్లో అమెరికా జెండాలు సైతం కనిపించడం గమనార్హం. వైట్‌హౌస్‌కు రావా లంటూ నెల క్రితమే నవ్‌రొకిని ట్రంప్ ఆహ్వానించారు.

తుర్కియేలో ముగిసిన రష్యా-ఉక్రెయిన్ చర్చలు

ఇస్తాంబుల్: తుర్కియే వేదికగా రష్యా–ఉక్రెయిన్ ప్రతినిధుల మధ్య జరిగిన రెండో విడత చర్చలు పట్టుమని కనీసం గంట సేపు కూడా కొనసాగలేదు. సోమవారం ఇస్తాంబుల్‌లో మొదలైన ఈ చర్చలు గంటలోపే ముగిసినట్లు ఇరుదేశాలు ప్రకటించాయి. లిథువేనియా రాజధాని విల్నియస్‌లో ఉన్న ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఈ విషయం ధ్రువీకరించారు. ఇరు వర్గాలు తుర్కియే మధ్యవర్తి ద్వారా పత్రాలను మార్చుకున్నాయన్నారు. దీని ప్రకారం యుద్ధ ఖైదీల మార్పిడి మరో దఫా చేపట్టే అవకాశముందన్నారు. యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన 6 వేల మంది సైనికుల మృతదేహాలను పరస్పరం అప్పగించుకోవాలని కూడా నిర్ణయించుకున్నట్లు వివరించారు. యుద్ధం సమయంలో తమ దేశం నుంచి బలవంతంగా తరలించుకుపోయిన చిన్నారుల జాబితాను కూడా రష్యా అధికారులకు అందజేశామన్నారు.

వరద ప్రభావిత ఈశాన్యానికి నిధులివ్వాలి: ఖర్గే

న్యూఢిల్లీ: ఈశాన్య రాష్ట్రాల్లో వరద పరిస్థితుల నేపథ్యంలో కేంద్రంపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. పీఎం కేర్స్ పేరుతో ఎలాంటి ఆడిట్ లేకుండా భారీ మొత్తంలో ఉంచిన నిధుల గేట్లను తెరిచి ఇకనైనా ఈశాన్య రాష్ట్రాలకు సాయంగా ఇవ్వాలని కోరారు. 'అస్సాంకు వరద బెడద లేకుండా చేస్తామని 2016లో ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. 2022లో అమిత్ షా ఇదే హామీని పునరుద్ఘాటించారు. బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం మాత్రం రాష్ట్రాన్ని నిర్లక్ష్యం చేసినట్లుగా కనిపిస్తోంది' అని ఖర్గే అన్నారు.



కెనడాలో జీ7 శిఖరాగ్రానికి మోదీ డుమ్మా!?

న్యూఢిల్లీ: కెనడాలో ఈ నెల 15 నుంచి మొదలయ్యే జీ7 శిఖరాగ్ర సమావేశానికి ప్రధాని మోదీ వెళ్లకపోవచ్చని తెలుస్తోంది. ఆరేళ్లుగా జీ7 సమావేశాలకు క్రమం తప్పకుండా హాజరవుతున్న ప్రధాని మోదీ మొదటిసారిగా డుమ్మా కొట్టే అవకాశాలున్నాయని విశ్వసనీయ వర్గాల సమాచారం. జూన్ 15–17 తేదీల మధ్య అల్బర్టాలో ఈ భేటీ జరగనుంది. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా సంక్షోభం వంటి కీలకమైన అంతర్జాతీయ సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లపై కూటమిలోని ప్రముఖ పారిశ్రామిక దేశాల నేతలు చర్చించనున్నారు. శిఖరాగ్రానికి రావాలంటూ ప్రధాని మోదీకి కెనడా ఇప్పటి వరకు ఆహ్వాన సైతం పంపలేదు. ఇప్పటికిప్పుడు ఆహ్వానం వచ్చినా ఇరుదేశాల మధ్య నెలకొన్న సంబంధాలు, వేగంగా మారుతున్న అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో సన్నద్ధతకు సమయం పడుతుందని చెబుతున్నారు. జీ7 కూటమిలో అమెరికా, యూకే, ఇటలీ, జర్మనీ, కెనడా, జపాన్ సభ్యదేశాలు కాగా, ప్రస్తుతం కెనడా అధ్యక్షత బాధ్యతల్లో ఉంది.

కొండచరియలు విరిగిపడి ముగ్గురు జవాన్ల మృతి

గాంగ్‌టక్: ఈశాన్య రాష్ట్రం సిక్కింలో వరద బీభత్సం కొనసాగుతోంది. మిలటరీ క్యాంప్‌పై కొండచరియలు విరిగి పడిన ఘటనలో ముగ్గురు జవాన్లు మృత్యువాతపడగా ఆరుగురు గల్లంతయ్యారు. మంగన్ జిల్లా ఛాటెన్‌లో ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో ఘటన చోటుచేసుకుంది. ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగి పడుతున్నట్లు ఆర్మీ ప్రతినిధి తెలిపారు. మృతులను హవల్దార్ లఖ్విందర్ సింగ్, లాన్స్ నాయక్ మునీశ్ ఠాకూర్, పోర్టర్ అభిషేక్ లఖాడాలుగా గుర్తించామన్నారు. మృతదేహాలను వెలికి తీసి, స్వల్పంగా గాయపడిన నలుగురు జవాన్లను కాపాడామన్నారు. అననుకూల వాతావరణంలో కూడా గల్లంతైన ఆరుగురి కోసం సహాయక బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయని వివరించారు. మరోవైపు, కొండచరియలు విరిగిపడి రహదారులు మూసుకుపోవడంతో లచుంగ్, చుంగ్‌తంగ్ పట్టణాల్లో చిక్కుకుపోయిన 737 మంది పురుషులు, 561 మంది మహిళలు, 380 మంది చిన్నారులు కలిపి మొత్తం 1,678 మంది పర్యాటకులను రక్షించినట్లు రాష్ట్ర డీజీపీ అక్షయ్ సచ్‌దేవా సోమవారం తెలిపారు. మంగన్ జిల్లా లచుంగ్‌లో తెగిపోయిన రహదారిని బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్(బీఆర్‌వో)పునరుద్ధరించడంతో పర్యాటకులను బయటకు తీసుకురావడం సాధ్యమైందని చెప్పారు. మొత్తం 284 వాహనాలు, 16 బైక్‌లపై పోలీసు భద్రత నడుమ గాంగ్‌టక్‌కు చేర్చామన్నారు. లచెన్‌లో చిక్కుకుపోయిన మరో 100 మంది పర్యాటకులను కాపాడేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు.


కిమ్ మూన్ సూ   లీ జే మ్యుంగ్

దక్షిణ కొరియాలో నేడే ఎన్నికలు

విపక్ష అభ్యర్థి మ్యుంగ్‌కే అధ్యక్ష పీఠం!

సియోల్: నెలల తరబడి కొనసాగిన రాజకీయ సంక్షోభం అనంతరం దక్షిణ కొరియాలో మంగళవారం అధ్యక్ష ఎన్నికలు జరుగుతున్నాయి. గత డిసెంబర్‌లో మార్షల్ విధించి పరువుతో పాటు అంతిమంగా పదవి కూడా కోల్పోయిన యూన్ సుక్ యెల్ స్థానంలో 4.4 కోట్ల మంది ఓటర్లు నూతన అధ్యక్షున్ని ఎన్నుకోనున్నారు. ఆరుగురు అభ్యర్థులు బరిలో ఉన్నా ప్రధాన పోటీ అధికార పీపుల్ పవర్ పార్టీ అభ్యర్థి కిమ్ మూన్ సూ, విపక్ష డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ కొరియా పార్టీకి చెందిన లీ జే మ్యుంగ్ మధ్యే నెలకొంది. వారు తొలుత నువ్వా నేనా అన్నట్టుగా తలపడ్డా, మ్యుంగ్ క్రమంగా పై చేయి సాధించారు. దీనికి తోడు తాజా మాజీ అధ్యక్షుని ఏకపక్ష పోకడలను విమర్శించేందుకు సూ నిరాకరించడంతో ఆయన గ్రాఫ్ బాగా పడిపోయింది. ఈ నేపథ్యంలో 61 ఏళ్ల మ్యుంగ్ భారీ మెజారిటీతో నెగ్గడం ఖాయమని పరిశీలకులు అంటున్నారు. సాయంత్రానికల్లా ఎన్నికల ఫలితాలు వెలువడి నూతన అధ్యక్షుడు బుధవారమే బాధ్యతలు చేపడతారు.

అక్కడ ఏడాదికి 25,000 రోజులు

వాషింగ్టన్: భూమి సూర్యుని చుట్టూ ఒకసారి తిరిగిరావడానికి 365 రోజులు పడుతుందని తెల్సిందే. అదే మాదిరి ఒక చిన్నపాటి మరుగుజ్జు గ్రహం లాంటి ఖగోళ వస్తువు మన సూర్యుని చుట్టూ అత్యంత నెమ్మదిగా తిరుగుతోంది. ఎంతగా అంటే ఒక చుట్టు చుట్టేయడానికి ఏకంగా 25,000 రోజుల సమయం తీసుకుంటోంది. సౌరమండలంలో కొత్తగా కనిపెట్టిన ఈ మరుగుజ్జు గ్రహానికి 2017 ఓఎఫ్201 అని పేరుపెట్టారు. అయితే దీనిని గ్రహం హోదా ఇవ్వాలా వద్దా అనే చర్చ జరుగుతోంది. ఎందుకంటే దీనిని పూర్తిస్థాయిలో గ్రహ లక్షణాలు లేవని తేలింది. నెప్ట్యూన్ గ్రహం ఎంత దూరంలో అయితే సూర్యుడి చుట్టూ తిరుగుతోందో అంతకంటే కాస్తంత ఎక్కువ దూరంలో ఈ అంతరిక్ష పదార్థం మన సూర్యుని చుట్టూ తిరుగుతోంది. ఇది చాలా నెమ్మదిగా పరిభ్రమిస్తోంది. ఒకసారి సూర్యుడిని చుట్టిరావడానికి 25,000 రోజుల సమయం తీసుకుంటోంది. దీని వెడల్పు ఏకంగా 700 కిలోమీటర్లు. '' కోట్ల సంవత్సరాలుగా ఒకే కక్ష్యలో పరిభ్రమిస్తోంది. ఆ లెక్కన చూస్తే బుల్లి గ్రహం హోదా పొందే అర్హత కాస్తంత దీనికి ఉంది'' అని అమెరికాలోని న్యూజెర్సీ కేంద్రంగా పనిచేసే ప్రిన్స్‌టన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ అడ్వాన్స్‌డ్ స్టడీలో ఖగోళ భౌతిక శాస్త్రవేత్త సిహావో చెంగ్ అన్నారు. మరుగుజ్జు గ్రహాల హోదా పొందిన ఐదింటికి కంటే ఈ కొత్త ఖగోళ వస్తువు కాస్తంత చిన్నగా ఉంది. గతంలో గ్రహంగా చెలామణి అయిన ఇటీవల మరుగుజ్జు గ్రహంగా స్థిరపడిపోయిన ప్లూటో వ్యాసం 2,377 కిలోమీటర్లుకాగా ఈ 2017 ఓఎఫ్201 వ్యాసం కేవలం 700 కిలోమీటర్లే!

ఎండలు ముందే ముగిశాయెందుకు?

- గత ఏడాది మే, జూన్ నెలల్లో భగభగలు.. ఈసారేమో చల్లదనం
- దేశవ్యాప్తంగా చాలాచోట్ల వర్షాలు
- వాతావరణ మార్పులే కారణం

మే నెల భానుడి ప్రచండ వేడికి పెట్టింది పేరు. రోహిణి కార్తెలో రోకళ్లు పగులుతాయని పెద్దల మాట. సూర్యప్రకోపానికి జనం విలవిల్లాడిపోయే కాలంగా ఎండాకాలం దశాబ్దాలుగా పేరు తెచ్చుకుంది. కానీ ఈసారి మే నెలలో దాదాపు వేడి మాయమై చల్లదనమే రాజ్యమేలింది. దేశవ్యాప్తంగా చాలా చోట్ల వర్షాలు పడ్డాయి. పైగా ముందస్తుగానే ఎండాకాలం జనాలకు బైబై చెప్పి వెళ్లిపోయింది. 2024లో మే, జూన్ నెలల్లో ఎండలు విపరీతంగా ఉండటంతో 2025లో ఆదిత్యుడు ఇంకెంత రెచ్చిపోతాడోనన్న భయాలను పటాపంచలు చేస్తూ ఈసారి మే నెలలో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిలోనే నమోదవడం విశేషం. తక్కువ ఎండలకు తోడు తక్కువ రోజులే ఎండాకాలం కొనసాగడం గమనార్హం. వేడిమి, ఉక్కబోతతో విసుగుతెప్పించే వేసవికాలం వేగంగా గడిచిపోయింది. 2024 సంవత్సరం భూమి మీద అత్యంత ఉష్ణమయ ఏడాదిగా చరిత్రలో నిలిచిపోయింది. ఇక భారత్‌లో గత ఏడాది మేలో దేశవ్యాప్తంగా వడగాలులు చండ ప్రచండంగా వ్యాపించి జనాన్ని బెంబేలెత్తించాయి. ఇందుకు పూర్తి భిన్నంగా 2025 మేనెల సాగిపోవడం సాధారణ ప్రజానీకాన్ని ఆశ్చర్యంలో, ఒకింత ఆలోచనలో పడేసింది. ఈసారి దేశ వాతావరణ ముఖచిత్రంలో మార్పులొచ్చాయని కొందరు విశ్లేషణలు మొదలెట్టారు.

2024 మే, జూన్‌లో..

గత ఏడాది మే, జూన్ నెలల్లో దేశవ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదుకావడంతోపాటు వడగాల్పుల ఘటనలు చాలా చోట్ల సంభవించాయి. దీంతో చాలా ప్రాంతాల్లో కరువు తాండవించింది. దీంతో జలాశయాల్లో నీటి నిల్వలు అడుగంటాయి. నీటి లభ్యత బాగా తగ్గిపోయింది. భూగర్భజలాలు మరింత కిందకు వెళ్లిపోయాయి. విద్యుత్ కొరత సమస్య సైతం అధికమైంది. వాతావరణ మార్పులతో ముడిపడిన ఈ అధిక ఉష్ణోగ్రతల విపరిణామాలు వెనువెంటనే వ్యవసాయం, ఆరోగ్యంతోపాటు కోట్లాది మంది మధ్యతరగతి ప్రజల జీవనంపైనా దుష్ప్రభావాలు చూపాయి. వడదెబ్బకు జనం పిట్టల్లా రాలిపోయారు. 2025 మేలో అధిక ఉష్ణోగ్రతలు నమోదుకాకుండా అకాలవర్షాలు అడ్డుకున్నాయి. దేశవ్యాప్తంగా మెజారిటీ రాష్ట్రాల్లో వర్షాలు పడ్డాయి. పలు చోట్ల కుండపోత వర్షాలు కురిశాయి. వాతావరణ చక్రంలో మార్పుల కారణంగానే మేలో వేడిమి మటుమాయమై చల్లదనం వచ్చి చేరిందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. చల్లదనం అత్యధిక రోజులు కొనసాగడంతో అది అంతిమంగా ఎండకాలం ముగింపునకు ముందస్తు నాంది పలికిందని నిపుణులు విశ్లేషించారు.

మరెన్నో కారణాలు..

వర్షాకాలం ఈసారి ముందస్తుగా ముంచుకురావడం సైతం ఎండకాలం తీవ్రతను తగ్గించేసింది. వాతావరణంలో ముందస్తుగా తేమ శాతం పెరగడం, చల్లని గాలుల క్రమానుగతిలో మార్పులు సైతం ఉష్ణోగ్రత అధికం కాకుండా అడ్డుకున్నాయి. దీంతో వేసవికాలంలో వేడి తగ్గిపోయింది. గతంతో పోలిస్తే ఈసారి ఎండాకాలంలో వాతావరణం చాలావరకు మేఘావృతమైంది. దాంతోపాటు దేశంలో మేనెలలో ప్రతిరోజూ ఏదోఒక చోట వర్షాలు పడుతూ సగటు ఉష్ణోగ్రత పెరగకుండా నిలువరించాయి. ఈ చల్లదన పరిస్థితులు పరోక్షంగా ప్రభుత్వాల మీదా పెనుభారాన్ని ఒక్కసారిగా దించేశాయి. విద్యుత్ డిమాండ్ పెరగకుండా అడ్డుకున్నాయి.

ముందుకొచ్చిన కొత్త ధోరణి

ఉడికించే ఉష్ణోగ్రతలు ఉన్నపళంగా తగ్గిపోవడం కొన్ని రకాల పంటల దిగుబడిపైనా ప్రభావం చూపుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. చక్కటి వేడి పరిస్థితుల్లోనే కొన్నిరకాల పంటలు ఏపుగా పెరిగే పరిస్థితులు ఉంటాయని, ఈసారి ఎండలు ఇలా వచ్చి అలా వెళ్లిపోవడంతో ఆయా పంటల సాగుఫలంపై ప్రతికూల ప్రభావం పడొచ్చని వ్యవసాయరంగ నిపుణులు చెబుతున్నారు. ఈసారి మారిన ఈ పరిస్థితులకు తగ్గట్టు కర్షకులు తమ పంటల విత్తునాటడం మొదలు ఎరువులు, పురుగుమందులు చల్లడం దాకా ప్రతిదాంట్లో కాస్తంత సమయపాలన పాటించడం తప్పనిసరి అయిందని వాళ్లు చెబుతున్నారు. హఠాత్తుగా ఎండాకాలం వ్యవధి తగ్గి వర్షాలు మొదలవడంపై వాతావరణ విభాగం సైతం వాతావరణ ముందస్తు అంచనాల వ్యూహాలకు పదునుపెట్టింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
మంగళవారం : 3 : జూన్ : 2025


ఇటీవల ముస్లిం యువకుని హత్యను ఖండిస్తూ మంగళూరులో ముస్లింల నిరసన


జిల్లాలో గోవధ, అక్రమ రవాణా అధికమైందని ఆరోపిస్తూ కలబుర్గిలో హిందూ సంఘాల ధర్నా

న్యూస్‌రీల్

బెళగావి నీళ్లు ధార్వాడకా?

- కన్నడ సంఘాల ధర్నా


నిరసనకారులను అడ్డుకుంటున్న పోలీసులు

దొడ్డబళ్లాపురం: జిల్లాలోని హిడకల్ డ్యాం నుంచి హుబ్లీ–ధార్వాడలోని పరిశ్రమలకు నీటి విడుదలను ఆపకపోతే బెళగావి బంద్ తప్పదని కర్ణాటక రక్షణ వేదిక నేతలు, కార్యకర్తలు హెచ్చరించారు. సోమవారంనాడు బెళగావిలోని రాణి చెన్నమ్మ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకూ ఖాళీ బిందెలతో ర్యాలీ చేసి, కలెక్టరేట్‌ను ముట్టడించి ధర్నా చేపట్టారు. వారంలోపు నీటి విడుదల ఆపకపోతే తామే ముందుండి నీటి విడుదల అడ్డుకుంటామని, బెళగావి జిల్లా బంద్ చేస్తామని చెప్పారు. జిల్లాలోని హిడకల్ డ్యాం నుంచి ప్రజలకు, రైతులకు నీటిని ఇవ్వాలని కోరారు. పరిశ్రమలకు ఇస్తే రైతుల పంటలు ఎండిపోతాయన్నారు. కలెక్టర్ కార్యాలయానికి తాళం వేయడానికి ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. పలువురిని అరెస్టు చేసి తరలించారు.

మెడికో ఆత్మహత్య


విష్ణుప్రియ (ఫైల్)

శివమొగ్గ: శివమొగ్గలో ఉన్న సుబ్బయ్య మెడికల్ కళాశాలలో హాస్టల్లో ఓ మెడికో ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు విష్ణుప్రియ (22). వివరాలు.. ఈమె కుటుంబం బెంగళూరుకు చెందినది కాగా, జర్మనీలోని బెర్లిన్‌లో నివసిస్తోంది. విష్ణుప్రియ ఇటీవలే ఎంబీబీఎస్ పూర్తిచేసి ఇంటర్న్‌షిప్ చేస్తోంది. మరికొన్ని రోజుల్లో పూర్తయి డాక్టర్ కానుంది. అయితే ఏమి జరిగిందో మరి.. హాస్టల్ గదిలో ఉరి వేసుకొని ప్రాణాలు తీసుకుంది. కారణాలు తెలిసి రాలేదు. డెత్‌నోట్ ఏదీ దొరకలేదు. శివమొగ్గ గ్రామీణ పోలీసులు ఆమె శవాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మిమ్స్‌లో బాలిక మృతిపై విచారణ


ఆదివారం ఆస్పత్రిలో ధర్నా చేస్తున్న మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు

మండ్య: బాలిక సాన్వి మరణానికి మిమ్స్ వైద్యుల నిర్లక్ష్యం కారణమని ఆరోపణలు రావడంతో విచారణ కోసం బృందాన్ని ఏర్పాటు చేశాం, 15 రోజుల్లోగా నివేదిక ఇస్తారని ఎమ్మెల్యే పి.రవికుమార్ చెప్పారు. సోమవారం మండ్య నగరంలో ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. ఇంట్లో టైల్స్ పడడం వల్ల బాలిక కాలు విరిగింది, నాలుగు రోజుల్లో ఎలా చనిపోతుందని అన్నారు. గాయానికి ఇన్‌ఫెక్షన్ వచ్చిందని వైద్యులు తెలిపారన్నారు. మిమ్స్‌లోని పలు విభాగాల సర్జన్లతో కమిటీని రచించినట్లు తెలిపారు. జిల్లాధికారి కార్యాలయంలో మిమ్స్ వైద్య నిపుణులతో కలెక్టర్ చర్చించారు. బాలికను వైద్యం కోసం చేర్పించగా మరణించడం, మృతదేహంతో తల్లిదండ్రులు ఆందోళన చేయడం తెలిసిందే. సకాలంలో వైద్యం చేయక పోవడం వల్లే తమ బిడ్డ దూరమైందని తల్లిదండ్రులు ఆరోపించారు.

అరెస్టు చేయాలని ధర్నా



బనశంకరి: బెళగావి తాలూకా సంతిబస్తవాడ మసీదులో ఖురాన్, హదీస్‌లను కాల్చివేసిన ఘటనలో దుండగులను అరెస్టు చేయాలని ముస్లింలు సోమవారం ఆ జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా చేశారు. పోలీసులు కేసు దర్యాప్తును ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. ఘటన జరిగి 20 రోజులు గడిచినప్పటికీ దుండగులను అరెస్ట్ చేయకపోవడం అనుమానాలకు కారణమౌతోందని, గ్రామంలో అశాంతి సృష్టించడానికి దుండగులు కుట్రపన్నారని ఆరోపించారు. ఇటీవల సంతిబస్తవాడలో మరో వర్గంవారు తమతో వ్యాపారాలను బహిష్కరించారని, మత సామరస్యం దెబ్బతీస్తున్నారని చెప్పారు. చర్యలు తీసుకోకపోతే పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని తెలిపారు.


వానల చాటున వ్యాధుల దాడి




వారం కిందట బెంగళూరులో వరద ముంపు ఇలా ఉండేది

- నీటి కాలుష్యం, దోమల బాధ
- డెంగీ, మలేరియా, గున్యా బెడద
- మంచి అలవాట్లతోనే రక్షణ

బనశంకరి: ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు. కానీ బెంగళూరు నగరంలో కుండపోత వర్షాల వల్ల అనేక చోట్ల ముంపు సమస్య ఏర్పడి అంటురోగాలు ప్రబలుతాయనే భయం నెలకొంది. ఇప్పటికే కరోనా తో పాటు డెంగీ కేసులు హెచ్చుమీరాయి. మలేరియా, చికెన్‌గున్యా కేసులు నమోదు కావడంతో పాటు సాధారణ జ్వరం, వైరల్ ఫీవర్, జలుబు, తలనొప్పి కేసులు పెరుగుతున్నాయి. వర్షాల వల్ల ఇళ్ల చుట్టూ, లోతట్టు ప్రదేశాలలో రోజుల తరబడి వర్షపు నీరు నిలబడటంతో దోమలు ఉత్పత్తి ఎక్కువైంది. దీంతో డెంగీ, చికెన్‌గున్యా, మలేరియా జబ్బుల బెడద వెంటాడుతోంది. భారీ వర్షాలతో ఇళ్లలోకి చొరబడిన డ్రైనేజీ నీరు, కొళాయిల్లో కలుషిత నీటి సరఫరా, అధ్వాన్నంగా మారిన భూగర్భ డ్రైనేజీ తదితర కారణాలు వ్యాధులకు ఆలవాలమవుతున్నాయి. వాంతులు, కడుపునొప్పి, హైపటైటిస్–ఏ, విరేచనాలు, కలరా జబ్బుల భయం నెలకొంది.


కొళాయి నీటిలో హాని కారకాలు

రాష్ట్రంలో అతిసారం కేసులు

వానల వల్ల రాష్ట్రంలో ఇప్పటికే 67,187 అతిసార కేసులు నమోదయ్యాయి. డెంగీ జ్వరాల కేసులు ఉధృతం అవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 26 వేల మంది రక్తపరీక్షలు చేశారు. బెంగళూరు పాలికె పరిధిలో 500 మందికి పైగా డెంగీ జ్వరానికి గురయ్యారు. రాష్ట్రంలో 1,300 మందికి పైగా డెంగీ సోకింది. 300 మందికి పైగా చికెన్‌గున్యా, 65 మందికి పైగా మలేరియా బారినపడ్డారు. దోమల వల్ల ప్రబలే రోగాలు కావడంతో ప్రజలు ఇళ్లలో, ఇంటి చుట్టుపక్కల స్వచ్ఛతకు ప్రాధాన్యత ఇవ్వాలి. దోమలను నాశనం చేసే చర్యలు చేపట్టినట్లు ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు.


ఆదమరిస్తే అనారోగ్యం తప్పదు

కొత్తగా లెప్టోస్పిరోసిస్ జబ్బు

లెప్టోస్పిరోసిస్ అనే కొత్తరకం జబ్బు వ్యాపిస్తోంది. ఇది కలుషితాల నుంచి వెలువడే పరాన్నజీవి. రాష్ట్రంలో ఇప్పటివరకు 392 కేసులు నమోదయ్యాయి. ఇది కలుషితనీరు, మట్టిలో పెరుగుతుంది. ఎలుకలు వంటి చిన్నపాటి ప్రాణుల కళేబరాల నుంచి బయటికి వచ్చే బ్యాక్టీరియా ఇది. నీటిలో ప్రాణుల కళేబరాలు, మూత్రం చేరితే వ్యాపిస్తుంది. ఆ నీటిని వాడితే శరీరంలోకి వెళ్లి ఇన్ఫెక్షన్‌ను కలిగిస్తుంది. ఇది మూత్రపిండాలు, గుండె కు హాని కలిగించడంతో మరణానికి దారితీస్తుంది. జ్వరం, తలనొప్పి, ఒంటి నొప్పులు, వాంతులు దీని లక్షణాలు.

ఆరోగ్యంపై శ్రద్ధ తప్పదు

వర్షాలతో గత కొన్నిరోజులుగా డెంగీ కేసులు ప్రబలుతున్నాయి. బెంగళూరులో వర్షం నీటితో రోగాలు పెరిగే అవకాశాలు ఉన్నాయి, ప్రజలు ఆరోగ్యం పట్ల అధిక శ్రద్ధ వహించాలి అని కేసీ జనరల్ ఆసుపత్రి చిన్నపిల్లలు వైద్యుడు డాక్టర్ లక్ష్మీపతి తెలిపారు.

కనీస జాగ్రత్తలు ప్రధానం

- మరిగించి చల్లారిన నీటిని తాగాలి
- ఇంట్లో వండిన తాజా పౌష్టికాహారం తినాలి
- ఇంటినుంచి బయటికి వెళితే మాస్కు ధరించాలి
- తాజా పండ్లు, కూరగాయలను ఎక్కువగా తినాలి
- బయటి ఆహారం తినేటప్పుడు జాగ్రత్త గా ఉండాలి
- చేతులను శానిటైజర్‌తో శుభ్రం చేసుకుంటూ ఉండాలి
- ఇంటి లోపల బయట శుభ్రతను కాపాడుకోవాలి
- ఎలాంటి రోగ లక్షణాలు కనబడినా వైద్యులతో చికిత్స తీసుకోవాలి

నిర్మాణంలో ఉండగానే కూలింది

- కూలీ మృతి, నలుగురికి గాయాలు


శిథిలాల నుంచి కూలీల రక్షణ చర్యలు

మండ్య: నిర్మాణ దశలో ఉన్న మహాద్వారం కుప్పకూలిన ప్రమాదంలో ఒక కార్మికుడు మరణించగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటన మండ్య జిల్లాలోని నాగమంగళ తాలూకాలోని దేవరహళ్ళి గ్రామంలో జరిగింది. వివరాలు.. తపసీరాయ స్వామి దేవాలయం ముందు భాగంలో మహాద్వారాన్ని నిర్మిస్తున్నారు. సుమారు 20 అడుగుల ఎత్తు, 35 అడుగుల పొడవునా నిర్మాణమవుతోంది. పై భాగంలో కాంక్రీట్ వేయడం కోసం కడ్డీలతో చట్రం బిగించారు. సోమవారం మధ్యాహ్నం కాంక్రీటు వేస్తుండగా బరువు తట్టుకోలేక చట్రం కుప్పకూలి కార్మికుల మీద పడింది. ఐదుమంది కార్మికులు చిక్కుకున్నారు. జేసీబీని తీసుకొని వచ్చి శిథిలాలను తొలగించి కూలీలను బయటకు తీశారు. ఆస్పత్రికి తరలిస్తున్నప్పుడు కల్బుర్గి జిల్లాకు చెందిన శరన్ (27) అనే కూలి చనిపోయాడు. మిగతావారికి ఆస్పత్రిలో చికిత్స జరుగుతోంది. నాగమంగళ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు. నాసిరకంగా సెంట్రింగ్‌ను వేయడమే కూలడానికి కారణమని అనుమానాలున్నాయి.

పెళ్లిలో రూ.25 లక్షల నగల చోరీ

దొడ్డబళ్లాపురం: కళ్యాణ మండపంలో వధువుకు చెందిన రూ.25 లక్షల విలువైన బంగారు నగలు చోరీకి గురైన సంఘటన బెంగళూరు రాజాజినగర పరిధిలో చోటుచేసుకుంది. గవిపురం నివాసి ఎల్.శివశంకర్ ఈమేరకు మాగడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శివశంకర్ కుమార్తె దివ్య వివాహం రాజాజినగర సప్తపది కళ్యాణ మండపంలో జరిగింది. మే 29న జరిగిన రిసెప్షన్‌కు అనేకమంది అతిథులు హాజరయ్యారు. పెళ్లికూతురికి చెందిన ఖరీదైన కానుకలు, రూ.25 లక్షల విలువైన నగలను సూట్‌కేస్, బ్యాగుల్లో భద్రపరిచి నిద్రపోయారు. మే 30న ఉదయం అందరూ లేచి గదికి తాళంవేసి ముహూర్తానికి వెళ్లారు. ఇంతలో ఎవరో దొంగలు నకిలీ తాళంచెవితో గది తాళం తీసి నగల బ్యాగులను అపహరించారు. చోరీ వల్ల పెళ్లిలో ఉత్సాహం బదులు విచారం తాండవించింది.

కొట్లాడుతూ ఉంటే హిందీని రుద్దుతారు

దొడ్డబళ్లాపురం: కన్నడ, తమిళం అంటూ మనం కొట్లాడుతూ సమయం వృథా చేస్తే కేంద్రం వచ్చి మనపై హిందీ భాషను రుద్దుతుందని మంత్రి కృష్ణ భైరేగౌడ అన్నారు. తాజా కన్నడ, తమిళ వివాదాన్ని ప్రస్తావించారు. సోమవారంనాడు కెంపేగౌడ విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడిన ఆయన అన్ని భాషలూ సమానమే అన్నారు. అయితే బలవంతంగా మనపై హిందీ రుద్దాలని చూస్తున్నారని ఇదే అసలు సమస్య అన్నారు. స్వయంప్రేరితంగా హిందీ నేర్చుకొంటే తప్పులేదని, నేర్చుకో అని ఒత్తిడి చేయడం సబబు కాదన్నారు.

చెప్పతో కొట్టి.. కాళ్ల బేరానికి


చెప్పతో యువతి, క్షమాపణల పర్వం

- ఆటోడ్రైవర్‌కు బిహారీ మహిళ క్షమాపణలు

శివాజీనగర: ఆవేశంలో కన్నుమిన్ను కానక ఆటోడ్రైవర్‌ను హిందీ మహిళ చెప్పుతో కొట్టింది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా అరెస్టు చేశారు. జైలు జీవితం తప్పదని గ్రహించిన ఆమె కాళ్ల బేరానికి వచ్చింది. బిహార్‌కు చెందిన వివాహిత పంఖూరి మిశ్రా, ఆమె భర్త ఆటోడ్రైవర్ కాళ్లపై పడి క్షమాపణ చెప్పారు.

క్షమించండి ప్లీజ్

రోడ్డుపై తమ స్కూటర్‌కు తగిలాడని ఆటోడ్రైవర్ లోకేశ్‌ను పంఖూరి మిశ్రా చెప్పుతో బాదింది. వీడియో తీస్తావా.. తీయ్ అని కూడా బూతులు తిట్టింది. ఈ వీడియో వైరల్ కాగా మిశ్రా అకృత్యంపై జనం మండిపడ్డారు. ఆటోడ్రైవర్ ఫిర్యాదు మేరకు ఆమె మీద బెళ్లందూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం ఆ జంటను పిలిపించి విచారణ జరిపారు. నేను గర్భవతిని, ఆస్పత్రికి వెళ్తుండగా ఆటో తగిలింది, కోపంతో దాడి చేశాను, ఆటోడ్రైవర్ నాపై దాడికి ప్రయత్నించాడు అని తెలిపింది. పోలీసులు ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేసుకొని బెయిలు ఇచ్చి పంపారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న ఆటోడ్రైవర్‌కు క్షమాపణలు చెప్పారు. కన్నడిగులు తమను క్షమించాలని, బెంగళూరును, ఇక్కడి సంస్కృతిని ప్రేమిస్తున్నామని, కావాలని చేయలేదని పంఖూరి వివరణ ఇచ్చింది.


స్వతంత్ర పార్కులో ఆటోడ్రైవర్ల ఆందోళన

ఆటోడ్రైవర్ల ధర్నా

మరోవైపు చెప్పుల దాడిని ఖండిస్తూ బెంగళూరులో ఆటోడ్రైవర్ల సంఘం ధర్నా చేసింది. ఫ్రీడంపార్క్‌లో వందలాదిగా చేరి నినాదాలు చేశారు. ప్రభుత్వం తమకు భద్రత కల్పించాలని, దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని కోరారు.


బాను ముష్తాక్ గర్వకారణం: సీఎం

శివాజీనగర: సాహిత్యానికి సమాజాన్ని వృద్ధిచేసే శక్తి ఉందని, సాహిత్యం ద్వారా సమాజాన్ని ఐకమత్యం చేయాలే గాని విభజించరాదని సీఎం సిద్ధరామయ్య అన్నారు. సోమవారం విధానసౌధలో బుకర్ పురస్కార గ్రహీత, కన్నడ రచయిత్రి బాను ముష్తాక్ అభినందన సభ జరిపారు. ఆమెను సీఎం సన్మానించి మాట్లాడారు. బాను ముష్తాక్ కన్నడ కీర్తిని పెంచారు. ఇది కన్నడ ప్రపంచానికే గర్వకారణమని ప్రశంసించారు. బాను ముష్తాక్‌ను, ఆమె రచనలను ఆంగ్లంలోకి అనువదించిన దీపా బస్తికి రూ.10 లక్షల చొప్పున నగదు పురస్కారం అందజేయనున్నట్లు ప్రకటించారు. పాత్రికేయురాలిగా, రచయితగా, న్యాయవాదిగా, ఉద్యమకారిణిగా సమాజంలో రాణించారని బాను ముష్తాక్‌ను కొనియాడారు. ముస్లిం సముదాయపు మహిళ మూఢ నమ్మకాలను వ్యతిరేకిస్తూ రాసే ప్రగతిపరమైన శ్రద్ధ ఆమెలో ఉందని అన్నారు.


కవయిత్రులను సన్మానిస్తున్న సీఎం

థగ్ లైఫ్ ఆడకూడదు


మైసూరులో నిరసన



థగ్ లైఫ్ భవితపై సందేహాలు

- కన్నడ సంఘాల హెచ్చరిక

శివాజీనగర/ మైసూరు: తమిళం నుంచి కన్నడ భాష పుట్టిందని వివాదాస్పదమైన వ్యాఖ్యలు చేసిన ప్రముఖ నటుడు కమల్ హాసన్‌పై వ్యతిరేకత అధికమవుతోంది. ఆయన నటించిన కొత్త సినిమా థగ్ లైఫ్ ను కర్ణాటకలో విడుదల చేయరాదని కన్నడ సంఘాలు హెచ్చరించాయి. ఒక్క థియేటర్‌లో సినిమా ఆడినా బెంగళూరును బంద్ చేస్తామని కర్ణాటక రక్షణా వేదిక నాయకులు తెలిపారు. ఈ సినిమా జూన్ 5న దేశమంతటా విడుదల అవుతోంది. కమల్ క్షమాపణ చెప్పకపోవడంతో కన్నడ సంఘాలు భగ్గుమంటున్నాయి. సినిమా ఆడిస్తే థియేటర్ లోపలికి చొరబడి ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. కన్నడ సంఘాలన్ని ఏకమై ఈ తీర్మానం చేసినట్లు నేతలు తెలిపారు.

కమల్‌ని అరెస్టు చేయాలి

కమల్ హాసన్‌ను వెంటనే అరెస్టు చేయాలని మైసూరులో కన్నడ చళువళి పోరాటదారుడు వాటాల్ నాగరాజు, సంఘాల నేతలు కమల్ చిత్రానికి నిప్పుపెట్టారు. కమల్‌కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వాటాల్ మాట్లాడుతూ కర్ణాటకలో కమల్ హాసన్ సినిమాలను పూర్తిగా బహిష్కరణ చేయాలని అన్నారు. కన్నడ ప్రజలు కమల్ సినిమాలను వ్యతిరేకించాలని చెప్పారు.

ఫొటోషూట్‌కు రూ.25 వేల జరిమానా

- జంటకు అటవీశాఖ వడ్డన



మైసూరు: ఇది ఫోటోషూట్ల కాలమైంది. పెళ్లికి ముందు, ఆ తరువాత, తల్లీ తండ్రి కాబోతుంటే మరోసారి ఇలా అనేక సందర్భాలలో ఫోటోషూట్లు ఉండాల్సిందే. కొన్నిసార్లు ఇవి వెర్రిగా మారుతుంటాయి కూడా. ఇదే మాదిరిగా మైసూరులోని చామరాజనగర జిల్లా గుండ్లుపేట తాలూకాలోని బండీపుర వన్యప్రాణుల అభయారణ్యంలోకి చొరబడి ఫోటోలు తీసుకున్న జంటకు అటవీశాఖ రూ. 25 వేల జరిమానా వడ్డించింది. బెంగళూరుకు చెందిన పల్లవి, ఘోష్ అనే వ్యక్తులు విహారానికి వచ్చారు. బండీపుర మంగళ రోడ్డు సమీపంలో అడవిలోకి వెళ్లి ఫోటో షూట్ చేస్తున్నారు. ఇక్కడ ఫోటోలు తీయడం నిషిద్ధం. అటవీ అధికారి నవీన్‌కుమార్‌కు పర్యాటకులకు సమాచారం అందించారు. వెంటనే ఆ జంటను పట్టుకుని హెచ్చరిక లేఖ ఇచ్చి రూ. 25 వేలు జరిమానా విధించారు.

ఆల్మట్టి ఎత్తు పెంపునకు అడ్డంకులా?



- మహారాష్ట్ర సీఎం లేఖపై డిప్యూటీ సీఎం ధ్వజం

బనశంకరి: కృష్ణా ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం కర్ణాటక రాష్ట్రం వాటా నీటిని ఉపయోగించుకోవడానికి ఆల్మట్టి డ్యామ్ ఎత్తును 524 మీటర్లకు పెంచాలని ట్రిబ్యునల్‌లో కోరినప్పుడు మౌనంగా ఉన్న మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ హఠాత్తుగా అభ్యంతరం చెప్పడం ఆశ్చర్యం కలిగించిందని డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్ అన్నారు. సోమవారం విధానసౌధలో విలేకరులతో మాట్లాడుతూ ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచి రాష్ట్ర రైతులు హితరక్షణ కాపాడటానికి రాష్ట్ర ఎంపీలు, కేంద్రమంత్రులు సహకరించాలని చేతులెత్తి మొక్కుతానని అన్నారు. గత నెల 9వ తేదీన దేవేంద్ర ఫడ్నవీస్, సీఎం సిద్దరామయ్యకు లేఖ రాశారని తెలిపారు. ఆలమట్టి ఎత్తు పెంచితే మహారాష్ట్రలో సాంగ్లి, కొల్హాపుర జిల్లాలు వరద ముంపు సమస్యను ఎదుర్కొంటాయని లేఖలో రాశారన్నారు. ఫడ్నవీస్ వైఖరి తమకు తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. 2010 ట్రిబ్యునల్ తీర్పు పట్ల మహారాష్ట్ర ఎప్పుడూ ప్రశ్నించలేదని, ఈ పథకాన్ని అమలు చేయాలని మహారాష్ట్ర కూడా చెప్పిందని, కానీ ఇప్పుడు మళ్లీ డ్యాం ఎత్తు పెంచరాదని లేఖ రాసిందని డీకేశి ఆరోపించారు. ఎత్తు పెంపు అనేది ట్రిబ్యునల్‌లో తమకు దక్కిన హక్కు అని, దీనిపై సీఎం సిద్దరామయ్య ఒకటి రెండు రోజుల్లో తిరుగు లేఖ రాస్తారని తెలిపారు.

వరద వారి సమస్య

మహారాష్ట్రలో వరదలు తలెత్తితే, అది వారి సమస్య. వారే సరిదిద్దుకోవాలని కేంద్రమంత్రులను, ప్రధానిని కలిసి చెబుతామని డీకే అన్నారు. ఇందులో రాష్ట్ర ఎంపీలు, కేంద్రమంత్రులు సమైక్యంగా ఉండాలన్నారు. 2013 నుంచి ఈ పథకానికి గెజిట్ నోటిఫికేషన్ కావాలని వేచి చూస్తున్నామని, ఇంకా ఎన్నిరోజులు నిరీక్షించాలని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి సోమణ్ణ ఆల్మట్టి గురించి స్పందిస్తూ ఈ ప్రాజెక్టు రాష్ట్ర హితమని, మాకు వేరే రాష్ట్రాలతో గొడవ ఇష్టంలేదని, మన వాటా నీరు కావాలని అన్నారు. ఆలస్యం కావడం వల్ల ఖర్చు పెరిగిపోతోంది. భూస్వాధీనానికి లక్ష కోట్ల రూపాయలు అవసరమని అన్నారు.

అప్పు ఇస్తామని రూ.20 లక్షల టోకరా

మైసూరు: రూ. 25 కోట్లు రుణం అందిస్తామని హామీ ఇచ్చి చెన్నైకు చెందిన ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది మైసూరువాసిని రూ. 25 లక్షలు మోసం చేసినట్లు కేసు నమోదైంది. మైసూరులోని జయనగరకు చెందిన వేణుగోపాల్ బాధితుడు, అతడు చామరాజనగరలో మేడేహళ్లి సమీపంలోని ఒక రాతి క్రషర్ కొనాలనుకున్నాడు. లక్ష్మీ ఫిన్ కోర్ప్ రూ. 500 కోట్ల వరకు రుణాలు అందిస్తామని ప్రకటన చేసింది. అది చూసి వేణుగోపాల్ ఫోన్ నంబర్‌కు ఫోన్ చేసి విచారించగా లోన్ ఇస్తామని, చెన్నైకి రావాలని తెలిపారు. సరే అని చెన్నైకు వెళ్లి ఫైనాన్స్ సంస్థలో మాట్లాడి రూ. 25 కోట్ల అప్పు తీసుకుంటానని చెప్పాడు. అప్పు మొత్తంలో ఒక్క పర్సెంట్ సర్వీస్ చార్జి కట్టాలని సంస్థ సిబ్బంది చెప్పారు. వారు చెప్పినట్లే వేణుగోపాల్ రూ. 20 లక్షలను వారికి ఇచ్చాడు. కాలం గడిచినా అప్పు మాత్రం మంజూరు కాలేదు. మళ్లీ ఫోన్ చేయగా స్పందన లేదు. లక్ష్మీ, రఘు శ్రీనివాస్ ఉదయ్‌కుమార్ అనేవారు తనను మోసగించారని మైసూరు అశోకపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.


సోమవారం రాత్రి కలబుర్గిలో వర్షం కురిసిన దృశ్యం. కాగా రాష్ట్రంలో అనేక జిల్లాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టాయి. పొడి వాతావరణం నెలకొంది

క్లుప్తంగా

తమిళ సినిమాల విడుదలకు ఒప్పుకోం



ధర్నాలో పాల్గొన్న వాటాళ్ నాగరాజ్, కార్యకర్తలు

చిక్కబళ్లాపురం: కన్నడ భాష గురించి వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కమల హాసన్‌పై సోమవారం వాటాళ్ నాగరాజ్ నేతృత్వంలో కన్నడ సంఘాల ఆధ్వర్యంలో నగరంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ధర్నా చేశారు. వాటాళ్ నాగరాజ్ మాట్లాడుతూ థగ్‌లైఫ్ సినిమాను కర్ణాటకలో విడుదల చేయడానికి అంగీకరించేది లేదన్నారు. కమల హాసన్ చిత్రపటాన్ని కాల్చి ఆక్రోశం వ్యక్తపరిచారు. కన్నడిగులకు కమల హాసన్ క్షమాపణ చెప్పాలి, లేని పక్షంలో వారి చిత్రమే కాదు ఏ ఒక్క తమిళ సినిమాను విడుదల చేయడానికి ఒప్పుకోబోమని అన్నారు. కర్ణాటక రక్షణా వేదిక తరపున ఏర్పాటు చేసిన ధర్నాలో పాల్గొని మాట్లాడుతూ కమల హాసన్ దురహంకారి అని అన్నారు. వారికి, భాషకు సంబంధం లేదు. తాను అహంకారంతో మాట్లాడుతూ తమిళం నుంచి కన్నడ భాష పుట్టిందంటూ రాష్ట్రం, దేశంలోని కన్నడిగులకు అవమానం చేశారని ఆరోపించారు. తక్షణం కమల హాసన్ కన్నడిగులకు క్షమాపణ కోరాలి. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం కమల హాసన్‌పై గట్టి చర్యలు చేపట్టాలి, ఈనెల 5న వారి సినిమా రిలీజ్ అయితే కన్నడ సంఘాలు, రాష్ట్ర ప్రజలు ఫిలిం చాంబర్ అందరూ కలిసి వారి చిత్ర ప్రదర్శనను ఆపాలని అన్నారు. ధర్నాలో కన్నడ సేన జిల్లాధ్యక్షుడు రవికుమార్, నారాయణ స్వామి, శ్రీరామగౌడ ప్రవీణ్, కృష్ణమూర్తి జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ నేత అరెస్టు

బనశంకరి: దక్షిణ కన్నడ జిల్లాలో సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టు పెట్టారంటూ హిందూ జాగరణ వేదిక నేత రత్నాకర్ అమీన్‌ను సోమవారం ఉడుపి జిల్లా అజెకారు పోలీసులు అరెస్టు చేశారు. స్వయంప్రేరితంగా కేసు నమోదు చేసిన పోలీసులు రత్నాకర్ ను అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

బైకిస్టు మృత్యువాత

తుమకూరు: తుమకూరు జిల్లాలో సోమవారం హుళియారు సమీపంలోని తిమ్మలాపుర గేటు వద్ద కారు, బైక్, ఢీకొన్న ప్రమాదంలో బైకర్ అక్కడికక్కడే చనిపోయాడు. హందనకెరె హోబళి బేవినహళ్లి గ్రామవాసి (34) మృతుడు. కలియూరు నుంచి మట్టిగటేకు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు అతన్ని ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయమై మృతి చెందాడు. కారు డ్రైవర్ కాంతరాజుకు కూడా గాయాలు తగిలాయి. హుళియారు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

చిన్నారుల్లో నేర ప్రవృత్తి విశృంఖలం

- పిల్లలను మంచిగా పెంచడం తల్లిదండ్రుల బాధ్యత
- మనో వైద్యులు, పోలీస్ అధికారుల సలహా సూచనలు



మాట్లాడుతున్న డీసీపీ రవీష్, డాక్టర్ శివానంద హిరేమఠ(ఫైల్)



హుబ్లీ: ఇటీవల పిల్లల్లో నేర ప్రవృత్తి పెరుగుతోంది. దీనిపై తల్లిదండ్రుల పాత్ర గురించి మనోవైద్యులు, పోలీస్ అధికారులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. మద్యం తాగిన మత్తులో గాని, మత్తు పదార్థానికి బానిసలైనప్పుడు గొడవ జరగడం పర్యవసానంగా హత్యకు దారి తీయడం అక్కడక్కడ జరుగుతున్నాయి. మూడు రోజుల క్రితం వాణిజ్య నగరి హుబ్లీలో చిన్న కారణంగా 13 ఏళ్ల బాలుడు తన కన్నా మూడేళ్లు పెద్దవాడైన మరో బాలుడిని చాకుతో దాడి చేసి హత్య చేసిన ఘటన సర్వత్ర ఆందోళన కలిగించిన సంగతి తెలిసిందే. చిన్న పిల్లలు తెలిసో తెలియకో హత్య వరకు ఎలా వెళుతున్నారు. పిల్లల మనోగతంలో ఇంత క్రౌర్యం కలగడానికి కారణం ఏమిటి? ఈ విషయంలో తల్లిదండ్రుల పాత్ర ఏమిటి? అన్న దానిపై సమాధానంగా పిల్లల పరివర్తన ఎలా ఉంటుందన్న దాని గురించి మనోవైద్యులు, పోలీస్ అధికారులు పలు సూచనలు చేశారు. ఇటీవల హుబ్లీ ధార్వాడ నేర, ట్రాఫిక్ విభాగం డీసీపీ సీఆర్ రవీష్ మాట్లాడుతూ తన 30 ఏళ్లకు పైగా వృత్తి జీవితంలో ఇలాంటి ఘటన తొలిసారిగా చూశానన్నారు. 13 ఏళ్ల బాలుడు హత్య చేయడం అత్యంత ఆవేదన కలిగించే ఘటన అన్నారు. పిల్లలను బాగా పెంచడం ప్రతి తల్లిదండ్రి ప్రథమ కర్తవ్యం అన్నారు.

వేప విత్తనానికి తేనె పోస్తే విషం పోతుందా?

వేప విత్తనానికి బెల్లం, పాలు, తేనె పోసినంత మాత్రాన వేపలోని విషం పోతుందా? అంటూ వేప ఎప్పటికైనా తియ్యదనం ఇస్తుందా? అని బసవణ్ణ వచనాన్ని ఉదాహరణగా వివరించారు. పిల్లల ఎదుగుదల తదితర బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. తల్లిదండ్రులు పిల్లలతో నడుచుకొనే తీరు వారిపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. దీనికి తోడు మొబైల్, టీవీలు, సినిమాల్లో నేరాలు, ఘోరాలను వైభవీకరించడం వల్ల సుతిమెత్తని చిన్నారుల మనసుపై పరిణామం చోటు చేసుకుంటుందన్నారు. పిల్లల మనసు మొగ్గలాంటిది. తల్లిదండ్రులు వారిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. పిల్లలు రోజు ఎక్కడికి వెళుతున్నారు? ఏం చేస్తున్నారు? అన్నదాంతో పాటు అసహజ వ్యక్తిత్వాన్ని గమనిస్తూ వాటికి పరిష్కారం కల్పించేందుకు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా పిల్లల్లో తల్లిదండ్రులు దుర్గుణాలను తగ్గేలా చూడాలన్నారు. నైతిక, నీతి పాఠాలను వివరించి చెప్పాలన్నారు. పబ్జీ, బ్లూగేమ్స్ వంటి ఆన్‌లైన్ ఆటలు చిన్నారి పువ్వులాంటి మనసుపై ముల్లులాంటి క్రౌర్యాన్ని కలిగిస్తుందన్నారు. అందుకే పిల్లలకు మొబైల్, ల్యాప్‌టాప్‌లో ఏం చేస్తున్నారో సదా గమనించి మంచి చెడ్డలను వివరించాలన్నారు.

పిల్లలపై ఇంటి వాతావరణ ప్రభావం

మనోవైద్యుడు డాక్టర్ శివానంద హిరేమఠ మాట్లాడుతూ 13 ఏళ్ల బాలుడు హత్య ఘటన తనను దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ఇటీవల పిల్లల్లో అమాయకత్వం తగ్గిపోతోందన్నారు. సోషల్ మీడియా, సినిమాలోని హింసను భారీగా చూపడం వంటి దృశ్యాలు చిన్నారుల మనసులను కనిష్టం చేస్తున్నాయన్నారు. తమ చుట్టు పక్కల తమ కన్నా పెద్దలు అలాంటి ప్రవృత్తిలో ఉంటే వారినే పిల్లలను అనుసరిస్తారు. ఇంట్లోని వాతావరణంలో తల్లిదండ్రుల మధ్య జగడాలు వంటి కారణాలు పిల్లలపై తీరని ప్రభావం చూపుతాయన్నారు. ఈ విషయాలపై తల్లిదండ్రులు సదా జాగృతంగా ఉండి తమ పిల్లలకు అవసరమైనప్పుడు కౌన్సిలింగ్, థెరపీ ద్వారా సమస్యలను పరిష్కరించాలి. ఆన్‌లైన్ ఆటలలో హింసాత్మక ప్రవృత్తి నానాటికి పెరుగుతున్న కారణంగా ప్రభుత్వం, తల్లిదండ్రులు వాటి నుంచి దూరంగా ఉంచే పని చేయాలి. తండ్రే ఆ కుటుంబ ఆదర్శ వ్యక్తిగా ఉత్తమ నడత కలిగి ఉండాలి. కుటుంబంలో శాంతి, సమాధానం, నెమ్మదితో కూడిన వాతావరణ కౌటుంబిక సౌహార్ద ఉండాలి. తండ్రి తమ పిల్లలకు తగిన సమయాన్ని కేటాయించి పిల్లలతో చక్కటి అనుబంధాన్ని పాదుగోల్పేలా తమ తీరును తల్లిదండ్రులు మార్చుకుంటే మంచిదని ఆయన అభిప్రాయపడ్డారు.

ఎక్స్‌ప్రెస్ కెనాల్ ప్రాజెక్ట్‌ను రద్దు చేయాలి

- ఎమ్మెల్యే సురేష్‌గౌడ డిమాండ్

తుమకూరు: తుమకూరు జిల్లాకు చెందిన హేమావతి నీటిని వినియోగించే బకాసుర ఎక్స్‌ప్రెస్ కెనాల్ ప్రాజెక్ట్‌ను రద్దు చేయాలి, అసలు ప్లాన్ ద్వారా కుణిగల్‌కు నీటిని విడుదల చేయాలి, ఎక్స్‌ప్రెస్ కెనాల్ ద్వారా నీరు ప్రవహించనివ్వబోమని ఎమ్మెల్యే సురేష్‌గౌడ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం నగరంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్స్‌ప్రెస్ కెనాల్‌కు సంబంధించిన సాంకేతిక కమిటీ నివేదికపై చర్చించడానికి జిల్లాలోని ఎన్నికైన ప్రతినిధులు సభ్యులుగా ఉండాలని అన్నారు. ఎక్స్‌ప్రెస్ కెనాల్ అంశంపై ఉప ముఖ్యమంత్రి డి.కే.శివకుమార్, మంత్రి డాక్టర్ జి.పరమేశ్వర్ గందరగోళ ప్రకటనలు చేస్తున్నారన్నారు. తాము కుణిగల్ లేదా మాగడి నుంచి నీటిని తీసుకోకూడదని చెప్పడం లేదు. కానీ అశాస్త్రీయమైన ఎక్స్‌ప్రెస్ లింక్ కెనాల్ వద్దు, లింక్ కెనాల్ ప్రాజెక్ట్ నుంచి హేమావతి నీటిపై ఆధారపడిన జిల్లాలోని ఆరు తాలూకాలకు ఒక్క చుక్కనీరు కూడా ప్రవహించలేదని ఆయన అన్నారు. జిల్లా ప్రజలు భిన్నమైన కోణం నుంచి మాట్లాడాలని ఆయన అన్నారు. బీజేపీ నీటిని రాజకీయం చేయడం లేదు. ఇది పార్టీలకు అతీతంగా జరుగుతున్న పోరాటం ఎక్స్‌ప్రెస్ కెనాల్ ప్రాజెక్ట్‌ను సూత్రప్రాయంగా ముగించే వరకు పోరాటం ఆగదు. పోలీసు కేసు నమోదు చేయడం ద్వారా బెదిరించడం, దాడి చేయడం అసాధ్యం. పోరాటం తీవ్రతరం అవుతుంది. గుబ్బి, జిల్లా బంద్ తర్వాత జిల్లాధికారి కార్యాలయం దగ్గర భారీ నిరసన కార్యక్రమం జరుగుతుంది. ప్రభుత్వం వెళ్లిపోయే వరకకు పోరాటం ఆగదని ఎమ్మెల్యే సురేష్‌గౌడ హెచ్చరించారు. ఎమ్మెల్యే జీబీ జ్యోతీ గణేష్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఎస్.రవిశంకర్, హెబ్బాళ్కర్, రైతు సంఘ అధ్యక్షుడు గోవిందరాజు, నాయకులు దిలీప్‌కుమార్, బ్యాటరంగగౌడ, చంద్రశేఖర్ బాబు, ఎస్.ఆర్.గౌడ, బైరప్ప, యోగస్‌కుమార్ పాల్గొన్నారు.

డ్యాం గేట్ల మార్పు టెండర్ ఖరారు

హొసపేట: తుంగభద్ర డ్యాం 32 క్రస్ట్‌గేట్లను మార్చే బాధ్యతలను గుజరాత్‌కు చెందిన హార్డ్‌వేర్ టూల్స్ అండ్ మెషినరీ ప్రాజెక్ట్ కంపెనీకి అప్పగించారు. ఈ పనిని పూర్తి చేయడానికి ఆ సంస్థకు 15 నెలల గడువుతో తుంగభద్ర బోర్డు బాధ్యతను అప్పగించింది. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ప్రధాన కార్యాలయం కలిగిన కంపెనీకి ఇప్పటికే రిజర్వాయర్‌లోని 19వ గేట్ కోసం క్రస్ట్‌గేట్ నిర్మించే బాధ్యతను అప్పగించగా ఈ పనిని ఈనెలాఖరునాటికి పూర్తి చేయాలి. ఆలోగా 32 గేట్ల పనితో పాటు మొత్తం 33 గేట్ల నిర్మాణ పనులను అదే కంపెనీకి అప్పగించారు. 32 గేట్ల నిర్మాణానికి తుంగభద్ర బోర్డు రూ.52 కోట్ల మొత్తాన్ని నిర్ణయించింది. ఈ టెండర్‌లో కంపెనీ రూ.41.42 కోట్లకు పనిని పూర్తి చేయడానికి బిడ్‌ను సమర్పించింది. తక్కువ బిడ్ కారణంగా నిర్మాణ బాధ్యతను ఆ కంపెనీకి అప్పగించినట్లు తుంగభద్ర బోర్డు వర్గాలు తెలిపాయి.

చిన్నారులకు అక్షరాభ్యాసం

మైసూరు: మైసూరు నగరంలోని విజయ్ విద్యా పాఠశాల, ప్రీకేజీ, ఎల్‌కేజీ విద్యార్థుల కోసం పాఠశాల రంగుల్లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. విద్యలోకి అడుగు పెట్టడాన్ని సూచిస్తూ ఈ పవిత్ర వేడుక విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో జరిగింది. ఈ కార్యక్రమంలో గౌరవ కార్యదర్శి విశ్వనాథ్, విజయ్ విఠల్ కాంపోజిట్ పీయూ కళాశాల ప్రిన్సిపాల్ హెచ్.సత్యప్రసాద్, విజయ్ విఠల్ స్కూల్ ప్రిన్సిపాల్ వీణ, కిండర్ గార్డెన్ ప్రధానోపాధ్యాయురాలు ప్రతిభ, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది హాజరయ్యారు.

భూ స్వాధీనంపై అభ్యంతరాల స్వీకరణ



ప్రజల నుంచి ఆక్షేపణలు స్వీకరిస్తున్న అధికారిణి

శ్రీనివాసపురం: తాలూకాలోని యదరూరు గ్రామ సమీపంలో పరిశ్రమల కోసం భూ స్వాధీనం చేసుకోవడంపై సోమవారం కేఐడీబీ అధికారులు రైతుల నుంచి ఆక్షేపణలు స్వీకరించారు. గ్రామ సమీపంలో 1273 భూమిని పరిశ్రమల కోసం గుర్తించారు. ఇందులో 551 మంది ఖాతాదారులు ఉన్నారు. ఈ ప్రాంతంలో పరిశ్రమలు స్థాపించాల్సి ఉండగా, అభ్యంతరం వ్యక్తం చేస్తున్న రైతుల నుంచి ఆక్షేపణలు స్వీకరిస్తున్నట్లు విశేష భూ స్వాధీన అధికారిణి వెంకటలక్ష్మి తెలిపారు. సమావేశంలో పలువురు రైతులు ఈ ప్రాంతంలో పరిశ్రమలు స్థాపించవద్దని కోరారు. ఇందుకు స్థానికంగా ఉన్న రైతులు స్పందించి ఈ ప్రాంతంలో పరిశ్రమలు వద్దంటున్న వారు ఈ ప్రాంతానికి చెందిన వారు కాదని, వేరే ప్రాంతం నుంచి వచ్చారని తెలిపారు. అధికారులు స్థానికంగా ఉన్న గ్రామస్తుల అభిప్రాయాలను సేకరించాలన్నారు. ఎమ్మెల్యే జీకే వెంకటశివారెడ్డి జోక్యం చేసుకుని అధికారులు గ్రామస్తుల అభిప్రాయం సేకరించడానికే వచ్చారు. ప్రభుత్వం సరైన స్థలాన్ని గుర్తించింది. అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తేవాలన్నారు. ఆక్షేపణలు సమర్పించడానికి తమకు ఇంకా 10 రోజుల సమయం కావాలని సీపీఎం నాయకుడు సూర్యనారాయణ, కాంగ్రెస్ నాయకుడు కేకే మంజునాథ్, బ్యాటప్ప, నవీన్‌కుమార్ తెలిపారు. స్పందించిన అధికారిణి ఈ ప్రాంతంలో పరిశ్రమల కోసం స్థలం గుర్తించామన్నారు. అయితే ఇంకా నోటిఫికేషన్ జారీ కాలేదు. ఇప్పటికే నోటిఫికేషన్ ఇచ్చిన రైతుల నుంచి ఆక్షేపణలు స్వీకరించి అభిప్రాయాలు సేకరిస్తామని తెలిపారు.

బైక్‌కు లారీ ఢీ.. ఇద్దరి మృతి

మాలూరు : ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో ద్విచక్రవాహనంలో ప్రయాణిస్తున్న ఇద్దరు మరణించిన ఘటన తాలూకాలోని హోసూరు రోడ్డులోని గ్రీన్ సిటీ కాలేజ్ ముందు చేసుకుంది. తమిళనాడులోని విల్లుపురం జిల్లా మేలేనూరు తాలూకా సెట్టతంగల్ గ్రామానికి చెందిన పవన్‌కుమార్(23), తంగుగణం గ్రామానికి చెందిన భాగ్యరాజ్ (23) ప్రమాదంలో మరణించిన వ్యక్తులు. వీరిద్దరూ స్నేహితులు కాగా మాలూరు పట్టణ పారిశ్రామికవాడ ప్రాంతంలో ఉన్న ట్రాన్స్ ఏసీఆర్ సాల్యూషన్స్‌లో పవన్‌కుమార్ ఏసీ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. వీరిద్దరూ మధ్యాహ్న భోజనం తీసుకుని వస్తుండగా గ్రీన్ సిటీ కాలేజ్ వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఘటనలో పవన్‌కుమార్ అక్కడికక్కడే మరణించగా, తీవ్రంగా గాయపడిన భాగ్యరాజ్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మరణించాడు. మాలూరు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మంటల్లో గాయపడి మృతి

దొడ్డబళ్లాపురం: దొడ్డ తాలూకా ముత్సంద్ర గ్రామంలో గ్యాస్ లీకేజీ వల్ల జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడ్డ మహిళ మృత్యువుతో పోరాడి మరణించింది. చిక్కబళ్లాపురానికి చెందిన ఆదిలక్ష్మి (27) గ్రామంలో ఒంటరిగా నివసిస్తూ ఇళ్లల్లో పని చేసి ఉపాధి పొందేది. ఏప్రిల్ 24న ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీకై మంటలు చెలరేగి ఆదిలక్ష్మి తీవ్రంగా గాయపడింది. అప్పటినుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె ఆదివారం నాడు చనిపోయింది.

బడుగులు ఎదగాలి

గౌరిబిదనూరు: సమాజంలో అణగారినవర్గాల వారు అన్ని రంగాలలో రాణించి అభివృద్ధి చెందాలని అణగారిన వర్గాల సమన్వయ వేదిక గౌరవాధ్యక్షుడు భక్తరహళ్ళి చంద్రప్ప తెలిపారు. ఇక్కడి సమానతా సౌధలో నూతన పాలక మండలిని ఏర్పాటు చేసి మాట్లాడారు. తాలూకాలో అణగారిన వర్గాల యువత ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాల్సిన అవసరాన్ని తెలిపారు. పాలక మండలి సభ్యులు అణగారిన వర్గాల వారిలో సమన్వయాన్ని సాధించాలన్నారు. యువతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ప్రదీప్, ఉపాధ్యక్షుడు నరసింహమూర్తి, జహీర్‌బాషా, త్యాగరాజు, కుమార్, నాగరాజు, నిరంజన మూర్తి, అశోక్ పాల్గొన్నారు.

చార్జింగ్ సెంటర్ల విస్తరణ: మంత్రి

దొడ్డబళ్లాపురం: రాబోయే రోజుల్లో పెట్రోలు, డీజిల్ ఇంధనంతో అవసరం లేని వాహనాలను మనం చూడవచ్చని రాష్ట్ర విద్యుత్ శాఖమంత్రి కేజే జార్జ్ అన్నారు. కెంపేగౌడ ఎయిర్‌పోర్టు వద్ద కొత్తగా స్థాపించిన సోలార్ పవర్ బ్యాటరీ ఈవీ చార్జింగ్ సెంటర్‌ను సోమవారంనాడు ప్రారంభించారు. ఇది క్యాబ్ డ్రైవర్లకు, ఈవీ వాహనాలు ఉపయోగిస్తున్న వారికి ఎంతో అనుకూలమన్నారు. రాష్ట్రంలో రోజురోజుకీ ఈవీ వాహనాల సంఖ్య పెరుగుతోందని, ఇక్కడ ఒకేసారి 24 వాహనాలు చార్జింగ్ చేయవచ్చన్నారు. డిమాండుకు తగ్గట్టు చార్జింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. కర్ణాటకలో ప్రస్తుతం 5,880 ఈవీ చార్జింగ్ స్టేషన్‌లు, బెంగళూరు నగర జిల్లాలోనే 4,462 జార్జింగ్ స్టేషన్‌లు ఉన్నాయన్నారు. బెస్కాంకు సంబంధించిన ఈవీ మిత్ర యాప్ ద్వారా చార్జింగ్ స్టేషన్‌ల వివరాలు, ఫీజులను తెలుసుకోవచ్చారు.

హోసూరు వార్తలు...

మళ్లీ మొదలైన బడులు



బ్యాటరపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో ఎమ్మెల్యే వై. ప్రకాష్ తదితరులు



కెలమంగలం తెలుగు పాఠశాలలో పిల్లలకు ఎమ్మెల్యే టి. రామచంద్రన్ కెలమంగలంలో

హోసూరు, కెలమంగలం: వేసవి సెలవులు పూర్తయిన పాఠశాలలు తెరుచుకున్నాయి. హోసూరు పారిశ్రామికవాడ బేడరపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఎమ్మెల్యే వై. ప్రకాష్, మేయర్ ఎస్.ఏ. సత్య, ఉపమేయర్ ఆనందయ్య తదితరులు పాల్గొని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం, సంచులు ఇతర విద్యా ఉపకరణాలను అందజేశారు.

కెలమంగలం పట్టణ పంచాయతీలోని తెలుగు పాఠశాలలో తళి ఎమ్మెల్యే టి. రామచంద్రన్ ముఖ్య అతిథిగా పాల్గొని పిల్లలకు ఉచిత పాఠ్యపుస్తకాలను, నోటుపుస్తకాలు, అందజేశారు. హెచ్‌ఎం లీలావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా పాఠశాలల్లో సందడి నెలకొంది. పిల్లలను బడిలో చేర్పించడానికి తల్లిదండ్రులు తరలివచ్చారు.

ఇష్టం లేని కాలేజీకి వెళ్లనని..

క్రిష్ణగిరి: తల్లిదండ్రులు చెప్పిన కళాశాలలో చేరేందుకు ఇష్టంలేని యువకుడు ఆత్మహత్య చేసుకొన్న ఘటన క్రిష్ణగిరి తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు క్రిష్ణగిరి తిరువళ్లువర్ నగర్‌కు చెందిన బాల్ పీటర్‌సన్ (18), ప్లస్టూ పాస్ అయ్యాడు, తిరుపత్తూరు జిల్లాలోని కళాశాలలో చేరతానని చెప్పాడు. తల్లిదండ్రులు కోయంబత్తూరులోని కళాశాలలో చేరాలని ఒత్తిడి చేశారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన అతడు ఇట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు.

రెండు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

హోసూరు: కురుబరపల్లి, కల్లావి ప్రాంతాల్లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు రైతులు మృతి చెందారు. కురుబరపల్లివాసి పెరియణ్ణ (46), వెంకటేష్(64), రంగస్వామి(45)లు కలిసి ద్విచక్రవాహనంలో సోమనాథపురం వద్ద వెళుతూ కింద పడ్డారు. తీవ్ర గాయాలేర్పడిన ముగ్గురిని స్థానికులు చికిత్స కోసం క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పెరియణ్ణ చనిపోయాడు. ధర్మపురి జిల్లా అరూర్ తాలూకా మూకనూర్‌పట్టి గ్రామానికి చెందిన రైతు ప్రవీణ్‌కుమార్(27), మిత్రుడు ప్రభు(32)తో కలిసి ద్విచక్రవాహనంలో వెళ్లుతూ కొల్లపట్టి బస్టాప్ వద్ద చెట్టును ఢీకొన్నారు. ప్రవీణ్‌కుమార్ మరణించాడు.

భర్తను తలచుకుంటూ ఆత్మహత్య

హోసూరు: ప్రేమించి పెళ్లి చేసుకొన్న భర్త ప్రమాదంలో మృతి చెందడంతో విరక్తి చెందిన భార్య ఆత్మహత్య చేసుకొన్న ఘటన బేరికె పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. క్రిష్ణగిరి జిల్లా బేరికె తేరుపేటకు చెందిన బాలాజీ భార్య కుప్పన్ (19) ఏడాది క్రితం ప్రేమించి పెళ్లి చేసుకొన్నారు. బాలాజీ గత ఏడాది డిసెంబర్‌లో రోడ్డు ప్రమాదానికి గురై చనిపోయాడు. అప్పటి నుంచి దిగులుగా ఉన్న కుప్పన్ ఆదివారం ఇంట్లో ఉరి వేసుకొంది. బేరికె పోలీసులు కేసు నమోదు చేశారు.

గ్రానైట్ లారీలు సీజ్

హోసూరు: క్రిష్ణగిరి ఖనిజసంపద శాఖ ప్రత్యేక తహసీల్దార్ అరుణ్‌కుమార్ నేతృత్వంలో అధికార్లు ఆదివారం రాత్రి క్రిష్ణగిరి – కుప్పం జాతీయ రహదారిలో తనిఖీలు చేశారు. అనుమతి లేకుండా గ్రానైట్ రాళ్లను తరలిస్తున్న రెండు లారీలను పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

రాయచూరు రూరల్: మనిషి సంపూర్ణ ఆరోగ్య రక్షణకు యోగా దోహదపడుతుందని మాజీ ఇంజినీర్ వెంకటేష్ పేర్కొన్నారు. సోమవారం బిల్లవ మందిరంలో యోగా శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. యోగాతో వ్యాధులను దూరం చేసుకోవచ్చన్నారు. శారీరకంగా, మానసికంగా ఎదుగుదలకు యోగా, ధ్యానం, ప్రాణాయామం అలవర్చుకోవాలన్నారు. మల్లికార్జున స్వామి, సత్యవతి, బూదెప్ప, సహదేవ్, భావన, నేత్ర, విజయలక్ష్మి, ప్రభాకర్‌లున్నారు.

క్లీనర్ దుర్మరణం

పెద్దవడుగూరు: అనంతపురం జిల్లా తాడిపత్రి పరిధిలో పెద్దవడుగూరు మండల పరిధిలోని కాశేపల్లి టోల్ ప్లాజా సమీపంలో ఐషర్ వాహనం ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో ఒకరు చనిపోయారు. ఈ ప్రమాదం లో ఐషర్ వాహనం క్లీనర్ మహమ్మద్ (31) అనే వ్యక్తి మృతి చెందాడు. రాయచూరు నుంచి అనంతపురానికి సరుకులు తీసుకొని వచ్చి అన్‌లోడ్ చేసి తిరిగి రాయచూరుకు వెళ్తుండగా కాశేపల్లి టోల్‌ప్లాజా దాటగానే నిద్రమత్తులో ఐషర్ డ్రైవర్ ఖలీల్ ముందుగా వెళ్తున్న గుర్తు తెలియని వాహనంను ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో ఐషర్ క్లీనర్ అక్కడికక్కడే చనిపోయాడు. ఇతని స్వస్థలం రాయచూరు జిల్లా మాన్వి అని తెలిసింది. పోలీసులు అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మృత దేహాన్ని పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జిందాల్‌లో అగ్ని ప్రమాదం

సాక్షి బళ్లారి: దేశంలో పేరు గాంచిన స్టీల్ ఇండస్ట్రీ జిందాల్ పవర్ హౌస్‌లో అగ్నిప్రమాదం జరిగింది. సోమవారం జిల్లాలోని తోరణగల్లు సమీపంలో వేలాది ఎకరాల్లో వెలసిన జిందాల్ స్టీల్ ప్లాంట్ ఆవరణలో ఉన్నఫళంగా పవర్ హౌస్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకోవడంతో ఎలక్ట్రానిక్ వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. తక్షణం అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మంటలను అర్పడంతో ఎలాంటి ప్రాణహాని జరగలేదు. ఈ ఘటనపై తోరణగల్లు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అదృష్టవశాత్తు ప్రాణ నష్టం జరగక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకొన్నారు.

యథేచ్ఛగా సంబరాలు.. 8 మంది అరెస్ట్

రాయచూరు రూరల్: ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ క్రికెట్ పోటీల్లో తమ జట్టు గెలుపుపై మితిమీరిన సంబరాలు చేసుకుంటున్న 8 మందిని పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన జిల్లాలోని మస్కి తాలూకాలో చోటు చేసుకుంది. మస్కి తాలూకా హసమకల్‌లో ఆర్‌సీబీ జట్టు విజయం సాధించిన రోజు రాత్రి 8 మంది ఆర్‌సీబీ అభిమానులు యథేచ్ఛగా సంబరాలు చేసుకున్నారు. టపాసులు పేల్చడంతో పాటు పెట్రోలు పోసిన యువకులు నడి రోడ్డుపై నిప్పంటించి అల్లరి చేసి న్యూసెన్స్ సృష్టించినందున పోలీసులు అరెస్ట్ చేశారు. సింధనూరు తాలూకా బళగానూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరారెడ్డి తెలిపారు.


పౌర కార్మికుల పోరు బాట.. వీధుల్లో చెత్త మేట



ఓ వీధిలో పేరుకున్న చెత్త కుప్ప

కేజీఎఫ్ : తమ డిమాండ్ల సాధన కోసం పౌర కార్మికులు నిరవధిక ధర్నా చేపట్టడంతో నగరంలో చెత్త తీసేవారు లేక ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం పేరుకు పోతోంది. నానాటికీ చెత్త అధికం అవుతుండడంతో అంటువ్యాధులు ప్రబలుతాయేమోననే ఆందోళనలో పౌర కార్మికులు ఉన్నారు. పౌర కార్మికుల ఆందోళన మరిన్ని రోజులు కొనసాగితే నగరం మొత్తం చెత్తమయం అవుతుంది. దీనికి తోడు వర్షం వస్తే చెత్తలో నీరు కలిసి దుర్వాసన ప్రారంభం అవుతుంది. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడం వల్ల చెత్త చేరి మురుగు నీరు డ్రైనేజీల్లో సక్రమంగా ప్రవహించకుండా రోడ్డుపైకి వస్తోంది. నగర వాసులు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. నగరంలోని అన్ని వార్డుల్లోను ఇదే పరిస్థితి నెలకొని ఉంది. అధికారులు వెంటనే పౌర కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వారి డిమాండ్లపై తక్షణమే స్పందించాలని నగర వాసులు కోరారు.

నాలుగో రోజుకు పౌర కార్మికుల ధర్నా



ధర్నాలో పాల్గొన్న పౌర కార్మికులు

కేజీఎఫ్ : తమ వివిధ డిమాండ్ల సాధన కోసం నగరంలో పౌర కార్మికులు చేపట్టిన నిరవధిక ధర్నా సోమవారం 4వ రోజుకు చేరింది. నగరసభ ముందు విలేకరులతో కేజీఎఫ్ పౌర సేవ నౌకరుల సంఘం అధ్యక్షుడు రాము మాట్లాడుతూ రాష్ట్ర పౌర సేవా సంఘం ప్రభుత్వ ఉద్యోగులకు ఇస్తున్న ప్రతి సౌకర్యాలను పౌర సేవ నౌకరులకు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దినకూలీ నౌకరులుగా విధులు నిర్వహిస్తున్న పౌర కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. నగరసభలో 1 శాతం పౌర కార్మికులను విశేష నియామకం చేపట్టాలని, ఎస్‌ఎఫ్‌సీ నిధి నుంచి వేతనాలు చెల్లించాలని ఒత్తిడి చేశారు. ధర్నాలో పౌర కార్మికుల సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటేష్, శశికుమార్, రామచంద్ర, రాజా మూర్తి, జయరామ, దేవేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

కోలారు సమాచారం

చిక్కతిరుపతి ఆలయంలో సౌకర్యాలకు చర్యలు



ఆలయ సభాంగణంలో పరిశీలిస్తున్న సభ్యులు

మాలూరు : చారిత్రక ప్రసిద్ధ యాత్రా స్థలం చిక్కతిరుపతి శ్రీప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో మౌలిక సౌకర్యాల కల్పనకు దశలవారీగా చర్యలు తీసుకుంటామని ఆలయ ఈఓ టీ.సెల్వమణి తెలిపారు. సోమవారం చిక్కతిరుపతి ఆలయ సభాంగణంలో ఆలయ వ్యవస్థాపక సమితి సర్వ సభ్యులతో చర్చించిన అనంతరం మాట్లాడారు. ఆలయం లోపల ఉన్న కార్యాలయాన్ని ఆలయం బయట నూతనంగా నిర్మించడానికి శ్రీ ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయ వ్యవస్థాపక సమితి సభ్యులందరూ అంగీకరించారన్నారు. దీనిని ఇప్పటికే ఎమ్మెల్యే కేవై నంజేగౌడతో చర్చించామన్నారు. ఆలయం బయట నూతనంగా కార్యాలయం నిర్మించడం వల్ల సభలు, సమావేశాలు నిర్వహించడానికి, ఇతర కార్యకలాపాలకు అనుకూలం అవుతుందన్నారు. అంతేకాకుండా ఆలయం లోపల ఉన్న కళ్యాణోత్సవం నిర్వహించే స్థలాన్ని మరింత అభివృద్ధి చేయాలని సమావేశంలో తీర్మానించారన్నారు. ఆలయంలో భక్తులకు మరింతగా సౌకర్యాలను కల్పించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పేష్కార్ వి. చెలువస్వామి, వ్యవస్థాపక సమితి సభ్యుడు ఎం గోపాల్, వి.కృష్ణమూర్తి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త అహల్యాబాయి



అహల్యాబాయి జయంతిని నిర్వహించిన దృశ్యం

కోలారు : అప్రతిమ సమాజ సేవకురాలు అహల్యాబాయి హోల్కర్ అని చుటుకు సాహిత్య పరిషత్ అధ్యక్షుడు నారాయణప్ప తెలిపారు. సోమవారం నగరంలోని ప్రభుత్వ మహిళా పారిశ్రామిక శిక్షణా సంస్థలో నిర్వహించిన అహల్యాబాయి హోల్కర్ 301వ జయంతిలో ఆయన మాట్లాడారు. అహల్యాబాయి మహిళల విద్యాభ్యాసం కోసం శ్రమించారన్నారు. సమాజం నుంచి ఎదురైన సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని మహిళల విద్యాభ్యాసం కోసం పోరాటాలు సాగించారన్నారు. సంస్థ అధికారి కేటీ శివకుమార్ మాట్లాడుతూ దేశ చరిత్రలో 17వ శతాబ్దంలో తన భార్య, పిల్లలను కోల్పోయి సతీసహగమనాన్ని ధిక్కరించారన్నారు. మరాఠ సామ్రాజ్య రాజమాతగా ధార్మిక, విద్య, సాంస్కృతిక ప్రగతితో పాటు ఉత్తమ పాలన, సామాజిక సంక్షేమ, మానవతా కార్యక్రమాలను నిర్వహించి విజయవంతమయ్యారన్నారు. సంస్థ ప్రిన్సిపాల్ గోపాల్, అధికారులు వాణిశ్రీ, లక్ష్మీ, పుష్ప, సుజాతమ్మ పాల్గొన్నారు.

తాలూకా అభివృద్ధికి పెద్దపీట



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మంజునాథ్

కోలారు : తాలూకాలోని ప్రతి గ్రామంలో సమస్య గురించి తనకు సమాచారం ఉందని, దశల వారీగా అన్ని గ్రామాల్లోని సమస్యలను పరిష్కరిస్తానని, తాలూకా అభివృద్ధికి కట్టుబడి ఉంటానని ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ తెలిపారు. తాలూకాలోని చౌడదేనహళ్లి గ్రామ పంచాయతీ వ్యాప్తిలోని దొడ్డవల్లబి గ్రామంలో సోమవారం రహదారి అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసింది, రెండేళ్లలో నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి రూ.వందల కోట్ల నిధులు విడుదల చేసిందన్నారు. పలు అభివృద్ధి పనులు ఇప్పటికే పూర్తి కాగా మరికొన్ని 50 శాతం పూర్తయ్యాయన్నారు. మిగిలిన మూడేళ్ల అవధిలో కోలారు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి ప్రాధాన్యతనిస్తానన్నారు. ప్రముఖంగా తాలూకాలో పరిశ్రమల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. తదనుగుణంగా మౌలిక సౌకర్యాలను కల్పించడానికి పెద్ద పీట వేస్తామన్నారు. ఎమ్మెల్సీ అనిల్‌కుమార్, వక్కలేరి జీపీ అధ్యక్షుడు మైలాండహళ్లి మురళి, గ్యారంటీ పథకాల జిల్లా అధ్యక్షుడు వై శివకుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేక్ కటింగ్.. ఆపై కటకటాలు


లాంగ్ కత్తితో కేక్ కోస్తున్న అనిల్

గౌరిబిదనూరు: పుట్టినరోజు అని లాంగ్ కత్తితో కేక్ కట్ చేసిన వ్యక్తి, తరువాత పోలీసుస్టేషన్‌కు అతిథిగా వెళ్లాడు. ఆకతాయి చర్యల ఫలితం ఇలాగే ఉంటుంది. వివరాలు.. తాలూకాలోని వైచకూరహళ్ళి గ్రామంలో ఆటోడ్రైవర్ అనిల్ పుట్టినరోజును స్నేహితులతో జరుపుకొన్నాడు. పెద్ద ఖడ్గంతో కేక్‌ను కత్తిరించాడు. ఈ ఫోటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. వాటిని చూసిన రూరల్ పోలీసులు అనిల్‌ను అరెస్టు చేశారు. నిబంధనల ప్రకారం పెద్ద కత్తిని కలిగి ఉండడం, దానిని ప్రదర్శించడం చట్టరీత్యా నేరం. దీంతో ఆయుధ చట్టం కింద కేసు నమోదు చేశారు.

బీజేపీ నేతకు జిల్లా బహిష్కారం

శివాజీనగర: బీజేపీ నాయకుడు అరుణ్ పుత్తిలను దక్షిణ కన్నడ జిల్లా నుంచి బహిష్కరించారు. ఆయనను కల్బుర్గి జిల్లా షహబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి పంపివేయాలని సహాయక కలెక్టర్ నోటీస్ జారీచేశారు. జిల్లాలో మత ఘర్షణలకు కారణమవుతున్నారని ఈ చర్యలు తీసుకున్నారు.

కల్లడ్కపై కేసు

ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖుడు కల్లడ్క ప్రభాకర్ భట్ పై ఎఫ్ఐఆర్ నమోదైంది. బజ్పెలో హత్యకు గురైన సుహాస్‌శెట్టి శ్రద్ధాంజలి కార్యక్రమంలో రెచ్చగొట్టే ప్రసంగం చేసినట్లు బంట్వాళ్ గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివిధ వర్గాల మధ్య ద్వేషాలు పెరిగే విధంగా రెచ్చగొట్టే ప్రసంగం చేశారనే ఆరోపించారు.

నదిలో మునిగి మృతి



గౌరిబిదనూరు: సమీపంలోని క్రిస్టియన్ కాలనీకి చెందిన మిశ్చల్ (21) చేపలు పట్టడానికని కల్లూడి సమీపంలోని ఉత్తర పినాకినీ నదికి వెళ్లి మృత్యువాత పడ్డాడు. ఆదివారం మధ్యాహ్నం మిశ్చల్, మరో ముగ్గురు స్నేహితులు చేపలు పట్టాలని నదికి వెళ్లారు. అయితే అక్కడ ఏం జరిగిందో కానీ నది తీరంలో నీట మునిగి చనిపోయాడు. సాయంత్రం కుటుంబీకులు కాల్ చేయగా ఫోన్ ఎత్తలేదు. స్నేహితులు ఫోనును స్విచ్ఆఫ్ చేసుకొన్నారు. సాయంకాలం టౌన్ ఎస్ఐ చంద్రకళ సిబ్బందితో వచ్చి గాలించగా, 20 అడుగుల నీటి గుంతలో శవం కనిపించింది. ఫైర్ సిబ్బంది రాత్రి 10 గంటలదాకా శ్రమించారు, వర్షం రావడంతో కార్యాచరణ నిలిపివేశారు. సోమవారం ఉదయం 11 గంటల సమయంలో మృతదేహాన్ని బయటకు తీశారు.

థీమ్‌పార్క్ పనుల తనిఖీ

దొడ్డబళ్లాపురం: దేవనహళ్లి సమీపంలోని కెంపేగౌడ ఎయిర్‌పోర్టులో 108 అడుగుల కెంపేగౌడ విగ్రహం ఆవరణలో జరుగుతున్న థీమ్ పార్క్ పనులను రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి కృష్ణభైరేగౌడ సోమవారంనాడు పరిశీలించారు. సుమారు రూ.20 కోట్ల ఖర్చుతో ఈ థీమ్ పార్క్ నిర్మిస్తున్నారు. పనుల్లో నాణ్యత ఉండాలని, త్వరగా పూర్తి చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. మరో నాలుగు నెలల్లో పనులు పూర్తవుతాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఏబీ బసవరాజు, ఏసీ సయిదా ఆయేషా, కెంపేగౌడ అభివృద్ధి ప్రాధికార అధ్యక్షురాలు ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవ ఎన్నిక



మండ్య: మండ్య తాలూకాలోని హోళలు పాల ఉత్పత్తి దారుల సహకార సంఘం ఎన్నికల్లో నూతన ఉపాధ్యక్షురాలిగా ఎం.కవిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ పదవికి ఆమె ఒక్కరే నామినేషన్ వేశారు. గ్రామపంచాయతీ అధ్యక్షుడు హెచ్.ఎన్.శివరామ్, సభ్యులు ఎంబీ కృష్ణప్ప, దొడ్డ సిద్దయ్య, హెచ్.ఎస్.చరణ్ తదితరులు అభినందించారు.

హిందూ కార్యకర్తలపై కేసు

దొడ్డబళ్లాపురం: పోలీస్‌స్టేషన్ ముందు అర్ధరాత్రి గుమిగూడారనే ఆరోపణలపై 15మంది హిందూ కార్యకర్తలపై దక్షిణ కన్నడ జిల్లా కడబ పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లాలో ఇటీవల హత్యలు, హత్యాయత్నాలు పెరగడంతో కొన్ని రోజులుగా పోలీసులు కొందరు హిందూ సంఘాల నేతల ఇళ్లల్లో సోదాలు చేసి సమాచారం సేకరిస్తున్నారు. ఈ చర్యలను ఖండిస్తూ 1న అర్ధరాత్రి హిందూ సంఘాల కార్యకర్తలు కడబ పోలీస్‌స్టేషన్ ముందు గుమిగూడారు. ఇదే కారణం చూపుతూ పోలీసులు 15మందిపై కేసు నమోదు చేసారు. హిందూ సంఘాల కార్యకర్తలను పోలీసులు రౌడీల్లా చూస్తున్నారని, అర్ధరాత్రిళ్లు ఇళ్లల్లోకి వస్తూ కుటుంబాలను భయానికి గురిచేస్తున్నారని, దీన్ని ప్రశ్నించడానికే తాము స్టేషన్ వద్దకు వచ్చామని హిందూ కార్యకర్తలు తెలిపారు.


పాల ధార మాదిరిగా శివగంగా జలపాతం


ఉంచల్లి జలపాతం వద్ద పర్యాటకులు


సాతోడి జలపాతాన్ని కెమెరాల్లో బంధిస్తున్న ఫోటోగ్రాఫర్లు

ఉత్తర కన్నడ అందాలు.. ఉరికే జలపాతాలు

- అడవుల్లో ట్రెక్కింగ్ అనుభవం
- వర్షాకాలంలో టూరిస్టులకు ప్రత్యేకం


శివపుర వేలాడే తూగు వంతెన

బనశంకరి: ఉత్తర కన్నడ జిల్లాలో పశ్చిమ కనుమలలో సుందరమైన పర్వతాలు, అడవులు, వాటిలో నుంచి జలజలా జాలువారే జలపాతాలు అనేకం కనువిందు చేస్తాయి. వన్యజీవులు, పర్వతశ్రేణులు, నదులు, ట్రెక్కింగ్ ప్రదేశాలు ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటాయి. ఉత్తరకన్నడ జిల్లా వర్షాకాలంలో తప్పకుండా సందర్శించే పర్యాటక ప్రాంతాల్లో ఇది ఒకటి అని చెప్పవచ్చు. లెక్కకు మిక్కిలి జలపాతాలు ఇక్కడ ప్రవహిస్తున్నాయి. వాటిలో కొన్ని ప్రధానమైనవి మరింత ప్రసిద్ధి పొందాయి. జలపాతాల వీక్షణకు డబ్బు, సమయం వెచ్చించడం ఎంతమాత్రం తక్కువ కాదు.

ఉంచళ్లి జలపాతం

ఉత్తర కన్నడ జిల్లా శిరసి వద్ద గల సొగసైన జలపాతాల్లో ఉంచల్లి జలపాతం ఒకటి. ఇది అఘనాశిని నది ద్వారా ఏర్పడింది. సుమారు 116 మీటర్ల ఎత్తు నుంచి జాలువారుతుంది. దీనిని లుసింగ్టన్ జలపాతం అని కూడా పిలుస్తారు. చరిత్ర ప్రకారం 1945లో బ్రిటీష్ పాలనలో జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన జేడీ.లుసింగ్టన్ ఉంచళ్లి జలపాతాన్ని కనిపెట్టారు. ఒకసారి అడవుల్లో యాత్రకు వెళ్లినప్పుడు ఈ జలపాతం ఆయన కంట పడింది. అంతవరకూ దీనిని ఎవరూ చూసింది లేదు. వర్షాకాలంలో ఈ జలపాతం పర్యాటకులను కనువిందు చేస్తుంది.

శివపుర వేలాడే వంతెన

ఉత్తర కన్నడ జిల్లాలో శివపుర వేలాడే వంతెన ప్రత్యేక ఆకర్షణ. శివపుర వేలాడే వంతెనపై నిలబడి నయమనోహరమైన దృశ్యాలు వీక్షించడం ఎవరికైనా సంతోషం కలిగించేదే. ఇది సాతోడి జలపాతం నుంచి కేవలం 5 కిలోమీటర్ల దూరంలో ఉంది. దీనిని కొడసళ్లి జలాశయం పై నిర్మించారు. శివపుర వేలాడే వంతెన ఉత్తర కన్నడ జిల్లాలో అత్యంత పర్యాటక ప్రదేశాల్లో ఒకటి. ఉత్తర కన్నడ జిల్లా యల్లాపుర సమీపంలో ఉంది. ప్రకృతి ప్రేమికులను , పక్షిప్రేమికులకు ఇది సరైన పర్యాటక స్థలం. మీరు ఫోటోగ్రాఫర్లు అయితే కెమెరాల్లో అద్భుతమైన చిత్రాలను బంధించవచ్చు.

శివగంగా ఫాల్స్

ఉత్తర కన్నడ జిల్లా శిరసి వద్ద శివగంగా జలపాతాన్ని పర్యాటకులు తప్పకుండా వర్షాకాలంలో సందర్శించాలి. శివగంగా జలపాతం 242 అడుగుల ఎత్తు నుంచి జాలువారుతుంది. శివగంగా జలపాతం శాల్మలా నది నీటి వల్ల ఏర్పడింది. ఈ ఫాల్స్‌ని చేరుకోవడానికి దట్టమైన అడవులు మధ్య మూడు కిలోమీటర్లు ట్రెక్కింగ్ చేయాలి. పర్వతారోహణ, జలపాతం వీక్షణం థ్రిల్లింగ్‌గా ఉంటాయి.

శిర్లి జలపాతం

ఉత్తర కన్నడ జిల్లా యల్లాపుర సమీపంలో ఉన్న శిర్లి జలపాతాన్ని శిరాలె ఫాల్స్ అని కూడా పిలుస్తారు. దేశవ్యాప్తంగా పర్యాటకులను ఆకట్టుకునే అత్యంత సుందరమైన జలపాతాల్లో ఇది ఒకటి. యల్లాపుర నుంచి 15 నిమిషాలు పాటు ప్రయాణిస్తే ఇక్కడికి చేరవచ్చు. ఇక్కడ కొండకోనల్లో ట్రెక్కింగ్ సైతం చేయవచ్చు.

సుందరం సాతోడి

ఉత్తర కన్నడ జిల్లా యల్లాపుర సమీపంలో గల సాతోడి జలపాతం వర్షాకాలంలో వీక్షించడానికి అద్భుతమైన పర్యాటక ప్రాంతం. 50 అడుగులు ఎత్తునుంచి జాలువారుతుంది. పశ్చిమ కనుమల్లో సుందరమైన జలపాతాల్లో సాతోడి జలపాతం టూరిస్టులను ముగ్ధుల్ని చేస్తుంది అనడంలో ఎలాంటి సందేహంలేదు. అలాగే హొన్నావరలో సంధ్యాసమయంలో సూర్యాస్తమయ దృశ్యం మురిపిస్తుంది.


శిర్లి జలపాతం


హొన్నావరలో సంధ్యా సమయంలో సూర్యాస్తమయం

నా సినిమా ప్రదర్శనకు అనుమతివ్వరూ!


హైకోర్టు


కమల్‌హాసన్

- బెంగళూరు హైకోర్టులో నటుడు కమల్‌హాసన్ పిటిషన్
- థియేటర్లలో రక్షణ కల్పించాలని వినతి

సాక్షి, బెంగళూరు: కన్నడ భాషపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసి కన్నడిగుల ఆగ్రహానికి గురైన బహుభాషా కమల్‌హాసన్ తన తాజా సినిమా థగ్‌లైఫ్ విడుదల గురించి కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. థగ్‌లైఫ్ సినిమా విడుదలను అడ్డుకుంటామని కన్నడ సంఘాలు భీష్మించుకుని కూర్చొన్నాయి. జూన్ 5న సినిమా విడుదలవుతోంది. తానేమీ తప్పు మాట్లాడలేదని, తప్పు చేయనప్పుడు క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదని కమల్‌హాసన్ ఇటీవలే చెప్పారు. థియేటర్లలో థగ్‌లైఫ్ చిత్ర ప్రదర్శనకు తగిన భద్రత కల్పించేలా రాష్ట్ర డీజీపీ, నగర పోలీసు కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేయాలని కమల్‌తో పాటు చిత్ర నిర్మాణ సంస్థ ప్రతినిధులు తమ పిటిషన్‌లో న్యాయస్థానాన్ని కోరారు. సినిమా ప్రదర్శనను నిషేధించకుండా ప్రభుత్వానికి కూడా ఆదేశాలు ఇవ్వాలని విన్నవించారు. పిటిషన్‌పై విచారణకు తేదీ ఇంకా ఖరారు చేయలేదు.

డీజీపీ నుంచి స్పందన లేదు

సినిమా నిర్మాణంలో అనేక ఏళ్ల శ్రమ ఉందని, సుమారు రూ. 300 కోట్ల మేర సినీ నిర్మాణానికి ఖర్చు అయినట్లు తెలిపారు. సినిమాను ఆడనివ్వబోమని చెప్పడం రాజ్యాంగ ఉల్లంఘన కిందకి వస్తుందని పిటిషన్‌లో తెలిపారు. తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని తెలిపారు. సినిమా విడుదలకు ఇబ్బందులులేకుండా చూడాలని మే 31న రాష్ట్ర డీజీపీకి లేఖ రాయగా, ఇప్పటివరకు వారి నుంచి ఎలాంటి స్పందన లేదని తెలిపారు.

సస్పెండైనా హాజరు పుస్తకంలో సంతకం

బనశంకరి: చట్టవ్యతిరేక కేసుల్లో భాగస్వాములై సస్పెండ్‌కు గురైన కృష్ణ అనే పౌర కార్మికుడు పశ్చిమ వలయ కార్యాలయంలో ఫైళ్లను తీసుకుని తిరగడం, హాజరు పుస్తకంలో ప్రతినిత్యం సంతకం చేస్తున్నారని బీజేపీ నేత ఎన్ఆర్.రమేశ్ ఆరోపించారు. నిబంధనలకు వ్యతిరేకంగా చెత్త తొలగింపు కార్యక్రమానికి సంబంధించి మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తుండటంపై తమ బంధువుల పేర్లతో ప్రతి నెల లక్షలాది రూపాయలు బిల్లులు చేసుకోవడం గురించి తన అక్రమాలను ప్రశ్నించే అధికారులపై కులం పేరుతో దూషించారనే కేసులు పెట్టి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారని ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా బీబీఎంపీ కమిషనర్ అతడికి నిబంధనలకు వ్యతిరేకంగా ఇచ్చిన జూనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ పోస్ట్ నుంచి తొలగించి పౌరకార్మికుడి పోస్ట్ మాత్రమే చేయాలని ఆదేశించారు. సస్పెండ్‌కు గురైన కృష్ణ ప్రతినిత్యం పశ్చిమ వలయ కార్యాలయానికి వెళ్లి కొన్ని ఫైళ్లు తీసుకుని వాటి ఆమోదం కోసం ఇష్టానుసారంగా తిరుగుతున్నారు. ఇలాంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడుతూ ప్రస్తుతం సస్పెండ్‌కు గురైన జూనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ అనే ఉద్యోగిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అతడిని తన కార్యాలయంలో కూర్చొబెట్టుకుని అన్ని విధాలుగా సహకారం అందిస్తున్న పశ్చిమ వలయ పాడి చెత్త తొలగింపు శాఖ అధికారులు, వారి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీబీఎంపీ కమిషనర్, పశ్చిమ వలయ కమిషనర్‌కు ఎన్ఆర్. రమేశ్ ఫిర్యాదు చేశారు.

కారు ఢీకొని బైకర్ మృతి

మైసూరు: వేగంగా వెళుతున్న కారు బైక్‌ను ఢీకొనడంతో ఓ బైకర్ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన తాలూకాలోని కిదానపుర సమీపంలో జరిగింది. జిల్లాలోని టి.నరసీపుర తాలూకాలోని తలకాడు నివాసి మాదేష్(43) మృతుడు. నగరంలోని కమ్మనహళ్లి సమీపంలో ఒక చేపల వ్యాపారికి తన బైక్‌పై చేపలు డెలివరీ చేస్తున్న చేపల విక్రేత అయిన ఆయనను వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొంది. బైక్‌తో పాటు గుంతలో పడిపోయిన మాదేష్ అక్కడే మృతి చెందాడు. వరుణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

అధిక లాభాల ఆశ చూపి వంచన

మైసూరు: స్టాక్ మార్కెట్‌లో అధిక లాభాలు సంపాదించాలన్న దురాశతో రూ.7 లక్షలు పోగొట్టుకొన్న ఘటన మైసూరులో జరిగింది. మైసూరులోని తటగళ్లి ప్రాంతానికి చెందిన ఒక వైద్యుడు ఫేస్‌బుక్ ద్వారా స్టాక్ మార్కెట్ గురించి తెలుసుకొన్నాడు. తరువాత అతను అక్కడ ఉన్న పుస్తక చర్చా బృందంలో చేరాడు. వారు అక్కడ తమ వాటాల వ్యాపారం ప్రారంభించి కొన్ని రోజులు స్టాక్ మార్కెట్‌కు ఎక్కువ డబ్బు విరాళంగా ఇస్తే ఎక్కువ లాభాలు ఆర్జించవచ్చని మోసపూరితమైన కోరికను సృష్టించారు. వారి మాటలు నమ్మిన అతను చెప్పిన ఖాతాలో రూ.7 లక్షలు జమ చేసి మోసపోయాడు. ఘటనపై సైబర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది.

కమల్ మాటలను సమర్థించను

- నటుడు శివరాజ్‌కుమార్

సాక్షి, బెంగళూరు: కన్నడ భాష గురించి నటుడు కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలను తాను సమర్థించడం లేదని హ్యాట్రిక్ హీరో శివరాజ్‌కుమార్ తెలిపారు. కన్నడ భాష గురించి అవహేళన కమల్‌హాసన్ మాట్లాడితే అదే వేదికపైనున్న శివ దాన్ని తప్పు పట్టగపోగా చప్పట్లు కొట్టారని కొందరు కన్నడ సంఘాల నేతలు మండిపడుతున్నారు. దీంతో శివ మరోసారి స్పందించారు. తాను చప్పట్లు కొట్టిన సందర్భం వేరని తెలిపారు. కమల్ హాసన్ భాషపై మాట్లాడుతున్న సందర్భంలో నిజంగా ఆయన ఏమి మాట్లాడుతున్నారో తనకు తెలియదని అన్నారు. తాను కూడా ఒక కన్నడ అభిమానినని, మా తండ్రి కూడా ఒక కన్నడ అభిమాని అనేది అందరికీ తెలుసునని చెప్పారు. కమల్ హాసన్ మాట్లాడినదాన్ని నేను సమర్థించడం లేదు అని బదులిచ్చారు.

జేఈఈ ఫలితాల్లో ర్యాంకులు



బనశంకరి: జేఈఈ అడ్వాన్స్ -2025 పరీక్షల ఫలితాల్లో బెంగళూరు అలెన్ కెరియర్ ఇన్స్టిట్యూట్ రికార్డు సృష్టించినట్లు నిర్వాహకులు చెప్పారు. 17 మంది విద్యార్థులు టాప్- 500 ర్యాంకుల్లో స్థానం దక్కించుకున్నారు. సోమవారం జయనగర మూడోబ్లాక్‌లోని అలెన్ కెరియర్ ఇన్స్టిట్యూట్‌లో ఉపాధ్యక్షుడు మహేశ్ యాదవ్ మాట్లాడారు. విద్యార్థులకు ప్రతిభ, మార్గదర్శనం చేస్తుందన్నారు. బెంగళూరు కేంద్రం నుంచి 6 మంది విద్యార్థులు టాప్ 200, 17 మంది టాప్ 500 ర్యాంకులు సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. ఏఐఆర్ 57-చిన్మయ శంకరశాస్త్రి, ఏఐఆర్-142 అనిరుద్ శర్మా, ఏఐఆర్ 143- రిషబ్ పాండే, ఏఐఆర్-164 ఏఐఆర్ 181-రాఘవ్ జగ్గి ర్యాంకులు సాధించారు.

వలస కూలీ దుర్మరణం

మైసూరు: రోడ్డుపై నడిచి వెళుతున్న పాదచారిని కారు ఢీకొని మరణించాడు, చామరాజనగర జిల్లాలోని హనూరు పట్టణ శివార్లలో జరిగింది. బిహార్‌కు చెందిన 29 ఏళ్ల వలస కూలీ గౌతం మృతుడు. పట్టణ శివార్లలో ఒక నిర్మాణ ప్రాజెక్టులో పనిచేసి తిరిగి వస్తుండగా మలేమహదేశ్వర కొండపై నుంచి వస్తున్న కారు అతన్ని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన గౌతంను వెంటనే అంబులెన్స్ ద్వారా కొల్లేగాళ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం చామరాజనగర జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా దారిలో చనిపోయాడు. హనూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

విచారణకు బీజేపీ ఎమ్మెల్సీ

దొడ్డబళ్లాపురం: కల్బుర్గి కలెక్టర్ పాకిస్తాన్ నుంచి వచ్చారేమో అంటూ వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎమ్మెల్సీ ఎన్ రవికుమార్ హైకోర్టు ఆదేశాల మేరకు సోమవారంనాడు బెంగళూరు దక్షిణ డీసీపీ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. కలెక్టర్‌పైనే కాకుండా మంత్రి ప్రియాంక్ ఖర్గె, పోలీసులపై కూడా రవికుమార్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో విచారణకు హాజరయ్యారు.

ఆర్సీబీ గెలుపు కోసం అభిమానుల పూజలు

మైసూరు: మైసూరు నగరంలోని దివాన్‌రోడ్డులోని సమృద్ధీశ్వర ఆలయంలో అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరుగనున్న ఆర్సీబీ, పంజాబ్ జట్ల మధ్య బుధవారం జరిగే ఫైనల్ మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) జట్టు గెలుపొందాలని అభిమానులు విశేష హోమాలు, పూజలు నెరవేర్చారు. ఆర్సీబీ జట్టు గెలుపు కోసం ప్రార్థించి ఆర్సీబీ జెర్సీ ధరించి అభిమానుల తరఫున విశేష పూజలను చెల్లించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు కుమార్ నేతృత్వంలో విజయదుర్గ హోమాన్ని నెరవేర్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీష్‌గౌడ ఆర్సీబీ జెర్సీ ధరించి పాల్గొన్నారు. ఈసారి ఆర్సీబీ గెలుస్తుందని మేం ఆశిస్తున్నాం. ఈసారి ప్రతి ఆటగాడు బాగా రాణించాడు. కార్యక్రమంలో దేవరాజ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్, రాయప్ప, కర్ణాటక విజయ రక్షణ వేదిక అధ్యక్షుడు వినయ్‌కుమార్, గురురాజిత్ నవీన్, రవిచంద్ర పాల్గొన్నారు.

టెక్నాలజీతో మార్పులు

తుమకూరు: వ్యవసాయం, ఆరోగ్యం, అంతరిక్ష రంగంలో ప్రపంచంలో భారత దేశం ఉన్నతమైన స్థానంలో ఉంది, టెక్నాలజీని ఉపయోగించి అనేక రంగాల్లో మంచి మార్పులు తీసుకు వచ్చినట్లు హోంమంత్రి పరమేశ్వర్ అన్నారు. తుమకూరులో సిద్ధార్థ కాలేజీలో టెక్నోడియా 2025 అనే విజ్ఞాన సదస్సును ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కువ స్టార్టప్ కంపెనీలు ఉన్నాయని, విద్యార్థులు పరిశోధనాత్మకమైన అధ్యయనాలు చేయడం కోసం డీప్ టెక్నాలజీని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. కొత్త కొత్త పరిశోధనలు చేయడం ద్వారా సమాజంలో మంచి పేరు పొందవచ్చని అన్నారు.

పోలీసు సంక్షేమ నిధి దుర్వినియోగంపై కేసు

మైసూరు : పోలీసు సంక్షేమ నిధి, ఇతర ఖాతాలకు చెందిన సుమారు రూ.3.54 లక్షల దుర్వినియోగంపై నగరంలోని నజరాబాద్ పోలీస్ స్టేషన్‌లో మైసూరు కేఎస్ఆర్‌పీకి చెందిన సెకండ్ గ్రేడ్ అసిస్టెంట్‌పై కేసు నమోదైంది. కేఎస్ఆర్పీ థర్డ్ బెటాలియన్‌లో సెకండ్ గ్రేడ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న పీఎస్ నవీన్ నిధుల దుర్వినియోగం ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అతను కేఎస్ఆర్‌పీ ఆర్థిక విభాగంలో దాదాపు రెండేళ్లు పనిచేశాడు. ఆ సమయంలో కేఎస్ఆర్‌పీ పోలీస్ సంక్షేమ నిధికి, రిటైర్డ్ పోలీస్ సంక్షేమ నిధికి చెందాల్సిన రూ.3.54 లక్షలను తన సొంతానికి వాడుకొన్నాడని అందిన ఫిర్యాదు మేరకు నజరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అయ్యో హంపీ


నిత్యం వేలాది పర్యాటకులు సందర్శించే హంపీలో కనీస వసతులు లోపించాయని ఆరోపణలున్నాయి. ఇటీవల వర్షాలకు ఎక్కడ చూసినా బురద ఏర్పడింది. విరూపాక్ష ఆలయం దారిలో మండపాల ముందు వాననీరు మడుగు కట్టింది. నీటిని మోటార్ల ద్వారా తోడే పనిని ప్రారంభించారు. వాననీరు నిలిచిపోవడం వల్ల స్మారకాల భద్రతకు ముప్పు కలుగుతోందని హంపీవాసులు వాపోయారు. వర్షపునీరు ఎప్పటికప్పుడు వెళ్లిపోయేలా కాలువలు కూడా లేవు.


నైరుతి రుతుపవనాల ముందస్తు వానలతో నదులకు కొత్త కళ వచ్చింది. చిన్నబోయిన నదులు బిరబిరా పారుతున్నాయి. మైసూరు జిల్లా చుంచనకట్టె వద్ద కావేరి నది రమణీయ దృశ్యం. దీంతో పర్యాటకులు తరలివస్తున్నారు


ఎండిపోయిన మైదానాలు వరుణుని పలకరింపుతో పచ్చగా మారాయి. హరిత వర్ణ బయళ్లు మూగజీవాల ఆకలి తీరుస్తున్నాయి. బెళగావి వద్ద బెణకనహళ్లిలో గడ్డి మైదానంలో మేస్తున్న గొర్రెలు

సాక్షి
ఫ్యామిలీ
బెంగళూరు
మంగళవారం ॥ 3-6-2025

రాజైనా రైతైనా.. కొడుకైనా కూతురైనా
కలెక్టరైనా బంట్రోతైనా.. ఊరైనా పట్నమైనా
మనిషికి ప్రాప్తమయ్యే మొదటి వాహనం సైకిల్.
దోగాడే వయసులో ట్రై సైకిల్ తొక్కి
బైస్కిల్‌కు ఎదగడమే చేయాల్సింది.
ఇక అక్కడి నుంచి ఎక్కడికి చేరినా
జీవితాన్ని బేలెన్స్ చేసుకుంటూ
ముందుకు సాగమని చెబుతుంది సైకిల్.
ప్రతి ఒక్కరి బాల్యంలో సైకిల్ విడదీయరానిది.
ఆ మాటకొస్తే సైకిల్‌లోని ప్రతి పార్ట్
జీవన సందేశాన్ని వినిపిస్తుంది.
అసలు సైకిల్‌ని ఇష్టపడని వారెవరు?


నేడు వరల్డ్ సైకిల్ డే

మొదటి వాహనముకు వందనం!



సైకిల్!

ట్రింగ్ ట్రింగ్‌మని బెల్లు కొడుతూ జ్ఞాపకాలు కమ్ముకుంటున్నాయా?

చిన్నప్పుడు ఎవరిదో ఇంటి ముందు సైకిల్ స్టాండ్ వేసి ఉంటే కింద కూచుని పెడల్ తిప్పుతూ వెనుక చక్రం గిర్రున తిరుగుతుంటే చూసిన జ్ఞాపకం. ముందు చక్రంలో వెనుక చక్రంలో స్పోక్స్ మధ్యన ఉండే ఇంద్రధనువు రంగుల కుచ్చు గుబ్బలను ఆసక్తిగా చూసిన జ్ఞాపకం. వెనుక సీటుకు డైనమో ఉంటుంది. అది ఆన్ చేస్తే బ్యాక్ టైర్‌కు అంటుకుంటుంది. టైరు తిరిగే కొద్దీ డైనమో నుంచి కరెంటు జనరేట్ అయ్యి ముందున్న బల్బు వెలుగుతుంది. ఆ రోజుల్లో రాత్రుళ్లలో లైటు వెలిగే సైకిల్ తొక్కేవాడు గొప్ప.



అవును. సైకిల్ తొక్కడం గొప్పే. ఎంతమంది దగ్గర ఉండేదని. ఒకవేళ ఉన్నా అందులో అంతరం. ర్యాలీ, హంబర్ సైకిళ్లు ఉన్నవారు శ్రీమంతులు, హీరో సైకిల్ ఉన్నవారు మధ్య తరగతి వారు, అట్లాస్ అంటే ఇక పేదవాళ్లు కొని తెగ తొక్కడమే. ఆ తర్వాత బి.ఎస్.ఏ సైకిళ్లు వచ్చాయి. వాళ్లు తెచ్చిన లేడీస్ సైకిళ్లు ఆడపిల్లలను వాటిపై కూచోబెట్టి నేరుగా స్కూళ్లకు కాలేజీలకు పంపాయి. చిన్న పట్టణాల్లో సాయంత్రాలు సైకిల్ తొక్కుతూ వెళ్లే ఆడపిల్లలకు ఉండే క్రేజ్ సామాన్యం కాదు.

మగాడికి 'మగాడు' అనిపించుకునే సవాళ్లు సమాజం పెడుతూ ఉంటుంది. ఆ సవాళ్లలో ఒకటి సైకిల్ తొక్కడం నేర్చుకోవడం. ఏడు, ఎనిమిది తరగతులకు రావడంతోటే ఊళ్లలో పల్లెల్లో పిల్లలు సైకిల్ నేర్చుకుని ఉండాల్సింది. 'ఏంటి.. మీవాడికి ఇంకా సైకిల్ తొక్కడం రాదా' అనంటే అవమాన పడిపోయే తండ్రులు ఉండేవారు. కొడుకు తిట్లతో రెచ్చగొట్టి 'సైకిల్ తొక్కుతావా లేదా' లేదా అని ఎక్కించి వెనుక పరిగెత్తుతూ నేర్పించేవారు. ఆ రోజుల్లో పిల్లలు తొక్కే సైకిళ్లు ఎక్కడివని? అన్నీ పెద్దలు తొక్కేవే. అందుకే పిల్లలు మొదట ఆఫ్ పెడల్ తొక్కి, ఆ తర్వాత ఫ్రంట్ బార్ మీద కూచుని తొక్కి, కాళ్లందే ఎత్తు పెరిగాక సీటు మీద కూచుని తొక్కేవారు.

సైకిల్ తొక్కడం అంత వీజీ కాదు. ఆ రోజుల్లో ప్రతి సైకిలూ తన యజమానిని సొంత ఊరి చెరువు నీళ్లు గటగటా తాగించేది. ఒక సైకిలుకు బ్రేకులు పడవు. ఒక సైకిల్‌కు పెడళ్లు ఊడిపోతాయి. ఒక సైకిల్‌కు చైను లూజు. మరో సైకిలుకు స్టాండ్ పడదు. స్టాండ్ వేసి జరగ్గానే ధబేలున పడుతుంది. ఒక సైకిలుకైతే సీటు అట్టగట్టుకుని పోయి కూచుంటే ముళ్ల మీద కూచున్నట్టు ఉంటుంది. ఒక సైకిలు సైడుకు లాగుతూ ఉంటుంది. ఒక సైకిలుకు హ్యాండిలు వంకర. ఇక పంక్చర్లు వేసి వేసి లోపల టైరు బ్యారుమన్నా ఓనరు కనికరించక దాన్ని తొక్కుతూనే ఉంటాడు. డబ్బులే లేని ఆ కాలంలో సైకిలే సిరి.

సైకిల్ వల్ల ఫ్రెండ్‌షిప్స్ ఏర్పడతాయి. ఫ్రంట్ రాడ్ మీద కూచుని సినిమాకొచ్చే వాడొకడు. బ్యాక్ క్యారేజీ మీద కూచుని సంతకు పోదాం అనేవాడొకడు. ఎదురుగాలిలో తొక్కుతుంటే వెనుక కూచున్నవాడు కూడా తోడు తొక్కుతాడు. అంటే రెండు పెడళ్ల మీద నాలుగు కాళ్లు. సైకిల్ డౌన్‌లో తొక్కేటప్పుడు గడ్డిపోచకంటే తేలిగ్గా ఉంటుంది. ఎదురుగాలిలో తొక్కుతుంటే రాకాసి దెయ్యమంత బరువు పెరుగుతుంది.

అన్నింటి కంటే హింస ఏమిటంటే చైనుకు ఉన్న మడ్‌గార్డు గనుక పెడల్‌కు రాసుకుంటూ ఉంటే మనం వీధి వెంట వెళుతున్నామని ప్రతి ఒక్కరూ గుర్తిస్తారు.. ఆ గర్‌గర్‌మనే సౌండ్‌కి.

సైకిల్‌కు సింగారాలు చేసేవారు ఉండేవారు. హ్యాండిల్‌కు చెరొక మిర్రర్‌ని బిగించే సోగ్గాళ్లు ఉండేవారు. హ్యాండిల్ మీద ఫ్రంట్ క్యారేజీ బిగిస్తే వాటి మీద బుక్స్ పెట్టుకోవచ్చు. సీటుకు స్పాంజ్ కవర్ చాలా షోకు. స్టీలు బిందెల మీద పేర్లు రాసినట్టు సైకిల్ హ్యాండిల్ మీద ఓనర్ పేరు రాయించడం సేఫ్. సైకిల్ దొంగతనం అయితే పోలీసులు ఆ పేరును బట్టి వాపసు చేసేవారు.

ఆ రోజుల్లో అద్దె సైకిళ్ల జమానా నడిచింది. ఐదారు సైకిళ్లు అద్దెకు ఇస్తూ బతికే వారుండేవారు. సైకిళ్లన్నీ అద్దెకెళ్లిపోతే కావాల్సిన వాళ్లు వెయిట్ చేస్తూ కూచునేవారు. కొందరైతే రేపొద్దున నాకు సైకిల్ కావాలి అని ముందే అద్దెకు మాట్లాడుకునేవారు. సైకిల్ లేకుండా పని ఎవరికి జరిగేదని? సామాన్లు తెచ్చుకోవాలన్నా, పక్కూరికి పనికి వెళ్లాలన్నా, నీళ్లు తెచ్చుకోవాలన్నా, ఎవరికైనా బాగా లేకపోతే డాక్టర్‌ని పిలుచుకు రావాలన్నా, చావు కబురు చెప్పాలన్నా సైకిలే గతి.

సైకిల్ వేదాంతి. బతుకు బండిని బేలెన్స్ తప్పకుండా చూసుకోమని, అత్యాశలకూ అతి కోరికలకూ బ్రేకులు వేస్తూ నువ్వెంత తొక్కగలవో అంతలోనే బతకమని, మంచి అనుబంధాలనే ఆయిల్‌ను తరచూ రిమ్ములకు రాస్తూ ఉండమని, మంచి చెడ్డల్లో పాల్గొంటూ సైకిల్ బెల్లులా ఉనికి చూపమని, వెనుక క్యారేజీ మీద కూచోబెట్టుకునే పాటి సహాయమైనా ఇతరులకు చేస్తూ ఉండాలని, జీవితపు పరుగుకు అప్పుడప్పుడు స్టాండ్ వేసి నిలబెట్టమని లేదంటే కనీసం సైడ్ స్టాండ్ వేయమని చెబుతుంటుంది. లేదంటే హటాత్తుగా సైకిల్ మొరాయించి ఓవరాయిలింగ్‌కు వస్తుందని హెచ్చరిస్తుంది.

సైకిల్‌లా సింపుల్‌గా బతకడం ఇవాళ చాలా కష్టమైపోతుంది. కాసింత గాలి కొడితే ఇక సైకిల్ ఏమీ అడగదు. కాని నేడు మనం ఉపయోగిస్తున్న, వాడుతున్న, అందుకోవాలనుకుంటున్న ప్రతిదీ మన నుంచి చాలా అడుగుతున్నాయి.

ఇంటి వాకిటలో నిలబెట్టిన సైకిల్ ఎంత నిమ్మళంగా ఉంటుంది!

'వరల్డ్ సైకిల్ డే' రోజున జీవితపు వేగాన్ని తగ్గించుకుని ఆస్వాదనకు పెడల్ వేద్దాం.

– కె.

ఉమెన్ సేఫ్టీ

ఆపదలో అండగా...


కరణ్



బహిరంగ ప్రదేశాల్లో మహిళల భద్రతను దృష్టిలో పెట్టుకొని మైసూర్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ స్టూడెంట్ కరణ్ సరికొత్త పరికరాన్ని తయారు చేశాడు.

ఐజీడబ్ల్యూఎస్(ఇన్నోవేటివ్ ఇంటెలిజెంట్ జీయోఫెన్స్–ఎనేబుల్డ్ వేరబుల్స్ సిస్టమ్స్) అనే పరికరం మహిళలు ఆపదలో ఉంటే వారి ఎమర్జెన్సీ కాంటాక్ట్‌ను ఎలార్ట్ చేస్తుంది.

'డివైజ్‌లోని ముఖ్యమైన ఫీచర్‌లలో ఒకటి...జియోఫెన్స్–బేస్డ్ డిటెక్టర్. ఒక మహిళని ఎవరైనా మూడు నిమిషాల కంటే ఎక్కువ సేపు ఫాలో అవుతున్నప్పుడు ఈ డివైజ్ సందేహాస్పద వ్యక్తి మొబైల్ ఫోన్‌ను గాని, బ్లూటూత్ డివైజ్ అడ్రస్ గుర్తించడానికి ఉపయోగపడుతుంది' అంటున్నాడు కరణ్.

ఈ డివైజ్‌లో జియోఫెన్స్–బేస్డ్ సేఫ్టీ టైమర్ కూడా ఉంటుంది. యూజర్ ఒక డెస్టినేషన్ చేరుకోవడానికి టైమ్ సెట్ చేసుకోవచ్చు. ఒక అమ్మాయి షాపింగ్‌కు వెళ్తూ 30 నిమిషాలలో ఇంటికి వస్తానని చెబితే సిస్టమ్ ఆమె జియోలోకేషన్‌ని మానిటర్ చేస్తుంది. సెట్ చేసిన టైమ్ లోపు ఇంటి జియోఫెన్స్‌లోకి రాకపోతే డివైజ్ ఆటోమెటిక్‌గా ఆమె లోకేషన్‌ని ఎమర్జెనీ కాంటాక్ట్‌కి పంపిస్తుంది. డివైజ్‌లో 'రిటర్న్ హోమ్ సేఫ్టీ రిమైండర్' కూడా ఉంటుంది. డివైజ్‌లో మరో సేఫ్టీ ఫీచర్...డేంజర్–జోన్ నోటిఫైయర్. ఇది హై–రిస్క్ జీపీఎస్ లొకేషన్స్ ప్రీలోడెడ్ జాబితాను ఉపయోగిస్తుంది. యూజర్ ఈ ప్రాంతాలలోకి వెళ్లినప్పుడు వేరబుల్ బజర్ యాక్టివేట్ అవుతుంది. ఎమర్జెన్సీ కాంటాక్ట్‌కి తెలియజేస్తుంది.

సమ్‌థింగ్ స్పెషల్

దుప్పటి లెహంగా



'ఫ్యాషన్ అనేది ఫ్యాబ్రిక్ స్టోర్ నుంచి కాదు మన ఊహల నుంచి మొదలవుతుంది' అంటారు. సిమ్రాన్ క్రియేటివిటీని చూస్తే 'నిజమే సుమీ' అనిపిస్తుంది. ఢిల్లీకి చెందిన కంటెంట్ క్రియేటర్ సిమ్రాన్ ఆనంద్ ఇరవై కిలోల బెడ్ షీట్‌ను ఆకట్టుకునే లెహంగాగా మార్చి ఔరా అనిపిస్తోంది.

'ఔట్‌ఫిట్ ఫ్రమ్ స్క్రాచ్' కాప్షన్‌తో ఒక వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది సిమ్రాన్.

'ఎందుకు ఇలా?' అనే ప్రశ్నకు ఆమె ఇచ్చిన జవాబు... 'బెడ్ షీట్‌లలో నాకు ఫ్యాషన్ కనిపించింది'

'లెహంగాగా మార్చడం ద్వారా దుప్పట్లకు సెకండ్ లైఫ్ కూడా ఇవ్వవచ్చు' అంటుంది సిమ్రాన్.

ఇక నెటిజనుల స్పందన విషయానికి వస్తే... 'దుప్పటితో లేహంగా ఏమిటీ!' అనే వెక్కిరింపుల కంటే...

'క్రియేటివ్ ఐడియా' అనే ప్రశంసలే ఎక్కువగా కనిపించాయి.

బులియన్

జూన్ 2న ముగింపు రూ.లలో (బంగారం 10 గ్రా.: వెండి కిలో)

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	97,110
బంగారం (22 క్యారెట్లు)	90,069
వెండి	99,500
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	98,670
బంగారం (22 క్యారెట్లు)	89,500
వెండి	1,00,100
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	97,910
బంగారం (22 క్యారెట్లు)	89,751
వెండి	1,01,090
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	98,670
బంగారం (22 క్యారెట్లు)	92,180
వెండి	1,00,100
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	96,250
బంగారం (22 క్యారెట్లు)	88,550
వెండి	98,600
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	97,630
బంగారం (22 క్యారెట్లు)	89,500
వెండి	1,11,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాక్షి సినిమా

మనసు నీకై రథమయ్యే రారా...


కమల్‌హాసన్

కమల్‌హాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వం వహించిన చిత్రం 'థగ్ లైఫ్'. శింబు, త్రిష, అభిరామి, నాజర్ ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. రాజ్‌కమల్ ఫిలింస్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, రెడ్ జెయింట్ మూవీస్ పతాకాలపై రూపొందిన ఈ చిత్రం ఈ నెల 5న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. తెలుగులో శ్రేష్ఠ్ మూవీస్‌పై ఎన్. సుధాకర్ రెడ్డి రిలీజ్ చేస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'విశ్వద నాయక...' అంటూ సాగే నాలుగో పాటని విడుదల చేశారు. 'విశ్వద నాయక.. విహిత వీరా... మనసు నీకై.. రథమయ్యే రారా...' అంటూ ఈ పాట సాగుతుంది. ''ఈ పాటలో కమల్‌హాసన్ క్యారెక్టర్ నేచర్, అభిరామి, త్రిష పాత్రల్లోని డైనమిక్స్‌ని లిరిక్ రైటర్ అనంత శ్రీరామ్ అద్భుతంగా ప్రజెంట్ చేశారు. ప్రశాంత్ వెంకట్ రాసిన ర్యాప్ ఈ పాటకు మరో స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచింది. అలెగ్జాండ్రా జాయ్ వండర్ ఫుల్ వోకల్స్ ఎమోషన్‌ని నావిగేట్ చేయగా, ఏఆర్ అమీన్ ర్యాప్ ఎనర్జీని మరింతగా పెంచింది'' అని చిత్రబృందం పేర్కొంది.

కుబేర ప్రేక్షకులకి నచ్చుతుంది

– నాగార్జున


నాగార్జున, ధనుష్

''చెన్నై ప్రేక్షకుల నుండి సంవత్సరాలుగా నాకు లభించిన ప్రేమకు కృతజ్ఞతలు. 'కుబేర'ని శేఖర్‌గారు అద్భుతంగా తీశారు. ఈ చిత్రం ప్రేక్షకులకి కచ్చితంగా నచ్చుతుంది. ఈ మూవీ తర్వాత రజనీకాంత్ గారి 'కూలీ' సినిమా ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేయడానికి రెడీగా ఉంది'' అని హీరో నాగార్జున అక్కినేని తెలిపారు. ధనుష్, నాగార్జున హీరోలుగా, రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటించిన చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో అమిగోస్ క్రియేషన్స్‌తో కలిసి ఎస్‌వీసీ ఎల్‌ఎల్‌పీపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్ రావు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదల కానుంది. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించిన 'కుబేర' ఆడియో లాంచ్ చెన్నైలో ఘనంగా జరిగింది. ఈ వేడుకలో ధనుష్ మాట్లాడుతూ–''కుబేర' కోసం తిరుపతిలో ఎండలో చెప్పులు లేకుండా, చిరిగిన బట్టలతో బిచ్చగాడిగా నటించడం మరచిపోలేను. ఆ అనుభవం జీవితంలోని ముఖ్యమైన సత్యాలను గుర్తు చేసింది'' అన్నారు. ''కుబేర' నా కెరీర్‌లో చాలా ప్రత్యేకమైన సినిమా'' అన్నారు రష్మికా మందన్నా. ''ధనుష్, నాగార్జునగారి నటన మెస్మరైజింగ్‌గా ఉంటుంది'' అని శేఖర్ కమ్ముల తెలిపారు. ''సినిమా చాలా అద్భుతంగా వచ్చింది.. గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు పుస్కూర్ రామ్‌మోహన్ రావు, సునీల్ నారంగ్. ఈ కార్యక్రమంలో దేవి శ్రీ ప్రసాద్, నిర్మాతలు జాన్వీ నారంగ్, భరత్ నారంగ్, సిమ్రాన్ నారంగ్, కెమేరామేన్ నికేత్ బొమ్మి, ప్రొడక్షన్ డిజైనర్ తోట తరణి, లిరిక్ రైటర్స్ వివేక, చంద్రబోస్, నంద కిషోర్ పాల్గొన్నారు.


'ఘాటి' పోస్టర్

జూలైలో ఘాటి

హీరోయిన్ అనుష్కాశెట్టి, దర్శకుడు క్రిష్ జాగర్లమూడి కాంబినేషన్‌లో రూపొందిన తాజా చిత్రం 'ఘాటి'. తమిళ నటుడు విక్రమ్ ప్రభు మరో లీడ్ రోల్ చేశారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించిన ఈ సినిమాని జూలై 11న విడుదల చేస్తున్నట్లు ప్రకటించి, పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రిలీజ్ కానున్న 'ఘాటి' సినిమాకు నాగవెల్లి విద్యా సాగర్ సంగీతం అందించగా, సాయి మాధవ్ బుర్రా డైలాగ్స్ రాశారు. వ్యాపార రంగంలో పైస్థాయికి వెళ్లాలనుకునే ఓ మహిళను కొందరు మోసం చేస్తారు. దీంతో ఆ మహిళ వారికి తగిన బుద్ధి చెప్పి, వ్యాపారంలో అత్యున్నత స్థాయికి ఎలా చేరుకుంటారు? అనే నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందని టాక్.

దీపావళికి తెలుసు కదా


సిద్ధు జొన్నలగడ్డ

సిద్ధు జొన్నలగడ్డ హీరోగా, రాశీ ఖన్నా, శ్రీనిధీ శెట్టి హీరోయిన్లుగా, వైవా హర్ష కీలక పాత్రలో నటిస్తున్న రొమాంటిక్ డ్రామా 'తెలుసు కదా'. ప్రముఖ స్టైలిస్ట్ నీరజా కోన దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, టీజీ కృతీ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాని దీపావళి పండుగ సందర్భంగా అక్టోబరు 17న రిలీజ్ చేయనున్నట్లు సోమవారం మేకర్స్ ప్రకటించారు. ''మనసును తాకేలా, ఊహించని మలుపులతో ఈ సినిమా ప్రేక్షకులను అలరిస్తుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

క్లైమాక్స్ చూసి భావోద్వేగం అవుతున్నారు

– రూపేశ్


పవన్ ప్రభ, రాజేంద్ర ప్రసాద్, రూపేశ్

''షష్టిపూర్తి' అనేది కల్చరల్ బ్లాక్ బస్టర్ కాదు.. కల్ట్ బ్లాక్ బస్టర్. 'పెళ్లి పుస్తకం' చిత్రం నుంచి 'షష్టిపూర్తి' వరకు ఏ నటుడికి దక్కని సినిమా ప్రయాణం నాకు దక్కింది. 'షష్టిపూర్తి' చూస్తూ ప్రేక్షకులు ఏడ్చేస్తున్నారంటేనే మేం విజయం సాధించినట్టు'' అని రాజేంద్ర ప్రసాద్ చెప్పారు. పవన్ ప్రభ దర్శకత్వంలో రాజేంద్ర ప్రసాద్, అర్చన, రూపేశ్, ఆకాంక్షా సింగ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'షష్టిపూర్తి'. రూపేశ్ నిర్మించిన ఈ సినిమా మే 30న విడుదలైంది. హైదరాబాద్‌లో నిర్వహించిన కల్చరల్ బ్లాక్‌బస్టర్ మీట్‌లో రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ–''విజయ, వాహినీ, ఏవీఎం వంటి గొప్ప ప్రొడక్షన్ కంపెనీల్లో పని చేసిన అనుభవంతో చెబుతున్నాను.. నిర్మాతగా రూపేశ్ గొప్ప స్థాయికి వెళ్తాడు. ఇలాంటి పాత్రలు నా చివరి శ్వాస వరకు చేయాలనుకుంటున్నాను'' అన్నారు. హీరో, నిర్మాత రూపేశ్ మాట్లాడుతూ–''షష్టిపూర్తి'ని ఇంతలా ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్. మా సినిమా క్లైమాక్స్ చూసి భావోద్వేగం అవుతున్నారు'' అని తెలిపారు. ''షష్టిపూర్తి' లాంటి మంచి చిత్రాలను ఆదరిస్తే నా లాంటి దర్శకులు, రూపేశ్ లాంటి నిర్మాతలు ఇంకా ముందుకు వస్తారు'' అన్నారు పవన్ ప్రభ. ఈ కార్యక్రమంలో కెమేరామేన్ రామ్, పాటల రచయిత చైతన్య ప్రసాద్ మాట్లాడారు.

తెలంగాణ కళాకారులకు అన్యాయం జరిగింది

– ప్రతాని రామకృష్ణగౌడ్


అమృత్ గౌడ్, రమేశ్ నాయుడు, ప్రతాని రామకృష్ణ, కిరణ్

''తెలంగాణ ప్రభుత్వం గద్దర్‌గారి పేరుతో అవార్డ్స్ ఇవ్వడం సంతోషంగా ఉంది. అయితే ఈ అవార్డు కమిటీ జ్యూరీకి మురళీ మోహన్, జయసుధలను చైర్మన్లుగా నియమించడం ఏంటో అర్థం కాలేదు. ఎఫ్‌డీసీ చైర్మన్‌గా 'దిల్' రాజు తన అధికారాలను దుర్వినియోగం చేశారు. తన వాళ్లకే అవార్డ్స్ ఇచ్చుకున్నారు. జ్యూరీ కమిటీలో ఉన్నవాళ్ల సినిమాలకు అవార్డ్స్ ఇవ్వకూడదనే నిబంధనలను పాటించ లేదు. థియేటర్స్ బంద్ విషయంలోనూ 'దిల్' రాజు ప్రమేయం ఉంది'' అని 'తెలంగాణ ఫిలిం చాంబర్' చైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ–''గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్'లో తెలంగాణ కళాకారులకు, సాంకేతిక నిపుణులకు అన్యాయం జరిగింది. జ్యూరీ కమిటీ సభ్యులు అన్ని సినిమాలు చూడలేదు. థియేటర్స్‌లో పర్సంటేజీ విధానం వల్ల గతంలో లాభాలు ఆర్జించిన డిస్ట్రిబ్యూటర్స్‌కు ప్రస్తుత విధానాల వల్ల నష్టాలు వస్తున్నాయి. 2002 వరకు థియేటర్స్‌లో పర్సంటేజీ విధానం ఉండేది. ఆ తర్వాత నిర్మాత డి. సురేష్ బాబులాంటి కొందరు తమ స్వార్థంతో అద్దె విధానాన్ని మొదలు పెట్టారు. ఆ తర్వాత నిర్మాతలు అల్లు అరవింద్, 'దిల్' రాజు, ఏషియన్ సునీల్.. లాంటి వాళ్లు సురేష్ బాబు బాటలోనే నడిచి థియేటర్స్‌ను తమ కబంధ హస్తాల్లో పెట్టుకున్నారు'' అన్నారు. ''గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్'లను ప్రభుత్వం పునః పరిశీలించాల్సిన అవసరం ఉంది'' అన్నారు టీఎఫ్‌సీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, నటుడు కిరణ్, తెలంగాణ డైరెక్టర్స్ యూనియన్ ప్రెసిడెంట్ రమేష్ నాయుడు, తెలంగాణ రైటర్స్ యూనియన్ ప్రెసిడెంట్ అమృత్ గౌడ్ కోరారు.

నాన్న అంటేనే దైవం


పృథ్వీ అంబర్, సాయికుమార్

''నాన్న అంటేనే మొదటి దైవం.. తను పోసిన ప్రాణమిది.. నాన్న అనగానే వాలే నీ ముందు.. అలుపెరుగని ప్రాణమిది.. మన కొరకే బతికే ప్రాణం.. మన బాధ్యత ఒకటే ధ్యానం'' అంటూ సాగుతుంది 'చౌకీదార్' సినిమాలోని 'నాన్న' యాంథమ్ పాట లిరికల్ వీడియో. పృథ్వీ అంబర్, ధన్యా రమ్యకుమార్ జంటగా, సాయికుమార్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'చౌకీదార్'. చంద్రశేఖర్ బండియప్ప దర్శకత్వంలో డా. కల్లహల్లి చంద్ర శేఖర్ నిర్మించారు. సచిన్ బస్రూర్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'నాన్న..' పాటను విడుదల చేశారు. ఈ పాటకు సంతోష్ వెంకీ సాహిత్యం అందించగా, విజయ్ ప్రకాష్ ఆలపించారు. త్వరలో సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నట్లుగా మేకర్స్ తెలిపారు.

డేంజర్ బాయ్స్


వికాస్, రాధా

వికాస్ ఉత్తయ్య, రాధా భగవతి, అశ్విన్ హాసన్, రాఘవ్ కొడబాద్రి, మిథున్ తీర్థహళ్లి ప్రధాన పాత్రల్లో నటించిన కన్నడ చిత్రం 'అపాయవీడి హెచ్చరిక'. అభిజిత్ తీర్థహళ్లి దర్శకత్వంలో వి.జి.మంజునాథ్, పూర్ణిమ ఎమ్.గౌడ్ నిర్మించిన ఈ చిత్రం కన్నడలో హిట్‌గా నిలిచింది. ఈ సినిమాను యశ్విని క్రియేషన్స్, గీతా ఫిలిమ్స్‌పై శ్రీరంగం సతీష్ కుమార్ తెలుగులో 'డేంజర్ బాయ్స్' టైటిల్‌తో త్వరలో విడుదల చేస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ్ 'డేంజర్ బాయ్స్' ఫస్ట్‌లుక్‌ని, దర్శక–నిర్మాత సాయివెంకట్ టీజర్‌ను, నిర్మాత టి.రామసత్యనారాయణ– జాతీయ మానవ హక్కుల కమిషన్ మెంబర్ సత్య వర్ధన్ ఈ సినిమా పాటలను రిలీజ్ చేశారు.

తొలిప్రేమ తోపేం కాదు!


శ్రీ గౌరీప్రియ, కిరణ్ అబ్బవరం

కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'చెన్నై లవ్ స్టోరీ' అనే టైటిల్ ఖరారు చేశారు. 'కలర్ ఫోటో', బేబి' చిత్రాల దర్శకుడు సాయి రాజేశ్ కథను అందిస్తున్న ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ గౌరీప్రియ హీరోయిన్. అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్‌పై సాయి రాజేశ్, ఎస్‌కేఎన్ నిర్మిస్తున్నారు. డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా చేతుల మీదుగా 'చెన్నై లవ్ స్టోరీ' అనే టైటిల్ ఫస్ట్ లుక్, గ్లింప్స్ రిలీజ్ చేశారు. 'ఫస్ట్ లవ్ ఫెయిలైతే బెస్ట్ లవ్ ఎక్కడో మొదలువుతుంది', 'తొలిప్రేమ అంత తోపేం కాదు' అంటూ కిరణ్ చెప్పే డైలాగులు గ్లింప్స్‌లో ఉన్నాయి.

సాక్షి బిజినెస్
మంగళవారం
3-6-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
77	34
81,374	24,717

విదేశీ సూచీలు

నాస్‌డాక్	19,174	△	60
డోజోన్స్	42,086	▽	184
ఎఫ్‌టీఎస్ఈ 100	8,774	△	2
డాక్స్	23,931	▽	67
హాంగ్‌సెంగ్ (శుక్రవారం ముగింపు)	3,347	▽	16
నికాయ్	37,461	▽	494

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.10	86.12
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	113.90	116.83
€	యూరో	ఎస్‌బీఐ	95.88	98.58
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.84	60.38
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.80	56.00
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	64.10	68.79
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.88	23.38
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.36	24.14
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.98	12.81

స్వల్ప నష్టాలతో సరి

- తొలుత 797 పాయింట్లు డౌన్
- చివరికి 77 పాయింట్లు మైనస్
- 81,374 వద్ద ముగిసిన సెన్సెక్స్



ముంబై: కనిష్ఠ స్థాయిల నుంచి కోలుకున్నా.., దేశీయ స్టాక్ సూచీలకు నష్టాలు తప్పలేదు. ఇంట్రాడేలో 797 పాయింట్లు క్షీణించిన సెన్సెక్స్ 77 పాయింట్లు నష్టంతో 81,374 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 34 పాయింట్లు కోల్పోయి 24,717 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాలతో సూచీలు నష్టాలతో మొదలయ్యాయి. ఇంట్రాడేలో నిఫ్టీ 225 పాయింట్లు కోల్పోయి 24,526 వద్ద కనిష్టాన్ని తాకింది. ఆర్బీఐ కీలక వడ్డీరేట్ల తగ్గింపు ఆశలతో తదుపరి లాభాల్లోకి మళ్లినప్పటికీ నష్టాల ముగింపు తప్పలేదు.

➤ బీఎస్ఈలో మిడ్, స్మాల్ క్యాప్ 0.58%, 0.36 శాతం లాభపడ్డాయి.

➤ నష్టాలతో లిస్టయిన ఏజిస్ వొపాక్ టెర్మినల్ షేరు అప్పర్ సర్క్యూట్ తాకింది. ఇష్యూ ధర రూ.235తో బీఎస్ఈలో 6.38% డిస్కౌంట్‌తో రూ.220 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో బౌన్స్‌బ్యాక్ అయ్యింది. 3% ఎగసి రూ.242 వద్ద అప్పర్ సర్క్యూట్ తాకి.. ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.26,808 కోట్లకు చేరింది.

➤ లిస్టింగ్ నష్టాలు భర్తీ చేసుకున్న ష్లాస్ బెంగళూరు షేరు స్వల్ప లాభంతో గట్టెక్కింది. బీఎస్ఈలో ఇష్యూ ధర రూ.435తో పోలిస్తే 6.55% డిస్కౌంట్‌తో రూ.406 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 7% క్షీణించి రూ.404 వద్ద కనిష్టాన్ని తాకింది. మిడ్ సెషన్ నుంచి బలపడి 1% లాభంతో రూ.439 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.14,546 కోట్లుగా నమోదైంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

3-6-2025	
విశాఖ	535-00
చిత్తూరు	613-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	510-00
విజయవాడ	525-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	525-00
వరంగల్	527-00
రిటైల్ ధర	5.85

ఈవీ మేకర్స్‌కు గుడ్ న్యూస్!

- దేశీయంగా తయారు చేస్తే.. ట్యాక్స్ తక్కువే!
- పెట్టుబడిని బట్టి సుంకం 15 శాతమే
- ఈవీల స్కీము విధివిధానాల నోటిఫికేషన్

దిగుమతి సుంకాల్లో భారీ తగ్గింపు



న్యూఢిల్లీ: విదేశీ ఎలక్ట్రిక్ వాహనాల కంపెనీలు కూడా దేశీయంగా తయారీ కార్యకలాపాలు చేపట్టేలా ప్రోత్సహించడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా పెట్టుబడుల పరిమాణం ఆధారంగా దిగుమతి సుంకాలను తగ్గించేలా కొత్త ఈవీ పాలసీ మార్గదర్శకాలను నోటిఫై చేసింది దీని ప్రకారం రూ. 4,150 కోట్ల వరకు స్థానికంగా ఎలక్ట్రిక్ ఫోర్ వీలర్ల తయారీపై ఇన్వెస్ట్ చేస్తే 8,000 వరకు ఈవీలను అత్యంత తక్కువగా 15 శాతం సుంకాలతో దిగుమతి చేసుకునేందుకు వీలవుతుంది. ప్రస్తుతం ఈ సుంకాలు 70–100 శాతం వరకు ఉన్నాయి. సదరు సంస్థలు అనుమతులు పొందిన నాటి నుంచి మూడేళ్లలోగా భారత్‌లో తయారీ ప్లాంట్ల కార్యకలాపాలు ప్రారంభించాల్సి ఉంటుంది. మరికొద్ది వారాల్లో ఈ స్కీముకు దరఖాస్తులను స్వీకరించే ప్రక్రియ ప్రారంభమవుతుందని, కనీసం 120 రోజుల పాటు ఇది అమల్లో ఉంటుందని అధికారులు తెలిపారు. భారీ పరిశ్రమల శాఖ గతేడాది మార్చి 15న ఈ స్కీమును ప్రకటించింది.


విధివిధానాల్లో కొన్ని..

ప్లాంటు ఏర్పాటు, యంత్ర పరికరాలు మొదలైన వ్యయాలకు స్కీము కింద పెట్టుబడుల ఆధారిత ప్రయోజనాలు లభిస్తాయి. స్థల సమీకరణ కోసం చేసిన వ్యయాలను పరిగణనలోకి తీసుకోరు. అప్లికేషన్ ఫారంతో పాటు దరఖాస్తుదారు రూ. 5,00,000 నాన్-రిఫండబుల్ ఫీజు చెల్లించాలి. ఆటోమోటివ్ తయారీకి సంబంధించి గ్లోబల్ స్థాయిలో గ్రూప్ ఆదాయం రూ. 10,000 కోట్లు దాటిన కంపెనీలకు ఈ స్కీము వర్తిస్తుంది.

గరిష్ఠంగా రూ. 6,484 కోట్ల వరకు సుంకాలపరమైన మినహాయింపు ఉంటుంది. కార్ల తయారీకి సంబంధించి తొలి మూడేళ్లలో దేశీయంగా జోడించే అదనపు విలువ కనీసం 25 శాతం ఉండాలి. అయిదేళ్లలో దీన్ని 50 శాతానికి పెంచుకోవాలి. చార్జింగ్ మౌలిక సదుపాయాలపై చేసే వ్యయాలను కూడా పెట్టుబడి కింద పరిగణిస్తారు. కంపెనీ హామీ ఇచ్చిన పెట్టుబడి మొత్తంలో ఇది 5 శాతం లోపు వరకు దీన్ని పరిగణనలోకి తీసుకుంటారు.

టెస్లాకు భారత్‌లో కార్ల తయారీపై ఆసక్తి లేదు..

కేంద్ర మంత్రి కుమారస్వామి వెల్లడి



న్యూఢిల్లీ: అమెరికన్ ఎలక్ట్రిక్ కార్ల దిగ్గజం టెస్లాకు భారత్‌లో షోరూమ్‌లను ప్రారంభించడంపైనే ఆసక్తి ఉంది తప్ప ఉత్పత్తి చేయడంపై లేదని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి తెలిపారు. ఈవీ పాలసీ మార్గదర్శకాల విడుదల కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ విషయం చెప్పారు. స్కీముకు సంబంధించిన తొలి విడత చర్చల్లో మాత్రమే టెస్లా ప్రతినిధులు పాల్గొన్నారని, రెండో .. మూడో విడత సంప్రదింపుల్లో పాల్గొనలేదని మంత్రి వివరించారు. మరోవైపు, మెర్సిడెస్ బెంజ్, స్కోడా-ఫోక్స్‌వ్యాగన్, హ్యుందాయ్, కియాలాంటి అంతర్జాతీయ దిగ్గజాలు మాత్రం భారత్‌లో తయారీపై ఆసక్తి కనపర్చాయని చెప్పారు.

చిన్న కార్ల విభాగాన్ని ఆదుకోవాలి

ప్రభుత్వానికి మారుతీ సుజుకీ వినతి



న్యూఢిల్లీ: కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ చిన్న కార్ల విభాగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతోంది. కారు కొనలేని కష్టమర్ల కోసం ప్రభుత్వం కొన్నిరకాల ప్రోత్సాహకాలు ప్రకటించవలసి ఉన్నట్లు కంపెనీ మార్కెటింగ్, సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ పేర్కొన్నారు. అందుబాటు ధరలు దూరంకావడంతో ఇటీవల చిన్న కార్ల విక్రయాలు తగ్గుతున్నట్లు విలేకరుల వర్చువల్ సమావేశంలో తెలియజేశారు. పెరిగిన నియంత్రణల కారణంగా చిన్న కార్ల ధరలు పెరిగిపోయినట్లు వెల్లడించారు. దీంతో ద్విచక్ర వాహనం నుంచి కారుకు అప్‌గ్రేడ్ కావాలనుకునే కస్టమర్లపై ప్రతికూల ప్రభావం పడుతున్నట్లు వివరించారు. రూ. 5 లక్షల ధరలోపు ఎంట్రీలెవల్ కార్ల విక్రయాలు 2016లో నమోదైన 9,34,538 యూనిట్ల నుంచి గతేడాది 25,402 వాహనాలకు పడిపోయినట్లు తెలియజేశారు.

గ్లోబల్ టెక్ దిగ్గజాల్లో రిలయన్స్

30 లిస్టెడ్ సంస్థల జాబితాలో ఏకైక భారతీయ కంపెనీ



న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్లలో ట్రేడవుతున్న 30 అంతర్జాతీయ టెక్నాలజీ దిగ్గజాల్లో దేశీ సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ చోటు దక్కించుకుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ట్రెండ్స్ పేరిట రూపొందించిన నివేదికలో భాగమైన లిస్టులో 23వ స్థానంలో నిల్చింది. తద్వారా భారత్ నుంచి ఈ జాబితాలో చోటు దక్కించుకున్న ఏకైక సంస్థగా నిల్చింది. కృత్రిమ మేధ సాంకేతికత వినియోగ ధోరణులు, ప్రభావంపై రూపొందించిన ఈ నివేదికలో మార్కెట్ క్యాపిటలైజేషన్‌పరంగా తొలి ఎనిమిది స్థానాల్లో అమెరికాకు చెందిన మైక్రోసాఫ్ట్, ఎన్‌విడియా, యాపిల్, అమెజాన్ తదితర సంస్థలు ఉన్నాయి. ఈ ఏడాది చైనా నుంచి 3 సంస్థలు, జర్మనీ కంపెనీలు 2, తైవాన్.. నెదర్లాండ్స్ .. దక్షిణ కొరియా.. భారత్ నుంచి ఒక్కో కంపెనీ చొప్పున తొలిసారిగా ఈ లిస్టులో చేరాయి.

అమెరికా టాప్.. అత్యంత విలువైన 30 గ్లోబల్ టెక్ కంపెనీల జాబితాలో మూడు దశాబ్దాలుగా అమెరికా ఆధిపత్యమే కొనసాగుతోంది. ఈ లిస్టులో 1995లో అమెరికా వాటా 53 శాతంగా ఉండగా 2025లో 70 శాతానికి పెరిగింది. 30 టాప్ కంపెనీల్లో 21 సంస్థలు అమెరికావే ఉన్నాయి. 1995లో జపాన్‌కి 30 శాతం వాటా ఉండగా ప్రస్తుతం అది సున్నా స్థాయికి పడిపోయింది.

రూ. 7,600 కోట్లతో అపోలో హాస్పిటల్స్ విస్తరణ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హెల్త్‌కేర్ దిగ్గజం అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్ సుమారు రూ. 7,600 కోట్ల పెట్టుబడులతో కార్యకలాపాలను భారీగా విస్తరిస్తోంది. ఇప్పటికే రూ. 2,000 కోట్లు ఇన్వెస్ట్ చేయగా, వచ్చే 3–4 ఏళ్లలో మిగతా మొత్తాన్ని పెట్టుబడి పెట్టనున్నట్లు సంస్థ తెలిపింది. నగదు నిల్వలు, అంతర్గత వనరుల నుంచి ఇందుకు అవసరమైన నిధులను సమకూర్చుకోనున్నట్లు వివరించింది. హైదరాబాద్, బెంగళూరు, గురుగ్రామ్, కోల్‌కతా, న్యూఢిల్లీలో కీలక ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని అపోలో హాస్పిటల్స్ తెలిపింది. కొత్తగా 4,300 పడకలను జోడించుకోనున్నట్లు వివరించింది. 2026 ఆర్థిక సంవత్సరంలో 2,000 బెడ్స్ అందుబాటులోకి వస్తాయని పేర్కొంది.

‘మే’లో తయారీ మందగమనం

మూడు నెలల కనిష్టానికి వృద్ధి



న్యూఢిల్లీ: దేశీ తయారీ రంగ వృద్ధి గత నెలలో మందగించింది. మూడు నెలల కనిష్టానికి చేరింది. హెచ్‌ఎస్‌బీసీ ఇండియా మాన్యుఫాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్(పీఎంఐ) మే నెలలో 57.6కు చేరింది. అంతకుముందు నెల ఏప్రిల్‌లో 58.2గా నమోదైంది. ఇందుకు ప్రధానంగా ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, డిమాండ్ నీరసించడం, భౌగోళిక రాజకీయ పరిస్థితులు ప్రభావం చూపాయి. పీఎంఐ 50కుపైగా నమోదైతే తయారీ రంగం వృద్ధిలో కొనసాగుతున్నట్లే. 50 దిగువకు చేరితే ప్రతికూల వృద్ధికి చేరినట్లు. అయితే మే నెలలో తయారీ రంగ వృద్ధి రేటు గత మూడు నెలల్లోనే కనిష్ఠంగా నమోదైనట్లు సర్వే పేర్కొంది.

యూపీఐ లావాదేవీల రికార్డ్

మే నెలలో రూ. 25.14 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: పేద, ధనిక తేడా లేకుండా స్మార్ట్‌ఫోన్ వినియోగదారులందరికీ అత్యంత చేరువైన యూపీఐ లావాదేవీలు గత నెలలో సరికొత్త రికార్డ్ నెలకొల్పాయి. మే నెలలో యూపీఐ లావాదేవీల విలువ రూ. 25.14 లక్షల కోట్లను తాకింది. 2024 మే నెలలో నమోదైన రూ. 20.44 లక్షల కోట్ల విలువైన లావాదేవీలతో పోలిస్తే వార్షికంగా 23 శాతం వృద్ధి నమోదైంది. అంతక్రితం నెల అంటే ఈ ఏప్రిల్‌లో నమోదైన రూ. 23.94 లక్షల కోట్లతో చూసినా వీటి విలువ 5 శాతం ఎగసింది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్(ఎన్‌పీసీఐ) విడుదల చేసిన తాజా గణాంకాలివి. పరిమాణంలోనూ లావాదేవీల సంఖ్య 1,789.3 కోట్ల నుంచి 1,867.7 కోట్లకు పెరిగింది. కాగా..రోజువారీ లావాదేవీల విలువ ఈ ఏప్రిల్‌తో చూస్తే రూ. 79,831 కోట్ల నుంచి రూ. 81,106 కోట్లకు బలపడింది.

కార్ల్‌సన్‌కు గుకేశ్ షాక్

క్లాసికల్ ఫార్మాట్‌లో తొలిసారి ప్రపంచ నంబర్‌వన్‌పై నెగ్గిన భారత గ్రాండ్‌మాస్టర్



స్టావెంజర్: మాగ్నస్ కార్ల్‌సన్... చెస్ గురించి తెలిసిన వారికి, క్రీడాభిమానులకూ సుపరిచితమైన పేరు... ప్రపంచ చదరంగంలో అతను 14 ఏళ్లుగా వరల్డ్ నంబర్‌వన్‌గా కొనసాగుతున్నాడు ... క్లాసికల్ ఫార్మాట్‌లో ఐదుసార్లు... ర్యాపిడ్ ఫార్మాట్‌లో ఐదుసార్లు... బ్లిట్జ్ ఫార్మాట్‌లో ఏకంగా ఎనిమిదిసార్లు విశ్వవిజేతగా నిలిచాడు. ఏమాత్రం చిన్న అవకాశం దొరికినా ఓటమి అంచుల్లో నుంచి విజయాన్ని అందుకోవడంలో దిట్ట. ఇలాంటి అసాధారణ నైపుణ్యమున్న ప్లేయర్‌తో గేమ్ ఆడుతూ ‘డ్రా’ చేసుకుంటే అది విజయంతో సమానం. ఇక నేరుగా గెలిస్తే అది పెద్ద సంచలనమే అవుతుంది. అలాంటి సంచలనమే నమోదు చేశాడు భారత యువ గ్రాండ్‌మాస్టర్, ప్రస్తుత ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్. ఆరుగురు మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య జరుగుతున్న నార్వే ఓపెన్ టోర్నీలో కార్ల్‌సన్‌పై గుకేశ్ చిరస్మరణీయ విజయాన్ని అందుకున్నాడు. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని... తన కెరీర్‌లో తొలిసారి క్లాసికల్ గేమ్‌లో కార్ల్‌సన్‌పై గెలిచాడు. ఆదివారం అర్ధరాత్రి దాటాక ముగిసిన ఆరో రౌండ్ గేమ్‌లో 19 ఏళ్ల గుకేశ్ తెల్ల పావులతో ఆడుతూ 62 ఎత్తుల్లో కార్ల్‌సన్ ఆట కట్టించాడు. నాలుగు గంటలపాటు జరిగిన ఈ గేమ్‌లో కార్ల్‌సన్ 52వ ఎత్తులో చేసిన తప్పిదాన్ని గుకేశ్ అనుకూలంగా మల్చుకొని సంచలన ఫలితం సాధించాడు. తనను ‘ఢీ’కొట్టే సరైన ప్రత్యర్థులు లేకపోవడంతో ప్రపంచ చాంపియన్‌షిప్‌పై ఆసక్తి కోల్పోయి కొన్నాళ్లుగా ఆ మెగా ఈవెంట్‌కు దూరంగా ఉంటున్న 34 ఏళ్ల కార్ల్‌సన్‌కు... భవిష్యత్‌లో గట్టి ప్రత్యర్థి కాగల సత్తా తనలో ఉందని గుకేశ్ నిరూపించుకున్నాడు.

అసహనంతో...



గుకేశ్ చేతిలో తొలిసారి ఓటమి చవిచూసిన కార్ల్‌సన్ పరాజయ భారాన్ని తట్టుకోలేకపోయాడు. ఊహించనిరీతిలో స్పందించాడు. తన నుంచి జరిగిన ఒక్క తప్పిదాన్ని అనుకూలంగా మల్చుకొని గుకేశ్ గెలుపు బాట పట్టడంతో కార్ల్‌సన్ ఆ కోపాన్నంతా తాము ఆడిన చెస్ బోర్డు టేబుల్‌పై చూపించాడు. తన పిడికిలితో ఒక్కసారిగా టేబుల్‌పై కార్ల్‌సన్ గట్టిగా కొట్టాడు. ఆ వెంటనే తమాయించుకున్న కార్ల్‌సన్ పావులను చెస్ బోర్డుపై అమర్చి... గుకేశ్‌కు వద్దకు వెళ్లి రెండుసార్లు సారీ చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కార్ల్‌సన్‌ను ఓడించిన తర్వాత గుకేశ్ కొన్ని క్షణాలపాటు షాక్‌లో ఉండిపోయి ఆ తర్వాత ఈ విజయాన్ని ఆస్వాదించాడు. ఆరో రౌండ్ తర్వాత గుకేశ్ 8.5 పాయింట్లతో సంయుక్తంగా మూడో స్థానంలో ఉన్నాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

మొదటి ట్రోఫీని ముద్దాడేందుకు...

ఐపీఎల్ 2008లో మొదలైంది... తొలి సీజన్... రెండు.... మూడు... నాలుగు... ఇలా చూస్తూ చూస్తూ 17 సీజన్లు గడిచిపోయాయి. కానీ ఒక్కసారైనా విజేతగా నిలవాలనే ఆ రెండు జట్ల కోరిక మాత్రం నెరవేరలేదు. ఇన్నేళ్లలో ఎంతో మంది ఆటగాళ్లు మారారు... కోచ్‌లు కొత్తగా వచ్చారు, వ్యూహాలూ మారాయి... వైఫల్యాలతో నిష్క్రమించిన ప్రతీసారి వచ్చే ఏడు మనదే అవుతుందనే ఆశతో మళ్లీ సున్నా నుంచి మొదలు పెట్టడం, ఆపై కీలక దశలో కుప్పకూలడం సాధారణంగా మారిపోయాయి తప్ప ఐపీఎల్ టైటిల్ ద్రాక్ష అందనే లేదు... ఒక టీమ్ ఈ ప్రయత్నంలో మూడుసార్లు తుది పోరుకు చేరి నిరాశతో వెనుదిరగ్గా... మరో జట్టు ఒకే ఒక్కసారి ఆఖరి మెట్టుకు చేరి చతికిలపడింది... ఇప్పుడు ఆ రెండు టీమ్‌లలో ఒకరికి ఉపశమనం దక్కే సమయం వచ్చింది. ఐపీఎల్ 18వ సీజన్‌లో కొత్త జట్టు చాంపియన్‌గా నిలవడం ఖరారైన నేపథ్యంలో తొలిసారి ఈ టైటిల్‌ను ఎవరు అందుకుంటారనేది ఆసక్తికరం. మొదటి ట్రోఫీ వేటలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), పంజాబ్ కింగ్స్ జట్లు నేడు జరిగే ఫైనల్ మ్యాచ్‌లో సర్వశక్తులూ ఒడ్డనున్నాయి.

- బెంగళూరు, పంజాబ్ కింగ్స్ మధ్య ఆఖరి పోరు
- నేడు ఐపీఎల్-18 సీజన్ ఫైనల్
- గెలిచిన టీమ్‌కు తొలి టైటిల్



శ్రేయస్ అయ్యర్
రజత్ పాటీదార్

రాత్రి 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

అహ్మదాబాద్: ఐపీఎల్-18 సీజన్‌లో 73 హోరాహోరీ మ్యాచ్‌ల తర్వాత ఈ ఏడాది విజేతను తేల్చే అసలు సమరానికి అంతా సిద్ధమైంది. నరేంద్ర మోదీ స్టేడియంలో నేడు జరిగే ఫైనల్ మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), పంజాబ్ కింగ్స్ జట్లు తలపడనున్నాయి. లీగ్ దశలో ప్రదర్శనను చూస్తే ఇరు జట్లు సమ ఉజ్జీలుగా కనిపించాయి. రన్‌రేట్ కారణంగా పంజాబ్ మొదటి స్థానంలో, బెంగళూరు రెండో స్థానంలో నిలిచినా... రెండు టీమ్‌లూ సమంగా తొమ్మిదేసి విజయాలు సాధించి 19 పాయింట్లతో నిలిచాయి. ‘ప్లే ఆఫ్స్’కు ముందు ప్రత్యర్థులుగా తలపడిన మ్యాచ్‌లలో ఇరు జట్లు ఒక్కో విజయాన్ని అందుకోగా... క్వాలిఫయర్-1లో పంజాబ్‌ను చిత్తు చేసి బెంగళూరు పైచేయి సాధించింది. ఈ నేపథ్యంలో ఆఖరి పోరులో గెలిచి పంజాబ్ లెక్క సరి చేస్తుందా లేదా ఆర్‌సీబీ ఆధిత్యం కొనసాగుతుందా చూడాలి. మొత్తంగా ఎవరు గెలిచినా తొలి ట్రోఫీతో సంబరాలు అంబరాన్ని తాకడం ఖాయం.

సమష్టి ప్రదర్శనతో...

ఐపీఎల్‌లో ఆర్‌సీబీ 2016లో ఆఖరిసారిగా ఫైనల్ చేరింది. ఆ మ్యాచ్‌లో ఓటమి తర్వాత ఆడిన ఎనిమిది సీజన్లలో జట్టు ప్రదర్శన అంతంత మాత్రమే. ముఖ్యంగా ఎవరో ఒక ఆటగాడి ప్రదర్శనపైనే ఆధారపడటం, అతను విఫలమైతే జట్టు కుప్పకూలడం తరచుగా సాగాయి. కానీ ఈ సీజన్ పూర్తి భిన్నంగా కనిపించింది. జట్టు పది మ్యాచ్‌లు గెలిస్తే తొమ్మిది మంది వేర్వేరు ఆటగాళ్లు ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’లుగా నిలిచారు. ఒకరు విఫలమైతే మరొకరు ఆదుకోవడంతో కీలక సమయాల్లో కూడా జట్టు పట్టు వీడలేదు. ఇప్పుడు అదే శైలి, పోరాటతత్వం బెంగళూరును ఫైనల్‌కు చేర్చాయి. ఎప్పటిలాగే స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లి 600కు పైగా పరుగులు, 8 అర్ధసెంచరీలతో జట్టుకు చుక్కానిలా నిలిచాడు. అతని ఓపెనింగ్‌లో సరైన జోడీగా ఫిల్ సాల్ట్ 387 పరుగులతో శుభారంభాలు అందించాడు. మిగతా బ్యాటర్లలో షెఫర్డ్, జితేశ్, కృనాల్ పాండ్యా కూడా ప్రభావవంతమైన ఇన్నింగ్స్‌లు ఆడారు. కెప్టెన్ పాటీదార్ గత ప్రదర్శనలతో పోలిస్తే ఈసారి అంత అద్భుతంగా ఆడకపోయినా... కెప్టెన్‌గా తొలి సీజన్‌లో జట్టును ఫైనల్ చేర్చిన ఘనత అతనికి దక్కింది. మైదానంలో కోహ్లి అనుభవం, సూచనలు అండగా ఉన్న పాటీదార్ నాయకత్వంలో టీమ్ టైటిల్ గెలిస్తే ఆర్‌సీబీ అభిమానుల కోరిక నెరవేర్చిన ప్రత్యేక వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోతాడు. బౌలింగ్‌లో కూడా టీమ్ పటిష్టంగా కనిపిస్తోంది. జట్టు బౌలింగ్ సత్తా తొలి క్వాలిఫయర్‌లో పంజాబ్‌పైనే కనిపించింది. ముఖ్యంగా హాజల్‌వుడ్ ఆస్ట్రేలియా నుంచి తిరిగి రావడం ఒక్కసారిగా జట్టు బలాన్ని పెంచింది. 21 వికెట్లతో అతను టీమ్ విజయాల్లో కీలకపాత్ర పోషించగా... భువనేశ్వర్, యశ్ సహకరించారు.

ఆ నలుగురితో కలిసి...

తొలి క్వాలిఫయర్ మ్యాచ్‌ను మినహాయిస్తే సీజన్ ఆసాంతం పంజాబ్ ప్రదర్శన అద్భుతంగా సాగింది. ముఖ్యంగా రెండో క్వాలిఫయర్‌లో ముంబైని చిత్తు చేసిన తీరు ఆ జట్టు సామర్థ్యాన్ని చూపించింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తన అసాధారణ బ్యాటింగ్‌తో 600కు పైగా పరుగులు చేయడంతో పాటు సమర్థ నాయకత్వంతో జట్టును ముందుండి నడిపిస్తున్నాడు. ఇద్దరు విదేశీ బ్యాటర్లు ఇన్‌గ్లిస్, స్టొయినిస్‌లకు కీలక సమయాల్లో ఒత్తిడిని దాటి చెలరేగిపోగల నైపుణ్యం ఉంది. అయితే పంజాబ్ విజయాల్లో కీలక పాత్ర మరో నలుగురు బ్యాటర్లు పోషిస్తున్నారు. వీరంతా జాతీయ జట్టుకు ఆడని ‘అన్‌క్యాప్డ్’ ఆటగాళ్లే కావడం విశేషం. ఓపెనర్లు ప్రియాన్ష్, ప్రభ్‌సిమ్రన్‌తో పాటు వధేరా, శశాంక్ రాణిస్తే కింగ్స్‌కు తిరుగుండదు. పంజాబ్ బౌలింగ్‌లో కాస్త తడబాటు కనిపిస్తోంది. అర్ష్‌దీప్ ఆశించిన స్థాయిలో సరైన ఆరంభాలు ఇవ్వడం లేదు. జేమీసన్ మెరుగ్గా ఉన్నా, మూడో పేసర్ అజ్మతుల్లా బౌలింగ్ సాధారణంగానే ఉంది. చహల్ స్పిన్ మరోసారి కీలకం కానుంది. ఫైనల్ ఒత్తిడిని అధిగమిస్తే పంజాబ్‌కు గెలుపు కష్టం కాబోదు.

తుది జట్ల వివరాలు (అంచనా)

బెంగళూరు: రజత్ పాటీదార్ (కెప్టెన్), కోహ్లి, సాల్ట్, మయాంక్ అగర్వాల్, లివింగ్‌స్టోన్, జితేశ్ శర్మ, షెఫర్డ్, భువనేశ్వర్, కృనాల్ పాండ్యా, యశ్ దయాళ్, హాజల్‌వుడ్.

పంజాబ్: శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్, ఇన్‌గ్లిస్, నేహల్ వధేరా, స్టొయినిస్, శశాంక్ సింగ్, అజ్మతుల్లా, చహల్, జేమీసన్, అర్ష్‌దీప్ సింగ్.

పిచ్, వాతావరణం

సీజన్ ఆరంభం నుంచి భారీ స్కోర్లు నమోదయ్యాయి. రెండో క్వాలిఫయర్ తరహాలోనే టాస్ గెలిచిన జట్టు ఛేదనకే మొగ్గు చూపవచ్చు. వర్ష సూచన ప్రస్తుతానికి లేదు కానీ వాన వస్తే అదనపు సమయంతో పాటు బుధవారం రిజర్వ్ డే కూడా ఉంది.



ఒక వస్తువు కావాల్సి వచ్చి ఆన్‌లైన్‌లో వెతికేటప్పుడు.. ఆ ఉత్పాదన తాలూకు పేజీలో 'ఒకటి మాత్రమే ఉంది', '10 నిమిషాల్లో కొంటే భారీ డిస్కౌంట్', 'ఫ్లాష్ డీల్ ఈ రోజు వరకే' వంటి సందేశాలు దర్శనమిస్తాయి. అవి నిజమనుకుని నమ్మి కస్టమర్లు వెంటనే కొనేస్తారు. అమ్మకాలను పెంచుకోవడమే లక్ష్యంగా చేసే ఈ మాయాజాలాన్ని 'డార్క్ ప్యాటర్న్స్' అని పిలుస్తారు. ఈ-కామర్స్ కంపెనీలు పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో ఆర్భాటంగా నిర్వహించే 'ఆన్‌లైన్ సేల్స్' సమయంలో ఈ మాయాజాలం విభిన్న రూపాల్లో 'స్క్రీన్'పైన దర్శనమిస్తుంది.

- సాక్షి, స్పెషల్ డెస్క్

డీల్ కాదు.. జేబు ఖాళీ!

ఓ సర్వే ప్రకారం కొనాలన్న ఆలోచన లేనప్పటికీ డార్క్ ప్యాటర్న్స్ కారణంగా ఆకర్షితులై 40% కంటే ఎక్కువ మంది వినియోగదారులు వస్తువులను కొనుగోలు చేస్తున్నారట. షాపింగ్ వెబ్‌సైట్ల తప్పుదారి పట్టించే, మోసపూరిత, చట్టవిరుద్ధ వ్యూహాలే ఇందుకు ప్రధాన కారణం. ఈ-కామర్స్, క్విక్ కామర్స్ కంపెనీలు వివిధ రకాల డార్క్ ప్యాటర్న్స్‌తో కస్టమర్లను ఆకర్షిస్తున్నాయి. తీరా చూస్తే తాము ఎక్కువ ఖర్చు చేశామనో.. లేదా అంతగా ఉపయోగకరం కాని ఉత్పత్తులను కొన్నామనో వినియోగదారులు తరువాత తెలుసుకుంటున్నారు. ఆన్‌లైన్ కస్టమర్లు తమకు కావాల్సిన వస్తు, సేవలను వేగంగా, సౌకర్యంగా పొందడం కోసం తరచూ డబ్బు, సమాచారం, గోప్యతతో రాజీ పడుతున్నారనేది నగ్న సత్యం.

ఈ-కామర్స్ కంపెనీల మాయాజాలం
'డార్క్ ప్యాటర్న్స్'తో గాలం
అవసరం లేకపోయినా కొనిపించేలా ఎత్తులు
రంగంలోకి కేంద్ర వినియోగదారుల మంత్రిత్వ శాఖ

ఒకటికి రెండుసార్లు..

ఏ వెబ్‌సైట్ ఉపయోగిస్తున్నా, సర్వీస్ ప్రొవైడర్‌ను ఎంతగా విశ్వసించినా మీ నుండి ఏ సమాచారం అడుగుతున్నారు, ఎటువంటి అనుమతులు కోరుతున్నారు అనే అంశాలపై వినియోగదార్లు అప్రమత్తంగా ఉండాలి. స్క్రీన్‌పై ఉన్న సమాచారాన్ని జాగ్రత్తగా చదవాలి. 'బై' బటన్ క్లిక్ చేసే ముందు మీకు కావాల్సింది మాత్రమే అక్కడ ఉందో లేదో ఒకటికి రెండుసార్లు గమనించాలి. ఆన్‌లైన్ సేవల కోసం సైన్ అప్ చేసే ముందు అన్ని సమయాల్లో రద్దు చేసుకునేందుకు స్పష్టమైన, కచ్చిత అవకాశం ఉందా లేదా నిర్ధారించుకోవాలి.

కనీసం ఒకటి..

అడ్వర్టైజింగ్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా-2024 నివేదిక ప్రకారం.. అత్యధికంగా డౌన్‌లోడ్ అయిన టాప్-53 భారతీయ యాప్స్‌లో ఒకటి మినహా మిగిలినవన్నీ కనీసం ఒక డార్క్ ప్యాటర్న్ ఉపయోగించాయట. లోకల్ సర్కిల్స్ నిర్వహించిన సర్వే ప్రకారం దాదాపు 50% భారతీయ వినియోగదారులు ఆన్‌లైన్ చెల్లింపుల సమయంలో కనీసం ఒక డార్క్ ప్యాటర్న్ సమస్యను ఎదుర్కొన్నారట.

రంగంలోకి కేంద్ర ప్రభుత్వం

ఈ-కామర్స్ సంస్థలు అనుసరిస్తున్న ఈ మోసపూరిత విధానాల పట్ల వినియోగదారులు, ఆఫ్‌లైన్ ట్రేడర్ల నుంచి దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఫిర్యాదులు వెల్లువెత్తడంతో కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఉత్పత్తులు పరిమితంగా ఉన్నాయని బుకాయించడం, పేమెంట్ చేసే సమయానికి అదనపు ఛార్జీ, నకిలీ కౌంట్‌డౌన్ టైమర్స్, ఒక వస్తువు చూపించి మరొకటి అంటగట్టడం, లావాదేవీ రద్దు చేసే అవకాశం లేకపోవడం, యూజర్ కోరకున్నా ప్రకటనల వీడియో ప్లే కావడం, తప్పుడు రివ్యూలు, పోల్చుకునే అవకాశం లేకపోవడం వంటి 13 రకాల డార్క్ ప్యాటర్న్స్‌ను గుర్తించింది. నిబంధనలను పాటించకపోతే చట్ట పరంగా చర్యలు ఉంటాయని ఈ-కామర్స్ కంపెనీలను వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. వినియోగదారుల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే, అనాలోచిత కొనుగోళ్లు, చర్యలకు దారితీసే తప్పుదారి పట్టించే డార్క్ ప్యాటర్న్స్‌ను తొలగించడానికి చేసిన మార్పులను వివరిస్తూ అంతర్గత వార్షిక తనిఖీ నివేదికలను మంత్రిత్వ శాఖకు సమర్పించాలని కంపెనీలకు స్పష్టం చేసింది.

విదేశాల్లో చట్టాలు

భారత్‌లో ఇప్పటివరకు ఈ పద్ధతిని నిషేధించే నిర్దిష్ట చట్టాలు లేవు. వినియోగదారుల రక్షణ చట్టం-2019 ప్రకారం అన్యాయమైన వాణిజ్య పద్ధతులుగా గుర్తిస్తూ డార్క్ ప్యాటర్న్స్‌ను అరికట్టడానికి కేంద్ర వినియోగదారుల పరిరక్షణ సంస్థ (సీసీపీఏ) 2023 నవంబర్‌లో మార్గదర్శకాలను జారీ చేసింది. అమెరికా, ఈయూ తదితర దేశాల్లో దీనికి సంబంధించి చట్టాలు అమలులోనూ ఉన్నాయి. వినియోగదారులు కుకీజ్‌ను అంగీకరించడం కంటే తిరస్కరించడం కష్టతరం చేసినందుకు గూగుల్, ఫేస్‌బుక్ రెండింటికీ ఈయూ, ఫ్రెంచ్ డేటా రక్షణ చట్టాల ప్రకారం 2022లో జరిమానా విధించారు.

డార్క్ ప్యాటర్న్స్‌కు సంబంధించి వినియోగదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్‌లు/వేదికలు
- జాగృతి యాప్
- జాగో గ్రాహక్ జాగో యాప్
- జాగృతి డ్యాష్‌బోర్డ్

కొన్ని డార్క్ ప్యాటర్న్స్

తొందరపెట్టడం (ఫాల్స్ అర్జెన్సీ)
ఉదా: 'కేవలం రెండే ఉన్నాయి', 'మరో 50 నిమిషాల్లో కొంటేనే భారీ డిస్కౌంట్' అని వినియోగదారులను ఆలోచించుకో నివ్వకపోవడం



అదనపు బరువు అంటగట్టడం (బాస్కెట్ స్నీకింగ్)
ఉదా: విమాన టికెట్ కొన్నప్పుడు.. వినియోగదారుడికి తెలియకుండానే ప్రయాణ బీమాను అంటగట్టడం

కించపరిచి.. పబ్బం గడుపుకొని (కన్ఫర్మ్ షేమింగ్)
ఉదా: వస్తువు కొనేటప్పుడు మొత్తం కింద 'చారిటీ' అని పెట్టి 'ధనవంతులకే దానాలు. నేను చేయను'; విమాన టికెట్లు కొనేటప్పుడు బీమా కూడా చేర్చి 'నాకు రక్షణ అక్కర్లేదు' వంటివి పెట్టడం

షరతులతో.. (ఫోర్స్‌డ్ యాక్షన్)
ఉదా: ఒక వినియోగదారుడు ఎక్స్ అనే యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే.. దాన్ని తెరవాలంటే వై అనే మరో యాప్ కూడా డౌన్‌లోడ్ చేయాలని షరతులు పెట్టడం. అది చేసేవరకూ ఎక్స్ ఓపెన్ కాకపోవడం

సబ్‌స్క్రైబింగ్ వల
ఉదా: ఒక వస్తువు కొనే సమయంలో ఆటో డెబిట్ వంటివి ప్రతిసారీ వచ్చేలా చేయడం. పెయిడ్ సబ్‌స్క్రిప్షన్ క్యాన్సిల్ చేసే ప్రక్రియ చాలా సంక్లిష్టంగా ఉండటం




తప్పుదారి పట్టించేలా.. (ఇంటర్‌ఫేస్ ఇంటర్‌ఫియరెన్స్)
ఉదా: ఏదైనా కొనేటప్పుడు లేదా వద్దనుకున్నప్పుడు 'యస్', 'నో'లలో.. నో అనే పదాన్ని లైట్ కలర్‌లో కనిపించీ కనిపించనట్టు చేయడం

వలవేసి.. వేరే చేసి (బెయిట్ అండ్ స్విచ్)
ఉదా: ఒక వస్తువును తక్కువ ధరకు చూపించి, తీరా పేమెంట్ చేసే సమయానికి ఆ వస్తువు కనిపించకుండా పోవడం. అలాగే కనిపించే ఎక్కువ ధర ఉండే వస్తువు ప్రత్యక్షం కావడం

మోసపూరిత ధర (డ్రిప్ ప్రైసింగ్)
ఉదా: చెస్ ఆడటానికి ఒక యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే.. మొదట ఉచితం అని చూపించి, వారం రోజుల తరువాత.. డబ్బులు చెల్లిస్తేనే తప్ప ఆడలేరు అని చెప్పడం.

ప్రకటన అని తెలియకుండా..
ఉదా: మరొక యాప్‌నకు సంబంధించిన ప్రకటన.. ఇప్పుడు చూసే పేజీలో ఉండటం, దాన్ని నొక్కితే అనూహ్యంగా ఆ యాప్‌లోకి వెళ్లిపోవడం లేదా ప్రకటనలను ప్రకటనల్లా కాకుండా కంటెంట్‌లానో మరోలానో ఇవ్వడం

పదేపదే వేధించడం
ఉదా: పదే పదే తమ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని వెబ్‌సైట్లు అడగడం, ఫోన్ నంబర్లు అడగడం, 'నోటిఫికేషన్లు' ఆన్ చేయాలని బలవంతపెట్టడం.. నో చెప్పేందుకు నో బటన్ స్పష్టంగా కనిపించకపోవడం.



క్లుప్తంగా...

కాకాణి బెయిల్ పిటిషన్‌పై నేడు విచారణ



నెల్లూరు (లీగల్): పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులో వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై దాఖలైన బెయిల్ పిటిషన్‌పై 5వ అదనపు జిల్లా (ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ) కోర్టులో సోమవారం జరగవలసిన విచారణను న్యాయమూర్తి ఎస్.సరస్వతి మంగళవారానికి వాయిదా వేశారు. ఇదే కేసులో కాకాణిని పోలీస్ కస్టడీకి కోరుతూ పోలీసుల తరఫున స్పెషల్ ఏపీపీ కేదారనాథ్ దాఖలు చేసిన పిటిషన్ విచారణ కూడా న్యాయమూర్తి మంగళవారానికి వాయిదా వేశారు.

రాజ్ కేసిరెడ్డి బెయిల్ పిటిషన్‌పై కౌంటర్

విజయవాడలీగల్: మద్యం విధానంపై నమోదైన అక్రమ కేసులో అరెస్టై విజయవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న రాజ్ కేసిరెడ్డి బెయిల్ పిటిషన్‌ను ఏసీబీ కోర్టు న్యాయమూర్తి సెలవు కావడంతో ఇన్‌చార్జి సీబీఐ న్యాయస్థానం న్యాయమూర్తి సోమవారం విచారణ జరిపారు. కౌంటర్ దాఖలుచేయాలని పోలీసులను ఆదేశిస్తూ విచారణను 4వ తేదీకి వాయిదావేశారు.

చాణక్య బెయిల్ పిటిషన్‌పై విచారణ..
ఇదే కేసులో అరెస్టైన చాణక్య బెయిల్ పిటీషన్‌ను ఇన్‌చార్జి సీబీఐ కోర్టు న్యాయమూర్తి విచారణ జరిపారు. కౌంటర్ దాఖలుచేయాలని పోలీసులను ఆదేశిస్తూ విచారణను 5వ తేదీకి వాయిదావేశారు.

రేపు రాష్ట్ర వ్యాప్తంగా 'వెన్నుపోటు దినం'

- శాంతియుత ర్యాలీలకు అనుమతివ్వాలంటూ రాష్ట్ర డీజీపీకి వైఎస్సార్‌సీపీ లేఖ

సాక్షి, అమరావతి: టీడీపీ కూటమి ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చక పోవడంతో పాటు, అన్ని రంగాల్లో విఫలమైన ప్రభుత్వంపై ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం బుధవారం (4వ తేదీ) నిర్వహించతలపెట్టిన రాష్ట్ర వ్యాప్త శాంతియుత ర్యాలీలకు అనుమతి ఇవ్వాలంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర డీజీపీకి లేఖ రాసింది. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరుతో విడుదలైన లేఖలో ముఖ్యాంశాలు ''వెన్నుపోటు దినం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుత ర్యాలీలు నిర్వహించి, ఆయా చోట్ల ఉన్నతాధికారులకు వినతి పత్రాలు సమర్పిస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెల్లడించింది. ఈ కార్యక్రమం కోసం ముందస్తు అనుమతి కోరుతూ, చాలా రోజులకు ముందే స్థానికంగా ఆయా పోలీస్ స్టేషన్లలో దరఖాస్తు చేసినా, ఇప్పటి వరకు ఏ నిర్ణయం తీసుకోకుండా తాత్సారం చేస్తున్నారు. నిరంకుశంగా వ్యవహరిస్తూ, మా పార్టీ కార్యక్రమం నిర్వహించకుండా చేయాలని చూస్తున్నారు. ఇది కచ్చితంగా ఇండియన్ పోలీస్ యాక్ట్, సెక్షన్- 30 ఉల్లంఘన కిందకే వస్తుంది. ప్రధాన విపక్షంగా ప్రజాస్వామ్య పద్ధతిలో పూర్తి శాంతియుతంగా తాము తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త 'వెన్నుపోటు దినం' కార్యక్రమానికి చట్ట ప్రకారం అనుమతి ఇవ్వాల్సి ఉన్నా, స్థానిక పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ, మా విజ్ఞప్తిని పట్టించుకోవడం లేదు. ప్రజలంతా స్వచ్ఛందంగా పాల్గొనేలా, తాము ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా నిర్వహించే ర్యాలీలకు స్థానికంగా పోలీసు అధికారులు అనుమతి ఇచ్చేలా ఆదేశం చాలివ్వాలని వైఎస్సార్‌సీపీ కోరుతోంది.

'వెన్నుపోటు దినం'ను విజయవంతం చేద్దాం

- ఎక్కడైనా అడ్డంకులు కల్పిస్తే న్యాయస్థానాల ద్వారా అధిగమిద్దాం
- ప్రజాస్వామ్య పద్ధతిలో ర్యాలీలు ప్రశాంతంగా నిర్వహించి అధికారులకు వినతిపత్రాలివ్వాలి
- ప్రభుత్వం అణిచివేసే ప్రయత్నంచేస్తే మీడియా ద్వారా ప్రజలకు వివరిద్దాం
- వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి



సాక్షి, అమరావతి : టీడీపీ కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించేందుకు ఈనెల 4న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన 'వెన్నుపోటు దినం' నిరసన కార్యక్రమాన్ని ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించి.. విజయవంతం చేద్దామని వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. కేవలం ప్రజల ఆవేదన ప్రభుత్వానికి తెలియజేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం అనే విషయాన్ని ప్రజలకు స్పష్టంగా చెప్పాలన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజనల్ కోఆర్డినేటర్లు, పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు, రాష్ట్ర కార్యదర్శులతో సోమవారం ఆయన తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమం విజయవంతంపై దిశానిర్దేశం చేశారు. సజ్జల ఇంకా ఏమన్నారంటే..

ప్రశాంతంగా ర్యాలీలు నిర్వహించాలి..
ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అడ్డుకుంటే దానికి తగిన విధంగా వ్యవహరిద్దాం. ఎక్కడైనా అడ్డంకులు కల్పిస్తే న్యాయస్థానాల ద్వారా అధిగమిద్దాం. మనం ముందుగా అనుకున్న విధంగా ర్యాలీలు నిర్వహించి ప్రభుత్వ అధికారులకు వినతిపత్రం అందజేద్దాం. దీనిని అణిచివేసే ప్రయత్నం చేసినా మీడియా ద్వారా ప్రజలకు వివరిద్దాం. ప్రశాంతంగా ర్యాలీలు నిర్వహించి డిమాండ్ల పత్రాన్ని అధికారులకు అందజేసి కార్యక్రమాన్ని జయప్రదం చేద్దాం. సీనియర్ నాయకులంతా అందుబాటులో ఉంటారు.

అడ్డుకుంటే లీగల్ సెల్‌ను సంప్రదించాలి..
వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడు వైవీ సుబ్బారెడ్డి, మాజీమంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. అసెంబ్లీ కోఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరితోనూ ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నామని చెప్పారు. ఎక్కడైనా ఈ కార్యక్రమాన్ని అడ్డుకునే ప్రయత్నంచేస్తే పార్టీ కేంద్ర కార్యాలయంలోని లీగల్ సెల్‌ను సంప్రదించాలన్నారు. పార్టీ ఇచ్చిన సూచనల ప్రకారం అందరూ ముందుకెళ్లాలని.. ఎక్కడైనా సమస్య వస్తే వెంటనే దానికి తగిన విధంగా స్పందిస్తామని మాజీమంత్రి కారుమూరి నాగేశ్వరరావు చెప్పారు.

రాష్ట్రంలో ఆటవిక పాలన

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): ఆటవిక దేశాల్లోని నియంతల పాలనలో సాగే అరాచకాలన్నీ ఏపీలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. గుంటూరు జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న మాజీ ఎంపీ నందిగం సురేష్, పార్టీ నేత తురకా కిషోర్‌ను సోమవారం ఆయన పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. మాజీ ఎంపీ నందిగం సురేశ్‌పై 12 కేసులు నమోదు చేశారని, తప్పుడు కేసులో అరెస్ట్ చేసి జైలుకు తరలించారన్నారు. పార్టీ నేత తురకా కిషోర్‌పై గతంలో జరిగిన ఘటనలకు బాధ్యుడిగా అరెస్ట్ చూపారన్నారు. నెల్లూరు జిల్లాలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపించారని అన్నారు. దీనిపై ఇద్దరు ఎమ్మెల్సీలు, కాకాణి కుమార్తె జిల్లా కలెక్టర్‌ను కలిసేందుకు వెళ్లగా.. వారిపైనా కేసులు పెట్టారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఆరోగ్య పరిస్థితి దారుణంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు పల్నాడు జిల్లాలో హరికృష్ణను అరెస్ట్ చేసి స్టేషన్లో చిత్రహింసలకు గురి చేశారని సజ్జల తెలిపారు. ఆయన వెంట మాజీ మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజిని, మేరుగ నాగార్జున, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఉన్నారు.

తెనాలి ఘటనలో ఎస్పీ, సీఐలను తొలగించాలి

మాజీ ఎంపీ హర్షకుమార్ డిమాండ్



సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులే చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దారుణంగా ప్రవర్తిస్తున్నారని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ మండిపడ్డారు. రాజమహేంద్రవరంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రెండు రోజుల వ్యవధిలో తెనాలిలో జరిగిన రెండు ఘటనలకు పోలీసులే బాధ్యత వహించాలన్నారు. పోలీసులు సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునేలా, మానవత్వం లేకుండా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. తెనాలిలో యువకులను దారుణంగా కొట్టిన సంఘటనలో కారకులైన ఎస్పీని, ఇద్దరు సీఐలను వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అలాగే, పోలీసులు తీవ్రంగా వేధించడంతో మహారాష్ట్రకు చెందిన బంగారం వ్యాపారి సిద్ధేష్ జెన్నై ఆత్మహత్య చేసుకున్న వ్యవహారంపైనా హైకోర్టు సుమోటోగా కేసు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

డీఎస్సీ-2025 నిలుపుదలకు హైకోర్టు నిరాకరణ

ప్రస్తుత దశలో మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమన్న ధర్మాసనం



సాక్షి, అమరావతి: డీఎస్సీ-2025 నోటిఫికేషన్‌కు అనుగుణంగా ఈ నెల 6న నిర్వహించనున్న రాత పరీక్షతో పాటు తదుపరి చర్యలన్నింటినీ నిలుపుదల చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. స్టే కోసం పలువురు అభ్యర్థులు దాఖలు చేసిన అనుబంధ పిటిషన్లను కొట్టేసింది. హాల్‌టికెట్ల జారీ కూడా పూర్తయిందని, పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం సాధ్యం కాదంది. మధ్యంతర ఉత్తర్వుల జారీకి అవసరమైన ప్రాథమిక ఆధారాలను కోర్టు ముందుంచడంలో పిటిషనర్లు విఫలమయ్యారని హైకోర్టు తెలిపింది. మధ్యంతర ఉత్తర్వులిచ్చేందుకు ఎలాంటి సహేతుక కారణాలు కూడా లేవని స్పష్టం చేసింది. విస్తృత ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని మధ్యంతర ఉత్తర్వుల కోసం దాఖలు చేసిన అనుబంధ పిటిషన్లను కొట్టేస్తున్నట్టు తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కుంచెం మహేశ్వరరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అత్యవసరంగా పిటిషన్లు దాఖలు
డీఎస్సీ-24కు వయసు పరంగా అర్హులైన, అప్పట్లో దరఖాస్తు చేసుకున్న వారందరినీ 2025 డీఎస్సీకి అర్హులుగా ప్రకటించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ కర్నూలు జిల్లాకు చెందిన బోయ కన్నయ్య, మరో 12 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గరిష్ట వయో పరిమితిని 44 నుంచి 45 ఏళ్లకు పెంచేలా ఆదేశాలు జారీ చేయాలని కోర్టును కోరారు. అంతేకాక పదో తరగతిలో మొదటి భాషగా ఇంగ్లిష్, రెండో భాషగా తెలుగు చదివిన తమను మొదటి భాషగా తెలుగు చదివి ఉండాలన్న నిబంధనను సాకుగా చూపుతూ 2025 డీఎస్సీకి అనర్హులను చేశారని కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన వి.సాంబశివతో పాటు మరో ముగ్గురు, పరీక్ష సన్నద్ధతకు కేవలం 45 రోజులే ఇచ్చారని, 90 రోజుల గడువుతో తిరిగి నోటిఫికేషన్‌కు ఆదేశాలివ్వాలంటూ విజయనగరం జిల్లాకు చెందిన ఎం.షరీఫ్, మరో ఐదుగురు ఇంకో పిటిషన్ దాఖలు చేశారు.

దళిత, మైనారిటీలపై రాజ్యహింస

- పోలీసులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడాన్ని హోంమంత్రి సమర్థిస్తారా?
- మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఆగ్రహం
- సర్కారు దుర్మార్గాలపై బాధితుల గొంతుగా వైఎస్సార్‌సీపీ ప్రశ్నిస్తుంది



సాక్షి,అమరావతి: రాష్ట్రంలో మానవత్వానికి మచ్చ తెచ్చేలా కూటమి సర్కారు దళిత, మైనారిటీలపై రాజ్యహింసకు పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో రాజకీయ పాలన ముసుగులో రాక్షస పాలన సాగుతోందన్నారు. నారా లోకేశ్ సృష్టించిన రెడ్‌బుక్ రాజ్యాంగం బూటుకాలు కింద బడుగులు విలవిలలాడుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో జరుగుతున్న హింసాకాండలో బాధితుల గొంతుగా వైఎస్సార్‌సీపీ ప్రశ్నిస్తుందని స్పష్టంచేశారు. తెనాలిలో పోలీసులు నడిరోడ్డుపై చిత్రహింసలకు గురిచేసిన బాధిత యువకులను మాజీ సీఎం వైఎస్ జగన్ పరామర్శించి, వారి పక్షాన ఈ దుర్మార్గంపై ప్రభుత్వాన్ని నిలదీస్తారని తెలిపారు.ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ వైఎస్ జగన్ ఉంటారు. బాధితుల పక్షాన మాట్లాడతారు అని చెప్పారు.'ఏడాది పాలనలోనే ఈ ప్రభుత్వ నిజస్వరూపం బయటపడింది. చేయని నేరానికి తెనాలిలో ముగ్గురు దళిత, మైనారిటీ యువకులపై పోలీసులు జరిపిన హింసను రాష్ట్ర ప్రజలంతా చూశారు. ఆ ఘటనపై రాష్ట్ర హోంశాఖ మంత్రి అనితలో కొద్దిపాటి పశ్చాత్తాపం లేకుండా పోలీసులను వెనుకేసుకురావడం దారుణం. దళిత సమాజం నుంచి వచ్చిన హోంమంత్రి కులాన్ని అడ్డం పెట్టుకుని రాజకీయం చేస్తున్నారనడం సిగ్గుచేటు. బాధిత యువకుల తల్లుల కన్నీరు హోంమంత్రికి కనిపించలేదా? అని టీజేఆర్ సుధాకర్ బాబు ప్రశ్నించారు.

పోలీసుల చర్య సరైనదే

- తెనాలిలో దళిత యువకులపై థర్డ్ డిగ్రీ సమర్థనీయమే
- హోంమంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్య



సాక్షి, అమరావతి: గుంటూరు జిల్లా తెనాలిలో పోలీసులు దళిత యువకులను నడిరోడ్డుపై థర్డ్‌డిగ్రీ ప్రయోగించడం సరైనదేనంటూ హోంమంత్రి వంగలపూడి అనిత సమర్థించారు. విజయవాడలో సత్యన్నారాయణపురం పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆమె ప్రారంభించారు. అనంతరం హోమ్ మంత్రి అనిత మాట్లాడుతూ తెనాలిలో పోలీసులు యువకులను నడిరోడ్డుపై లాఠీలతో కొట్టడం సరైందేనన్నారు. శాంతిభద్రతలను పరిరక్షించాల్సింది పోలీసులేనని చెప్పుకొచ్చారు. తప్పు చేసిన వారికి కులంతో పనేంటని వ్యాఖ్యానించారు. అంతేకాదు పోలీసులు తప్పు చేశారని భావిస్తే వారిపై కేసు నమోదు చేసి న్యాయస్థానంలో నిరూపించుకోవాలని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు.

కోవిడ్ పరీక్షలు పెంచండి..

- ప్రభుత్వ మొద్దునిద్రపై 'సాక్షి' కథనంతో హడావుడిగా వైద్యశాఖ సమీక్ష
- 10 రోజుల క్రితమే రాష్ట్రంలో పాజిటివ్ కేసులు

సాక్షి, అమరావతి : కొత్త వేరియంట్ రూపంలో కరోనా వైరస్ వ్యాపిస్తున్న క్రమంలో నియంత్రణ చర్యలను చంద్రబాబు ప్రభుత్వం గాలికొదిలేసిన తీరుపై 'కరోనా తీవ్రం.. సర్కారు బోద్యం' శీర్షికతో సోమవారం 'సాక్షి'లో కథనం రావడంతో వైద్యశాఖ సోమవారం కదిలింది. ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు సోమవారం హుటాహుటిన సమీక్ష నిర్వహించారు. వైరస్ వ్యాప్తి పెరుగుతున్న క్రమంలో పరీక్షల సామర్థ్యం పెంచాలని ఆయన అధికారులను ఆదేశించారు. రోజుకు వెయ్యి మందికి పరీక్షలు నిర్వహించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయా విభాగాధిపతులకు చెప్పారు. పాత జీజీహెచ్‌లలో రోజుకు 100 చొప్పున, కొత్త జీజీహెచ్‌లలో రోజుకు 50 చొప్పున పరీక్షలు చేసేందుకు చర్యలు తీసుకుంటూ.. నెలరోజులకు అవసరమయ్యే కిట్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. అలాగే, వివిధ రాష్ట్రాల్లో కోవిడ్ వ్యాప్తి, రోజువారీ పరీక్షల తీరును గమనించాలని చెప్పారు. గత పది రోజులుగా బయటపడ్డ కోవిడ్ కేసులను విశ్లేషించాలన్నారు. ఈ సమీక్షలో వైద్యశాఖ అధికారులు వీరపాండియన్, గిరీశా, డాక్టర్ నరసింహం పాల్గొన్నారు.

12 నుంచి 11వ స్థానానికి..
రాష్ట్ర వైద్యశాఖ హడావుడిగా సమీక్ష నిర్వహించి పరీక్షల సామర్థ్యం పెంచాలని ఆదేశించడం చూస్తుంటే.. ఇప్పటివరకు కరోనా పరీక్షలు అంతంతమాత్రంగా చేపట్టినట్లు ప్రభుత్వం పరోక్షంగా అంగీకరించినట్లయింది. దేశంలో కరోనా వ్యాప్తి ప్రమాద ఘంటికలు మోగిస్తుంటే.. రాష్ట్రంలో ఇంకా పరీక్షలు పెంచే యోచనల్లోనే ప్రభుత్వం ఉండడం ఏమిటని.. ఈవెంట్స్ మేనేజ్‌మెంట్‌పై చూపుతున్న శ్రద్ధ ప్రజారోగ్యంపై చూపించడంలేదన్న విమర్శలు వస్తున్నాయి.

ఉర్సా భూములపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమేనా..?

- మంత్రి లోకేశ్‌కు మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రతి సవాల్
- మొత్తం ఫైళ్లను బయటపెట్టాలని డిమాండ్



సాక్షి, అమరావతి: ఉర్సా భూముల వ్యవహారానికి సంబంధించి ప్రభుత్వం మొత్తం ఫైళ్లను బయటపెట్టడంతో పాటు ఈ అంశంపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమేనా అంటూ వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మంత్రి నారా లోకేశ్‌కు సవాల్ విసిరారు. ఉర్సా భూముల వ్యవహారంలో మంత్రి లోకేశ్ చేసిన సవాల్‌కు స్పందిస్తూ సోమవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. తన సవాల్‌ను స్వీకరించాలని డిమాండ్‌చేశారు. ఈ సందర్భంగా ఆయన మంత్రి లోకేశ్‌కు పలు ప్రశ్నలు సంధించారు.

- ▲ ఉర్సా కంపెనీకి విశాఖపట్నం ఐటీ హిల్‌లో ఎకరం కోటి రూపాయలకు మూడున్నర ఎకరాలు, కాపులుప్పాడలో ఎకరం యాభై లక్షల చొప్పున రూ.56.36 కోట్లకు కేటాయించామంటూ మీరు ప్రకటించడం ఏంటి? దీనికి సంబంధించిన జీఓ విడుదల కాకుండా ఇప్పుడు మీరు చెప్పడం ఏంటి?
- ▲ కుంభకోణం బయటపడ్డ దాదాపు 50 రోజులు దాటిన తర్వాత ఇప్పుడు ప్రకటన చేయడం ఏంటి? దీనివెనుక నడిచిన తతంగం ఏంటి?
- ▲ ఉర్సాకు కేటాయించిన భూమి రేటు విషయమై యాభై రోజులుగా గప్‌చుప్‌గా వ్యవహరించిన మీరు, ఇవాళ అకస్మాత్తుగా మీ బినామీ కంపెనీ గత ఏప్రిల్ 21నాడు విడుదల చేసిన ప్రకటనకు అనుగుణంగా మాట్లాడుతున్నారు. అంటే ఈ వ్యవహారంలో మీరు మూసేయాల్సినవి మూసేశారా? ఫైళ్లు చింపేసినా, తగలబెట్టినా స్కిల్ స్కాం తరహాలో బయటకు వస్తాయి కదా?
- ▲ మీరు 2024 అక్టోబర్ 25న అమెరికాకు వెళ్లారు. 2024 సెప్టెంబర్ 27న అమెరికాలో కంపెనీ రిజిస్టర్ అయ్యింది. 2025 ఫిబ్రవరి 12న హైదరాబాద్‌లో ప్రారంభం అయ్యింది. ఈ పరిణామాల వెనుక అసలు అర్థం ఏంటి?
- ▲ 2025 ఏప్రిల్ 10న చంద్రబాబు అధ్యక్షతన సమావేశమై గ్రీన్ సిగ్నల్ ఇచ్చేయడం, ఆ తర్వాత ఏప్రిల్ 15న కేబినెట్‌లో ఆమోదం వెంటవెంటనే జరిగిపోయాయి. ఏమిటీ మీకు అంత ప్రేమ?
- ▲ రూ. 5,728 కోట్ల పెట్టుబడి పెడతామంటున్న ఈ కంపెనీ కేవలం 10 లక్షల రూపాయల ఆథరైజ్డ్ క్యాపిటల్‌ను, లక్ష రూపాయిల పెయిడప్‌క్యాపిటల్‌ను మాత్రమే కలిగి ఉండడం వెనుక అర్థం ఏంటి? అలాంటి కంపెనీకి రూ.3వేల కోట్ల విలువైన భూములు అప్పనంగా ఇవ్వడం ఏంటి?
- ▲ ఉర్సా చేసిన ప్రాజెక్టులు ఏంటి? ఆ కంపెనీ సృష్టించిన టెక్నాలజీ ఏంటి? మీరైనా చెప్పగలరా?
- ▲ రూ.5 వేల కోట్ల కంపెనీ హైదరాబాద్‌లోని ఒక మిడిల్ క్లాస్ అపార్ట్‌మెంట్లో ఉంది. ఒక కుటుంబం ఎంత కరెంటు బిల్లు కడుతుందో అంతే మొత్తాన్ని ఈ కంపెనీ కడుతోంది. ఇలాంటి కంపెనీకి రూ.3 వేల కోట్ల విలువైన భూములను అప్పగించడాన్ని ఏ రకంగా సమర్థిస్తారు?
- ▲ ఉర్సాకు ఎకరా రూ.50 కోట్లు విలువ చేసే 60 ఎకరాల భూమిని అప్పనంగా ఇస్తున్నారు. మరి ఎవరికైనా ఇలాగే ఇస్తారా?
- ▲ ఉర్సా కంపెనీకి చెందిన సతీష్ అబ్బూరి 21 సెంచరీ ద్వారా ఎంతో మందిని మోసం చేశారని, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని కూడా ఇందులో పాలుపంచుకున్నాడని విజయవాడ మాజీ ఎంపీ కేశినేని నాని చేసిన ఆరోపణలపై మీరెందుకు దర్యాప్తు చేయించడంలేదు.

పుట్టపర్తిలో విదేశీయుడి అనుమానాస్పద మృతి

బెలారస్‌కు చెందిన డేవిడ్ డోవిచ్‌గా గుర్తింపు

పుట్టపర్తి టౌన్: శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో విదేశీయుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆయనను బెలారస్ దేశానికి చెందిన డేవిడ్ డోవిచ్ (44)గా గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం.. డేవిడ్ డోవిచ్ కొన్నేళ్ల క్రితం టూరిస్ట్ వీసాపై పుట్టపర్తికి వచ్చాడు. స్థానిక గోపురం థర్డ్ క్రాస్ ప్రియాంక గెస్ట్ హౌస్ ఐదో ఫ్లోర్‌లో స్నేహితుడు మంజునాథతో కలిసి ఉండేవాడు. డేవిడ్ డోవిచ్ భార్యతో గొడవ పడి విడిపోయాడు. పిల్లలకూ దూరంగా ఉంటున్నాడు. రెండేళ్ల నుంచి మద్యం, గంజాయి వంటి వ్యసనాలకు బానిసయ్యాడు. నిత్యం తెలిసిన వారిని డబ్బు అడుగుతూ జీవనం సాగిస్తుండేవాడు. గతంలో కర్ణాటక ప్రాంతంలో తన వీసా, పాస్‌పోర్టు, బ్యాగులన్నీ పోగొట్టుకున్నాడు. పది రోజులుగా మంజునాథ కర్ణాటక నాగేపల్లి వద్ద గృహ నిర్మాణ పనిలో ఉండి.. అతని గదికి వెళ్లలేదు. ఆదివారం రాత్రి నుంచి డేవిడ్ కనిపించకపోవడంతో మంజునాథ వెతికాడు. సోమవారం ఉదయం అపార్టుమెంట్ కిందిభాగంలో డేవిడ్ శవమై కన్పించాడు. ఒంటిపై దుస్తులేవీ లేవు. ఎస్ఐ లింగన్న, పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

Published and printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
మంగళవారం : 3 : జూన్ : 2025


ఇటీవల ముస్లిం యువకుని హత్యను ఖండిస్తూ మంగళూరులో ముస్లింల నిరసన


జిల్లాలో గోవధ, అక్రమ రవాణా అధికమైందని ఆరోపిస్తూ కలబుర్గిలో హిందూ సంఘాల ధర్నా

న్యూస్‌రీల్

బెళగావి నీళ్లు ధార్వాడకా?

- కన్నడ సంఘాల ధర్నా


నిరసనకారులను అడ్డుకుంటున్న పోలీసులు

దొడ్డబళ్లాపురం: జిల్లాలోని హిడకల్ డ్యాం నుంచి హుబ్లీ–ధార్వాడలోని పరిశ్రమలకు నీటి విడుదలను ఆపకపోతే బెళగావి బంద్ తప్పదని కర్ణాటక రక్షణ వేదిక నేతలు, కార్యకర్తలు హెచ్చరించారు. సోమవారంనాడు బెళగావిలోని రాణీ చెన్నమ్మ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకూ ఖాళీ బిందెలతో ర్యాలీ చేసి, కలెక్టరేట్‌ను ముట్టడించి ధర్నా చేపట్టారు. వారంలోపు నీటి విడుదల ఆపకపోతే తామే ముందుండి నీటి విడుదల అడ్డుకుంటామని, బెళగావి జిల్లా బంద్ చేస్తామని చెప్పారు. జిల్లాలోని హిడకల్ డ్యాం నుంచి ప్రజలకు, రైతులకు నీటిని ఇవ్వాలని కోరారు. పరిశ్రమలకు ఇస్తే రైతుల పంటలు ఎండిపోతాయన్నారు. కలెక్టర్ కార్యాలయానికి తాళం వేయడానికి ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. పలువురిని అరెస్టు చేసి తరలించారు.

మెడికో ఆత్మహత్య


విష్ణుప్రియ (ఫైల్)

శివమొగ్గ: శివమొగ్గలో ఉన్న సుబ్బయ్య మెడికల్ కళాశాలలో హాస్టల్లో ఓ మెడికో ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు విష్ణుప్రియ (22). వివరాలు.. ఈమె కుటుంబం బెంగళూరుకు చెందినది కాగా, జర్మనీలోని బెర్లిన్‌లో నివసిస్తోంది. విష్ణుప్రియ ఇటీవలే ఎంబీబీఎస్ పూర్తిచేసి ఇంటర్న్‌షిప్ చేస్తోంది. మరికొన్ని రోజుల్లో పూర్తయి డాక్టర్ కానుంది. అయితే ఏమి జరిగిందో మరి.. హాస్టల్ గదిలో ఉరి వేసుకొని ప్రాణాలు తీసుకుంది. కారణాలు తెలిసి రాలేదు. డెత్‌నోట్ ఏదీ దొరకలేదు. శివమొగ్గ గ్రామీణ పోలీసులు ఆమె శవాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మిమ్స్‌లో బాలిక మృతిపై విచారణ


ఆదివారం ఆస్పత్రిలో ధర్నా చేస్తున్న మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు

మండ్య: బాలిక సాన్వి మరణానికి మిమ్స్ వైద్యుల నిర్లక్ష్యం కారణమని ఆరోపణలు రావడంతో విచారణ కోసం బృందాన్ని ఏర్పాటు చేశాం, 15 రోజుల్లోగా నివేదిక ఇస్తారని ఎమ్మెల్యే పి.రవికుమార్ చెప్పారు. సోమవారం మండ్య నగరంలో ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. ఇంట్లో టైల్స్ పడడం వల్ల బాలిక కాలు విరిగింది, నాలుగు రోజుల్లో ఎలా చనిపోతుందని అన్నారు. గాయానికి ఇన్‌ఫెక్షన్ వచ్చిందని వైద్యులు తెలిపారన్నారు. మిమ్స్‌లోని పలు విభాగాల సర్జన్లతో కమిటీని రచించినట్లు తెలిపారు. జిల్లాధికారి కార్యాలయంలో మిమ్స్ వైద్య నిపుణులతో కలెక్టర్ చర్చించారు. బాలికను వైద్యం కోసం చేర్పించగా మరణించడం, మృతదేహంతో తల్లిదండ్రులు ఆందోళన చేయడం తెలిసిందే. సకాలంలో వైద్యం చేయక పోవడం వల్లే తమ బిడ్డ దూరమైందని తల్లిదండ్రులు ఆరోపించారు.

అరెస్టు చేయాలని ధర్నా



బనశంకరి: బెళగావి తాలూకా సంతిబస్తవాడ మసీదులో ఖురాన్, హదీస్‌లను కాల్చివేసిన ఘటనలో దుండగులను అరెస్టు చేయాలని ముస్లింలు సోమవారం ఆ జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా చేశారు. పోలీసులు కేసు దర్యాప్తును ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. ఘటన జరిగి 20 రోజులు గడిచినప్పటికీ దుండగులను అరెస్ట్ చేయకపోవడం అనుమానాలకు కారణమౌతోందని, గ్రామంలో అశాంతి సృష్టించడానికి దుండగులు కుట్రపన్నారని ఆరోపించారు. ఇటీవల సంతిబస్తవాడలో మరో వర్గంవారు తమతో వ్యాపారాలను బహిష్కరించారని, మత సామరస్యం దెబ్బతీస్తున్నారని చెప్పారు. చర్యలు తీసుకోకపోతే పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని తెలిపారు.





వారం కిందట బెంగళూరులో వరద ముంపు ఇలా ఉండేది

వానల చాటున వ్యాధుల దాడి

- నీటి కాలుష్యం, దోమల బాధ
- డెంగీ, మలేరియా, గున్యా బెడద
- మంచి అలవాట్లతోనే రక్షణ

బనశంకరి: ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు. కానీ బెంగళూరు నగరంలో కుండపోత వర్షాల వల్ల అనేక చోట్ల ముంపు సమస్య ఏర్పడి అంటురోగాలు ప్రబలుతాయనే భయం నెలకొంది. ఇప్పటికే కరోనా తో పాటు డెంగీ కేసులు హెచ్చుమీరాయి. మలేరియా, చికెన్‌గున్యా కేసులు నమోదు కావడంతో పాటు సాధారణ జ్వరం, వైరల్ ఫీవర్, జలుబు, తలనొప్పి కేసులు పెరుగుతున్నాయి. వర్షాల వల్ల ఇళ్ల చుట్టూ, లోతట్టు ప్రదేశాలలో రోజుల తరబడి వర్షపు నీరు నిలబడటంతో దోమలు ఉత్పత్తి ఎక్కువైంది. దీంతో డెంగీ, చికెన్‌గున్యా, మలేరియా జబ్బుల బెడద వెంటాడుతోంది. భారీ వర్షాలతో ఇళ్లలోకి చొరబడిన డ్రైనేజీ నీరు, కొళాయిల్లో కలుషిత నీటి సరఫరా, అధ్వాన్నంగా మారిన భూగర్భ డ్రైనేజీ తదితర కారణాలు వ్యాధులకు ఆలవాలమవుతున్నాయి. వాంతులు, కడుపునొప్పి, హైపటైటిస్–ఏ, విరేచనాలు, కలరా జబ్బుల భయం నెలకొంది.


కొళాయి నీటిలో హాని కారకాలు

రాష్ట్రంలో అతిసారం కేసులు

వానల వల్ల రాష్ట్రంలో ఇప్పటికే 67,187 అతిసార కేసులు నమోదయ్యాయి. డెంగీ జ్వరాల కేసులు ఉధృతం అవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 26 వేల మంది రక్తపరీక్షలు చేశారు. బెంగళూరు పాలికె పరిధిలో 500 మందికి పైగా డెంగీ జ్వరానికి గురయ్యారు. రాష్ట్రంలో 1,300 మందికి పైగా డెంగీ సోకింది. 300 మందికి పైగా చికెన్‌గున్యా, 65 మందికి పైగా మలేరియా బారినపడ్డారు. దోమల వల్ల ప్రబలే రోగాలు కావడంతో ప్రజలు ఇళ్లలో, ఇంటి చుట్టుపక్కల స్వచ్ఛతకు ప్రాధాన్యత ఇవ్వాలి. దోమలను నాశనం చేసే చర్యలు చేపట్టినట్లు ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు.


ఆదమరిస్తే అనారోగ్యం తప్పదు

కొత్తగా లెప్టోస్పిరోసిస్ జబ్బు

లెప్టోస్పిరోసిస్ అనే కొత్తరకం జబ్బు వ్యాపిస్తోంది. ఇది కలుషితాల నుంచి వెలువడే పరాన్నజీవి. రాష్ట్రంలో ఇప్పటివరకు 392 కేసులు నమోదయ్యాయి. ఇది కలుషితనీరు, మట్టిలో పెరుగుతుంది. ఎలుకలు వంటి చిన్నపాటి ప్రాణుల కళేబరాల నుంచి బయటికి వచ్చే బ్యాక్టీరియా ఇది. నీటిలో ప్రాణుల కళేబరాలు, మూత్రం చేరితే వ్యాపిస్తుంది. ఆ నీటిని వాడితే శరీరంలోకి వెళ్లి ఇన్ఫెక్షన్‌ను కలిగిస్తుంది. ఇది మూత్ర పిండాలు, గుండె కు హాని కలిగించడంతో మరణానికి దారితీస్తుంది. జ్వరం, తలనొప్పి, ఒంటి నొప్పులు, వాంతులు దీని లక్షణాలు.

ఆరోగ్యంపై శ్రద్ధ తప్పదు

వర్షాలతో గత కొన్నిరోజులుగా డెంగీ కేసులు ప్రబలుతున్నాయి. బెంగళూరులో వర్షం నీటితో రోగాలు పెరిగే అవకాశాలు ఉన్నాయి, ప్రజలు ఆరోగ్యం పట్ల అధిక శ్రద్ధ వహించాలి అని కేసీ జనరల్ ఆసుపత్రి చిన్నపిల్లలు వైద్యుడు డాక్టర్ లక్ష్మీపతి తెలిపారు.

కనీస జాగ్రత్తలు ప్రధానం

- మరిగించి చల్లారిన నీటిని తాగాలి
- ఇంట్లో వండిన తాజా పౌష్టికాహారం తినాలి
- ఇంటినుంచి బయటికి వెళితే మాస్కు ధరించాలి
- తాజా పండ్లు, కూరగాయలను ఎక్కువగా తినాలి
- బయటి ఆహారం తినేటప్పుడు జాగ్రత్త గా ఉండాలి
- చేతులను శానిటైజర్‌తో శుభ్రం చేసుకుంటూ ఉండాలి
- ఇంటి లోపల బయట శుభ్రతను కాపాడుకోవాలి
- ఎలాంటి రోగ లక్షణాలు కనబడినా వైద్యులతో చికిత్స తీసుకోవాలి

నిర్మాణంలో ఉండగానే కూలింది

- కూలీ మృతి, నలుగురికి గాయాలు


శిథిలాల నుంచి కూలీల రక్షణ చర్యలు

మండ్య: నిర్మాణ దశలో ఉన్న మహాద్వారం కుప్పకూలిన ప్రమాదంలో ఒక కార్మికుడు మరణించగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటన మండ్య జిల్లాలోని నాగమంగళ తాలూకాలోని దేవరహళ్ళి గ్రామంలో జరిగింది. వివరాలు.. తపసీరాయ స్వామి దేవాలయం ముందు భాగంలో మహాద్వారాన్ని నిర్మిస్తున్నారు. సుమారు 20 అడుగుల ఎత్తు, 35 అడుగుల పొడవునా నిర్మాణమవుతోంది. పై భాగంలో కాంక్రీట్ వేయడం కోసం కడ్డీలతో చట్రం బిగించారు. సోమవారం మధ్యాహ్నం కాంక్రీటు వేస్తుండగా బరువు తట్టుకోలేక చట్రం కుప్పకూలి కార్మికుల మీద పడింది. ఐదుమంది కార్మికులు చిక్కుకున్నారు. జేసీబీని తీసుకొని వచ్చి శిథిలాలను తొలగించి కూలీలను బయటకు తీశారు. ఆస్పత్రికి తరలిస్తున్నప్పుడు కల్బుర్గి జిల్లాకు చెందిన శరన్ (27) అనే కూలి చనిపోయాడు. మిగతావారికి ఆస్పత్రిలో చికిత్స జరుగుతోంది. నాగమంగళ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు. నాసిరకంగా సెంట్రింగ్‌ను వేయడమే కూలడానికి కారణమని అనుమానాలున్నాయి.

పెళ్లిలో రూ.25 లక్షల నగల చోరీ

దొడ్డబళ్లాపురం: కళ్యాణ మండపంలో వధువుకు చెందిన రూ.25 లక్షల విలువైన బంగారు నగలు చోరీకి గురైన సంఘటన బెంగళూరు రాజాజినగర పరిధిలో చోటుచేసుకుంది. గవిపురం నివాసి ఎల్.శివశంకర్ ఈమేరకు మాగడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శివశంకర్ కుమార్తె దివ్య వివాహం రాజాజినగర సప్తపది కళ్యాణ మండపంలో జరిగింది. మే 29న జరిగిన రిసెప్షన్‌కు అనేకమంది అతిథులు హాజరయ్యారు. పెళ్లికూతురికి చెందిన ఖరీదైన కానుకలు, రూ.25 లక్షల విలువైన నగలను సూట్‌కేస్, బ్యాగుల్లో భద్రపరిచి నిద్రపోయారు. మే 30న ఉదయం అందరూ లేచి గదికి తాళంవేసి ముహూర్తానికి వెళ్లారు. ఇంతలో ఎవరో దొంగలు నకిలీ తాళంచెవితో గది తాళం తీసి నగల బ్యాగులను అపహరించారు. చోరీ వల్ల పెళ్లిలో ఉత్సాహం బదులు విచారం తాండవించింది.

కొట్లాడుతూ ఉంటే హిందీని రుద్దుతారు

దొడ్డబళ్లాపురం: కన్నడ, తమిళం అంటూ మనం కొట్లాడుతూ సమయం వృథా చేస్తే కేంద్రం వచ్చి మనపై హిందీ భాషను రుద్దుతుందని మంత్రి కృష్ణ భైరేగౌడ అన్నారు. తాజా కన్నడ, తమిళ వివాదాన్ని ప్రస్తావించారు. సోమవారంనాడు కెంపేగౌడ విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడిన ఆయన అన్ని భాషలూ సమానమే అన్నారు. అయితే బలవంతంగా మనపై హిందీ రుద్దాలని చూస్తున్నారని ఇదే అసలు సమస్య అన్నారు. స్వయంప్రేరితంగా హిందీ నేర్చుకొంటే తప్పులేదని, నేర్చుకో అని ఒత్తిడి చేయడం సబబు కాదన్నారు.

చెప్పుతో కొట్టి.. కాళ్ల బేరానికి


చెప్పుతో యువతి, క్షమాపణల పర్వం


స్వతంత్ర పార్కులో ఆటోడ్రైవర్ల ఆందోళన

- ఆటోడ్రైవర్‌కు బిహారీ మహిళ క్షమాపణలు

శివాజీనగర: ఆవేశంలో కన్నుమిన్ను కానక ఆటో డ్రైవర్‌ను హిందీ మహిళ చెప్పుతో కొట్టింది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా అరెస్టు చేశారు. జైలు జీవితం తప్పదని గ్రహించిన ఆమె కాళ్ల బేరానికి వచ్చింది. బిహార్‌కు చెందిన వివాహిత పంఖురి మిశ్రా, ఆమె భర్త ఆటోడ్రైవర్ కాళ్లపై పడి క్షమాపణ చెప్పారు.

క్షమించండి ప్లీజ్

రోడ్డుపై తమ స్కూటర్‌కు తగిలాడని ఆటోడ్రైవర్ లోకేశ్‌ను పంఖురి మిశ్రా చెప్పుతో బాదింది. వీడియో తీస్తావా.. తీయ్ అని కూడా బూతులు తిట్టింది. ఈ వీడియో వైరల్ కాగా మిశ్రా అకృత్యంపై జనం మండిపడ్డారు. ఆటోడ్రైవర్ ఫిర్యాదు మేరకు ఆమె మీద బెళ్లందూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం ఆ జంటను పిలిపించి విచారణ జరిపారు. నేను గర్భవతిని, ఆస్పత్రికి వెళ్తుండగా ఆటో తగిలింది, కోపంతో దాడి చేశాను, ఆటోడ్రైవర్ నాపై దాడికి ప్రయత్నించాడు అని తెలిపింది. పోలీసులు ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేసుకొని బెయిలు ఇచ్చి పంపారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న ఆటోడ్రైవర్‌కు క్షమాపణలు చెప్పారు. కన్నడిగులు తమను క్షమించాలని, బెంగళూరును, ఇక్కడి సంస్కృతిని ప్రేమిస్తున్నామని, కావాలని చేయలేదని పంఖురి వివరణ ఇచ్చింది.

ఆటోడ్రైవర్ల ధర్నా

మరోవైపు చెప్పుల దాడిని ఖండిస్తూ బెంగళూరులో ఆటోడ్రైవర్ల సంఘం ధర్నా చేసింది. ఫ్రీడంపార్క్‌లో వందలాదిగా చేరి నినాదాలు చేశారు. ప్రభుత్వం తమకు భద్రత కల్పించాలని, దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని కోరారు.


బాను ముష్తాక్ గర్వకారణం: సీఎం


కవయిత్రులను సన్మానిస్తున్న సీఎం

శివాజీనగర: సాహిత్యానికి సమాజాన్ని వృద్ధిచేసే శక్తి ఉందని, సాహిత్యం ద్వారా సమాజాన్ని ఐకమత్యం చేయాలే గాని విభజించరాదని సీఎం సిద్దరామయ్య అన్నారు. సోమవారం విధానసౌధలో బుకర్ పురస్కార గ్రహీత, కన్నడ రచయిత్రి బాను ముష్తాక్ అభినందన సభ జరిపారు. ఆమెను సీఎం సన్మానించి మాట్లాడారు. బాను ముష్తాక్ కన్నడ కీర్తిని పెంచారు. ఇది కన్నడ ప్రపంచానికే గర్వకారణమని ప్రశంసించారు. బాను ముష్తాక్‌ను, ఆమె రచనలను ఆంగ్లంలోకి అనువదించిన దీపా బస్తికి రూ.10 లక్షల చొప్పున నగదు పురస్కారం అందజేయనున్నట్లు ప్రకటించారు. పాత్రికేయురాలిగా, రచయితగా, న్యాయవాదిగా, ఉద్యమకారిణిగా సమాజంలో రాణించారని బాను ముష్తాక్‌ను కొనియాడారు. ముస్లిం సముదాయపు మహిళ మూఢ నమ్మకాలను వ్యతిరేకిస్తూ రాసే ప్రగతిపరమైన శ్రద్ధ ఆమెలో ఉందని అన్నారు.

థగ్ లైఫ్ ఆడకూడదు


మైసూరులో నిరసన



థగ్ లైఫ్ భవితపై సందేహాలు

- కన్నడ సంఘాల హెచ్చరిక

శివాజీనగర/ మైసూరు: తమిళం నుంచి కన్నడ భాష పుట్టిందని వివాదాస్పదమైన వ్యాఖ్యలు చేసిన ప్రముఖ నటుడు కమల్ హాసన్‌పై వ్యతిరేకత అధికమవుతోంది. ఆయన నటించిన కొత్త సినిమా థగ్ లైఫ్ ను కర్ణాటకలో విడుదల చేయరాదని కన్నడ సంఘాలు హెచ్చరించాయి. ఒక్క థియేటర్‌లో సినిమా ఆడినా బెంగళూరును బంద్ చేస్తామని కర్ణాటక రక్షణా వేదిక నాయకులు తెలిపారు. ఈ సినిమా జూన్ 5న దేశమంతటా విడుదల అవుతోంది. కమల్ క్షమాపణ చెప్పకపోవడంతో కన్నడ సంఘాలు భగ్గుమంటున్నాయి. సినిమా ఆడిస్తే థియేటర్ లోపలికి చొరబడి ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. కన్నడ సంఘాలన్నీ ఏకమై ఈ తీర్మానం చేసినట్లు నేతలు తెలిపారు.

కమల్‌ని అరెస్టు చేయాలి

కమల్ హాసన్‌ను వెంటనే అరెస్టు చేయాలని మైసూరులో కన్నడ చళువళి పోరాటదారుడు వాటాల్ నాగరాజు, సంఘాల నేతలు కమల్ చిత్రానికి నిప్పుపెట్టారు. కమల్‌కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వాటాల్ మాట్లాడుతూ కర్ణాటకలో కమల్ హాసన్ సినిమాలను పూర్తిగా బహిష్కరణ చేయాలని అన్నారు. కన్నడ ప్రజలు కమల్ సినిమాలను వ్యతిరేకించాలని చెప్పారు.

ఆల్మట్టి ఎత్తు పెంపునకు అడ్డంకులా?



- మహారాష్ట్ర సీఎం లేఖపై డిప్యూటీ సీఎం ధ్వజం

బనశంకరి: కృష్ణా ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం కర్ణాటక రాష్ట్రం వాటా నీటిని ఉపయోగించుకోవడానికి అల్మట్టి డ్యామ్ ఎత్తును 524 మీటర్లకు పెంచాలని ట్రిబ్యునల్‌లో కోరినప్పుడు మౌనంగా ఉన్న మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ హఠాత్తుగా అభ్యంతరం చెప్పడం ఆశ్చర్యం కలిగించిందని డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్ అన్నారు. సోమవారం విధానసౌధలో విలేకరులతో మాట్లాడుతూ ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచి రాష్ట్ర రైతులు హితరక్షణ కాపాడటానికి రాష్ట్ర ఎంపీలు, కేంద్రమంత్రులు సహకరించాలని చేతులెత్తి మొక్కుతానని అన్నారు. గత నెల 9వ తేదీన దేవేంద్ర ఫడ్నవీస్, సీఎం సిద్దరామయ్యకు లేఖ రాశారని తెలిపారు. ఆలమట్టి ఎత్తు పెంచితే మహారాష్ట్రలో సాంగ్లి, కొల్హాపుర జిల్లాలు వరద ముంపు సమస్యను ఎదుర్కొంటాయని లేఖలో రాశారన్నారు. ఫడ్నవీస్ వైఖరి తమకు తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. 2010 ట్రిబ్యునల్ తీర్పు పట్ల మహారాష్ట్ర ఎప్పుడూ ప్రశ్నించలేదని, ఈ పథకాన్ని అమలు చేయాలని మహారాష్ట్ర కూడా చెప్పిందని, కానీ ఇప్పుడు మళ్లీ డ్యాం ఎత్తు పెంచరాదని లేఖ రాసిందని డీకేశి ఆరోపించారు. ఎత్తు పెంపు అనేది ట్రిబ్యునల్‌లో తమకు దక్కిన హక్కు అని, దీనిపై సీఎం సిద్దరామయ్య ఒకటి రెండు రోజుల్లో తిరుగు లేఖ రాస్తారని తెలిపారు.

వరద వారి సమస్య

మహారాష్ట్రలో వరదలు తలెత్తితే, అది వారి సమస్య. వారే సరిదిద్దుకోవాలని కేంద్రమంత్రులను, ప్రధానిని కలిసి చెబుతామని డీకే అన్నారు. ఇందులో రాష్ట్ర ఎంపీలు, కేంద్రమంత్రులు సమైక్యంగా ఉండాలన్నారు. 2013 నుంచి ఈ పథకానికి గెజిట్ నోటిఫికేషన్ కావాలని వేచి చూస్తున్నామని, ఇంకా ఎన్నిరోజులు నిరీక్షించాలని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి సోమణ్ణ ఆల్మట్టి గురించి స్పందిస్తూ ఈ ప్రాజెక్టు రాష్ట్ర హితమని, మాకు వేరే రాష్ట్రాలతో గొడవ ఇష్టంలేదని, మన వాటా నీరు కావాలని అన్నారు. ఆలస్యం కావడం వల్ల ఖర్చు పెరిగిపోతోంది. భూస్వాధీనానికి లక్ష కోట్ల రూపాయలు అవసరమని అన్నారు.

అప్పు ఇస్తామని రూ.20 లక్షల టోకరా

మైసూరు: రూ. 25 కోట్లు రుణం అందిస్తామని హామీ ఇచ్చి చెన్నైకు చెందిన ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది మైసూరువాసిని రూ. 25 లక్షలు మోసం చేసినట్లు కేసు నమోదైంది. మైసూరులోని జయనగరకు చెందిన వేణుగోపాల్ బాధితుడు, అతడు చామరాజనగరలో మేడేహళ్లి సమీపంలోని ఒక రాతి క్రషర్ కొనాలనుకున్నాడు. లక్ష్మీ ఫిన్ కోర్ప్ రూ. 500 కోట్ల వరకు రుణాలు అందిస్తామని ప్రకటన చేసింది. అది చూసి వేణుగోపాల్ ఫోన్ నంబర్‌కు ఫోన్ చేసి విచారించగా లోన్ ఇస్తామని, చెన్నైకి రావాలని తెలిపారు. సరే అని చెన్నైకు వెళ్లి ఫైనాన్స్ సంస్థలో మాట్లాడి రూ. 25 కోట్ల అప్పు తీసుకుంటానని చెప్పాడు. అప్పు మొత్తంలో ఒక్క పర్సెంట్ సర్వీస్ చార్చి కట్టాలని సంస్థ సిబ్బంది చెప్పారు. వారు చెప్పినట్లే వేణుగోపాల్ రూ. 20 లక్షలను వారికి ఇచ్చాడు. కాలం గడిచినా అప్పు మాత్రం మంజూరు కాలేదు. మళ్లీ ఫోన్ చేయగా స్పందన లేదు. లక్ష్మీ, రఘు శ్రీనివాస్ ఉదయ్‌కుమార్ అనేవారు తనను మోసగించారని మైసూరు అశోకపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఫొటోషూట్‌కు రూ.25 వేల జరిమానా

- జంటకు అటవీశాఖ వడ్డన


ఫోటో షూట్..

మైసూరు: ఇది ఫోటోషూట్ల కాలమైంది. పెళ్లికి ముందు, ఆ తరువాత, తల్లీ తండ్రి కాబోతుంటే మరోసారి ఇలా అనేక సందర్భాలలో ఫోటోషూట్లు ఉండాల్సిందే. కొన్నిసార్లు ఇవి వెర్రిగా మారుతుంటాయి కూడా. ఇదే మాదిరిగా మైసూరులోని చామరాజనగర జిల్లా గుండ్లుపేట తాలూకాలోని బండీపుర వన్యప్రాణుల అభయారణ్యంలోకి చొరబడి ఫోటోలు తీసుకున్న జంటకు అటవీశాఖ రూ. 25 వేల జరిమానా వడ్డించింది. బెంగళూరుకు చెందిన పల్లవి, ఘోష్ అనే వ్యక్తులు విహారానికి వచ్చారు. బండీపుర మంగళ రోడ్డు సమీపంలో అడవిలోకి వెళ్లి ఫోటో షూట్ చేస్తున్నారు. ఇక్కడ ఫోటోలు తీయడం నిషిద్ధం. అటవీ అధికారి నవీన్‌కుమార్‌కు పర్యాటకులకు సమాచారం అందించారు. వెంటనే ఆ జంటను పట్టుకుని హెచ్చరిక లేఖ ఇచ్చి రూ. 25 వేలు జరిమానా విధించారు.

క్లుప్తంగా

పార్టీని మరింత బలోపేతం చేద్దాం



జెండాను స్వీకరించి బాధ్యతలు చేపట్టిన నిర్మల

రాయచూరు రూరల్: జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేద్దామని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బసవరాజ్ పాటిల్ ఇటగి పేర్కొన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా నిర్మల బెణ్ణె అధికార బాధ్యతలు స్వీకరించే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రజలు బీజేపీ పట్ల విసుగు చెందారన్నారు. అక్రమాల పుట్ట, కమీషన్ పేరుతో రాష్ట్రాన్ని నిలువు దోపిడీ చేశారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ జారీ చేసిన పంచ గ్యారెంటీలు త్వరలో జరుగనున్న నగరసభ, జెడ్పీ, టీపీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి సహాయకారి అవుతాయన్నారు. సమావేశంలో శాంతప్ప, నరసమ్మ, శాలం, అమరేగౌడ, శ్రీనివాసరెడ్డి, తాయన్న, శివమూర్తి, అరుణ్, రాజశేఖర్, నాగేంద్రలున్నారు.

ట్రాక్టర్ టిల్లర్ కింద పడి వ్యక్తి మృతి

హుబ్లీ: ధార్వాడ తాలూకా ఎత్తినగుడ్డ వద్ద పొలంలో ట్రాక్టర్ టిల్లర్(నాగలి) కింద పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన జరిగింది. ఆ గ్రామానికి చెందిన నారాయణ ఈళిగేర మృతుడు. పరిచయం ఉన్న వ్యక్తి రుద్రగౌడ పాటిల్‌తో కలిసి ఈయన ట్రాక్టర్‌తో నాగలి దున్నించడానికి వెళ్లారు. ఈ క్రమంలో ఆకస్మికంగా నాగలి కింద పడి మృతి చెందాడు. అయితే ట్రాక్టర్ డ్రైవర్ ఈ విషయాన్ని ఎవరికీ చెప్పకుండా ఏమీ తెలియనట్లు ఇంటికి వచ్చేశాడు. అయితే పొలంలో వ్యక్తి మృతదేహం లభించగా తొలుత హత్యగా అనుమానం వ్యక్తమైంది. పోలీసులు విచారించగా నాగలి దున్నేటప్పుడు పొరపాటున నారాయణ పడి మృతి చెందినట్లు తేలింది. ఈ కేసుకు సంబంధించి డ్రైవర్ రుద్రగౌడ పాటిల్‌ను అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేపట్టినట్లు ధార్వాడ ఉపనగర పోలీసులు తెలిపారు.

పాల ప్రాముఖ్యతపై అవగాహన అవసరం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న స్మిత

రాయచూరు రూరల్: పాల వాడకం ప్రాముఖ్యతపై అవగాహన అవసరమని బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం సంచాలకురాలు స్మిత పేర్కొన్నారు. నగరంలోని బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలో ప్రపంచ క్షీర దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పాలను తాగాలని, పాలతో తయారు చేసిన ఆహార పదార్థాలను తినాలన్నారు. తద్వారా పాల వాడకం కూడా పెరిగి ఆరోగ్యం పెంపొందుతుందన్నారు.

చెరువులోకి ట్రాక్టర్ బోల్తా.. బాలుడు దుర్మరణం



చెరువులోకి పడిన ట్రాక్టర్ వద్ద సహాయక చర్యల్లో పాల్గొన్న ప్రజలు

రాయచూరు రూరల్: చెరువులోకి ట్రాక్టర్ బోల్తా పడ్డ ఘటనలో అమరేష్(15) అనే బాలుడు దుర్మరణం చెందిన ఘటన జిల్లాలోని లింగసూగూరు తాలూకాలో చోటు చేసుకుంది. ఆదివారం కరడకల్ చెరువు గట్టుపై ట్రాక్టర్ నడుపుతుండగా డ్రైవర నిర్లక్ష్యంతో ట్రాక్టర్ అదుపు తప్పి చెరువులోకి పడింది. డ్రైవర్ నీటిలో మునిగి ఈత కొడుతూ బయట పడ్డాడు. కానీ బాలుడు చెరువులో మునిగి ప్రాణాలు వదిలాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ దత్తాత్రేయ కర్నాడ్ తెలిపారు.

పిల్లలకు కిట్ల పంపిణీ



కిట్‌లను పంపిణీ చేసిన దృశ్యం

రాయచూరు రూరల్: సమాజంలో ప్రామాణికతో పేద పిల్లలకు సహాయం చేయడం మానవ ధర్మమని రోటరీ క్లబ్ అధ్యక్షుడు శరణ బసవ పేర్కొన్నారు. ఆదివారం పండిత సిద్ధరామ జంబలదిన్ని రంగమందిరంలో కలా సంకుల సంస్థ ఆధ్వర్యంలో పేద పిల్లలకు స్కూల్ బ్యాగ్ కిట్లను అందించి మాట్లాడారు. విద్యారంగంలో జిల్లా వెనుక బడిన విషయాన్ని ప్రస్తావించారు. ప్రాథమిక స్థాయిలో పిల్లలకు విద్యను అందించాలన్నారు. కార్యక్రమంలో కలా సంకుల సంస్థ అధ్యక్షురాలు రేఖ, ఇన్‌కం టాక్స్ అధికారి శోభా యాదవ్, సురేఖ, ప్రసన్న, ఫాతిమా, దండెప్ప, శ్రీనివాస్, మంజుల, సంతోషి, మారుతిలున్నారు.

చిన్నారుల్లో నేర ప్రవృత్తి విశృంఖలం

- పిల్లలను మంచిగా పెంచడం తల్లిదండ్రుల బాధ్యత
- మనో వైద్యులు, పోలీస్ అధికారుల సలహా సూచనలు





మాట్లాడుతున్న డీసీపీ రవీష్, డాక్టర్ శివానంద హిరేమఠ(ఫైల్)



హుబ్లీ: ఇటీవల పిల్లల్లో నేర ప్రవృత్తి పెరుగుతోంది. దీనిపై తల్లిదండ్రుల పాత్ర గురించి మనోవైద్యులు, పోలీస్ అధికారులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. మద్యం తాగిన మత్తులో గాని, మత్తు పదార్థానికి బానిసలైనప్పుడు గొడవ జరగడం పర్యవసానంగా హత్యకు దారి తీయడం అక్కడక్కడ జరుగుతున్నాయి. మూడు రోజుల క్రితం వాణిజ్య నగరి హుబ్లీలో చిన్న కారణంగా 13 ఏళ్ల బాలుడు తన కన్నా మూడేళ్లు పెద్దవాడైన మరో బాలుడిని చాకుతో దాడి చేసి హత్య చేసిన ఘటన సర్వత్ర ఆందోళన కలిగించిన సంగతి తెలిసిందే. చిన్న పిల్లలు తెలిసో తెలియకో హత్య వరకు ఎలా వెళుతున్నారు. పిల్లల మనోగతంలో ఇంత క్రౌర్యం కలగడానికి కారణం ఏమిటి? ఈ విషయంలో తల్లిదండ్రుల పాత్ర ఏమిటి? అన్న దానిపై సమాధానంగా పిల్లల పరివర్తన ఎలా ఉంటుందన్న దాని గురించి మనోవైద్యులు, పోలీస్ అధికారులు పలు సూచనలు చేశారు. ఇటీవల హుబ్లీ ధార్వాడ నేర, ట్రాఫిక్ విభాగం డీసీపీ సీఆర్ రవీష్ మాట్లాడుతూ తన 30 ఏళ్లకు పైగా వృత్తి జీవితంలో ఇలాంటి ఘటన తొలిసారిగా చూశానన్నారు. 13 ఏళ్ల బాలుడు హత్య చేయడం అత్యంత ఆవేదన కలిగించే ఘటన అన్నారు. పిల్లలను బాగా పెంచడం ప్రతి తల్లిదండ్రి ప్రథమ కర్తవ్యం అన్నారు.

వేప విత్తనానికి తేనె పోస్తే విషం పోతుందా?

వేప విత్తనానికి బెల్లం, పాలు, తేనె పోసినంత మాత్రాన వేపలోని విషం పోతుందా? అంటూ వేప ఎప్పటికైనా తియ్యదనం ఇస్తుందా? అని బసవణ్ణ వచనాన్ని ఉదాహరణగా వివరించారు. పిల్లల ఎదుగుదల తదితర బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. తల్లిదండ్రులు పిల్లలతో నడుచుకొనే తీరు వారిపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. దీనికి తోడు మొబైల్, టీవీలు, సినిమాల్లో నేరాలు, ఘోరాలను వైభవీకరించడం వల్ల సుతిమెత్తని చిన్నారుల మనసుపై పరిణామం చోటు చేసుకుంటుందన్నారు. పిల్లల మనసు మొగ్గలాంటిది. తల్లిదండ్రులు వారిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. పిల్లలు రోజు ఎక్కడికి వెళుతున్నారు? ఏం చేస్తున్నారు? అన్నదాంతో పాటు అసహజ వ్యక్తిత్వాన్ని గమనిస్తూ వాటికి పరిష్కారం కల్పించేందుకు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా పిల్లల్లో తల్లిదండ్రులు దుర్గుణాలను తగ్గేలా చూడాలన్నారు. నైతిక, నీతి పాఠాలను వివరించి చెప్పాలన్నారు. పబ్జీ, బ్లూగేమ్స్ వంటి ఆన్‌లైన్ ఆటలు చిన్నారి పువ్వులాంటి మనసుపై ముల్లులాంటి క్రౌర్యాన్ని కలిగిస్తుందన్నారు. అందుకే పిల్లలకు మొబైల్, ల్యాప్‌టాప్‌లో ఏం చేస్తున్నారో సదా గమనించి మంచి చెడ్డలను వివరించాలన్నారు.

పిల్లలపై ఇంటి వాతావరణ ప్రభావం

మనోవైద్యుడు డాక్టర్ శివానంద హిరేమఠ మాట్లాడుతూ 13 ఏళ్ల బాలుడు హత్య ఘటన తనను దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ఇటీవల పిల్లల్లో అమాయకత్వం తగ్గిపోతోందన్నారు. సోషల్ మీడియా, సినిమాలోని హింసను భారీగా చూపడం వంటి దృశ్యాలు చిన్నారుల మనసులను కనిష్టం చేస్తున్నాయన్నారు. తమ చుట్టు పక్కల తమ కన్నా పెద్దలు అలాంటి ప్రవృత్తిలో ఉంటే వారినే పిల్లలను అనుసరిస్తారు. ఇంట్లోని వాతావరణంలో తల్లిదండ్రుల మధ్య జగడాలు వంటి కారణాలు పిల్లలపై తీరని ప్రభావం చూపుతాయన్నారు. ఈ విషయాలపై తల్లిదండ్రులు సదా జాగృతంగా ఉండి తమ పిల్లలకు అవసరమైనప్పుడు కౌన్సిలింగ్, థెరపీ ద్వారా సమస్యలను పరిష్కరించాలి. ఆన్‌లైన్ ఆటలలో హింసాత్మక ప్రవృత్తి నానాటికి పెరుగుతున్న కారణంగా ప్రభుత్వం, తల్లిదండ్రులు వాటి నుంచి దూరంగా ఉంచే పని చేయాలి. తండ్రే ఆ కుటుంబ ఆదర్శ వ్యక్తిగా ఉత్తమ నడత కలిగి ఉండాలి. కుటుంబంలో శాంతి, సమాధానం, నెమ్మదితో కూడిన వాతావరణ కౌటుంబిక సౌహార్ద ఉండాలి. తండ్రి తమ పిల్లలకు తగిన సమయాన్ని కేటాయించి పిల్లలతో చక్కటి అనుబంధాన్ని పాదుగోల్పేలా తమ తీరును తల్లిదండ్రులు మార్చుకుంటే మంచిదని ఆయన అభిప్రాయపడ్డారు.

అధిక లాభాల ఆశ చూపి భారీ వంచన

హుబ్లీ: ఆన్‌లైన్ నెట్‌వర్క్ కంపెనీలో డబ్బులు పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు ఇస్తామంటూ స్థానిక ఓ లెక్చరర్‌ను నమ్మించి రూ.11.47 లక్షలను బదలాయించుకొని ఆన్‌లైన్ వంచకులు మోసగించారు. లెక్చరర్ విజయ్ బాధితుడు. ఆయన వాట్సప్ నెంబర్‌ను సంప్రదించిన ఆన్‌లైన్ వంచకులు స్టాండర్డ్ చార్టెడ్ ఐ నెట్‌వర్క్ కంపెనీలో డబ్బులు పెట్టుబడి పెడితే 73.5 శాతం లాభాలు ఇస్తామని నమ్మించారు. ఈక్రమంలో ఎస్సీ ఎలైట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి మొబైల్‌కు లింక్ చేసి రూ.98 వేలు పెట్టుబడి పెట్టించుకొన్నారు. ప్రారంభంలో ఆ మేరకు రూ.10 వేలు లాభం ఇచ్చారు. దీన్ని నమ్మి సులభంగా డబ్బు సంపాదించవచ్చని ఆశపడి సదరు మొత్తం పెట్టుబడి పెట్టి మోసపోయినట్లు విజయ్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

టూర్ ఖర్చులు పంచుకుందామంటే దాడి

మరో ఘటనలో పర్యటన ఖర్చు పంచుకుందామన్న విషయానికి జరిగిన ఘర్షణలో తన స్నేహితుడిని బాటిల్‌తో కొట్టిన ఘటన పాత హుబ్లీలో జరిగింది. గోవా టూర్ ఖర్చులను పంచుకుందాం అన్నందుకు కోపగించుకొన్న పవన్ తన స్నేహితుడు శంకర్ దొడ్డమనిపై బాటిల్‌తో దాడి చేశాడు. మద్యం అంగడిలో కూర్చొని గోవా టూర్‌కు వెళ్లే విషయమై మాట్లాడుతున్న క్రమంలో అందరూ కలిసి ఖర్చులు పంచుకుందాం అని పవన్ చెప్పాడు. ఈ మాటకు ఆగ్రహానికి గురైన శంకర్ అందరి ఖర్చులను మీరు ఒక్కరే భరించాలంటూ నిందించి బాటిల్‌తో దాడి చేసి గాయపరిచాడని బాధితుడు పవన్ పాత హుబ్లీ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

మానవతా విలువలు పెంచుకోవాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న స్వామీజీలు



సన్మానం అందుకున్న ఉత్తమ విద్యార్థులు

రాయచూరు రూరల్: విద్యార్థులు మానవతా విలువలను పెంచుకోవాలని సోమవారపేటె మఠాధిపతి అభినవ రాచోటి శివాచార్య, మంగళవారపేటె మఠాధిపతి వీరసంగమేశ్వర శివాచార్య పేర్కొన్నారు. వీరశైవ కళ్యాణ మంటపంలో గాణిగ సమాజం ఆధ్వర్యంలో 2024-25లో ఉత్తమ శ్రేణిలో పాసైన పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు సన్మాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు పచ్చని నగరం, ప్లాస్టిక్ నిర్మూలనకు పాటు పడాలన్నారు. గాణిగ సమాజం అధ్యక్షుడు చెన్నప్ప సజ్జన్,° ఎసిద్రామప్ప, శకుంతల, లక్ష్మీబాయి, బసప్ప గౌరేబాళ్, విజయ్ కుమార్‌లున్నారు.

ఆర్టీఓ ఇన్‌స్పెక్టర్‌పై వేటుకు ఆదేశం

- అధికారులతో ఆర్టీఓ ఇన్‌స్పెక్టర్ దురుసు ప్రవర్తన ఫలితం



ఆర్టీఓ ఇన్‌స్పెక్టర్‌పై వేటుకు సూచిస్తున్న జిల్లాధికారి, ఎస్పీ

సాక్షి బళ్లారి: నగరంలోని ప్రాంతీయ రవాణా అధికారి(ఆర్టీఓ) కార్యాలయంలో తనిఖీకి వెళ్లిన జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా, ఎస్పీ శోభారాణిలతో సరైన విధంగా నడుచుకోకపోవడంతో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నగరంలో జిల్లాధికారి, ఎస్పీ ఇద్దరూ ఆర్టీఓ కార్యాలయాన్ని సందర్శించారు. స్పీడ్ కంట్రోల్‌కు సంబంధించి అధికారులతో చర్చలు జరుగుతున్న సమయంలో ఎన్నో ఏళ్లుగా ఇక్కడే టికాణా వేసుకొన్న ఆర్టీఓ ఇన్‌స్పెక్టర్ హేమంత్ కుమార్ నడుచుకొన్న తీరు, మాట్లాడిన పద్ధతి సరిగా లేకపోవడంతో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చొక్కాకు గుండీ కూడా పెట్టుకోక పోవడంతో ఎస్పీ మరింత ఆగ్రహం వ్యక్తం చేస్తూ ముందు బటన్ వేసుకొని మాట్లాడాలని మండిపడ్డారు. సినిమాలో విలన్ తరహాలో నడుచుకుంటున్న తీరును నిలదీశారు. దీంతో జిల్లాధికారి మాట్లాడుతూ తక్షణం ఇన్‌స్పెక్టర్ హేమంత్ కుమార్‌ను సస్పెండ్ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆర్టీఓ కార్యాలయాన్ని జిల్లాధికారి, ఎస్పీ సందర్శించడానికి రావడంతో పెద్ద ఎత్తున జనం గుమిగూడారు. ఆర్టీఓ ఇన్‌స్పెక్టర్ ఉన్నతాధికారులతో నడుచుకొన్న తీరు స్థానికులకు కూడా ఆశ్చర్యాన్ని కలిగించింది. తక్షణం ఆ అధికారిని సస్పెండ్ చేయాలని సూచించిన నేపథ్యంలో సదరు రవాణా శాఖాధికారులు ఆర్టీఓ సీఐని సస్పెండ్ చేస్తారా? లేదా? అన్నది చర్చనీయాంశమైంది.

డ్యాం గేట్ల మార్పు టెండర్ ఖరారు

హొసపేటె: తుంగభద్ర డ్యాం 32 క్రస్ట్‌గేట్లను మార్చే బాధ్యతలను గుజరాత్‌కు చెందిన హార్డ్‌వేర్ టూల్స్ అండ్ మెషినరీ ప్రాజెక్ట్ కంపెనీకి అప్పగించారు. ఈ పనిని పూర్తి చేయడానికి ఆ సంస్థకు 15 నెలల గడువుతో తుంగభద్ర బోర్డు బాధ్యతను అప్పగించింది. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ప్రధాన కార్యాలయం కలిగిన కంపెనీకి ఇప్పటికే రిజర్వాయర్‌లోని 19వ గేట్ కోసం క్రస్ట్‌గేట్ నిర్మించే బాధ్యతను అప్పగించగా ఈ పనిని ఈనెలాఖరునాటికి పూర్తి చేయాలి. ఆలోగా 32 గేట్ల పనితో పాటు మొత్తం 33 గేట్ల నిర్మాణ పనులను అదే కంపెనీకి అప్పగించారు. 32 గేట్ల నిర్మాణానికి తుంగభద్ర బోర్డు రూ.52 కోట్ల మొత్తాన్ని నిర్ణయించింది. ఈ టెండర్‌లో కంపెనీ రూ.41.42 కోట్లకు పనిని పూర్తి చేయడానికి బిడ్‌ను సమర్పించింది. తక్కువ ధరకు బిడ్ వేసిన కారణంగా నిర్మాణ బాధ్యతలను ఆ కంపెనీకి అప్పగించినట్లు తుంగభద్ర బోర్డు వర్గాలు తెలిపాయి.

కమల్ హాసన్ కన్నడిగులకు క్షమాపణ చెప్పాలి

హుబ్లీ: కన్నడ భాషపై సీనియర్ నటుడు కమల్ హాసన్ వ్యాఖ్యలు ఖండనీయం. ఆయన కన్నడిగులకు క్షమాపణ చెప్పాలని నటి రచితారామ్ పేర్కొన్నారు. ఓ బంగారు షోరూం ప్రారంభించడానికి వచ్చిన ఆమె స్థానిక మీడియాతో మాట్లాడారు. అపారమైన అభిమానులు ఉన్న కమల్ హాసన్ సినీ రంగానికి ఎంతో సేవ చేశారు. ఆయన కన్నడ గురించి అభ్యంతరకరంగా మాట్లాడటం సమంజసం కాదన్నారు. తనకు అపారమైన భాషాభిమానం ఉంది. వేరే భాష గురించి నేను వ్యాఖ్యానించను. నా మొదటి గౌరవం కన్నడ భాషకే. ఇక్కడ ఎవరి నుంచి ఎవరూ రాలేదు. దేవుడికి తెలుసు ఎవరు, ఎవరి నుంచి అని అన్నారు. అందరూ తమ మాతృభాషను మరువరాదన్నారు. అలాగే మన భాష గురించి వారికి నేర్పిద్దాం. వారి భాషను మనం నేర్చుకుందామన్నారు. కమల్ హాసన్ మాటల వల్ల కన్నడిగులైన మనకు ఎంతో బాధ కలిగింది. మన భాష గురించి మాట్లాడితే మేమెందుకు ఊరికే ఉండాలన్నారు. థగ్ లైఫ్ సినిమా విడుదల విషయం గురించి సినీ రంగం పెద్దలు నిర్ణయిస్తారు. ఈ విషయంలో నేనేమి మాట్లాడబోనన్నారు. ఐపీఎల్ కప్ గురించి అడిగిన ప్రశ్నకు ప్రస్తుతం ఐపీఎల్ 18వ సిరీస్ జరుగుతోంది. విరాట్ కోహ్లి జర్సీ నంబర్ కూడా 18, దీంతో 18తో మనకందరికీ ప్రత్యేకమైన అనుబంధం ఏర్పడింది. ఈసారి ఐపీఎల్ కప్ మనదేనని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.

కలబుర్గిలో రైల్వే డివిజన్ కార్యాలయం ప్రారంభిస్తాం



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి సోమణ్ణ

రాయచూరు రూరల్: కలబుర్గిలో రైల్వే డివిజన్ కార్యాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి వీ.సోమణ్ణ పేర్కొన్నారు. ఆదివారం కలబుర్గిలో అమృత్ భారత్ పథకం కింద జరుగుతున్న రైల్వే ఆధునికీకరణ పనులను పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. సామాన్య ప్రజలకు అనుకూలమయ్యే విధంగా భారతీయ రైల్వే 10 వేలకు పైగా జనరల్ బోగీలను ఏర్పాటు చేస్తోందన్నారు. రాష్ట్రంలో 13 జిల్లాల్లో వందే భారత్ రైలు సంచారం ఉందన్నారు. బెంగళూరు-బెళగావి మధ్య త్వరలో వందే భారత్ రైలు సంచారానికి చర్యలు తీసుకుంటామన్నారు. డీజిల్ ఇంజిన్లను తొలగించి విద్యుత్ రైళ్లను నడపడం వల్ల ఏడాదికి రూ.18 వేల కోట్లు ఆదా అవుతోందన్నారు. కమల్ హాసన్ కన్నడ భాషపై అవహేళనకరంగా వ్యాఖ్యలు చేయడాన్ని ఖండించారు. కేంద్రం పేదలకు తక్కువ ఖర్చుతో మందులు లభించేలా ఏర్పాటు చేసిన జనౌషధి కేంద్రాలను మూసివేయరాదని ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు లేఖ రాశానన్నారు. హేమావతి నీటి విడుదల విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య దారి మళ్లారన్నారు. హేమావతి నీటిని రామనగరకు తీసుకెళ్లే పథకంలో రైతులపై కేసులు నమోదు చేయడం తగదన్నారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మొండివాడిగా మారాడన్నారు. రైతులకు న్యాయం చేయకుండా నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. ఈ విషయంపై గతంలో ముఖ్యమంత్రికి లేఖ రాసి హేమావతి నీటి విషయంలో రాజకీయాలు వీడి రైతులకు న్యాయం చేయాలని కోరినట్లు తెలిపారు. నూతన పైపులైన్లు అమర్చుకోవాలన్నారు. హేమావతి నీటి పథకాన్ని వదిలి పెట్టాలని కోరామన్నారు.

శ్మశాన వాటికకు దారేదీ?

- ఇనుప కంచె వేయడంతో రాకపోకలకు ఆటంకం



శ్మశాన వాటిక దగ్గర దారికి కంచె వేసిన దృశ్యం

హొసపేటె: శ్మశాన వాటికకు వెళ్లే దారిలో తీగ కంచె ఏర్పాటుతో అంత్యక్రియలకు ఆటంకం కలిగిన ఘటన మరియమ్మనహళ్లిలో జరిగింది. శ్మశాన వాటికకు వెళ్లే దారి మూసుకొని పోవడంతో ఖననం చేయడానికి దారి లేకుండా పోయింది. దీంతో దాణాపుర గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకటాపుర హంపినకట్టె గ్రామంలో ముస్లింలు ఆందోళనలో ఉన్నారు. గ్రామంలోని ముస్లింలు ఎవరైనా మరణిస్తే అదే శ్మశాన వాటికలో ఖననం చేస్తారు. ఆ గ్రామానికి చెందిన హొన్నూరు సాబ్ అనే వ్యక్తి శనివారం మరణించగా, అంత్యక్రియల కోసం శ్మశాన వాటికకు మృతదేహాన్ని తరలించారు. దాదాపు ఏడాది కాలంగా ఉన్న ఆ రోడ్డుపై ఒక ప్రైవేటు వ్యక్తి ఇనుప కంచె వేసి దారి లేకుండా చేశాడు. మృతదేహాన్ని మోసుకెళ్తున్న మృతుడి బంధువులు తమకు దారి తెలియక కొంతసేపు ఇబ్బంది పడ్డారు. శ్మశాన వాటిక దగ్గర భూమిని కొన్న ఒక వ్యక్తి వందలాది ఏళ్లుగా ఉన్న శ్మశాన వాటికకు దారిని వదలడానికి బదులుగా తీగతో కంచెను ఏర్పాటు చేశాడు. ఏళ్ల తరబడి అక్కడ ఉన్న శ్మశాన వాటికకు వెళ్లే రోడ్డు పక్కన ఒక ప్రైవేటు వ్యక్తి అకస్మాత్తుగా ముళ్ల కంచెను నిర్మించాడు. దీంతో మృతదేహాన్ని పొరుగున ఉన్న పొలం గుండా తీసుకెళ్లి శ్మశాన వాటికలో దహనం చేయాల్సి వచ్చింది.


వ్యక్తి దారుణ హత్య




సీసీ ఫుటేజీలో కనిపించిన హతుడు

హుబ్లీ: కొప్పళలో సోమవారం ఓ దారుణ హత్య జరిగింది. బేకరీలో తన పని మీద ఉన్న వ్యక్తిని బయటకు లాగి వేటాడి మారణాయుధాలతో దారుణంగా హత్య చేశారు. వివరాలు.. కొప్పళ జిల్లాలోని కుష్టిగి తాలూకా తావరగెరా పట్టణం నడిబొడ్డున ఉన్న ఓ బేకరీ దుకాణంలో కొనడానికి వచ్చిన ఓ వ్యక్తిని దుండగుల గుంపు మారణాయుధాలతో దాడి చేసి క్రూరంగా హత్య చేశారు. ఈ కేసుకు సంబంధించి ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితులను ప్రమోద్, నాగరాజు, ప్రదీప్, రవి, గౌతమ్, మంజునాథ్‌గా గుర్తించగా, మరో వ్యక్తి పేరు తెలియరాలేదు. మొత్తం మీద ఏడుగురు అరెస్టు అయ్యారు. మృతుడిని చెన్నప్ప నారినాళ్‌గా గుర్తించారు. ఆస్తుల గొడవకు సంబంధించి బేకరీలో ఉన్న చెన్నప్పను లోపలికి వెళ్లి మారణాయుధాలతో హత్య చేయడానికి ప్రయత్నిస్తుండగానే అతడు బేకరిలో నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించాడు. ఈక్రమంలో దుండగులు ఇద్దరు అతనిని వెంటపడి మారణాయుధాలతో దాడిచేసి దారుణంగా హత్య చేశారు. మరో వ్యక్తి చేతికి దొరికినా కలపది మ్మెతో తలపై కొట్టాడు. కాగా ఈ హత్య దృశ్యాల వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. మొత్తం మీద హత్య చేయడానికి వచ్చిన దుండగులు తమ పని ముగించుకొని దర్జాగా వెళ్లి పోయినట్లుగా తెలిసింది. కాగా తావరగెరె పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా ఈ దారుణ హత్యతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. పోలీసు ఉన్నతాధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

జొన్నల కొనుగోలు కోసం రైతుల ఆందోళన



ప్రధాన వీధిలో ర్యాలీ చేస్తున్న దృశ్యం



ఆందోళనలో పాల్గొన్న రైతులు, న్యాయవాదులు

- సింధనూరు బంద్ విజయవంతం
- న్యాయవాదులు, వ్యాపారుల మద్దతు

రాయచూరు రూరల్: రైతులు ఖరీఫ్ సీజన్‌లో పండించిన జొన్నలను కొనుగోలు చేయాలంటూ రైతులు వారం రోజుల నుంచి ఆందోళనకు దిగారు. సోమవారం సింధనూరులో రైతు సంఘం ఆధ్వర్యంలో వందలాది మంది రైతులతో ఆందోళన, బంద్ చేపట్టిన సందర్భంగా అధ్యక్షుడు చామరస మాలిపాటిల్ మాట్లాడారు. అధికారులు ఉన్నఫళంగా కొనుగోలు కేంద్రాలను బంద్ చేసి జొన్నల కొనుగోళ్లను నిలిపివేయడాన్ని తప్పుబట్టారు. అంబేడ్కర్ సర్కిల్ వద్ద డీహెచ్ పూజార్ ఆధ్వర్యంలో రాస్తారోకో జరిపారు. మూడు గంటల పాటు రాస్తారోకో చేయడంతో వాహన రాకపోకలకు అంతరాయం వాటిల్లింది. కాగా సింధనూరు బంద్‌కు రైతులు, న్యాయవాదులు, వ్యాపారులు మద్దతు పలకడంతో విజయవంతమైంది.

జిందాల్‌లో అగ్ని ప్రమాదం

- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

సాక్షి బళ్లారి: దేశంలో పేరు గాంచిన స్టీల్ ఇండస్ట్రీ జిందాల్ పవర్ హౌస్‌లో అగ్నిప్రమాదం జరిగింది. సోమవారం జిల్లాలోని తోరణగల్లు సమీపంలో వేలాది ఎకరాల్లో వెలసిన జిందాల్ స్టీల్ ప్లాంట్ ఆవరణలో ఉన్నఫళంగా పవర్ హౌస్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకోవడంతో ఎలక్ట్రానిక్ వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. తక్షణం అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పడంతో ఎలాంటి ప్రాణ హాని జరగలేదు. ఈ ఘటనపై తోరణగల్లు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అదృష్టవశాత్తు ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకొన్నారు.

క్లీనర్ దుర్మరణం



ప్రమాదంలో మృతి చెందిన మహమ్మద్



మృతుడు ఫైల్‌ఫోటో

పెద్దవడుగూరు: అనంతపురం జిల్లా తాడిపత్రి పరిధిలో పెద్దవడుగూరు మండల పరిధిలోని కాశేపల్లి టోల్ ప్లాజా సమీపంలో ఐషర్ వాహనం ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో ఒకరు చనిపోయారు. ఈ ప్రమాదంలో ఐషర్ వాహనం క్లీనర్ మహమ్మద్ (31) అనే వ్యక్తి మృతి చెందాడు. రాయచూరు నుంచి అనంతపురానికి సరుకులు తీసుకొని వచ్చి అన్‌లోడ్ చేసి తిరిగి రాయచూరుకు వెళ్తుండగా కాశేపల్లి టోల్‌ప్లాజా దాటగానే నిద్రమత్తులో ఐషర్ డ్రైవర్ ఖలీల్ ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఐషర్ క్లీనర్ అక్కడికక్కడే చనిపోయాడు. ఇతని స్వస్థలం కర్ణాటకలోని రాయచూరు జిల్లా మాన్వి అని తెలిసింది. పోలీసులు అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

రాయచూరు రూరల్: మనిషి సంపూర్ణ ఆరోగ్య రక్షణకు యోగా దోహదపడుతుందని మాజీ ఇంజినీర్ వెంకటేష్ పేర్కొన్నారు. సోమవారం బిల్లవ మందిరంలో యోగా శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. యోగాతో వ్యాధులను దూరం చేసుకోవచ్చన్నారు. శారీరకంగా, మానసికంగా ఎదుగుదలకు యోగా, ధ్యానం, ప్రాణాయామం వంటివి అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున స్వామి, సత్యవతి, బూదెప్ప, సహదేవ్, భావన, నేత్ర, విజయలక్ష్మి, ప్రభాకర్‌లున్నారు.

డెంగీ కట్టడికి ఏకతాటిపై కదలండి



మాట్లాడుతున్న డాక్టర్ సురేంద్రబాబు

రాయచూరు రూరల్: డెంగీ వ్యాధిని కట్టడి చేసేందుకు అందరూ కలిసి ముమ్మరంగా ప్రచారం చేపట్టాలని జిల్లా ఆరోగ్యాధికారి డాక్టర్ సురేంద్రబాబు పిలుపు ఇచ్చారు. సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, ఆరోగ్య శాఖ, నగరసభ ఆధ్వర్యంలో డెంగీ దినోత్సవంపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. అందరిని ఏకతాటి పైకి తెచ్చి నలుగురితో సమానంగా కలిసి జీవించాలన్నారు. ఇంటి ముందు నీరు నిలవకుండా ముందుకు ప్రవహించేలా చూడాలన్నారు. ఇంటి మందు దోమలు రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. హెడ్ మాస్టర్ శ్రీనివాస్, నోడల్ అధికారులు చంద్రశేఖరయ్య, యశోద, ఆర్‌సీహెచ్ అధికారిణి నందిత, అరుణ, రాధిక, అనిత, అన్నపూర్ణలున్నారు.

యథేచ్ఛగా సంబరాలు.. 8 మంది అరెస్ట్

రాయచూరు రూరల్: ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ క్రికెట్ పోటీల్లో తమ జట్టు గెలుపుపై మితిమీరిన సంబరాలు చేసుకుంటున్న 8 మందిని పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన జిల్లాలోని మస్కి తాలూకాలో చోటు చేసుకుంది. మస్కి తాలూకా హసమకల్‌లో ఆర్‌సీబీ జట్టు విజయం సాధించిన రోజు రాత్రి 8 మంది ఆర్‌సీబీ అభిమానులు యథేచ్ఛగా సంబరాలు చేసుకున్నారు. టపాసులు పేల్చడంతో పాటు పెట్రోలు పోసిన యువకులు నడి రోడ్డుపై నిప్పంటించి అల్లరి చేసి న్యూసెన్స్ సృష్టించినందున పోలీసులు అరెస్ట్ చేశారు. సింధనూరు తాలూకా బళగానూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరారెడ్డి తెలిపారు.

కమిషనరేట్ ఏర్పాటు చేయాలని ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

రాయచూరు రూరల్: జిల్లాలోని గురుకుల పాఠశాలలకు కమిషనరేట్‌తో పాటు విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను పర్మినెంట్ చేయాలని గురుకుల పాఠశాల ఉపాధ్యాయుల సంఘం జిల్లాధ్యక్షుడు శ్రీశైల నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం టిప్పుసుల్తాన్ ఉద్యానవనంలో నిరవధిక ధర్నా ప్రారంభించి మాట్లాడారు. నవోదయ, మొరార్జి దేశాయి, రాణి కిత్తూరు చెన్నమ్మ, మైనార్టీ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను పర్మినెంట్ చేసి, మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. జీఎఫ్, పీఎఫ్‌లను కూడా మంజూరు చేయాలని కోరారు.